తెలుగు వెలుగు

జులై 2013 వెల: ₹20



విభిన్నమైన నిద్రలు ఒకటే జవాబు

25 years of trust

మా ప్రత్యేకంగా రూపొందించబడిన గాలిపీల్చుకోగల, మెత్తని మరియు స్ప్రింగ పరుపులతో మీ పిల్లలకు విశ్రాంతితో కూడిన కలల ప్రపంచాన్ని పరిచయం చేయండి. ఇవి వారికి కావలసినంత సౌకర్యాన్ని, మంచి స్పైన్ సపోర్ట్ మరియు మీ పిల్లలు రాత్రి పూట సుఖమైన నిద్ర అనుభవించేలా చేస్తాయి.

ఒక ప్రణయభరిత గాఢ నిద్రకు మా అద్వితీయమైన స్లీప్ సొల్యూషన్లపై ఆదమరచి నిద్రపోండి, ఇవి ప్రతి వ్యక్తి శరీరాకృతికి తగ్గట్టుగా మలచుకోబడతాయి, మీరు అటూఇటూ దొర్లినా హాయిగా అనిపిస్తుంది మరియు సుఖ నిద్రకు అత్యంత సౌకర్యాన్ని కలుగజేస్తాయి.

మీ సొంత వైవిధ్యమైన నిద్ర స్టైలుకు తగ్గట్టుగా రూపొందించబడ్డాయి-ప్రతి సెంచరీ పరుపులపై అలసటను దూరంచేసే గాఢమైన నిద్రకు ఉపక్రమించండి.

Centuary®

India ka Sleep Specialist

మా పరుపుల శ్రేణి :

కాయర్ పరుపులు | హెల్త్ స్ప్రింగ్ పరుపులు

లగ్జరీ పరుపులు | ఫ్లెక్సి పరుపులు

మా ఇతర ఉత్పాదనలు :

పాలి ఫైబర్ దిండ్లు | ఫోము దిండ్లు

కుషన్లు | బోల్‌స్టర్లు | బ్యాక్‌రెస్ట్‌లు | పియు ఫోమ్

An ISO 9001:2008 certified company

IS:8391 L-2193958

For further information, contact: +91-40-27899210/27845224; visit us at www.centuaryindia.com or write to us at info@centuaryindia.com

Sleep Specialist Stores: Hyderabad: 040-23045402 / 23045278 • Siddipet: Tirumala Furnitures: 9885533343.

A.P. Depot: Godown No. 4 & 5, Sy. No. 201/B, Madinaguda Village, Miyapur, Hyderabad - 500 049. Mob: 9848943364, 9666770185, 9848031390, 9849877252.

Contact Details: Ahmedabad: 079-26820184/9327542881 • Bengaluru: 080-22112971/9886719340 • Bhopal: 0755-4055532/9826385532 • Bhilai: 0788-223122/2223478 • Bhubaneshwar: 0674-3202260/9437017842 • Chennai: 044-42080073 • Coimbatore: 0422-4249000/9443152332 • Goa: 0832-2556198/2556374 • Jodhpur: 0291-2555386/9414914388 • Kerala: 0474-2484521 • Kolkata: 033-26376033/9831169655 • Mumbai: 022-28215222/9819003243 • Nagpur: 0712-3293124/9890646702 • Pune: 020-26989145/9819003243 • Vijayawada: 0866-6463499.

facebook.com/Centuaryindia   twitter.com/centuary_india   pinterest.com/centuaryindia

BEEHIVE

NIVEA
చాలా కొద్దిపాటి డ్రెస్సులు, ఒక బ్యాక్‌లెస్ డ్రెస్ కంటే అందంగాను మరియు సొగసైనదిగానూ ఉంటాయి. ఐతే, చాలా కొద్దిమంది స్త్రీలు వాటిని వేసుకునే ధైర్యాన్ని కలిగి ఉంటారు. దానికి ఏకైక ప్రధాన కారణం, దానికి తగ్గ ఖచ్చితమైన ఆక్సెసరీ లేకపోవడం: మచ్చలేని చర్మం.
ఎండబారిన పడడం వల్ల కొంత కాలానికి చర్మం నల్లబడి, పాడైపోతుంది. దీన్ని తిరిగి భర్తీ చెయ్యలేమని ఎవరన్నారు? NIVEA వైటెనింగ్ సెల్ రిపేర్ లోషన్ చర్మం లోపల పొరనుంచి పనిచేసి నష్టాన్ని రిపేర్ చేస్తుంది మరియు మీ చర్మాన్ని ఎల్లప్పుడూ తెల్లగా ఉంచుతుంది. ఇదుగో ఈ విధంగా:
• 40 X విటమిన్ C ఎన్నో ఏళ్ళుగా నల్లబడిన చర్మాన్ని, ఒక్కొక్క పొరగా, రిపేర్ చేసి, దాన్ని మళ్ళీ తెల్లగా చేస్తుంది.
• మెలనిన్ ఉత్పాదనని అదుపులో ఉంచి, లికోరీస్ ఎక్స్‌ట్రాక్ట్‌లు నష్టాన్ని అదుపులో ఉంచుతాయి.
• డబుల్ UV ఫిల్టర్స్ ఎండనుండి అడ్వాన్స్‌డ్ యువి ప్రొటెక్షన్‌ని అందజేసి, మళ్ళీ నల్లబడకుండా నిరోధిస్తాయి
• Hydra IQ చర్మాన్ని తేమగా ఉండేట్లు చేసేందుకై, విపరీతమైన (ఇంటెన్సివ్) మాయిశ్చరైజేషన్‌ని అందజేస్తుంది.
ముందు
తర్వాత
బ్యాక్ లెస్ డ్రెస్
వేసుకొనే విశ్వాసాన్ని
పొందండి.
NIVEA
Body Lotion
Whitening
Cell Repair &
UV Protect
40x
VITAMIN C
NIVEA
వైటెనింగ్ సెల్
రిపేర్ లోషన్
INTERFACE 381038

అక్షర లక్షలు...

తెలుగు వాడి వరసే వేరు — 10
- శంభు

వైద్యాలయమే విద్యాలయం — 14
- తెలుగు వెలుగు బృందం

ఆంగ్లం వస్తే ఎంత! రాకపోతే ఎంత! — 24
- డా॥ గాయత్రీదేవి

కవిత్వమా... కాస్త అర్థంకా! — 30
- కర్లపాలెం హనుమంతరావు

వానా... వానా... వెన్నెల వాన! — 40
- తెలుగు వెలుగు బృందం

20 సాహిత్యానికి ప్రతిరోజూ స్వర్ణయుగమే
- గొల్లపూడి మారుతీరావు

అస్పృశ్యతపై కవితాస్త్రం — 44
- తెలుగు వెలుగు బృందం

చందమామ రావే — 50
- వి.రాధ

నను్రబోవమని చెప్పవే — 58
- డా॥ ప్రభల జానకి

సీనియర్ సముద్రాల మాటల కడలి — 26
- పార్థసారథి చిరువోలు

సర్వం శ్రీ జగన్నాథం — 38
- గోపి శ్రీభాష్యం

మంచి పుస్తకం 48
ఏడు తరాల నీడ
- సూరంపూడి పవన్‌సంతోష్

కథలు

ప్రతి చిన్న విషయానికీ భయపడకుండా ధైర్యంగా ముందుకెళ్లాలని చెప్పే కథ... జడివానలో కూడా తన పనిని సాధించిన పిల్లాణ్ని చూసి కథానాయకుడు తన వ్యక్తిత్వాన్ని మార్చుకునే కథనం... ఉత్తరాంధ్ర మాండలిక గుబాళింపును విరజిమ్మే రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచన...
'వర్షం'
ఈ నెల కథా పారిజాతం — 34

ఊరు పిలుస్తోంది — 16
- కోటమర్తి రాధాహిమబిందు

చరమాంకం — 54
- గన్నవరపు నరసింహమూర్తి

తల్లీ! వందనం — 72
- మంత్రవాది మహేశ్వర్

వాగు — 86
- కోడూరి రవి

బహుమతి పొందిన ప్రేమలేఖలు

అక్షర ప్రేమాంజలి — 33
- బి.కళాగోపాల్

ప్రేమంటే! — 61
- శ్రీ

అక్రమాలపై బాణం... రచనకు ప్రాణం — 62
- తెలుగు వెలుగు బృందం

తెలుగులో రాత శాస్త్రవేత్తల బాధ్యత — 66
- నాదెండ్ల తిరుపతయ్య

మనకూ ఉన్నాయి మందులూ.. మాకులూ.. — 68
- డా॥ జి.వి.పూర్ణచంద్

కలం చెప్పని కవిత్వం — 70
- ఎం.రామజోగేశ్వరశర్మ

అప్పుడు 'కళ'కళ ఇప్పుడు వెలవెల — 80
- డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ

గురువా గురువా వినవా! — 84
- డా॥ జోస్యుల కృష్ణబాబు

ప్రత్యేక శీర్షికలు

భాషాశాస్త్రం... విజయాస్త్రం — 76
- హేమ

వ్యాకరణం గెలుపు సాధనం — 78
- శివలీల

మరిన్ని ప్రత్యేకాలు

ముత్యాల ముగ్గు — 13

మాటకట్టు — 53

రామోజీ ఫౌండేషన్

తెలుగు వెలుగు

సంపాదకుడు: **రామోజీరావు**

సంపుటి : 1 , సంచిక : 11

జులై 2013

పుటలు : 100, **వెల :** రూ. 20

సహకారం : రామోజీ విజ్ఞానకేంద్రం

ప్రకటనల కోసం : +91 80081 51599, +91 90001 80608

వివరాలకు : తెలుగువెలుగు, రామోజీ ఫౌండేషన్, రామోజీ ఫిల్మ్‌సిటీ, హయత్‌నగర్ (మం) రంగారెడ్డి - 501 512.

ఫోను: +91 8415 246 999

మొబైల్: +91 800 800 1656

ఫ్యాక్సు: +91 8415 305 018

ఈమెయిల్:
teluguvelugu@ramojifoundation.org

పత్రికపై కాపీరైట్ హక్కులు రామోజీ ఫౌండేషన్‌వి. ఈ పత్రికలోని భాగాలను, పత్రికను అనుమతి లేకుండా అంతర్జాలంలో పెట్టడం లేదా మరో చోట ప్రచురించడం కానీ చట్ట వ్యతిరేకం.

Telugu Velugu

Owned, Printed, published and Edited by Ramoji Rao on behalf of Ramoji Foundation, Ramoji Film City, Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh. Printed at Eenadu Press, D.No.7-134/1&2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally, Rangareddy District -500 072.

RNI No: APTEL/2012/45352

విన్నపం: తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణ, మేధోమథనం 'తెలుగువెలుగు' ముఖ్య ఆశయాలు. మన భాషకు పుష్టి చేకూర్చే రచనలకు పత్రికలో అగ్రతాంబూలం లభిస్తుంది. ఈ రచనల్లో వెల్లడయ్యేవి రచయితల అభిప్రాయాలు మాత్రమేనని మనవి. ఇవన్నీ పత్రిక యాజమాన్యం, సంపాదకవర్గ అభిప్రాయాలు కానక్కర్లేదు. భిన్న భావజాలాలకు నిష్పక్షపాత వేదికగా ఈ పత్రిక నిలుస్తుంది.

ఫేస్‌బుక్‌లోనూ 'తెలుగు వెలుగు'ను అనుసరించవచ్చు

అధికార భాషకు అందలం

ప్రధానమంత్రిగా దేశ అత్యున్నతాధికార పీఠం అధిష్ఠించిన ఏకైక తెలుగుబిడ్డ పీవీ పదేళ్లక్రితం 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో- అమ్మలాంటి తెలుగు చిరకాలం వెలుగొందాలని కోరుకున్నారు. ఆ కల నిజం కావడానికి అడ్డదారులుండవు. ఒక్కటే రాజమార్గం. అధికార భాషగా, బోధన భాషగా తెలుగును కట్టుదిట్టంగా అమలుపరచడమే. వాస్తవానికి, అలా చేయడం అత్యవసరమని 1975నాటి మొట్ట మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా తీర్మానించాయి. తరవాత ఏళ్లతరబడి జరిగిందేమిటో మనమంతా చూశాం, చూస్తున్నాం.

ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే సాగుతాయన్న హామీలు వట్టిపోయాయి. 27 ప్రభుత్వశాఖల్లో తెలుగును అమలుచేయాలని, రాతకోతలన్నీ ప్రజలకు అర్థమయ్యే భాషలోనే ఉండాలన్న నిర్ణయానికి తగిన మన్నన కొరవడింది. కేంద్రంతో, ఇతర రాష్ట్రప్రభుత్వాలతో మాత్రమే అనుసంధానంగా ఉంటుందన్న ఆంగ్లం, పాలనలో సర్వత్రా దర్జాగా ఆధిపత్యం చలాయిస్తోంది. ఇటీవలి తిరుపతి సదస్సు ఆమోదించిన ఏడు తీర్మానాల్లో- పాలన యంత్రాంగం అన్ని అంచెల్లోనూ అధికార భాషగా తెలుగును అమలుపరచాలన్నది ఒకటి. పకడ్బందీ కార్యాచరణ సంగతి పట్టించుకోకుండా, ఒకే లక్ష్యం కోసం పదేపదే తీర్మానాలు చేస్తూ పోవడంవల్ల ఉపయోగం ఏమిటి?

ఆరేళ్లక్రితం రాష్ట్ర ఆర్థికశాఖ 'జీతభత్యాలను ప్రజల డబ్బుతో పొందుతున్నందున, ప్రజల తెలుగు భాషనందు మన కార్య వ్యవహారాలు నిర్వహించడం మన ఉద్యోగధర్మ'మని పేర్కొంటూ ఉత్తర్వులిచ్చింది. ఆ ఉద్యోగధర్మం నిలువెల్లా కొల్లబోవడానికి కర్త, కర్మ, క్రియ- ప్రభుత్వమే. దేశంలోని మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కర్ణాటక, మహారాష్ట్రలకన్నా ముందుగానే ఇక్కడ భాషోద్యమాలు ప్రారంభమయ్యాయి. అయినా పరిపాలన భాషగా తెలుగును దిద్దుకునే బాధ్యతను ప్రభుత్వం సవ్యంగా నిర్వర్తించలేకపోయింది. దశాబ్దాలుగా రాష్ట్రప్రభుత్వమే పరభాషా వ్యామోహంలో పడి కొట్టుకుపోవడం చేదునిజం. శాసనసభ కార్యకలాపాల్లో, ఉత్తర్వుల్లో, అధికారిక రాతకోతల్లో ఆంగ్లానికే పెద్దపీట. 'ఉద్యోగధర్మం' నిలబెట్టుకోవడానికి అది కాదు పద్ధతి. పరిపాలన మాధ్యమంగా తేటతెలుగును ప్రజలకు చేరువ చేయడానికి ప్రభుత్వం కంకణబద్ధమైందన్న సంకేతం ఉద్యోగశ్రేణుల్లో స్థిరంగా నాటుకోవాలి. అందులో చురుగ్గా రాణించేవారిని ప్రోత్సహించాలి. వెర్రిమొర్రి అభ్యంతరాలతో తెలుగు భాషావ్యాప్తికి అడ్డుతగిలేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. పాలన యంత్రాంగం చేత ఓనమాలు దిద్దిస్తే, లక్ష్యం సగం నెరవేరినట్లే.

ఆంగ్లభాషలో తనకందిన ఏ ఉత్తరాన్ని లేదా ప్రతిపాదననైనా వెనక్కి తిప్పి పంపేసే అధికారం రాష్ట్రంలోని ప్రతి గెజిటెడ్ అధికారికీ ఉంది. ఏ రకమైన ప్రభుత్వ ఉత్తర్వుల జారీకీ ఆంగ్లం వాడరాదని, తెలుగునే వినియోగించాలని సర్కారీ నిర్దేశాలున్నాయి. ఆ మేరకు 1988లో జారీ అయిన ఉత్తర్వులు కాగితాలకే పరిమితమయ్యాయి. అప్పటి మెమో 167, జీఓ 587లతోపాటు 1990 నాటి జీఓ 218, 2005నాటి జీఓ 420- ప్రభుత్వ ఉత్తర్వులు, నియమాలు, నిబంధనలు, ఉపవిధులు అన్నీ తెలుగులోనే ఉండాలని చెబుతున్నాయి. అవంటూ ఉన్నాయని, వాటి అమలు నీరోడుతోందని అధికారుల్లో చాలామందికి తెలియకపోవడం తీవ్ర బాధాకరం. ప్రభుత్వ ధోరణి, అధికారుల తీరు ఇలా ఉన్నందువల్లే- మాతృభాషలో చదివితే సరైన ఉద్యోగాలు రావేమోనన్న భయాందోళనలు విద్యార్థులను, తల్లిదండ్రులను కుంగదీస్తున్నాయి. తెలుగు చదువులు కొండెక్కుతున్నాయి. తెలుగు బిడ్డలకు తెలుగులో చదవడం, రాయడం, మాట్లాడటం రాకుండా చేసే ఈ నిర్వాకాలు క్షమించరానివి. మరెంత మాత్రం సహించకూడనివి.

ఇతర పదాలెన్నో చేరి తమ భాష స్వచ్ఛత కోల్పోవడం దేశ భవితవ్యానికి, జాతి ఉనికికి పెనుప్రమాదకరమని గుర్తించిన చైనా ప్రభుత్వం రెండున్నరేళ్ల క్రితం కొత్తచట్టం తెచ్చింది. అన్నిరకాల ప్రసార సాధనాల్లో చైనా భాషాపదాలు తప్ప మరేవీ ఉపయోగించడానికి వీల్లేదని ఆంక్షలు విధించింది. అదే ఇక్కడ, అధికారిక కార్యకలాపాల్లో తెలుగుభాషా వినియోగాన్ని సమీక్షించి, మెరుగుదలకు కార్యాచరణ సూచించేందుకే ఉద్దేశించిన అధికార భాషాసంఘం కొలువు తీరి నాలుగు దశాబ్దాలు కావస్తున్నా- నికరంగా సాధించింది గుండుసున్న. ఇన్నేళ్ల నిష్క్రియ తాలూకు దుష్ఫలితాలను, ఇటీవలి అరకొర చొరవ తుడిచిపెట్టేయలేదు.

తెలుగు భాష అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఒక మంత్రిత్వశాఖ నెలకొల్పదలచినట్లు తిరుపతి వేదికపైనుంచి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ ప్రకటించారు. పాత జీఓలను పకడ్బందీగా అమలుపరచడంద్వారా ప్రభుత్వం తొలుత తన నిబద్ధత నిరూపించుకోవాలి. దానితోపాటు, సక్రమ పర్యవేక్షణతో తెలుగు భాషాభ్యున్నతికి నిబద్ధమయ్యే ప్రత్యేకశాఖను సత్వరం అవతరింపజేయాలి. అన్ని అంచెల్లోనూ తెలుగు వెలుగొందేలా చేసే సుదృఢశక్తిగా అధికార భాషాసంఘాన్నీ పరిపుష్టం చేయాలి.

ఉత్తుత్తి వాగ్దానాలతో బంగరు కలలు నెరవేరవు!



కనుమరుగైన తెలుగు బడి

పదిహేనేళ్ల కిందట తమిళనాడు ధర్మపురిలో విద్యాశాఖాధికారిగా పని చేసేవాణ్ని. స్థానిక అదియమాన్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం జరిగింది అప్పట్లో. సభలో పాఠశాల చరిత్రను చెబుతూ... 1857లో తెలుగు బడిగా ప్రారంభమైందని అన్నారు. అంటే, ఆనాడు అది అచ్చమైన తెలుగు ఊరు. ఇప్పటికీ అక్కడ తెలుగు వారు ఎక్కువగానే ఉన్నారు. కానీ, తెలుగు బడే లేదు. మరి భాష ఎలా బతుకుతుంది?

- ఆర్.శ్రీనివాస్, బెంగళూరు

అవమానం

మన భాషను కాపాడుకోవాలన్న తెలివిడి ప్రభుత్వానికి ఉండాలి. శివరాత్రి నాడు శ్రీశైలంలో జరిగిన కల్యాణంలో... భ్రమరాంబ, మల్లికార్జునులకు అలంకరించిన కర్పూరదండలపై ఆంగ్లంలో పేర్లు రాశారు. అందులోనూ భ్రమరాంబదేవి పేరు తప్పుగా. తెలుగులో రాయవచ్చు కదా.

- వి.రామనరసింహారావు, హైదరాబాద్

ఆ కాలంలోనే...

తెలుగుకు నన్నయ కాలంలోనే నష్టం జరిగింది. సంస్కృత పదాలకు డు, ము, వులను చేర్చి తెలుగులోకి తెచ్చి... భాషకు అన్యాయం చేశారు.

- తిరునగరి సురశేఖర్, నిర్మల్

అవి వద్దు

పదసృష్టి పెరగాలి. సృష్టించుకున్న కొత్త మాటలను వాడుకలోకి తేవాలి. హ్యాపీ ఫీలౌతున్నా, మైండ్ బ్లాక్ అయింది తదితర సంకర పద ప్రయోగాలను వదిలించుకోవాలి.

- బి.వి.ఎస్.ప్రసాద్, నెల్లూరు

అనిర్వచనీయం

సర్వేల్ ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థులపై ఇచ్చిన వ్యాసాన్ని చదవగానే... తెలుగు పద్యం భవిత బంగారమనిపించింది. ఆ విద్యార్థులను అంతటి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల కృషి అనిర్వచనీయం.

- కిల్లంసెట్టి వెంకటరమణ, జయపురం, ఒడిశా

అమ్మానాన్నలదే బాధ్యత

భాషాభివృద్ధిలో 'తెలుగు వెలుగు' ప్రయత్నం, తపన ఇలాగే కొనసాగాలి. తల్లిదండ్రులందరూ పిల్లలకు మాతృభాషను నేర్పించాలి.

- గిడుగు లక్ష్మీదత్, హైదరాబాద్

తెలుగు రచయితల మహాసభలు

సెప్టెంబరు 20-22 తేదీల్లో విజయవాడలో 3వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో కృష్ణా జిల్లా రచయితల సంఘం ఈ మహాసభలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా యువరచయితల కథలు, కవితలు, వ్యాసాలు, గేయాలు, కార్టూన్లతో కూడిన గ్రంథాన్ని ప్రచురిస్తున్నారు. దీనికోసం రచయితలు, చిత్రకారులు తమ సృజనలను పంపాలని కోరుతున్నారు. పూర్తి వివరాలకు: 94401 67697

కథా సంపుటాలకు ఆహ్వానం

శాంతి రజనీకాంత్ స్మారక కథా పురస్కారానికి 2011-12లో ప్రచురించిన కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. వాటిని ఈ నెల 15వ తేదీలోపు పోటీ నిర్వాహకులకు పంపాలి. పూర్తి వివరాలకు... 08554 278277

కవితలకు ఆహ్వానం

డా॥ రాధేయ కవితా పురస్కారం కోసం కవితలను ఆహ్వానిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎక్కడా ప్రచురితంకాని వాటిని ఈ నెల 31వ తేదీలోపు పంపాలని కోరుతున్నారు. పూర్తి వివరాలకు... 94923 74787

విద్యార్థులకు ఉపయుక్తం

'తేనెలూరే తెనాలి తెలుగు' హాస్యోచితంగా ఉంది. 'చదువుల సారం జ్ఞానం' ఉపయుక్తమైన వ్యాసం. 'మట్టిలో పుట్టిన మాండలిక పదాలు', 'పదపంచాయతీ' భాషాశాస్త్ర విద్యార్థులకు ఉపయోగకరం.

- డా॥ శివభూషణం, కర్నూలు

కథలు పెరగాలి

భాషాభిమానులను 'తెలుగు వెలుగు' బాగా ఆకట్టుకుంటోంది. కథల సంఖ్య పెంచి, కొత్త రచయితలకు అవకాశమివ్వాలి.

- దివాకర్ల వెంకటేశ్వర్లు, మచిలీపట్నం

అక్షర సుమాంజలి

పత్రిక ప్రచురణ వ్యాపారంలా లేదు. ఆంధ్రశారదకు సమర్పించుకున్న అక్షర సుమాంజలిలా అనిపిస్తోంది. 'తెలుగు వెలుగు'లో ప్రచురిస్తున్న మాండలిక కథల వల్ల... ఆయా ప్రాంతాల్లో వాడుకలో ఉన్న మాటలు అందరికీ పరిచయమవుతున్నాయి.

- వెంపటి హేమ, కుంట్లూరు, రంగారెడ్డి జిల్లా

చిరునామా ఇస్తే మేలు

ఉత్తరాల ద్వారా భాషావ్యాప్తి జరుగుతుంది. పత్రికలో రచయితల ఫోను నంబర్లతో పాటు పూర్తి చిరునామా ఇవ్వాలి. వారితో అభిప్రాయాలను పంచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే, కనుమరుగవుతున్న 'లేఖా రచన' సంప్రదాయాన్ని కాపాడుకోవచ్చు.

- కె.శివ, పెద్దాపురం, తూర్పుగోదావరి

వెలుగు పూలు

భాషను బతికిస్తే అది మనకు బతుకునిస్తుంది. సంచికలో కథలు, కవితలు, ప్రత్యేక శీర్షికలు అన్ని తెలుగు తోటలో వెలుగుపూలే.

- కాళహస్తి వెంకటశేషగిరి రావు, నెల్లూరు

సభలకే పరిమితమా?

ప్రభుత్వం అట్టహాసంగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించింది కానీ స్ఫూర్తిని అందిపుచ్చుకోలేదు. 'తెలుగు వెలుగు' పత్రిక మన భాష గొప్పతనాన్ని తెలియజేస్తోంది. దాని మాధుర్యాన్ని చవిచూపిస్తోంది.

- బొమ్మ గంగాధరరావు, యానాం

పితాంబరీతో మెరిసే పూజ సామగ్రి,
పూజలో ఇస్తుంది ప్రసన్నతని !
Pitambari
Extra Power
Pitambari
Shines Copper & Brass
Pitambari®
Shines Copper & Brass
పితాంబరీ రాగి –ఇత్తడి పూజాసామగ్రికి
కొత్త వాటిలా మెరుపునిస్తుంది
ఏ లోహం అయినా,
క్షణాల్లో మెరిసేలా చేస్తుంది,
మీ ఇంటి
శోభని పెంచుతుంది.
Pitambari®
METAL POLISH
FOR INSTANT SHINE
An ISO 9001 : 2008 Certified Company
METAL POLISH
FOR INSTANT SHINE
పితాంబరీ మెటల్ పోలిష్ ద్వారా
ఏ లోహాన్నైనా, ముఖ్యంగా
రాగి-ఇత్తడి శోభా-
వాస్తులని క్షణాల్లో
కొత్త వాటిలా మెరిసేలా చేయడం
ఇప్పుడు ఎంతో సులువు.
Pitambari®
INNOVATIVE PRODUCTS
Pitambari Products PVT. LTD. Thane. Tel.: (022) 6703 5555, Toll Free: 1800224418,
www.pitambari.com. Andhra Pradesh: 9246418131, 9010618618, C.R.M: (022) 67035699/5532/5564

మీసాలు...రోషాలు!

మింగ మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె! వెనకటికెవరో వెక్కిరించారు.

అంబలి తాగేవారికి మీసాలు ఎగబట్టేవారు కొందరా! అని ఇంకెవరో దెప్పిపొడిచారు. మీసమంటే అంత అలుసా! రోషానికైనా, పౌరుషానికైనా అదే గుర్తు కదా. 'మీసమున్న నేస్తమా.! నీకు రోషమెక్కువ' అని పాడుకునే తెలుగు వాళ్లం కదా. మరెందుకయ్యా పై సామెతలు పుట్టాయి అంటే, డాబుకు పోయే వారిని నేలకు దింపడానికి. సరే, ఇలాంటి వ్యతిరేకార్థ పద గుచ్ఛాల గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. వాటిని పక్కన పెట్టేద్దాం. 'ఆ తుచ్ఛ సుఖాలన్నీ మీసాలపై తేనె చుక్కల'ని ప్రవరాఖ్యుడి చేత అనిపించిన అల్లసాని పెద్దన లాంటి కవీశ్వరులు చెప్పిన మీసాల ముచ్చట్లను ఆస్వాదిద్దాం.

మీసాలొచ్చిన కొత్తలో చేశానయ్యా ఆ పని! నువ్వు ఇప్పుడొచ్చి గొప్పలకు పోతున్నావ్!

గుర్తొచ్చాడా! కవి సార్వభౌముడు జ్ఞప్తికి వచ్చాడా! కాస్త అటు ఇటుగా తనే చెప్పాడు...

నూనూగు మీసాల నూత్న యౌవనమున
శాలివాహన సప్తశతి నుడివితి

శ్రీనాథుడు శ్రీనాథుడే. ఆటలాడుకునే వయసు నుంచి అమరపురి కేగే నాటి వరకూ అచ్చ తెలుగు పద్య సేద్యం చేస్తూనే ఉన్నాడు.

రొయ్యకీ ఉందీ నీకూ ఉంది మీసం! ఎందుకయ్యా రోషం లేని బతుకు!

కవిచౌడప్ప ఎద్దేవా చేశాడు కదా... రాజులను!

ఇయ్యా యిప్పించంగల
అయ్యలకే కాని మీస మన్యులకేలా?
రొయ్యకు లేదా బారెడు!
కయ్యానకు కుందవరపు కవి చౌడప్పా!

'ఇవ్వడానికి'/ 'ఇప్పించడానికి' చేతులు రాని వాడికి మీసాలెందుకు? రాజు అన్న హోదా ఎందుకు! చౌడప్ప అక్షరాలకున్న శక్తే ఇంత. అవతల వాణ్ని నిలబెట్టి కడిగేస్తాయవి.

మీసకట్టు మీద ఒట్టు... ఓడితే మీసం తీసేస్తా!

తిరుపతి వేంకట కవులు మీసాలు మెలేసి (ఈ జంటలో చెళ్లపిళ్ల వారికి మీసాలుండేవి) మరీ విసిరిన సవాల్ ఇది. కాకపోతే వారు పద్యరూపంలో చెప్పారు. ఇక్కడ చలనచిత్ర పరిభాషలో చెప్పుకుంటున్నాం.

దోసమటంచెఱింగియును దుందుడు కొప్పగ బెంచినార మీ
మీసము రెండు బాసలకు మేమె
కవీంద్రులమంచు దెల్పగా
రోసము గల్గినన్ గవి వరుల్ మము గెల్వుడు, గెల్తురేని యా
మీసము దీసి మీ పద సమీపములన్ దలలుంచి మ్రొక్కమే

సంస్కృతాంధ్ర భాషల్లో మా కవితా శక్తికి గుర్తుగా మీసాలు పెంచాం. రోషమున్న కవులెవరైనా మమ్మల్ని ఓడించవచ్చు. అలా ఓడిస్తే... మీసం తీసి ఓడించిన వారి పాదాల ముందు ఉంచి నమస్కరిస్తాం! తిరుపతి వేంకట కవుల మాటల్లో ఎంతటి ఆత్మవిశ్వాసం!

మీసాల మీద నిమ్మకాయలు నిలబెడతా!

చాల్లే బాబూ... నీ బడాయి! అవని భారాన్ని మోస్తోంది 'మామ మీసాలే'నని మహాకవి అవతల చెబుతోంటే!

కారుమబ్బుల బారు సేరునేలెడి తీరు
కోర మీసము పొందు కోరుకొందు
మృగరాజు జూలునే తెగనాడ జాలు నీ
ఘన మీసము పసందు కనుల విందు
గండు చీమల దండు కదలాడి నటులుండు
నీ మీసము తెరంగు నీలిరంగు
మెలిపెట్టి నిలబెట్టు మీసాలు రోసాలు
గగన మండలముపై కాలుదువ్వు
ఎవరు మోయుచున్నారు ఈ అవని భార
మాది శేషుడా, కూర్మమా? కాదు కాదు
అష్టదిగ్గజ కూటమా? అదియు కాదు
మామ మీసాలె భువికి శ్రీరామరక్ష!

'కులగోత్రాలు' చలనచిత్రం కోసం మీసంపై శ్రీశ్రీ రాసిన సీసమిది! శ్రీరంగం కలానికి రెండు వైపులా పదునే. అక్షరాలతో విప్లవాగ్నులనూ రగిల్చాడు. చమత్కార బాణాలనూ సంధించాడు.

'మీసం మూరెడు... రోషం బారెడు' అని వెక్కిరించడం మనకు మామూలే. కానీ, ఉత్తర భారతీయులు, విదేశీయుల్లో చాలా మంది మీసాలు, గడ్డాలు పెంచరు కదా. అలా అని వారికి రోషం, పౌరుషం ఉండవా! అలా అని అనలేం. అనకూడదు కూడా. మన సమాజ స్థితిగతులు, అలవాట్లు, నమ్మకాలు, భావోద్రేకాల వ్యక్తీకరణకు అనుగుణంగా భాషలో కొన్ని ప్రయోగాలు స్థిరపడతాయి. మాటల ప్రవాహంలో మంచి ముత్యాలుగా జాలువారుతాయి. మీసాలపై వచ్చిన సామెతల నుంచి పద్య పాదాల వరకూ అన్నీ ఇలాంటి మేలిమి మౌక్తికాలే.

– తెలుగు వెలుగు బృందం





పాఠకులతో మహాకవి

శ్రీశ్రీ మాటల పదును మనకు తెలిసిందే. అలాంటి మహాకవిని ప్రశ్నించే అవకాశం వచ్చింది ఆనాటి 'ప్రగతి' (60వ దశకంలో ప్రచురితమైన వారపత్రిక) పాఠకులకు. సాహిత్యం, రాజకీయాలు, చలనచిత్రాలు... అనేకానేక అంశాలపై వారు శ్రీశ్రీకి ప్రశ్నలు సంధించే వారు. వాటికి ఆయన అలతి అలతి పదాలతో స్పష్టమైన సమాధానాలిచ్చే వారు. 'జాబులు - జవాబులు' శీర్షికన అవి పత్రికలో ప్రచురితమయ్యేవి. వాటిలో కొన్ని... (సాహిత్యపరమైనవి)

పాఠకుడు: నేనొక రచయితను కావాలంటే అందుకు ఎవరి ప్రోత్సాహం లభించాలి?

శ్రీశ్రీ: ముందు ఆత్మవిశ్వాసం ఉండాలి. తర్వాత దానికి తోడుగా అవిరళకృషి కావాలి.

తెలుగు సాహిత్యంలో వచ్చిన పరిణామాలపై మీ అభిప్రాయం?

ఇది వివరించాలంటే ఒక గ్రంథమే రాయాలి. సాహిత్య పరిణామానికి, సాంఘిక పరిణామానికి పరస్పర సంబంధం ఉందనేది నా అభిప్రాయం

బూర్జువా పదం ఏ భాష? దాని భావం?

ఫ్రెంచి భాష. దానికి సరైన తెలుగు మాట స్ఫురించలేదు. నడిమి తరగతి వాడు, త్రిశంకుస్వర్గవాసి మొదలైన మాటలు దాని భావాన్ని సూచించవచ్చు.

నగ్నకవులపై మీ వ్యాఖ్యానం?

దిగంబర కవులని మీ ఉద్దేశం అయి ఉంటుంది. వారు దిక్కులనే ఆచ్ఛాదనగా కప్పుకున్నారు కదా?

నాలుగు పాదాల గేయాలు రాసిన వారు వందల పేజీల నవలలు రాసిన వారికంటే ఎక్కువ పేరు సంపాదించుకోవడానికి కారణం?

ఇందులో ఎక్కువ తక్కువ ఎందుకు? ఎవరి పేరు వారికుంటుంది. నవలైనా, గేయమైనా నాణ్యత ముఖ్యం.

తెలుగువాడి వరసే వేరు

పెద్ద చిక్కొచ్చిపడింది!

తెలుగునాట ఎవరినీ ఏమీ అనడానికి వీల్లేదు. మేధావి అన్నా ఊరుకోరు. కళాకారుడు అన్నా ఊరుకోరు. అన్నీ అపార్థాలే! పరువు నష్టాలే!

'రామా అన్నా బూతుమాట అయిందేనని తరతరాలుగా తెలుగు వాళ్లు తలపట్టుకొన్న సందర్భాలు లెక్కలేనన్ని! అదేంటోగానీ, మాట వినని వాణ్ని నీ బుర్ర రామకీర్తన పాడిస్తానని బెదిరిస్తారు. రామకీర్తన అంటే ఇదా అని ఎవరైనా ముక్కున వేలేసుకుంటారు. పవిత్రమైన పదజాలానికి కూడా మన వాళ్లు తాటాకులు కట్టారు. తమాషా చూశారా. వెంకన్న గుడిలో తప్ప ఇంకెక్కడ గోవిందా అన్నా ఎవరిదో కొంప మునిగిందనుకోవాలి. ఎక్కడో మోసం జరిగితే కైంకర్యం జరిగిందని పత్రికలన్నీ తాటికాయంత అక్షరాలతో వేస్తాయి. కైంకర్యం అంటే కింకరుడు చేసే పని. కింకరుడు అంటే సేవకుడు (యమకింకరుడులో కింకరుడు స్పష్టంగా కనబడతాడు). కైంకర్యం అంటే సేవ! ఇప్పుడు లక్షలు, కోట్లు! లక్షల కోట్లు కైంకర్యం చేస్తున్నవారంతా ప్రజా'సేవకులు', 'మహామేత'లే అన్నది వేరే విషయం. నిజానికి శుభకార్యంలో అక్షింతలు వేయించుకుంటే ఎంత అదృష్టం! ఇది కూడా మారిపోయింది. తిట్లు తిన్నాడని అర్థం చేసుకోవాలి పాపం! శఠగోపం కూడా అలా అయిపోయింది. భజనకు కూడా అర్థం మారిపోయింది! నామం పెట్టడమన్నా వ్యతిరేకార్థమే. అర్థవిపరిణామమో, అనర్థ విపరిణామమో పరిస్థితి మాత్రం ఇది!

తమిళనాడులో కుంభకోణం గొప్పగొప్ప దేవాలయాలు ఉన్న ప్రాంతం. ప్రత్యేకించి నృసింహక్షేత్రం. అయితేనేం కుంభకోణం అన్నమాట వినిపిస్తే సీబీఐ గుర్తొస్తుంది. భాగవతం బాగోతం అయిపోయింది. నీ పంచాంగం బయటపెడతాననే మాట వినబడుతోంది. అంతెందుకు కొందరు తెలుగువాళ్లను చూసి వాళ్ల చరిత్ర తెలుసుకొని దేవుడు కూడా గడగడ వణికిపోతాడు. అతగాడు గుడినీ గుళ్లో లింగాన్నే కాదు... అతల వితల వగైరా లోకాల్నీ కబళించెయ్యగలరు. మింగేవాడు కావడమే ఇందుకు కారణం.

తిక్కరేగిందంటే తెలుగువాడు ఎదుటివాణ్ని కుక్క అనో, గాడిద అనో, పంది అనో తిడతాడు. సాటివాణ్ని అలా ఎందుకు ఆడిపోసుకుంటావన్నా ధాటి తగ్గదు! తెలుగువాడు భోళాశంకరుడు. అభిమానం కలిగితే అతగాణ్ని అదుపు చేయడమూ కష్టమే! మా అన్నో, నాన్నో... మనిషని చెప్పుకోవడానికి మాత్రం ధైర్యం చెయ్యరు ఏమిటో! సింహమనో, పులి అనో నిజస్వరూపాన్ని బయటపెట్టి ఆకాశానికి ఎత్తుతారు.

ఆంధ్రులు ఆరంభశూరులు అనే మాట ఉంది. ఏదయినా పని మొదలు పెట్టగానే దడదడలాడిస్తాడు. తర్వాత నీరసపడిపోతాడు. తెలుగువాడి తలకాయలో తిరుగులేని ఇంద్రజాలం ఉంది. మసిబూసి మారేడుకాయ చేయడమన్నా, తిమ్మిని బమ్మిని చేయడమన్నా ఒకటే! ఈ విద్యలో పెద్దపెద్ద 'అన్యాయవాదుల్ని' సైతం ఢామ్మని పడేస్తాడు. మద్యం 'సేవిస్తా'నంటాడు. మంచినీళ్లు సేవిస్తానని మాత్రం అనడు. మద్యానికి ఉన్న విలువ మంచినీళ్లకు లేదా? అంటే 'కిక్కు'రుమనడు.

వాదుకొస్తే తెలుగువాడు ఎవ్వరినైనా లెక్కచేయడు. నేతిబీర కాయ అంటాడు. అందులో నేయి ఉంటుందా? చలివేంద్రం అంటాడు. అందులో చలి ఉంటుందా? ఎవ్వారిని లెక్కచేయము అని తిరుపతి వెంకటకవులే కాదు ఏదో ఒక సందర్భంలో ప్రతి తెలుగువాడూ అంటాడు! ఇక కవుల సంగతి చెప్పేదేముంది!

మ్రొక్కిన వరమీని వేల్పును కూడా వదిలేయమన్నాడు సుమతీ శతకకారుడు. ఎంత సాహసం! దేవుడికైనా దెబ్బే గురువు అంటాడు. తెలుగు వాడయిన భక్తరామదాసు కంచెర్ల గోపన్న సంగతి అందరికీ తెలుసు. కులుకుచు తిరిగేవు... ఎవడబ్బ సొమ్మని శ్రీరామచంద్రుణ్నే నిలదీశాడు. దేవుడు ప్రకృతి... దెయ్యము వికృతి. ఆ మాటకొస్తే తెలుగు వాడి మనస్తత్వమే వేరు. దానిని



గమనించే బద్దెన కవి అప్పిచ్చువాడు పద్యం రాశాడు. అప్పిచ్చు వాడు ఉన్నాడోలేడో కనుక్కున్న తర్వాతనే ఊళ్లో ఉండమనడం ఎంత కష్టం! దీని సంగతి ఏమైనా, తెలుగువాడికి ప్రపంచ బ్యాంకుతో 'ఋణానుబంధాని'కి మూలాలు ఇందులోనే ఉన్నాయనిపిస్తుంది.

ఇదే సమయంలో మన శతక కవులు తమ పద్యాల్లో బోధించిన వ్యక్తిత్వ వికాస పాఠాలు అనన్యసామాన్యమైనవి. ఇందుకు తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష! దయచుట్టంబౌ అన్న శతక కవి మాటలు ముత్యాల మూటలు. ఈ మూడు ముక్కల్ని ఎవరు పాటించినా, అతడు అపురూపమైన వ్యక్తి అవుతాడు.

ఎటొచ్చీ చిన్న పిల్లలకు తెలుగువాడు ఇచ్చే శిక్షణే విచిత్రంగా ఉంటుంది. పిల్లాణ్ని అదుపు చేయడానికి అతగాడికి రెండు మార్గాలు. ఒకటేమో నీకు పెళ్లిచేస్తా..రా అని బెదిరిస్తాడు. పెళ్లి అంటే తన్నడం అనే అర్థం ఏ నిఘంటువులో ఉందో తెలీదు. ఇక అడుగో పోలీసు వస్తున్నాడు. ఇది చిన్నప్పటి నుంచే పిరికి మందు నూరిపోయడం, పోలీసుల పట్ల వ్యతిరేక భావాన్ని రేకెత్తించడం. 'అడుగో మామ తన్ను' అని పిల్లాణ్ని ప్రోత్సహిస్తాం. వాడిచేత సాధన కూడా చేయిస్తాం. ఇది హింసకు శిక్షణ!

తెలుగు వాడికి ప్రతిదీ ఒక ఆట. మాట్లాడుకోవడం, పోట్లాడుకోవడం ఇందుకు ఉదాహరణలు. ఇవన్నీ ఆటలు ఎలా అవుతాయంటే అది అంతేలే అంటాడు. వీటి సంగతి అలా వదిలేసినా తెలుగు వాడికి ఎవ్వరికీలేని సరికొత్త 'ఆహార పానీయాలు' ఉన్నాయి. 'తిట్లు తింటావు, తన్నులు తింటావ్' అని బెదిరిస్తాడు. తిట్లు, తన్నులు తినడం ఎట్లాగో ఎవరికీ అంతుబట్టదు ఇలాగే. పొగతాగడం ఒకటి. పొగను పీల్చడమో, వదిలెయ్యడమో చేస్తారు గానీ తాగడం ఎలా! అంటే నవ్వి ఊరుకుంటాడు. దీపం ఆరిపోయిందంటే కొండెక్కిందంటాడు. మంగళసూత్రం తెగిపోతే పెరిగిందంటాడు. బియ్యం అయిపోతే నిండుకున్నాయంటాడు. అంతెందుకు? ఏడు అని పలకడానికి తెలుగు వ్యాపారి ఇష్టపడడు. ఆరున్నొకటి అంటాడు.

తెలుగువాడి వరసే వేరు. ఉదాహరణకు వేలు విడిచిన మేనమామ అంటాడు వేలు విడవడం కాదు కదా! లక్షలు పారేసుకున్నా ఇది అంతుబట్టదు.

మిగతా దేవుళ్ల సంగతి ఏమోగానీ హనుమంతుడు మాత్రం కచ్చితంగా తెలుగువాడే! ఇందుకు ప్రత్యేకమైన పరిశోధనలు అక్కర్లేదు. హనుమంతుడికి తన శక్తి గురించి తనకు తెలియదు. తెలుగువాడికీ అంతే! కాళిదాసు కావ్యాలు విషపూరిత వ్యాఖ్యల వల్ల దెబ్బతిన్న కాలంలో తెలుగు పండితుడు మల్లినాథ సూరి సంజీవని వ్యాఖ్య రాసి ఆ కావ్యాలకు ప్రాణం పోశాడు! ఎంత గొప్ప సేవ ఇది! ఎంత గొప్ప చేవ ఇది!

కడుపులో బంగారు అని రాయించుకున్న తెలుగుతల్లి కంగారు పడుతోంది. 'ఋ'కు కొమ్మిస్తే 'బు' అవుతుందని ఓ తెలుగు పండితుడు పాఠం చెబుతుంటే విని ఆమె చెవులు మూసుకుంది! ఏది తెలుగు? ఏది కాదు? అనేది చచ్చేంత సమస్య కాదు- మంచి తెలుగు వచ్చేంత సమస్య. తాతలందరూ సంస్కృతమంతా తెలుగు అనుకుంటారు. లేతవాళ్లంతా ఇంగ్లీష్ అంతా తెలుగు

అనుకుంటారు. ఇందులో ఏదీ నిజం కాదు ఏదీ అబద్ధం కాదు.

తెలుగువాళ్లకు అనవసరమైన 'కలుపు' గోలుతనం ఉంది. ఇది భాషావిషయకంగా కనిపిస్తుంది. ఇందుకు యొక్క, నుండి, నుంచి ఉదాహరణలు. యొక్క అంటే ఒక్క. నుండి, నుంచి-ఉండి, ఉంచి. 'సంధి' కొట్టడంలో పక్కమాటల్లోని అక్షరాలు మరో పదంతో జత కట్టడంవల్ల ఇది జరిగింది.

తెలుగు భాష నిర్దిష్టంగానూ, నిర్దుష్టంగానూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో దీనిముందు హిందీ, ఇంగ్లీషులు బలాదూర్. ఇంగ్లీష్‌లో నిన్నను యస్టర్‌డే, నేడును టుడే, రేపును టుమారో అంటారు. మొన్నను డే బిఫోర్ యస్టర్‌డే, ఎల్లుండిని డే ఆఫ్టర్ టుమారో అంటారు. హిందీ సంగతి చెప్పేదేముంది. నిన్ననూ, రేపటిని ఒకేమాటన కట్టేస్తారు. 'కల్' అంటారు. సందర్భాన్ని బట్టి అర్థం చేసుకుంటారు. మరి మన తెలుగులో మొన్న, నిన్న, నేడు, రేపు, ఎల్లుండిలతో పాటు ఆ మర్నాటిని 'ఆవల ఎల్లుండి' అని అంటారు. ఆ తర్వాత రోజును అటావల ఎల్లుండి అని అంటారు. తెలుగు భాషలో గకార భాష దురాక్రమణ ఒకటి. తరతరాలుగా ఇది తెలుగువాడి గొంతుపట్టుకొని మాటల్ని పలికిస్తోంది. వాటికి అర్థమూ లేదు...వ్యాకరణమూ లేదు.

ఉదా: పెళ్లీగిళ్లీ, పనీగినీ

వీటిలో పెళ్లికి, పనికి అర్థాలున్నాయి. గిళ్లికి, గినికి లేవు. అయినా తెలుగువాడి నోట తప్పనిసరిగా వస్తాయి. ఇదెందుకయ్యా అని ఎవడూ అనడు. భాషను ఆధునీకరించేటప్పుడు కూడా విషయం అర్థం కాకపోతే విషమమే! లేక బదులు లేదా అని రాయమన్నారు వ్యావహారిక భాషావేత్తలు. గుడ్డిగా అనుసరించాడొక పాత్రికేయుడు. ఇంకేముంది? వర్షాలు లేదా పంటలు పండటం లేదు అని రాసేశాడు!

తెలుగువాడు సామెతల్ని సృష్టిస్తాడు. అయితే పొరపాటునో గ్రహపాటునో వాటిని తానే మార్చేస్తాడు. 'నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా' అంటుంటాడు. నిజానికి ఇందులోది నాగలోకం కాదు నాకలోకం. నాకలోకం అంటే స్వర్గం. సామెతల్ని మార్చి అపార్థాలు కూడా సృష్టిస్తాడు. 'ఇల్లు ఇరకటం ఆలు మరకటం' అంటాడు. ఇల్లు ఇరకటం (ఇరుగ్గా ఉండడం) ఉండటం సరే, భార్యను పట్టుకుని కోతి అంటే ఆమె ఊరుకుంటుందా? మొగుణ్ని పట్టుకుని దులిపేయదూ! చీపురుకట్ట తిరగేసి నువ్వు కోతి.., మీ నాన్న కోతి, మీ తాత కోతి అని ఎడాపెడా వాయించెయ్యదూ? అందువల్ల బుర్రకు పని చెప్పాలి. నిజానికి అది ఇల్లు ఇరుకూటం ఆలు మరుకూటం. అంటే ఇల్లు రెండు భాగాలుగా ఉండాలి. భార్య వేరే భాగం నుంచి రావాలి. ఇంతోటిదానికి ఇంట్లో 'యుద్ధపూరిత వాతావరణం' సృష్టించుకోవడం ఎందుకు? ఒక సామెత మరిచిపోతే వేలకొలది ప్రభవించును అని ఊరుకుంటే ఎంతహాయి! ఊరుకోడు.

తెలుగువాడికి ఖ గుణింతం మీద ఉన్న మక్కువ అంతా ఇంతా కాదు.. అపార్థాలకు శం'ఖు'స్థాపన చేసుకుంటాడు. 'శంకుస్థాపన' సరిపోతుందని చెప్పినా వినిపించుకోడు. ఒక్క ఇంగ్లీష్ ముక్క కూడా లేకుండా తెలుగు ప్రసంగం చేయమంటే తెలుగువాడు ఇబ్బంది పడతాడు. అంత'సీన్'లేదు అన్నా అంటాడు. సీన్ అనగానేమి? అది ఎట్లుండును? అన్నది నిఘంటువు చూసినా తెలియదు.

ఒక్కోసారి లైట్ కొట్టడం అంటాడు! కలర్ లేదు అంటారు. ఫిట్టింగ్ పెడుతున్నదంటారు. కటింగ్ ఇస్తున్నాడని అంటారు. ఇదంతా తెలుగట.

ఇతరుల తప్పులెంచడం, తన తప్పుల జోలికివస్తే తాటతీస్తాననడం తెలుగుకవి సొంతం. ఇందుకు తెనాలి రామలింగడు అలియాస్ తెనాలి రామకృష్ణుడు ఉదాహరణ.

ఒకని కవిత్వమందెనయ నొప్పులు తప్పులు నా కవిత్వమం
దొకనికి తప్పుపట్ట పనియుండదు కాదని తప్పుపట్టినన్
మొకమటు కిందుగా దిగిచి ముక్కలు వోవ నినుంప కత్తితో
సికమొదలంట కోయుదును చెప్పున గొట్టుదు మోముదన్నుదున్

అని వీరంగమాడాడు. అంత అవసరమా!

తప్పు చేయడం, చమత్కారంతో తప్పించుకోవడం తెలుగు కవికి వెన్నతో పెట్టిన విద్య.

మహాప్రస్థానంలో మహాకవి శ్రీశ్రీ- "వర్షుకాభ్రముల ప్రళయ ఘోషవలె" అంటాడు. నిజానికి వార్షుకాభ్రముల అనాలి. మహాకవీ! ఎందుకిలా రాశావయ్యా! అంటే 'నాకు సంస్కృతం రాదని చెప్పడానికి అలా రాశాలే' అని కప్పిపుచ్చి నవ్వించేశాడు. తెలుగువీర లేవరా! పాటలో ప్రతివాడూ సింహాలై గర్జించాలి! అని రాశాడు శ్రీశ్రీ. సింహం అయి గర్జించాలి అని ఉండాలి. ఇది ప్రస్తావించినప్పుడు శ్రీశ్రీ 'నాకు తెలుగు రాదని చెప్పడానికి అలా రాశాలే!' అని అనలేదు. ఇందుకు తెలుగు జాతి మొత్తం ఆయనకు 'రుణపడి' ఉంది.

తెలుగు వాడికి ఆత్మవిమర్శ కూడా ఉంది.

'కాళిదాసు కవిత్వం కొంత... నా పైత్యం కొంత' అన్న తెలుగువాడి స్వ(భాష)రూప జ్ఞానాన్ని వేనోళ్ల కొనియాడక తప్పదు. తెలుగు వాడికి ఎంత ప్రతిభ ఉంటే మాత్రం ఏం లాభం! నోరు తెరిచి అడిగితే తప్ప ఎవ్వరూ ఏదీ ఇవ్వరు! **'పెద్దన బోలు సత్కవులు పృథ్విని లేరని నీవెరుంగవే'** అనీ **'పెద్దన కేదలంచినను పేర్మిని నాకిడు కృష్ణరాణ్ణృపా'** అని అల్లసాని పెద్దన అడిగాకనే కృష్ణదేవరాయలు ఆయనకు గండపెండేరం తొడిగాడు. ఇవన్నీ తెలుసు కాబట్టే 'అడగందే అమ్మయినా పెట్టదు' అని తెలుగువాడు స్వానుభవంతో చెబుతాడు.

ప్రముఖ తెలుగుకవులతో ఒక సమస్య. ఒకచోట పుట్టరు. ఒక కాలంలో పుట్టరు. వాటితో పెద్ద గొడవలు. పోనీ దివంగతులు దిగివచ్చి తేల్చిచెబుతారా? అంటే చెప్పరు! పరిశోధనలు, ఉపపరిశోధనలు బోలెడంత కాలక్షేపం. విశ్వవిద్యాలయాలకు చేతినిండా పని! చివరకు సమస్య మాత్రం 'చిక్కు' చెదరకుండానే ఉంటుంది.

తెలుగు వాడి వేదాంతమూ చిత్రమైందే. దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అంటాడు. ఇదే సమయంలో ఇవ్వాళ చస్తే రేపటికి రెండు అని కూడా నిర్వేదంగా మాట్లాడ తాడు. అర్థం చేసుకునే వాడి జాతకాన్ని బట్టి అంతా 'సాగుతుంది'. పగలే వెన్నెల, జగమే ఊయల అయినా కాకపోయినా కదిలే ఊహలకు కన్నులుండాలి! అంతే! ఆహా! ఏమి తెలుగువాడు(క)!

- శంభు

ముత్యాల ముగ్గు

					6 మి					
				5 ల	మి	7 ల				
			4 చి	లి	బి	లి	8 క			
		3 ళ	క	ళ	త	ళ	త	9 ళ		
	2 మ	లు	పు	ల	కు	లు	కు	ల	10 త	
1 ళు	కు	ల	ప	ల్కుల్	ప	లు	ప	లు	త	11 ల
	పు	లు	జ	ల	జ	ల	గ	ల	గ	
		ల	క	ల	గొ	లి	పి	ల		
			చి	లు	క	ల	చె			
				లి	ప	లి				
					కెయ్					

కందం: మిలమిల చిలిబిలి కళకళ
తళతళ మలుపుల కులుకుల తళుకుల పల్కుల్
పలుపలు తలపులు జలజల
గలగల కలగొలి పిల చిలుకల చెలి పలికెయ్

ప్రత్యేకత:
ఈ 'ముత్యాల ముగ్గు'లో బేసి సంఖ్య గడుల్లో (1, 3, 5, 7, 9, 11) నిలువుగా చూస్తే 'ల, ళ' ప్రస్తావన విభిన్న రూపాల్లో ఉంటుంది.

సి.విజయ్‌కుమార్
గౌనివారిపల్లి, అనంతపురం జిల్లా
95502 69598



వైద్యాలయమే విద్యాలయం

ఫొటోలు: సుబ్రహ్మణ్యం

ఆ భవనపు గోడలపై చక్కటి పొడుపుకథలుంటాయి. తలుపులపై చిక్కటి కవితలు కనిపిస్తాయి. ఎక్కడ చూసినా తియ్యటి తెలుగు మాటలు, పాటలే దర్శనమిస్తాయి. తొందరపడి ఏదో పాఠశాల అనుకోకండి! అదొక పిల్లల ఆస్పత్రి. అమ్మభాషపై అక్కడి నిర్వాహకురాలికి ఉన్న అనురక్తే... ఆ వైద్యాలయాన్ని తెలుగు విద్యాలయంగా మార్చేసింది.

జిగట చర్మం... మిడిగుడ్లు... వర్షం పడితే కుప్పలు తెప్పలు... ఏంటో చెప్పండి! ఇలాంటి పొడుపు కథలు పిల్లల్లో భాషపై ఆసక్తి పెంచవూ!

ఆకాశమంత ఎత్తులో లక్ష్యాలు... వాటిని అందుకోవడానికి పిల్లల పాట్లు!

ఈ రెండు వాక్యాలు అమ్మానాన్నలను ఆలోచింపజేయవూ!

కరీంనగర్ జిల్లా సిరిసిల్లలోని సృజన్ పిల్లల ఆస్పత్రిలో అడుగుపెడితే ఇలాంటి అచ్చతెలుగు అక్షరాలెన్నో పలకరిస్తాయి. మంచి విషయాలెన్నింటినో మనసుకు హత్తుకునేలా వివరిస్తాయి. వైద్యశాల నిర్వహణ సంచాలకురాలు (ఎండీ) డా॥ కందేపి రాణీప్రసాద్ ఆలోచనల్లోంచి పుట్టిన అక్షర గుళికలివి.

రాణీప్రసాద్ తండ్రి ఎ.సుందరాచారి. తెలుగు భాషాభిమాని. తెలుగు సాహిత్య రంగంలోని పెద్దలందరితో ఆయనకు పరిచయాలున్నాయి. తరచూ కవి సమ్మేళనాలు నిర్వహించడం ఆయనకు అలవాటు. ముఖ్యంగా ఇంట్లో ఏదైనా వేడుక జరుగుతున్నప్పుడు ఇలాంటి సమ్మేళనాలను భారీగా ఏర్పాటు చేసేవారు. రాణీప్రసాద్ అక్షరాభ్యాసం నాడు వందమంది కవులతో సమ్మేళనం నిర్వహించారట! అలాగే ఆమె తమ్ముడు అక్షరాలు దిద్దడం ప్రారంభించిన సమయంలోనూ! కుటుంబ వ్యాపార (రైస్‌మిల్లులు) ప్రారంభ సమయాల్లోనూ ఇదే పద్ధతి. మంచి పాండిత్యమున్న వారిని ఇంటికి పిలవడం... కార్యక్రమాలనంతరం వారిని సత్కరించడం... ఇదీ ఆయన ప్రవృత్తి. రాణీప్రసాద్ వివాహ సందర్భంలో కూడా అపురూపమైన కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఇలా నిత్యం సరస్వతీ నిలయంగా భాసించే ఇంట్లో పెరిగిన రాణీప్రసాద్‌కు తెలుగుపై అభిమానం పెరిగింది. కవితలు రాయడం అలవాటైంది. వైద్యవిద్యను అభ్యసించి... చిన్నపిల్లల వైద్యనిపుణులు అయ్యాక కూడా అమ్మభాషను ఆమె మర్చిపోలేదు. దాదాపు దశాబ్దం కిందట భర్త డా॥ ప్రసాదరావుతో కలిసి సొంత ఆస్పత్రిని ప్రారంభించారు. పొడుపు కథలు, కవితలు, బొమ్మలను ప్రదర్శించడానికి తగినట్లుగా భవన ఆకృతిని రూపొందించారు. నిర్మాణ సమయంలోనే ఆ జాగ్రత్తలు తీసుకున్నారు. ఎనిమిదేళ్ల కిందట మొదటిసారిగా 'చిట్టిచిలకమ్మ' లాంటి గేయాలను ఆస్పత్రి గోడలపై అంటించారు. ఆ తర్వాత పొడుపు కథలను, కవితలను వాటికి జత చేశారు. ఇంకో విషయం... ఇలాంటి వాటికి చక్కటి బొమ్మలను కలిపి ప్రదర్శిస్తారు. ప్రతి రెండేళ్లకోసారి పాతవి తీసేసి కొత్తవి పెడతారు.

అసలు ఆస్పత్రిలో ఇలాంటి వాటిని ఎందుకు పెట్టాలనిపించిందని రాణీప్రసాద్‌ను అడిగితే... 'ఆస్పత్రికి వచ్చే వారు వైద్యులను కలవడానికి చాలాసేపు వేచిచూస్తూ కూర్చుంటారు. ఆ సమయమంతా వృథానే అవుతుంది. మన తెలుగులోని చక్కటి విశేషాలను అందరికీ కనిపించేలా ఉంచితే ఆ సమయం సద్వినియోగం అవుతుంది కదా అనిపించింది. తర్వాత నా ఆలోచన వాస్తవమేనని అర్థమైంది. ఆస్పత్రి గోడలపై ఉండే వాటిని పిల్లలు ఆసక్తికరంగా చదవడం గమనించా. చదవడం రాని మూడు, నాలుగేళ్ల పిల్లలైతే బొమ్మలను వింతగా చూస్తారు. దాంతో వాటిని వివరించడానికి తల్లిదండ్రులు ప్రయత్నిస్తారు. ఇదీ మంచిదే కదా. ఇక చదువురాని వాళ్లయితే పక్క వాళ్లను అడిగి మరీ చెప్పించుకుంటారు. మా ఆస్పత్రిలో నిత్యం కనిపించే దృశ్యాలివి' అని చెబుతారు.

వైద్య పరికరాలన్నింటిపై చక్కటి కవితలు కనిపిస్తాయి ఈ వైద్యశాలలో. వాటి ద్వారా అవి ఎలా పనిచేస్తాయో అందరికీ సులువుగా అర్థమవుతుంది. అలాగే, ప్రతి మందుల చిట్టీపైనా



తెలుగు ముగ్గు, సామాజికాంశాలపై చైతన్యం కలిగించే చిన్న కవిత ముద్రితమై ఉంటాయి. పోలియో చుక్కలు, వ్యాధి నిరోధక టీకాలు, ఎయిడ్స్, బాల్యవివాహాలు లాంటి ఎన్నో అంశాలపై గుదిగుచ్చిన అక్షరమాలికలు వీటిపై కనిపిస్తాయి. అవన్నీ రాణీప్రసాద్ కలం నుంచి వచ్చినవే. ఆస్పత్రిని సందర్శించే ఇతర వైద్యులు కూడా ఈ విషయంలో ఆమెను అభినందిస్తుంటారు. ఇక రోగులు, వారి బంధువుల అభినందనలైతే అనంతం. కరీంనగర్‌లోని భగవతి పాఠశాల వారు ఈ ఆస్పత్రిలోని పొడుపు కథలు, కవితలు, బొమ్మలతో ఓ ప్రదర్శన కూడా నిర్వహించారు.

చిన్నారులంటే రాణీప్రసాద్‌కు చాలా ఇష్టం. మంచి వాతావరణంలో ఎదిగిన పిల్లలు దేశానికి వెలకట్టలేని సంపద అవుతారన్నది ఆమె విశ్వాసం. అందుకే వారి కోసం పుస్తకాలు రాస్తున్నారు. ఇప్పటి వరకూ సొంతంగా పది పుస్తకాలను రాశారు. హిందీ, ఆంగ్లం నుంచి ఆరింటిని అనువదించారు (నేషనల్ బుక్ ట్రస్ట్ కోరిక మేరకు).

రాణీప్రసాద్ దంపతులకు ఇద్దరు పిల్లలు... సృజన్, స్వాప్నిక్. ఇప్పుడు ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు. వారు పాఠశాల స్థాయిలో ఉన్నప్పుడు... పత్రికల్లో పిల్లల కోసం నిర్వహించే శీర్షికలకు రచనలు చేసేవారు. వాటన్నింటినీ కలిపి రెండు సంకలనాలుగా ప్రచురించారు రాణీప్రసాద్. అసలు ఆవిడ బాలసాహిత్య రచయితగా మారడానికి స్ఫూర్తి సృజన్, స్వాప్నిక్‌లే. వారు రోజూ చేసే బండెడు ఇంటిపని (హోంవర్క్), దానికి తట్టుకోలేక వారు పడే బాధ ఆమెలో ఆలోచనను రేకెత్తించాయి. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయస్సులో ఈ చాకిరీ ఏంటనే ప్రశ్నకు ప్రాణం పోశాయి. దాంతో ఈ ఇంటిపనితో పిల్లల సర్వతోముఖాభివృద్ధికి ఆటంకం కలుగుతుందంటూ మొదటి పుస్తకం రాశారు. తర్వాత కూడా 'మార్కులు కాదు వ్యక్తిత్వమే ముఖ్యం' అన్న కోణంలో రచనలు సాగించారు. ఆమె పుస్తకాలకు తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాల నుంచి మంచి స్పందన వచ్చింది. పిల్లల కోసం రవీంద్రనాథ్ టాగూర్ చేసిన రచనలను తెలుగులోకి అనువదించే అవకాశం కూడా ఈ పుస్తకాల ద్వారానే రాణీప్రసాద్‌కు వచ్చింది. మరోవైపు 'బాలసాహిత్యంలో సైన్స్ రచనలు' అనే అంశంపై ఆమె పరిశోధన (పీహెచ్‌డీ) చేస్తున్నారు.

'గత కొన్ని దశాబ్దాల నుంచే బాలసాహిత్యం ఒక ప్రత్యేక శాఖగా అభివృద్ధి అవుతోంది. అయితే, పిల్లల పుస్తకాలంటే కేవలం పాటలు, గేయాలనే అనుకుంటున్నారు. రచనలు చేసే వారిలో చాలామంది కూడా ఆ కోణంలోనే చేస్తున్నారు. అయితే, చిన్నారుల కోసం ఏం రాసినా అందులో ఒక సందేశం ఉండాలి. చదివిన వారికి ఏదో ఒక కొత్త విషయం తెలియాలి. ముఖ్యంగా సైన్స్‌ను బాలసాహిత్యంలో మిళితం చేస్తూ చెప్పాలి. అప్పుడే పిల్లలకు సాహిత్యంతో నిజమైన లాభం చేకూరుతుంద'ని చెబుతారావిడ. అలాగే, ఇతర భాషల్లోని బాలసాహిత్యంలో పిల్లల మానసిక విశ్లేషణను గొప్పగా చిత్రిక పడుతున్నారని, మన దగ్గర మాత్రం చిన్నారుల పరిధికి మించిన ఆలోచనలను చొప్పిస్తున్నారని అంటారు. చిన్నారుల వయస్సును దృష్టిలో పెట్టుకుని రాసినప్పుడే ఫలితం ఉంటుందన్నది ఆమె అభిప్రాయం.

ప్రాణాలు పోయడమే కాదు అర్థవంతమైన జీవితానికి అక్కరకొచ్చే విషయాలను వివరిస్తూ అమ్మభాషపై చిన్నారుల్లో అవగాహన పెంచుతున్న రాణీప్రసాద్ లాంటి వైద్యులు ఊరికొకరున్నా చాలు కదా! తెలుగుతల్లి పులకించిపోవడానికి!!

(డా॥ రాణీప్రసాద్: 08723 233514)

– తెలుగు వెలుగు బృందం,

సహకారం: చిరుతాని సాయిబాబు, కరీంనగర్

ఊరు పిలుస్తోంది



కారు ఊరి పొలిమేరల్లోకి రాగానే నా హృదయం అనిర్వచనీయమైన భావంతో పులకించిపోయింది... చల్లటిగాలి ఎంతో ఆహ్లాదంగా ఉంది. పిల్లలిద్దరూ కిటికీలోంచి బయటకు చూస్తున్నారు. నా శ్రీమతి నందిని చిరునవ్వుతో నన్ను గమనిస్తోంది.

హఠాత్తుగా కారు ఆపాను... "అజయ్... అర్చనా... దిగండి" అంతా పొలాలు... చిన్న చిన్న కాలువలు... పారుతున్న నీటిని తీసుకుని ముఖం కడుక్కొని పాదాలు తడుపుకున్నా.

"రండి"

పిల్లలిద్దరూ చుట్టూ చూస్తూ వచ్చారు.

"చాలా సంతోషంగా ఉంది నందినీ"

"ఊc... గమనిస్తున్నాను. మీ ముఖం వెలిగిపోతోంది"

"ధన్యులం. నువ్విలా వెళ్దామని చెప్పకపోతే మనం వచ్చే వాళ్లం కాదు. ఎప్పటిలా ఏదో కారణంగా వాయిదా పడేది".

"ఇప్పుడు వాయిదా పడటానికి కారణాలంటూ ఏం లేవులెండి. పిల్లలకు ఎప్పటి నుంచో ఆశపెడుతున్న ఊటీ ప్రయాణం రద్దు చేసుకుని ఇటొచ్చామని వాళ్లే కాస్త అదోలా ఉన్నారు. అయినా ఏం ఫర్వాలేదు. ఊటీ మరోసారి వెళ్లొచ్చు."

ఎవరూ... పవన్‌బాబుగారా! దండాలు బాబూ... అబ్బో అబ్బో కుటుంబంతో వచ్చారా చాలా చాలా సంతోషం." దుగ్గల మీది నుంచి నడుస్తూ వచ్చాడు వీరయ్య."

"ఏం వీరయ్యా బాగున్నావా? మల్లేష్ ఎలా ఉన్నాడు?"

"బాగున్నాడు బాబూ ఇందాకనే ఇంటికి పోయాడు. పొలానికి నీళ్లు పెడ్దామని నేనున్నా... పనయిపోయింది. పండక్కి రాపోతిరి బాబూ. ఈసారన్నా నాలుగు రోజులుంటారా..."

"ఉందామనే వచ్చాం వీరయ్యా."

"అమ్మా నాన్నా చాలా సంతోషపడతారు. రండి రండని ఎన్నిసార్లు పిలిచినా ఏదో ఎప్పుడో తప్పించి ఎక్కువగా రానేరారు. వచ్చినా ఒక పూట... ఒక రోజు... అంతే."

"నా ఊరికి, నా ఇంటికి అమ్మానాన్నా రమ్మని పిలవాలా వీరయ్యా. నాకు సెలవు తక్కువగా దొరుకుతుంది. పిల్లలకేమో చిన్నతనంలో ఆరోగ్యాలు అంతగా బాగుండకపోవడం. చదువులకెదిగిన తర్వాత బడికే అతుక్కుపోవటం."

"అందుకే గదా మీ దగ్గరికే అమ్మానాన్నా వచ్చేది"

నవ్వాను నేను.

అజయ్ మొన్నే పదో తరగతి పరీక్షలు రాశాడు. అర్చన ఎనిమిదో తరగతి.

నాల్రోజులు ఊటీ వెళ్లొద్దామనుకుంటున్న సమయంలో నందిని 'మన ఊరికి వెళ్లొద్దాం. పిల్లలకూ ఊరు చూపించినట్లవుతుంది. మీరూ ఎప్పటి నుంచో ఈ హైద్రాబాద్‌ని మర్చిపోయి నాలుగు రోజులు గడపాలనుందని అంటుంటారు గదా' అంది నందిని.

పిల్లలు కాస్త ముఖం చిట్లించినా 'మీకు

తెలియని ఓ తియ్యదనాన్ని చూపిస్తాను' అని మనసులోనే అనుకున్నాను.

"పదండి బాబూ... పొద్దు గూకుతోంది."

"ఇంటికేనా వీరయ్యా..."

"ఆఁ... ఇంగెక్కడికి పోతాబాబూ. పొలం, ఇల్లు... అంతే... పట్నానికి పోయే పనులు మల్లేష్‌గాడే చూసుకుంటడు. మీ తాతగారు నేను కల్సి చదువుకున్నం. మీ నాన్నగారు నా కొడుకు మల్లేష్ కల్సి చదువుకున్నరు. మాకు చదువబ్బలేదు. మేం ఇక్కడున్నం. మీరు అక్కడెక్కడో ఉన్నరు. ఎట్టాగైనా చదువుకున్నారాయె. ఆ గొప్పే వేరు" అంటూ పిల్లలతో చెప్పాడు వీరయ్య.



"ఏం గొప్పాలేదు వీరయ్యా... నిజానికి మీరే గొప్ప. మీరు పండిస్తేనే మేం ఇంత తినేది."

"బాబూ... పిల్లలకి పొలమంటే ఏంటో చెప్పండి. బియ్యం ఎట్లొస్తయో చూపించండి. వాళ్లకేం తెల్సు ఇదంతా."

"నువ్వే చెప్పు వీరయ్యా" అన్నాను నేను. వీరయ్య చెబుతుంటే ఆశ్చర్యపోతూ విన్నారు పిల్లలు. వీరయ్య భుజాల చుట్టూ చేయి వేశాను. బిడియంగా విడిపించుకున్నాడు వీరయ్య.

రోడ్డుమీదికి వచ్చాం. "కారెక్కు వీరయ్యా"

"వద్దు బాబూ.. అంతా బురద అంటింది. అయినా మీతోపాటు కారెక్కుతానా. చాల్లేబాబూ మీరెళ్లిపోండి. నేను నడిచొస్తా... మాకలవాటే... కారు కొత్తదా బాబూ."

"అవును వీరయ్యా. కొని పది రోజులే అయింది."

"అయితే ముందు అమ్మానాన్నల్ని ఎక్కించుకొని తిప్పండి." అంటూ ఎంత బతిమాలినా ఎక్కనంటే ఎక్కనన్నాడు వీరయ్య.

చల్లటిగాలి రివ్వుమంటూ వీస్తోంది.

"నా చిన్నప్పుడు నాన్నకి క్యారేజీలో భోజనం తెచ్చేవాడ్ని. గుర్తుందా వీరయ్యా."

"అయ్యో... ఎందుకు గుర్తులేదు బాబూ. మీరంటే హడావిడిలో పడిపోయి ఎప్పుడో ఒకసారి ఇట్టా అనుకుంటే గుర్తొస్తుంటయి. మాకేం హడావిడుంటుంది. చెప్పాగా బాబూ... పొలం... ఇల్లు... వీటి మధ్య మా జీవితాలు గడిచిపోతుంటయి. మీ చిన్నతనం నుంచి జరిగినవన్నీ కళ్లముందు నిన్ననో మొన్ననో జరిగినట్టు కదులుతుంటయ్. ఓసారి మీ చెప్పు తెగిపోతే మిమ్మల్ని భుజానెత్తుకుని ఇక్కడి నుంచి ఇంటి దగ్గర దిగబెట్టా."

నా కళ్లు చెమర్చాయి. "అవును వీరయ్యా"

"ఎంత దూరం?" అడిగింది అర్చన.

"రెండు కిలోమీటర్లు" చెప్పింది నందిని."

"అప్పుడంటే నడిచేవాళ్లం. ఇప్పుడు మోటారు సైకిల్ నాకు నడపటం రాదు గానీ మల్లేష్ తీసుకొస్తాడు. అయినా ఇప్పటికీ ఒంట్లో బలం ఉంది నడుస్తా."

అప్పటి విషయాలు వీరయ్య చాలా చెప్పాడు.

నా హృదయం మీద పన్నీటిజల్లు చిలకరిస్తున్నట్లుగా అన్పించింది.

"అమ్మా నాన్నా ఎలా ఉన్నారు? వస్తున్నట్లుగా చెప్పలేదు"

"అయితే మళ్లొకసారి ఉగాది పండగ జరుపుకుంటరులెండి - మిమ్మల్ని చూసి తెగ ఆనందపడతారు. - ఇద్దరూ మంచిగున్నరు బాబూ... ఊళ్లో పెద్ద దిక్కంటే వాళ్లే గదా. ఎవరికి ఏ సహాయం అవసరపడినా చేస్తారు. ఏ సమస్య, ఏ కష్టం వచ్చినా తీరుస్తారు. అందరికీ అండగా ఉంటారు. అయ్యగారు ఇప్పటికీ సొంతంగా వ్యవసాయం చేయగలరు. మేం మంచిగా బతకాలని కౌలుకిచ్చారు. అమ్మానాన్నలు దేవుళ్లయ్యా..." కళ్లు ఒత్తుకున్నాడు వీరయ్య.

* * *

తెల్లవారి నిజంగానే మేమంతా మళ్లీ ఉగాది పండుగ జరుపుకున్నాం. మేం లేచేసరికి వీరయ్య భార్య రాములమ్మ ఇంటి ముందు పచ్చగా చానుపు జల్లి ముగ్గులు వేసి ఉంచింది. పెరట్లో ఉన్న మామిడి చెట్టు ఆకులు, కాయలు తెంపింది. వేపపూత శుభ్రం చేసి ఉంచింది.

"ఏంటి రాములమ్మా"

"మీరొచ్చారని అమ్మగారు అయ్యగారు ఇంకోసారి ఉగాది పండుగ జేస్తున్నారు" కళ్లార్పుతూ ఆనందంగా అంది.

"అమ్మా..."

"నిజంగా ఎంత ఆనందంగా ఉందో మాటల్లో చెప్పలేనురా. పండుగ జరుపుకుని ఇవాల్టికి ఇరవై అయిదు రోజులు. ఆ రోజు నాన్న, నేను కాస్త బాధపడ్డాం. నీ ఇబ్బందులు మాకు తెలియనివిగావు. కానీ ఒక్కగానొక్క కొడుకువి. అంత దూరంలో ఉండిపోతివి. ఆ రోజు బాధ ఈ రోజు తీరాలని మరోసారి ఉగాది పండుగ ఇలా కల్సి చేసుకుందామన్పించింది. అక్కడ అన్నీ కొనటమే... ఇక్కడ చింతపండు, మామిడి ఆకులు, కాయలు, వేపపూత, నిన్ననే కోసిన అరటిగెల, మన కొబ్బరిచెట్టు కాయలు... ఇలా అన్నీ ఇంటివే. మనవడు, మనవరాలు వీటన్నింటినీ చూసి ఎంత ఆశ్చర్యపోతున్నారో. వాళ్లని వెంటేసుకుని వాళ్ల తాత అన్నీ చూపిస్తున్నారు. - రాములమ్మ నీళ్ల తోడుతోంది. త్వరగా స్నానాలు ముగించుకోండి. ఉగాది పచ్చడి తయారు చేస్తాను తిందురుగాని. అమ్మా.. నందినీ.. కొత్తచీరె ఉంది అది కట్టుకుందువుగాని..." అమ్మ తెగ హడావిడి పడుతుంటే నా కళ్లు తడి అయ్యాయి.

అజయ్, అర్చన తాతగారూ... తాతగారూ అంటూ నాన్న చుట్టూ తిరుగుతుంటే చూడముచ్చటేసింది. నాన్నగారు బీరువా నుంచి నాకు, అజయ్‌కి అంచు పంచెలు తీసి ఇచ్చారు. పంచె కట్టుకోవడంలో నాన్నగారు సహాయపడుతుంటే చిన్నప్పుడు వినాయక చవితికి చిన్న అంచు కండువాలు కట్టింది గుర్తొచ్చింది. పంచెలో అజయ్ చాలా ముద్దుగా కన్పించాడు. గోధుమవర్ణంలో లాల్చీ అంచు పంచెలతో ఉన్న మా ముగ్గుర్నీ నందిని ఫొటోలు తీసింది. అర్చన వచ్చింది మొదలు ఏదో ఒకటి వీడియో తీస్తూనే ఉంది. అమ్మా, నందినీ కొత్త చీరెలు కట్టుకున్నారు. అర్చన పట్టులంగా జాకెట్టుతో ముస్తాబైంది. అమ్మ మోదుగ ఆకులతో చిన్నచిన్న దొప్పలు కుట్టి దాన్నిండా ఉగాదిపచ్చడి అందించింది.

"చాలా బాగుంది నానమ్మా..." లొట్టలేస్తూ తిన్నారు పిల్లలు.

గుడికెళ్లి పూజ చేయించుకున్నాం. పూజారిగారు ఎంతో ప్రేమగా మాట్లాడారు. గుడి ఆవరణంతా తిరుగుతూ పిల్లలకు నా చిన్ననాటి సంగతులు చెప్పాను. ఇంటికి వచ్చి వేడివేడి ఇడ్లీలను నెయ్యి, కారప్పొడితో తిన్నాం.

నాన్నగారు పిల్లలను బట్టల దుకాణానికి తీసుకెళ్లి కొత్తబట్టలు కొనిచ్చారు. నాకు రెండు టీ షర్టులు, నందినికి చీరె కొనుక్కొచ్చారు.

"ఇక్కడ బట్టలు గొప్పగా ఉండవు. రేపు పట్నానికి పోదాం. లేకుంటే డబ్బిస్తాను.. హైద్రాబాద్‌లో కొనుక్కోండి." అంటుంటే నా మనసు కలుక్కుమంది.

"వీటిని ఎంతో ప్రేమగా కొని తెచ్చారు ఇవే మాకు ఇష్టం మామయ్యగారూ... అక్కడ ఏదో కొనుక్కోవాలని కొనుక్కుంటాం. నిజంగా ఇంత సంతోషంగా అన్పించదు."

నాలుగు కాళ్ల జంతువును
గడ్డిని శనగల ఉలవలను
గారాబముతో తినుచుందున్
నేనును జనులను మోయుదును
బండ్లను కూడా లాగుదును
వేగములో మరి నన్నైతే
గెలవగ లేరు ఎవ్వరుగా
నేనెవరు?

(గుర్రం)

చెప్పుకోండి చూద్దాం!

నందిని అనేసరికి నా మనసు తేలికైంది.

మధ్యాహ్నం అమ్మ చేతి వంటతో కమ్మటి విందు భోజనం.

భోజనం చేస్తూ చాలాసేపు మాట్లాడుకున్నాం.

"పవన్"

"నాన్నగారూ..."

"నువ్వు కారు కొనటం నాకు చాలా ఆనందంగా ఉందిరా. రాత్రి మిమ్మల్ని చూసి మేమిద్దరం ఎంత సంతోషపడ్డామో. మీరు కారులో వస్తారని ఊహించలేదు."

"ఏదో... ఆశ్చర్యపరుద్దామని చెప్పలేదు" సంజాయిషీగా అన్నాను నేను.

"అదీ నిజమేలే. మాకూ అలానే బాగుంది."

నాన్నగారు అలా అంటుంటే నందిని నావైపు చూసి నవ్వింది.

* * *

ఆ సాయంత్రం పీటలు వేసి అమ్మానాన్నలను కూర్చోబెట్టి మేం తీసుకొచ్చిన పట్టువస్త్రాలు ఇచ్చాం. పాదనమస్కారాలు చేసి అక్షింతలు వేయించుకుని ఆశీస్సులు తీసుకున్నాం. నాన్నగారు నన్ను కౌగిలించుకుని నా తల మీద ముద్దు పెట్టుకుంటుంటే హృదయం ఝల్లుమంది. పిల్లల్ని ఎంతో ముద్దు చేస్తూ అమ్మతో ఏవేవో చెప్పుకుంటూ మురిసిపోతూంటే నా కళ్లలో ఆనందబాష్పాలు నిలిచాయి.

"నాన్నగారూ రామనాథం పంతులుగారికి, పంతులమ్మగారికి బట్టలు తెచ్చాం... ఇచ్చి వస్తాం."

"నలుగురూ కార్లోనే వెళ్లండి."

"కారులో వద్దులెండి. పిల్లలకి ఊరు చూపిస్తాను. నడిచే వెళ్తాం."

నల్గురం బయల్దేరాం. ప్రతి ఒక్కరూ ఆగి పలకరిస్తుంటే నందిని నేను అందరి ఆప్యాయతను పంచుకుంటూ అందరి గురించి తెల్సుకుంటూ ముందుకు సాగాం.

"ఇదే ఇల్లు" పిల్లలతో చెబుతూ గేటు తీశాను నేను.

"నాన్నగారూ... ఇక్కడ వర్షం పడింది" పిల్లలిద్దరూ ఒకేసారి అన్నారు.

"వర్షం కాదు. సాయంత్రం వేళ ఇలా ఆవరణంతా నీళ్లు చల్లటం అలవాటు. ఇదిగో అటుచూడండి... ఎన్ని కమతాలో... పాలకూర, బచ్చలి, గోంగూర, కొత్తిమీర, మెంతికూర... మా చిన్నప్పుడు మాస్టారు, పంతులమ్మగారు ఎక్కువగా ఈ మొక్కల మధ్యే ఉండేవారు. ఎప్పుడూ వీటికి ఏదో ఒక పని చేస్తూనే ఉండేవారు. చామంతి, మల్లె, కనకాంబరాలు.. చూశారా ఎన్ని పూలో... ఇటురండి. వీటిని పాదులు అంటారు" సొర.. బీర.. పొట్ల అంటూ నేను చూపిస్తుంటే ఆకుకూరలు, కూరగాయలు తెలిసినా ఇలా కాసే విధానాన్ని వాళ్లు ఎప్పుడూ చూడలేదు కాబట్టి ఎంతో ఆశ్చర్యపోతూ ఇంకా అడిగి అడిగి తెల్సుకున్నారు అజయ్, అర్చన.

"బావి.." అంటూ బొక్కెనతో నీళ్లు తోడి సంతోషపడ్డాను.. "చిన్నప్పుడు ఇదిగో ఈ

బండమీద కూర్చొని చదువుకునేవాణ్ని.. 'పవనొక బండ' అనేవాళ్లు" అంటూ లోపలికి వెళ్లి మాస్టారిని పంతులమ్మగారిని ఎంతో ఆశ్చర్యపరిచాను. వాళ్లిద్దరూ మా దంపతులిద్దర్నీ అక్కున చేర్చుకుంటుంటే పిల్లలు అలాగే చూస్తుండిపోయారు. మాస్టారు దంపతులకు బట్టలు పెట్టి ఆశీస్సులు అందుకున్నాం. పిల్లలు పాదనమస్కారాలు చేస్తుంటే ఆత్మీయంగా దగ్గరకు లాక్కుని ఎంతో ముద్దు చేశారు.

"ఈ మాస్టారే నాకు అక్షరాభ్యాసం చేసి అక్షరాలు దిద్దించారు."

"మీరు మీ నాన్నలా తయారవ్వాలి. చిన్నప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అదే పద్ధతిలో అంత సంస్కారవంతంగా ఉన్నాడు. ఇక్కడికి రావటం తక్కువే అయినా వచ్చే ఏదో ఒక పూటైనా నన్ను చూడటానికి మాత్రం తప్పక వస్తాడు మీ నాన్న. మాకెందుకురా బట్టలు... మీ అమ్మానాన్నలకు పెట్టాలి."

"అయ్యో... అదేంటి మాస్టారూ... అలా అంటారు. వాళ్ల తర్వాత మీరే గదా నాకు ముఖ్యం. ఆ తర్వాతే దేవుడు. తల్లి, తండ్రి, గురువు, దైవం అని మీరు చెప్పిందే పాటిస్తున్నాను" గౌరవభావంతో అన్నాను నేను.

మీ నాన్న ఇలా అలా అంటూ నా చిన్నప్పటి విషయాలు పిల్లలతో చాలా చెప్పారు మాస్టారు పంతులమ్మగారు - పిల్లలెంతో ఆసక్తిగా విన్నారు.

"రామన్నయ్య, లక్ష్మణ్ అన్నయ్య ఎలా ఉన్నారు మాస్టారూ."

"చాలా బాగున్నార్రా... రిటైరయ్యానని ఏ చింత లేదు. నీలాగే దూరంగా ఉన్నారు. మమ్మల్ని వృద్ధాశ్రమంలో వేసి ఉన్న రెండెకరాల పొలాన్ని ఇంటిని అమ్ముకుపోవాలన్న మనస్తత్వం గలవాళ్లు మాత్రంగాదు" నవ్వారు మాస్టారు.

"మీ పెంపకంలో వాళ్లు మరోలా ఎందుకుంటారు మాస్టారూ."

"చిన్నతనంలో అంతా బాగానే ఉంటార్రా... ఇదిగో ఇప్పుడే అసలు రంగు బయటపడేది."

నేనేం మాట్లాడలేకపోయాను.

"అప్పుడప్పుడు తీరిక చేసుకుని ఓ నాలుగు రోజులపాటు ఇలా వస్తుండండిరా..."

"అలాగే మాస్టారూ..."

"చాలా పల్లెలు పల్చబడిపోతున్నాయి. కారణాలు ఏవేవో ఉంటాయి. మనం మాత్రం మన పల్లెను కాపాడుకుందాం. మన తెలుగుదనాన్ని కాపాడుకుందాం. మన పండుగలను కాపాడుకుందాం."

"మాస్టారూ..."

"పండుగలు పల్లెటూరిలోనే పుట్టాయి. వాటిని మీరు తీసుకెళ్తే పట్టణాలకు, నగరాలకు కూడా వస్తాయి. మీరు పండుగలు చేసుకోవటం లేదనిగాదు. జీవం నిండి కళకళలాడుతూ కన్పిస్తున్నాయా? వాటి విశిష్టత మీకు ఎంతో కొంత తెల్సు. మీ పిల్లలకేం తెల్సు? వాళ్లకు మీరేమైనా చెబుతున్నారా?

డాన్సులు... పాటలు అంటూ ఎంత దూరం పంపటానికైనా మక్కువ చూపిస్తున్నారేగాని ఇంట్లో... మన పురాణాల గురించి ఏ తల్లితండ్రి అయినా తెలియజేయ గల్గుతున్నారా! అసలు వాళ్లకు కూడా అంతగా తెలవవు గదా... రామాయణ, భారత, భాగవతాల గురించి మీరు తెల్సుకుని పిల్లలకు తెలియజేయాలి.. పవన్.. నీలాంటివాళ్లు ముందుకు రావాలి.. చాలా కొద్ది సమయమే కేటాయించు.. సిటీలో నీ చుట్టూ ఉన్న వాళ్లతో ఓ చిన్న సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేయి."

"మాస్టారూ..."

"వాళ్ల చదువులు వాళ్లే చదువు కుంటున్నారు. నీకు పిల్లలకు చదువు చెప్పే పనిలేదు. కానీ చెప్పటానికి ఇంకా చాలా ఉందని ఆలోచిస్తే నీకే అర్థం అవుతుంది. నీలా, నా పిల్లల్లా ఇక్కడికి రాలేని పరిస్థితి కలిగినప్పుడు మీమీ పిల్లలతో కల్సి మీ దగ్గర్లోనే ఆనందంగా గడుపుకుంటూ ఓ సంతృప్తిని ఆస్వాదించవచ్చు. మనం మన పిల్లలకి తెలియజేస్తే వాళ్లు వాళ్ల పిల్లలకు తెలియజేస్తారు.. ఈ తెలుగుదనం ఇక్కడితోనే ఆగిపోతుందేమోనని భయంగా ఉంది."

"మా... స్టా... రూ..."

"మన పొరుగు రాష్ట్రాలు తమ భాషను జాగ్రత్తగా కాపాడుకుంటున్నాయి. మన మాతృభాష మృతభాషగా అయిపోతుంది. మన కళ్లు చూస్తున్నాయి. మన మనసుకు నచ్చటం లేదు. కానీ ఎవరో మనసుకు సంకెళ్లు వేసినట్లుగా మౌనంగా ఉండిపోతున్నాం. అలా అవసరమా పవన్. నీ పిల్లలకు ఇంకా తెలుగు బాగా నేర్పించు. తెలుగు భాషను బతికించేందుకు నీ వంతు కృషి నువ్వు చేయి. ఈ మాట పది మందికి ప్రచారం చేయి. ఓ తెలుగు మాస్టారిగా నా గుండె చాలా బాధపడుతోంది. ఇంకా చాలాచాలా చెప్పాలని ఉంది. మాస్టారిని గదా చెప్పటమే నాకు అలవాటు."

బలవంతపు చిరునవ్వు పెదవుల మీద కన్పిస్తుంటే నా గుండె తల్లడిల్లిపోయింది.

* * *

ఇంటికి వచ్చిన తర్వాత నాన్నగారిని పెద్దబాలశిక్ష గురించి అడిగాను. ట్రంకుపెట్టె నుంచి అప్పటి నా పుస్తకాన్ని తీసి ఇచ్చారు.

"ఇది ఇంకా ఉందా! నాన్నగారూ" అశ్చర్యపోయాను.

"ఎప్పటికైనా దీని అవసరం పడుతుందని దాచి ఉంచాను. ఇదిగో పద్యాల పుస్తకాలు ఉన్నాయి వాటినీ పిల్లలకు నేర్పించు. నీ చిన్నప్పుడు ఇవన్నీ నీకు కంఠస్థమే. ఒక్కసారి నువ్వు చదువుకున్నావంటే అన్నీ గుర్తొస్తాయి."

"నాన్నగారూ రామాయణ భారత భాగవతాలు కూడా ఇవ్వండి..."

నాన్నగారు సంతోషంగా తీసి ఇచ్చారు. అన్నీ భద్రపర్చుకున్నాను నేను.

* * *

కారు ఊరు దాటివెళ్లిపోతోంది. కారులో నేను నందిని మాత్రమే ఉన్నాం. పిల్లలు కొద్ది రోజులు నానమ్మ తాతగారి దగ్గరే ఉంటామని గొడవ చేశారు. మమ్మల్ని వదిలి ఉండని పిల్లలు అలా అనటం మాకు చెప్పలేనంత ఆనందాన్ని కలిగించింది. వాళ్లకు ఇంతవరకు తెలియని ఆ తియ్యదనంలోని ఆ రుచి ఎంతో బాగా నచ్చింది.

"చాలా సంతోషంగా ఉంది నందినీ" ఆర్తిగా అన్నాను నేను. "నాకు కూడా... త్వరలో మరోసారి మనం ఊటీకి వద్దాం." నవ్వింది నందిని.

కోటమర్తి రాధాహిమబిందు
మణుగూరు, ఖమ్మం జిల్లా
94407 64378

సాహిత్యానికి ప్రతిరోజూ స్వర్ణయుగమే

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి... జనం నాలుకల మీద నిలిచి... సాహితీ చరిత్ర పుటలను అలంకరించిన కవులు, రచయితలెందరో. వారందరి ఆశయం ఒక్కటే. ప్రజలను చైతన్యవంతులను చేయడం. దానికోసం తాము చెప్పాలనుకుంది చెప్పారు. చేయాలనుకుంది చేశారు. అయితే, కాలప్రవాహంలో ఈ అక్షర వ్యవసాయం రానురాను గాడి తప్పుతోందన్నది కొందరి మాట. అసలు రచయితలు ఎక్కడున్నారండీ... అన్నది మరో అడుగు ముందుకు వేసిన వారి మాట. వీటిల్లో ఏది నిజంగా నిజం? ఎవరిని అడగాలి అనుకుంటుంటే... సరిగ్గా అప్పుడే తట్టిన పేరు గొల్లపూడి మారుతీరావు.

పాత్రికేయునిగా, రేడియో ప్రయోక్తగా, రచయితగా, సినీ రచయితగా, నటుడిగా అందరికీ తెలిసిన వ్యక్తి ఆయన. దాదాపు మూడు తరాల మధ్య వారధిగా నిలుస్తూ వస్తున్న ఆయన్నే నేరుగా ఈ ప్రశ్నలన్నీ అడిగేశాం. రాయగలిగే ప్రతి వాడూ రచయితే అని చెబుతున్న ఆయన... తెలుగు సాహిత్యానికి ప్రతిరోజూ స్వర్ణయుగమే అంటూ... ఈ తరానికి బోలెడంత ఆత్మవిశ్వాసాన్ని పంచుతున్నారు.

తె.వె.: మీ దృష్టిలో సాహిత్యమంటే...?

గొల్లపూడి: సమాజాన్ని ప్రతిఫలించేదే సాహిత్యం. అది... సమాజంలోని ఆలోచనలు, సమస్యలు, సందేహాలను విమర్శిస్తుంది. విశ్లేషిస్తుంది. సాహిత్య ధర్మమిదే. నిజానికి సాహిత్య ధర్మం అనేది కాలానుగుణంగా నడిచే ప్రక్రియ.

రచయిత, రచనలకు మీరిచ్చే నిర్వచనాలు?

మనిషి ఎలా ఉండాలి అంటే ఏం చెప్పగలం? ఇవి చెప్పగలిగే విషయాలు కావు. రచయిత ఎలా ఉండాలి, రచన ఎలా చేయాలి అంటే... తన అనుభవంలో నుంచి అది రావాలి. అనుభవం ఉన్న వ్యక్తులను చదివి అనుభవశాలి అవ్వాలి. తనదైన దృక్పథం ఏర్పరచుకోవాలి. జీవితం మీద స్పష్టమైన పరిశీలన, అవగాహన ఉండాలి. రాసే సామర్థ్యాన్ని పెంచుకోగలగాలి. రాసే ఉత్సాహం ఉండాలి. తాను చెప్పిన విషయానికి ఎదుటివాడు, పక్కవాడు స్పందిస్తున్నాడంటే ఆనందం కలగాలి. ఆలోచన కలగాలి. మంచి విమర్శ కోసం ఎదురు చూసే ఉత్సాహం కావాలి. ఇవన్నీ ఉంటే... ఓ రచయిత అనుకోవచ్చు. తను చెప్పగలిగిన, చెప్పాల్సిన ఓ విషయాన్ని... ఎదుటి వ్యక్తి అవగాహనలోకో, అనుభవంలోకో తీసుకురాగలిగే సామర్థ్యమున్న - సామర్థ్యాన్ని పెంచుకున్న - పెంచుకోవడానికి అవకాశమున్న ఓ వ్యక్తి చేసే ప్రక్రియ రచన.

ప్ర: ఆధునిక తెలుగు సాహిత్యంలో స్వర్ణయుగమేది? ఎందుకు?

కాల్పనిక సాహిత్యం, భావకవిత్వ ధోరణి, నవ్యసాహిత్య పరిషత్తు... ఆ రోజులు ఒక తరహా సాహిత్యాన్ని ప్రతిఫలించాయి. ఇందులో రెండు కవితా ధోరణులున్నాయి. కలల ప్రపంచంలో విహరించే భావ కవితా పరంపర ఓ ఎత్తు. మన చుట్టూ ఉన్న సమస్యలను ప్రతిఫలిస్తూనే... సమాజంలోని దోపిడీ, అన్యాయాలను ఎండగట్టే రచనలు మరో ఎత్తు. ఈ రచనా విధానానికి ప్రప్రథమ వైతాళికుడు శ్రీశ్రీ. తల్లావఝ్ఝల

ఫొటోలు: బి.గోపీకృష్ణ

శివశంకరశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, నండూరి రామ్మోహనరావు... వీళ్లందరి సాహిత్యం ఓ రకం. శ్రీశ్రీది మరో విధమైన సాహిత్యం. నా ఉద్దేశంలో శ్రీశ్రీ తర్వాత వచ్చిన నవ్యసాహిత్య ధోరణి చాలా బలమైంది. కిందటి శతాబ్దపు ఆఖరు రోజుల్లో వచ్చిన ఈ సాహిత్యానికి తనదైన ఓ ముద్ర గానీ, తనదైన ఓ రూపం గానీ లేదు. ఎందుకంటే, ఈ ధోరణిలో వచ్చిన సాహితీ ప్రక్రియలన్నీ దేనికదే విభిన్నం. గత శతాబ్దంలోని సాహిత్య ధోరణులను ఎత్తి చూపాలను కుంటే... ప్రముఖంగా కనిపించేది, ఎక్కువగా ప్రభావితం చేసింది ఆధునిక కవిత్వ ధోరణి.

అంటే... కవితా యుగమే స్వర్ణయుగమా?

అలా అర్థం చేసుకోకూడదు. 20వ శతాబ్దపు చివర్లో ఈ సాహిత్యం చాలా ప్రభావాన్ని చూపింది. ఈ మధ్యలో పరిచయమైన సినిమా సైతం సాహితీ ధోరణుల్లో కొంత మార్పు తెచ్చింది. భావకవిత్వంతోపాటు సినిమా పాట పెరిగితే... సినిమాతో పాటు నవలా సాహిత్యం అభివృద్ధి చెందింది. అది ఎంత కాలం కొనసాగింది, ఎప్పటి వరకూ ప్రజలు ఆదరిస్తారు, కాలాన్ని ఎదిరించి ఎప్పటి వరకూ నిలిచి ఉంటుంది అనే అంశాల మీదే అది స్వర్ణయుగమా కాదా అనేది ఆధారపడి ఉంటుంది.

వస్తు స్వీకరణ, భావ వ్యక్తీకరణలో నాటితరం చేసిన అద్భుత ప్రయోగాలను ఈతరం కొనసాగిస్తోందా?

దీనికి నా సమాధానం ఒక్కటే. అది సత్యమో కాదో నాకు తెలియదు. ఒక ధోరణిని ప్రతిఫలించేట్టుగా సాహిత్యం ఈ రోజుల్లో నడవడం లేదేమో అని నేననుకుంటా. ఇది నా సొంత అభిప్రాయం. భావకవిత, విప్లవకవితా ధోరణుల్ని గుర్తు పట్టినంత స్పష్టంగా, స్ఫుటంగా ఇప్పుడున్న ధోరణుల్ని మనం గుర్తుపట్టలేం. ఉదాహరణకు... 60వ దశకం తర్వాత వచ్చిన ధోరణుల్లో ఎంతో కొంత ప్రభావితం చేస్తూ వచ్చింది నవలా సాహిత్యం. దీంతోపాటు ఎందరో కథారచయితలు వచ్చారు. వీరిలో అద్భుతమైన అభినివేశం, పరిణతి, ప్రక్రియా వైవిధ్యం సృష్టించిన వారు చాలా మంది ఉన్నారు. నవలలు, కథలు, కథానికల్లో ప్రత్యేకంగా ఒక ధోరణిగా మెచ్చుకోవాలి లేదా చెప్పుకోవాలి అంటే కథానిక సాహిత్యం. నేటి కథానిక సాహిత్యం మంచి ధోరణిలో, మంచి ప్రక్రియల్లో, మంచి ప్రయోగాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది నాకు.

సృజనాత్మకతలో గతకాలపు రచయితలతో ఇప్పటి వారు పోటీ పడుతున్నారా?

రచయితలకు సృజనాత్మకత చాలా అవసరం. అందులో ఎలాంటి అనుమానమూ లేదు. పాతతరం రచయితల కంటే... ప్రక్రియలో ఈ తరం రచయితలు ముందున్నారు. వస్తువులో మాత్రం అంత వైవిధ్యం పట్టుకోవట్లేదు. అంటే వాళ్లు ఎంచుకునే, చెప్పే అంశంలో... కొత్తదనం కనిపించట్లేదు. పీడిత వర్గం గురించి చెప్పడం... ఇలా ఇంకొకటి... ఇంకొకటి... ఇలాగన్న మాట.

దీనికి కారణం?

ఏం లేదు. ఎక్కువ పరిశీలన ఉండాలి. ఎక్కువ అవగాహన కావాలి. ఇప్పుడు వస్తు వైవిధ్యం అంటే... వస్తువు ఎక్కణ్నుంచి దొరుకుతుంది? సమాజం వస్తువు. విషయాన్ని కొత్తగా చెప్పాలి. దానికి సమాజాన్ని అవగాహన చేసుకోవాలి. బాగా సాహిత్యాన్ని చదివి అవగాహన చేసుకోవాలి. అప్పుడే వైవిధ్యం సాధ్యమౌతుంది.

అస్పష్టత, సంక్లిష్టతలకు దూరంగా కలం కదలాలంటే...?

ఈ విషయంలో మనం ఇదే ఉండాలి. ఇలాగే ఉండాలని చెప్పలేం. రచయితలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వ్యక్తిని బట్టి, సమాజాన్ని బట్టి మారుతుంటాయి. రచయితలు మూడు ముఖ్యమైన అంశాలు గుర్తుపెట్టుకోవాలి. సమకాలీన సమాజం పట్ల నిర్దుష్టమైన అవగాహన ఉండాలి. ప్రముఖుల రచనలు ఔపోసన పట్టాలి. వస్తువు విషయంలో తనదైన దృక్పథం ఉండాలి. ఇవి ఉన్నప్పుడే రచయిత స్పష్టంగా కనిపిస్తాడు. ఆ రచనల్లో సాంద్రత కనిపిస్తుంది.

మానవ జీవితాన్ని ముడిసరకుగా చేసుకున్న రచనలు వస్తున్నాయా?

మానవ జీవితానికి సంబంధం లేకుండా ఏ రచయితా... ఏ రచనా చేయలేదు. ఇప్పుడే కాదు... అప్పుడూ అలాంటి రచనలు వచ్చాయి. ఎప్పుడైనా అలాంటివే వస్తాయి. మానవ జీవితంలో ఏ అంశాన్ని ఎన్నుకుంటారన్నది ఆయా రచయితలు, వారి దృక్పథాన్ని బట్టి ఉంటుంది. రావూరి భరద్వాజ ఒకలా తీసుకుంటారు... నేనొకలా తీసుకుంటాను... ఇంకొకరు... ఇంకోలా తీసుకుంటారు. 'ఎంత మాత్రాన ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు' అన్నారు అన్నమాచార్యులు. ఎవరెవరు ఎంతగా ఎత్తుకోగలిగితే... ఏ మేరకు ఎత్తుకోగలిగితే... వారి అవగాహన ఏ దశలో నిలిస్తే... ఏ స్థాయిలో నిలిస్తే... ఆ స్థాయిలో వారి రచనలు కూడా నిలుస్తాయి.

మానవ జీవితపు లోతుల్ని తరచి చూడటమే సాహిత్య ప్రయోజనమా?

సాహిత్యం అంటే జీవితానికి ప్రతిబింబం. సమాజంపై అభిప్రాయం. సామాజిక విశ్లేషణ. సమాజానికి ఇచ్చే సూచన. ఇదే లేకుంటే ఎలా స్పందించగలం. ప్రతిదీ మన జీవితం నుంచి రావాల్సిందే. సాహిత్యం పాఠకుడి అనుభవంలోకి వచ్చినప్పుడు... ఆ సాహిత్యానికి ప్రతిఫలమో, పర్యవసానమో దక్కుతుంది. రచయిత చెప్పిన విషయాన్ని బట్టి ప్రతిచర్య ఆధారపడి ఉంటుంది. కొత్తగా చెబితే అబ్బ... ఎంత బాగా చెప్పాడు అనుకుంటాం. ఆ కొత్తగా చెప్పడమనేది కూడా అవగాహనలోకి రావాలి. అవగాహనలోకి రాలేదంటే... ఏదో చెబుతున్నాడు మనకు అర్థం కావడం లేదయ్యా... ఏదో ఉపన్యాసంలాగా ఉందంటారు.

రచయితే పాఠకుడి స్థాయికి దిగాలా?

దిగడం... దిగకపోవడం అనే ప్రశ్నే లేదు. పాఠకుడి ఆలోచనను ఉత్తేజ పరచాలి. పాఠకుడి అనుభవంలోకి రావాలి. ఎంత గొప్పగా చెప్పే రచయిత అయినా... ఆ మేరకు మనిషి అనుభవాల్లోకి తొంగి చూడాలి. మనిషి అవగాహనల్ని అందుకోవాలి. మనిషి మేధస్సు దగ్గరకు రావాలి. జనాల ఊహల్లో నిలబడాలి. అప్పుడే రచయితకు, పాఠకుడికి మధ్య అవగాహన (ర్యాపో) ఉందని చెప్పగలం. అప్పుడే సాహిత్యం ప్రతిఫలాన్ని పొందగలదు.

ఏదైనా రచనకు కాలాతీత నాణ్యత రావాలంటే?

సమకాలీన సమస్యలతో ప్రమేయమున్న రచనలు అవసరం... ఆ సమస్యతోనే తీరిపోతుంది. మానవతా విలువలు,

సర్వకాలీనమైన జీవుని వేదన ఉన్న రచనలు కాలాన్ని అధిగమించి బతుకుతాయి. ఇందుకు రామాయణమే గొప్ప ఉదాహరణ. అంతకంటే గొప్పగా ఎవరూ చెప్పలేదు. దాని విలువలు వేరు. శతాబ్దాల నుంచి ప్రజల నాలుకల మీద నడయాడుతూనే ఉంది. మనుచరిత్ర, వసుచరిత్ర ఇలా ఎన్నో రచనలు సర్వజనీన విలువలను నింపుకున్నాయి. అందుకే నేటికీ వాటిని చదువుకుంటున్నాం.

కొత్త రచయితలను తయారు చేసే శక్తి ఏ సాహిత్యానికి ఉందంటారు?

అది వ్యక్తుల అభిరుచుల మీద ఆధారపడి ఉంటుంది. ముందైతే బాగా చదవాలి. మనకంటే ముందు వారు ఏం చేశారో... ఎలా చేశారో... ఎలా చెప్పారో అన్న విషయాల్ని తెలుసుకోవడం చాలా ముఖ్యం. మొదట విద్వత్తు కావాలి. రెండోది వివేచన కావాలి. మూడోది విలక్షణమైన దృష్టి కావాలి. నాలుగోది తాను చెప్పే ధోరణి కావాలి.

ఈ నాలుగు ఉంటే మంచి రచనలు వస్తాయంటారా?

మంచి రచనలు కాదు... అసలు రచన రావాలంటేనే ఈ నాలుగు కావాలి. అది మంచి రచనా... కాదా... అన్నది కాలం నిర్ణయిస్తుంది. చెప్పే విషయంలో మనకు పూర్తి సామర్థ్యం ఉండి తీరాలి. రేడియోను బాగు చేసేవాడికి మొదట రేడియో గురించి తెలియాలి. దాన్ని మరమ్మతు చేయడం నేర్చుకోవాలి. తర్వాత తాను చేయడం ప్రారంభించాలి. తన అనుభవం నుంచి నేర్చుకోవాలి. అప్పుడు రేడియోను బాగు చేయడం వస్తుంది. రచన కూడా అంతే. ముందు పరిశీలించాలి... తర్వాత నేర్చుకోవాలి... ఆ తర్వాతే చేయాలి.

రచనల్లో చేసే హితబోధలకు, రచయితలు నిజజీవితంలో పాటించే విలువలకు సంబంధం?

అవసరం లేదు. నిజ జీవితంలో పాటించి... తను నేర్చుకున్న నిజాన్ని చెప్పినవాడు ప్రవక్త, మహాత్ముడు అవుతాడు. రచయిత కాడు. రచయితలందరూ తాము చెప్పినవన్నీ పాటించలేకపోవచ్చు. ఈ రెండూ... రెండు రకాలైన వేదికలు. ఈ రెంటికీ సంబంధం లేదు. తాను అనుభవంలో తెలుసుకున్న ఆదర్శాన్ని ప్రపంచానికి చెప్పేవాడు మహాత్మాగాంధీ అవుతాడు. నీవు పాటిస్తేనే ఆదర్శాలు చెప్పు అంటే... ఎవరూ చెప్పలేరు. చెప్పరు కూడా. తెలుగులో ఓ సామెత కూడా ఉంది. 'నేను చెప్పింది చేయి... నన్ను చూసి చేయకు' అని. రచయిత నిజానికి ఓ స్ఫూర్తిదాయకుడు. అది ఆయన చెప్పేవరకూ. అది ఆయన కూడా పాటించడమనేది వేరే విషయం. నిప్పులో దూకొద్దు ప్రమాదం అని రచయిత చెప్పాడనుకో... నువ్వు దూకావా అని అడిగితే ఎలా?

సమకాలీన తెలుగు సాహిత్యంపై మీ పరిశీలన?

నిజం చెప్పాలంటే, సమకాలీన సాహిత్యం మీద నాకు ఎక్కువ పరిశీలన లేదు. ఎందుకంటే, నేను ఎక్కువగా చదవలేదు. 'వందేళ్ల కథకు వందనం' కార్యక్రమం కోసం కథలు మాత్రం బాగా చదువుతున్నాను. ప్రపంచ సాహిత్యంతో పోటీ పడదగిన స్థాయిలో కథానిక సాహిత్యం వస్తోందని నా ఉద్దేశం. అయితే ఒకటే బాధ. నాటక రచనల విషయంలో మాత్రం... ఈ తరం వారు మాపాటి కూడా చేయలేదేమో అనిపిస్తోంది. కానీ... ఇది పరిశీలనతో చెబుతున్న మాట కాదని మీరనుకోవచ్చు. ఎందుకంటే... ఓ విధంగా నా అవగాహన తక్కువ. నా అవగాహన మేరకు మాత్రం... కథానిక సాహిత్యం చాలా మంచిది వస్తోంది.

నాటి నుంచి నేటి వరకూ రచనా భాషలో వచ్చిన మార్పులేంటి?

ఎన్నో రకాల మాటలు మన చుట్టూ ఉన్న పరిసరాల నుంచి మన మనసులోకి, మాటలోకి, రచనలోకి వచ్చేస్తుంటాయి. ఉర్దూలో నుంచి మనకెన్నో మాటలు వచ్చాయి. ఆంగ్లం నుంచి ఇంకెన్నో లభించాయి. కార్డ్, ట్రైన్... ఇలాంటివన్నీ. భేష్ అనే మాట మనది కాదు. తమాషా అనేదీ మనది కాదు. ఈ మధ్యలో వచ్చిన మాటలు పరిశీలిస్తే... నెటిజన్ అన్నారు. ఇంటర్నెట్ వచ్చింది గనుక. భాష స్వభావమేమిటంటే... పలుకుబడిలో నలిగిన ప్రతి మాటా... ఓ రూపాన్ని

సంతరించుకుని... సాహిత్యంలోకి వస్తూ ఉంటుంది. అది కాలానుగుణంగా, సమాజాన్ని బట్టి వస్తూ ఉంటుంది. అది సహజం. సరిగ్గా చెప్పుకోవాలంటే... భాషావశ్యత (ఫ్లెక్సిబిలిటీ ఆఫ్ లాంగ్వేజ్). లేదా భాషా వెసులుబాటు. ఒకే ఒక్క మాటలో చెప్పాలంటే భావ ప్రకటన. ఇందులో భాగంగా... ఏది సులువుగా వివరించగలమో, చెప్పడం వల్ల ఏది సులువుగా అర్థమౌతుందో, కొన్ని వందల, వేల మంది ఏది మాట్లాడుతున్నారో... ఆ మాటలన్నీ నిలుస్తాయి. ఇది ఎక్కడా ఆగిపోవడానికి వీలు లేదు. ఇదో ప్రవాహం లాంటిది. నేను ఇలానే మాట్లాడతాను - నన్నయ గారు ఇలాగే రాశారు అని మనం అనం, అనడానికి లేదు.

ఒకప్పటి రచనా కాన్వాసు చాలా పెద్దది. ఇప్పుడు ఆ పరిస్థితి ఉందంటారా?

ఆ విషయాన్ని కచ్చితంగా చెప్పలేను. ఎందుకంటే... ఇప్పటి రచనల్లో నేను చదివినవి చాలా తక్కువ. అయితే సినిమా విషయం తీసుకుంటే... మా కాలంలో వచ్చినన్ని అనువర్తనాలు (అడాప్టేషన్స్) ఇప్పుడు రావట్లేదు. ఆ రోజుల్లో సెక్రటరీ, చక్రభ్రమణం, రాక్షసుడు, మరణమృదంగం లాంటి ఎన్నో నవలలు చలనచిత్రాలయ్యాయి. అంత ముమ్మరంగా ఇవాళ అవుతున్నాయని అనుకోవట్లేదు. దానికి కారణం ఒక్కటే. కథానుగుణంగా సినిమా తీయడం కాకుండా... ప్రేక్షకులకు అప్పటికప్పుడు వినోదాన్ని పంచడమే దృష్టిలో పెట్టుకుని తీస్తున్నారు.

తెలుగు సాహిత్యంలో స్వర్ణయుగం రావాలంటే?

ఇప్పుడు స్వర్ణయుగం లేదని ఎందుకనుకోవాలి.? నన్నయ కాలం నాటి స్వర్ణయుగాన్ని మనం గుర్తు పడుతున్నాం. శ్రీశ్రీ లాంటి వారి కాలంలో వచ్చిన సాహితీ స్వర్ణయుగాన్ని ఇప్పుడు మనం గుర్తిస్తున్నాం. నేటి సాహిత్య స్వర్ణయుగాన్ని 2050లో గుర్తుపడతారేమో... మనకేం తెలుసు. సాహిత్య ధర్మం ఏమిటంటే... కాలంతోపాటు తనకు తానుగా కొత్తగా సృష్టించుకోగలగాలి. తనకు తాను ఓ రూపాన్ని తెచ్చుకోగలగాలి. తనకు తాను కొత్తగా నిర్మితమవ్వాలి. ఆనాటి పరిస్థితులను బట్టి, సమాజంలో ఉన్న సంప్రదాయాల్ని బట్టి దానిలో మార్పు రావాలి. అది గొప్పదా... కాలాన్ని ఎదిరించి బతుకుతుందా లేదా అన్నది ఇవాళ చెప్పలేం. మనముందు తరాలు అంటే... మన మనవళ్లు చెప్పగలరు.

అంటే నేటి సాహిత్యంపై ఈ రోజు ఓ నిర్ణయానికి రాలేమంటారా?

కచ్చితంగా. మీ అబ్బాయి ఎలాంటి వాడో వాడు రెండో సంవత్సరంలో ఉన్నప్పుడు నువ్వు చెప్పలేవు. 20 ఏళ్ల వయస్సులో చెప్పగలం... 30 ఏళ్ల వయసులో చెప్పగలం... 50 ఏళ్ల వయసులో చెప్పగలం. 20 ఏళ్ల వయసులో నీ కొడుక్కి ఏది మంచిదంటే... ఇరవయ్యేళ్ల కిందట అదే సందర్భంలో నీకు నీ పెద్దలు ఏది చెప్పారో అదే ఇప్పుడు నువ్వూ చెబుతావు. మన నీడ మనకు అక్కడే నిలబడ్డప్పుడు కనపడదు. అది ఎంత వరకూ వ్యాపిస్తుందన్నది చెప్పడానికి కొంత సమయం పడుతుంది. ఆ సమయానికి నేటితరం వారు ఉండకపోవచ్చు. అలాగే , సాహిత్యాన్ని ఇవాళ మనం నిర్ణయించలేం. కాలంతో పాటే విలువలు, సంప్రదాయాలు మారతాయి. కాలాన్ని బట్టి రచనా సరళి మారుతుంది. మన అవసరాలు కూడా మారతాయి. ఈ 'మార్పు' గొప్పదా, మంచిదా, కాలం విడిచి నిలుస్తుందా అనే విషయాన్ని 'కాలమే' చెప్పగలదు. మీ జీవితం మీకు పాఠం చెబుతుంది. రేపటి జీవితానికి మీరు పాఠం నేర్పుతారు. అది ఏమిటన్నది కాలమే చెప్పాలి. చేయాలి. ఈ మధ్యలోనే మనం ఉంటాం.

ప్రస్తుతం తెలుగు ఏ పరిస్థితుల్లో ఉంది?

ఒకప్పుడు నేను తెలుగు వాణ్ణని చెప్పుకోవడానికి గర్వపడే వాళ్లం. ఇప్పుడా పరిస్థితి ఉందంటారా? మన మాతృభాష ముమ్ముందు అభివృద్ధి చెందాలన్న ఆశ, కోరిక రెండూ నాకున్నాయి. ఎందుకంటే నా వృత్తి, ప్రవృత్తి, వ్యాపకం అన్నీ భాషతోనే ముందుకు సాగాయి, సాగుతున్నాయి. ఒకప్పుడు విజ్ఞాన సముపార్జన కోసం చదివితే ఇప్పుడు ఉద్యోగ సముపార్జన కోసం చదువుతున్నారు. చదివిస్తున్నారు. ఒక్కముక్కలో చెప్పాలంటే సంపాదనకు అవసరమయ్యే చదువులు ఇప్పుడు కొనసాగుతున్నాయి. భాషలోని తీయదనాన్ని, ఆత్మీయతను గుర్తించి, ఆస్వాదించి, ఆనందించే తత్వం... కనుమరుగు అవుతుందేమోనన్న భయం వేస్తోంది. ప్రపంచంలో నశించి పోయే భాషల జాబితాలో తెలుగు ఉందంటూంటే ఆందోళన కలుగుతోంది. ఈ భాషా విజ్ఞాన భాండాగారాన్ని విస్మరించే రోజులు వస్తాయేమోనని బాధగా ఉంది. అయిదు పదులు దాటిన వారే తెలుగును క్షుణ్ణంగా చదువుతున్నారు. కానీ, వారి పిల్లల్ని మాత్రం తెలుగులో చదివేందుకు, మాట్లాడేందుకు ప్రోత్సహించట్లేదు. దీనికి కారణాలు ఏవైనా కావచ్చు. అయితే, ఈ మధ్యకాలంలో రోజురోజుకీ అంతర్జాలంలో తెలుగు భాష వినియోగం విస్తృతమవుతోంది. కొన్ని మీడియా సంస్థలు సైతం తెలుగుకు పెద్దపీట వేస్తున్నాయి. ఇవన్నీ చూస్తుంటే... తెలుగు భాషాభివృద్ధిపై ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి.

మాతృభాష పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎవరిది?

ఆ బాధ్యత మీకు లేదంటారా! నాకు మాత్రం లేదంటారా! బాధ్యత వాళ్లది వీళ్లది అని నెట్టేయడం కాదు... తెలుగు వాళ్లంతా మాతృభాష పరిరక్షణ కోసం పూనుకోవాలి. ప్రభుత్వాలు, మీడియా సంస్థలు దీన్నో కర్తవ్యంగా చేపట్టాలి. వీళ్లందరి కంటే కూడా... తల్లిదండ్రులపైనే ఈ బాధ్యత ఎక్కువగా ఉంది. మనం ఏ మొక్క నాటితే ఆ చెట్టే పెరుగుతుంది. ఆ పళ్లే కాస్తాయి. మీ పిల్లలకు ఏ చదువు అందించాలను కుంటున్నారో... దాన్నే అందించండి. దాంతోపాటు... అమ్మ విలువ కూడా వారికి తెలియాలి కదా. అందుకే చిన్నతనం నుంచి పిల్లల చేత చక్కగా తెలుగు చదివించడం, వారికి తెలుగు వినిపించడంతోపాటు... ప్రతిరోజూ ఓ తెలుగు పద్యం నేర్పించండి. జాని జాని ఎస్ పాపా...తోపాటు... శ్రీరాముని దయచేతను లాంటి పద్యాలను నేర్పించండి. తెలుగులో వస్తున్న పిల్లల పుస్తకాలను చదివేలా ప్రోత్సహించండి.

- తెలుగు వెలుగు బృందం

ఆంగ్లంతోనే
జీతం! జీవితం!!
ఆ భాషతోనే అభివృద్ధి!!!
తెలుగు నేలపై ఇదే దురభిప్రాయం.
అక్కడికేదో ఆంగ్లం రానివాళ్లు ఈ లోకంలో
బతకలేకపోతున్నట్లు! జపాన్ తెలుసు కదా.
అభివృద్ధిలో మనకన్నా పైన... ఎక్కడో అందనంత
దూరంలో ఉంటుంది. కానీ, జపనీయుల్లో నూటికి
తొంభైతొమ్మిది మందికి పొట్టకోస్తే ఆంగ్లం
ముక్క రాదు. మేం కళ్లారా చూసిన
విషయమిది అంటున్నారు
డా॥ గాయత్రీదేవి

ఆంగ్లం వస్తే ఎంత! రాకపోతే ఎంత!

ఈ మధ్య మేం జపాన్ వెళ్లాం. ఏ దేశానికి వెళ్తున్నా... ప్రయాణానికి ముందు ఆ నేలకు సంబంధించిన వివరాలతో పాటు స్థానికుల గురించి తెలుసుకోవడం మాకలవాటు. జపనీయులు చాలా మర్యాదస్థులనీ, పర్యాటకులకు బాగా సాయపడతారని తెలిసింది. మనసుకు హాయిగా అనిపించింది. ఎందుకంటే, గతంలో ఇటలీకి వెళ్లినప్పుడు ఇందుకు పూర్తి వ్యతిరేక అనుభవాలు ఎదురయ్యాయి.

మానసికంగా ఎలాంటి భయమూ లేకుండా జపాన్ బయలుదేరాం. అక్కడ విమానాశ్రయం నుంచి మా హోటల్‌కి వెళ్లాలి. అంతకు ముందే మన రూపాయిలను 'యెన్'(జపాన్ ద్రవ్యం)ల్లోకి మార్చుకోవాలనుకున్నాం. విమానాశ్రయంలోనే అందుకు సంబంధించి కేంద్రం ఉంది. వెళ్లాం. కానీ, అక్కడి వారికి ఆంగ్లం తెలియదు. మాకు జపనీస్ రాదు. అయినా పని సాఫీగానే అయిపోయింది. హోటల్‌కు వెళ్లాలంటే ఏదో రైలును పట్టుకోవాలి. దాని గురించి తెలుసుకోవడానికి విచారణ కేంద్రానికి వెళ్తే.. విధి నిర్వహణలో ఓ అమ్మాయి ఉంది. తనకు ఆంగ్లం ఏమాత్రం రాదు. కానీ, మా ప్రశ్నలను అర్థం చేసుకుంది. వాళ్ల భాషలోనే మాట్లాడుతూ చక్కటి సంజ్ఞలతో మాకు సమాచారమంతా ఇచ్చింది. రైలు దిగాక దారి తెలియక ఇబ్బంది పడుతూంటే, చిన్న పోలీస్ ఉద్యోగి కనపడ్డాడు. ఆపద్బాంధవుడయ్యాడు. మేం ఇచ్చిన చిరునామా తీసుకుని, తన చేతిలో ఉన్న జీపీఎస్‌లో చూశాడు. తర్వాత మాతో కూడా వచ్చి మరీ మేం చేరాల్సిన ప్రదేశానికి చేర్చాడు. అతనికీ ఆంగ్లం రాదు, ఎంత రాదంటే రైటూ, లెఫ్టూ అన్న పదాలు కూడా తెలియవు!

బుల్లెట్ రైల్ టికెట్ కొనడానికి వెళ్లినప్పుడూ ఇంతే. మేం ఆంగ్లంలో మాట్లాడుతూ సంజ్ఞలు చేస్తుంటే, కౌంటర్లో ఉన్నతను జపనీస్‌తో బదులు సంజ్ఞలు చేస్తూ మాకేం కావాలో తెలుసుకున్నాడు. ఏ మాత్రం చిరాకు పడకుండా మాకు టిక్కెట్లను రిజర్వు చేసి ఇచ్చాడు. ఇలా మేం అక్కడ ఉన్న నాలుగు రోజులూ రకరకాల మనుషుల్ని కలుస్తూనే ఉన్నాం. ప్రభుత్వోద్యోగులు, విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగస్థులు, టాక్సీ డ్రైవర్లు... అందరితో మాట్లాడాం!. ఇంత మందిలో ఒకే ఒక్కడు... ఓ మోస్తరు ఆంగ్లం తెలిసిన అబ్బాయి తటస్థపడ్డాడు! అయినా... అక్కడ ఎవరిని, ఏ చిరునామా అడగడానికైనా వెనకాడక్కర్లేక పోయింది. భాష తెలియకనో, వాళ్ల సంస్కృతో ఏమో కానీ... ఎవరిని అడిగినా వారు మా వెంట వచ్చి దింపి వెళ్లేవారు. నామఫలకాలు, టిక్కెట్లు అన్నిటి మీదా జపనీసే. కొండొకచో ఆంగ్ల బోర్డులు కనిపించాయి. ఇంతకూ మేం వెళ్లింది పల్లెటూళ్లకు కాదు... ఒసాకా, టోక్యో నగరాలకి!

అక్కడ బుల్లెట్ రైల్లో వెళ్తున్నప్పుడు నా మనసుకి హత్తుకున్న మరో విషయం గురించి కూడా చెప్పాలి. బోగీలోకి వస్తున్నప్పుడు, వెళ్లేటప్పుడు... వారి శైలిలో నమస్కరిస్తున్నాడు టీసీ. తనని ఎవరైనా గమనిస్తున్నారా లేదా అని కానీ, ఎవరూ

పర్యవేక్షించడం లేదులే అని కానీ ఆలోచించకుండా అది తన విధి అన్నట్లు నమస్కరించి వెళ్లాడు. పని పట్ల అక్కడి వారికున్న గౌరవం నన్నెంత అబ్బురపరిచిందో! అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన ఆ దేశంలో మాకు ప్రత్యేకంగా కనిపించినవి వాళ్ల సంస్కృతి, భాషాభిమానం. స్థానికులు వాళ్ల భాషలోనే మాట్లాడుకుంటారు. అది అవమానకరమని ఎవ్వరూ అనుకోరు. ముఖ్యంగా తమకు ఆంగ్లం రాదని సిగ్గు పడరు. మనకు జపనీస్ రాదని అవహేళనా చేయరు. ఆంగ్లం తెలియని ఉద్యోగులు అక్కడ కోకొల్లలు. వారంతా "వాళ్ల భాషలోనే జీవిస్తున్నారు" అయినా... వారి ప్రగతి ఆగిపోలేదు. దేశాభివృద్ధికి లోటు లేదు. మరి మనమెందుకు ఆ పని చేయలేకపోతున్నాం? మనలో మనం కూడా అమ్మభాషలో మాట్లాడుకోలేక పోతున్నామెందుకు? మన పిల్లలకి తెలుగంటే చులకన భావం ఎందుకు కలిగిస్తున్నాం? ఆంగ్లంతోనే అభివృద్ధి అన్నట్లు ఎందుకు ప్రవర్తిస్తున్నాం?

భావప్రకటన కోసం పుట్టిందే భాష. ఆలోచనను సాటివారితో పంచుకునేందుకు పలుకు అవసరం. మానవ నాగరికతతో పాటే భాష కూడా అభివృద్ధి చెందింది. అయితే, ప్రపంచమంతా ఒకే భాష లేదు. పక్క పక్కనే అనిపించే ప్రదేశాల్లో కూడా విభిన్న భాషలు వినిపిస్తుంటాయి. మన దేశంలో ఈ విభిన్నత స్పష్టంగా కనిపిస్తుంది. ఐరోపాలోనూ అంతే. పక్కపక్కనే ఉన్న దేశాల్లో భాషలు వేరు వేరు. ఏ దేశంలోనైనా సామాన్యంగా ఎవరి భాషలో వారు మాట్లాడుకుంటారు. ఆయా దేశాల వారెవరూ ఆంగ్లం గురించి ఆలోచించరు. అది రాకపోతే ప్రపంచం తలకిందులవుతుందని భయపడరు మనలా!

మన భాషని మనం గొప్పగా చూడటం మర్చిపోతున్నాం. మన తెలుగును మనమే చంపుకుంటున్నాం. అదీ ఆంగ్లేయుల పరిపాలన అంతమై అరవై ఏళ్లు దాటిపోయాక! నాలుగు ఆంగ్లం ముక్కలు మాట్లాడడం చేతనైన వారిని మహనీయుల్లా చూడటం, అది రాని వారిని తీసిపారేయడం మరీ ఎక్కువైపోతోంది. ఆంగ్లం నేర్చుకోవడంలో తప్పులేదు. నేర్చుకోవాలి కూడా. అయితే, తెలుగుని పట్టించుకోకపోవడం గురించే బాధంతా. కేవలం ఆంగ్లం మాట్లాడటమే తెలివికి చిహ్నం కాదు.

మాతృభాష రాకపోతే నష్టమేంటని అనిపించవచ్చు. బట్టీ కొట్టడానికి ఏ భాషైనా పర్లేదు. కానీ, ఆలోచనల పరిధి పెరగాలంటే అమ్మభాషే దిక్కు. సాంస్కృతిక విషయ అవగాహన మాతృభాష ద్వారానే వస్తుంది. తరాలుగా వస్తున్న ఆ సంపద మాతృభాష నుడికారంతో ముడిపడి ఉంటుంది. దాన్ని సంపాదించాలంటే అమ్మభాష అవసరం.

అరుదైనదే కానీ...

అచ్చులేమో రెండంటే రెండు. హల్లులేమో కోకొల్లలు. ఇలాంటి అరుదైన భాష గురించి ఎప్పుడైనా విన్నారా? ఉబెఖ్ దాని పేరు. దాని వర్ణమాలలో 81 హల్లులకు తోడుగా రెండే అచ్చులుంటాయి. ఒకప్పుడు నల్లసముద్రం తూర్పుతీరంలో నివసించి 18వ శతాబ్దంలో టర్కీకి వలసవచ్చిన ఉబెఖ్ జాతీయులు ఈ భాషను మాట్లాడే వారు. దురదృష్టం ఏంటంటే దీన్ని మాట్లాడగలిగే చివరి మాతృభాషీయుడు (నేటివ్ స్పీకర్) 1992లోనే మరణించారు. టర్కీ స్థానిక సంస్కృతికి దగ్గరై తమ భాషను పోగొట్టుకున్నారు ఈ జాతీయులు.

తెలుగులో అలాంటి సంపద చాలా ఉంది. నన్నయ్య, పోతన, అన్నమయ్య, త్యాగయ్య లాంటి వారెందరో భాషనీ, దానితో పాటే భావాన్నీ పెంపొందించారు. అలా పేరున్న వారే కాదు పేరు తెలియని ఇంకెందరో కూడ పల్లె పదాల ద్వారా, జానపదాల ద్వారా భాషకి అందం తెచ్చారు. అటు పండితులూ ఇటు పామరులూ తరతరాలుగా ఆ నుడికారాన్నీ, ఆ సాంస్కృతిక సంపదనూ భాష ద్వారా అందిపుచ్చుకుంటున్నారు. భావితరాలకు అందజేస్తున్నారు. భాషే చనిపోతే ఆ వారసత్వం పోతుంది. అలా జరిగిన నాడు తెలుగు జాతి ఉనికే ఉండదు. దీన్ని గుర్తించకుండా... చదువుకు, ఉద్యోగాలకు తెలుగు అవసరం లేదని, దాన్ని పక్కన పెట్టేస్తే నష్టపోయేది మనమే.

మనలో మనం తెలుగులోనే మాట్లాడుకోవాలనేది ఓ ఉద్యమం కావాలి. అందుకు ప్రతి తెలుగువాడూ నడుం బిగించాలి. తెలుగు వెలుగుని కాపాడుకోవాలి. ఆ వెలుగులో మనం ముందడుగేయాలి. మన రాష్ట్రానికి వచ్చే విదేశీయులతో కూడా తెలుగులోనే మాట్లాడాలి. వాళ్లకు అర్థమయ్యేలా చెప్పేందుకు ప్రయత్నించాలి. అయ్యో... ఆంగ్లం రాదే అని బాధపడటం మానేయాలి. ఇప్పుడు ఈ క్షణంలో భూమ్మీద ఉన్న ఏ దేశానికి వెళ్లినా భాషాపరంగా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. మనమూ ఆ స్థాయికి చేరుకోవాలి.

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై
ఎవ్వనియందుడిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము తానెయైన వా
డెవ్వడువాని నాత్మ భవునీశ్వరునే శరణంబు వేడెదన్

లోకంబులు లోకేశులు
లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వడు
ఏకాకృతి వెల్గు నతని నే సేవింతున్

అంటూ పోతనామాత్యుడు అలవోకగా పరమేశ్వరుణ్ని వర్ణించిన సుందరమైన తెలుగు మనది. దాన్ని దూరం చేసుకుంటే 'నాది' అని చెప్పుకోవడానికి ఏదీ మిగలదు.

తెలుగు నేలపై పుట్టడం అదృష్టం. తెలుగులో మాట్లాడగలగడం మరీ అదృష్టం. అమ్మభాషంటే చెవికోసుకునే తమిళులే ఒప్పుకున్న విషయమిది. అందుకే అందరం మన తెలుగులో సగర్వంగా మాట్లాడుకుందాం. ఆత్మగౌరవంతో బతుకుదాం.

డా॥ గాయత్రీదేవి,
ఆయుర్వేద వైద్యులు, ముంబై
098202 57440

సీనియర్ సముద్రాల
మాటల కడలి

ఆయన తొలితరం సినీకవి, సంభాషణల రచయిత... పౌరాణిక చిత్రాలపైన ఆయనది చిర స్మరణీయ ముద్ర. రామాయణ, భారత, భాగవతాల్లోని పురాణ పాత్రలను ఆకళింపుచేసుకుని పాత్రోచిత రచన చేయటంలో ఆయన సిద్ధహస్తుడు. వేమన, త్యాగయ్య, భక్తరామదాసు, విప్రనారాయణ, అమరశిల్పి జక్కన్న లాంటి పాత్రలకు వెండితెర ఆవిష్కారం చేశారు. తరాలు మారినా ఈ చిత్రాలు సినిమా అభిమానులను రంజింప చేస్తూనే ఉన్నాయి. మాటల జలధి... పాటల కడలిగా సముద్రాల రాఘవాచార్య కీర్తిప్రతిష్ఠలందుకున్నారు (సీనియర్ సముద్రాల ఆయన వ్యావహారిక నామం). సముద్రాల రచనాశైలీవైభవాన్ని రేఖామాత్రంగా చెప్పే ప్రయత్నమిది.

"దిగ్దిశాంత విశ్రాంత యశోరాజితమై, నవఖండ భూమండల పరివ్యాప్తమై, దశాక్షౌహిణీ సేనావాహినీ పరిరక్షితమై, శాత్రవ భయంకరమైన, ఈ కురు మహా సామ్రాజ్యమును శాసించు రారాజును నేను"

'శ్రీకృష్ణ పాండవీయం' చిత్రం ప్రారంభంలో మయసభలోకి ప్రవేశిస్తూ కురురాజు పలికే సంభాషణలివి. సీనియర్ సముద్రాల సాహితీ ప్రజ్ఞకు మచ్చుతునకలివి. దీనికి కొనసాగింపుగా..."అరివీరషండ నిర్మూలనోద్దండ దోర్దండ బలమండితులు, మేరు సమానధీరులు మా శత సోదరులు... అనన్య సామాన్య కోదండ విద్యా నైపుణ్యంతో భార్గవ రాముండనై కురు సమ్రాట్ యశోరక్షాధీరుడైన ఈ రాధేయుడుండగా అనామకులైన పాండవార్భకులకు ఇంత ప్రజా ప్రశంసాడంబరమా? వివిధ వేద వేదాంగ వేదినై, నిఖిల నీతి విశేష పరిజ్ఞాతమైన నాకన్నను ఆ కుంతీ సుతాగ్రజుడు ధర్మకోవిదుడా? కౌరవేశ్వర భుక్తాన్న శేష భోజన మదోన్మత్తుడైన, భీమసేనుడు బలవంతుడా ద్రుపదరాజు జీవగ్రహణ మాత్రోపయుక్త ధనుర్విద్యోల్లాస దుర్విదగ్ధుడైన మధ్యముడు ధనురగ్రేసరుడా"

... సంస్కృత సమాసభూయిష్టంగా ప్రవాహశైలితో ఈ సంభాషణ కొనసాగుతుంది. సుయోధన పాత్రధారి నందమూరి తారకరామారావు తనదైన హావభావ విన్యాసాలతో వీటికి ప్రాణప్రతిష్ఠ చేశారు.

● ఇలాంటిదే పాండవ వనవాసంలోనూ కనిపిస్తుంది. ఎస్వీరంగారావు వాచకాన్ని దృష్టిలో పెట్టుకుని సముద్రాల రచన సాగుతుంది.

"చతుస్సముద్ర వేలావలయిత పట్టభద్రుడైన ఈ కౌరవచక్రవర్తిని చూచి ఒక బంధకి, పంచభర్తృక... ఆ ద్రౌపది పరిహసించుటా? దీనిని సహించి రారాజు జీవించుటా? ఈ పరాభవానికి తగిన ప్రతీకారం జరగవలసిందే. భీష్మద్రోణకృపాది సాహిక బాహుక దత్తాది ప్రముఖ వీరాధివీర పరివృతుడై అనేకాక్షౌహిణీచమూ సమేతులైన ఈ సుయోధనుని పరాక్రమం వ్యర్థం... ఉద్దండ వైరి హృదయమండల ప్రచండమైన ఈ గదాదండము నిస్సారం... నిరర్థకం..."

దుర్యోధన పాత్ర నేటికీ పండితపామరులను అలరిస్తూనే ఉంది. దీనికి సినీ రంగాన పునాది వేసింది సముద్రాలే.

● "ఏకచక్రపురాన యెగ్గుసిగ్గులు మాని తిరిప మెత్తిన నాడె తెల్లమాయె..." అని దుర్యోధనుడు ఎకసెక్కం చేస్తే- "తిరిపెమెత్తుట గాదు తిగిచి జరాసంధు మట్టిజేసిన జగజెట్టి నేను" అంటాడు భీముడు దీనికి ప్రతిగా.

పాండవ వనవాసంలో భీమ, దుర్యోధనుల నడుమ సంవాదం సందర్భంగా ఈ పద్యాలు

అంత తేలిగ్గా మరుపునకు రావు. ఘంటసాల, మాధవపెద్ది పోటాపోటీగా వీటిని ఆలపించారు. శ్రీకృష్ణపాండవీయంలో శిశుపాలుడు కృష్ణుణ్ని తూలనాడే ఘట్టం కనిపిస్తుంది. ఇదే కాదు ... పౌరాణిక చిత్రాల్లో సంవాద పద్యాల సృష్టికర్త సముద్రాలే.

● భూకైలాస్, సీతారామకళ్యాణం చిత్రాల్లో రావణుని పాత్రకు సముద్రాల విశిష్టత చేకూర్చి పెట్టారు. శివభక్తునిగా, తల్లి కోరికనుతీర్చే తనయునిగా, అమేయ పౌరుషానికి, పట్టుదలకు ప్రతీకగా రావణుడు ఇందులో కనిపిస్తాడు. ఈ పాత్ర ఔచిత్యాన్ని గుర్తెరిగి ఎన్టీఆర్ సీతారామకళ్యాణం చిత్రాన్ని స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. భావిజీవితంలో ప్రతినాయక పాత్రలను పోషించటానికి ఎన్టీఆర్‌కి ప్రేరణ ఇచ్చింది ఓ రకంగా ఈ చిత్రమేనేమో అనిపిస్తుంది. ఇందులో నారదుడు, రావణబ్రహ్మల మధ్య సంవాదం నాటకీయంగా సాగుతుంది. దేవదేవ పరంధామా, నీలమేఘశ్యామా.... కానరార కైలాసనివాస బాలేందుధరా... జటాహరా...గీతాలతో పాటు... హే పార్వతీనాథ... కైలాస్శైలాగ్రవాసా... శశాంకార్ధ మౌళి.. ఉమాదేవతోల్లాసిత నవ్యాంగ భాగా... అన్న శివదండకాన్ని సముద్రాల విరచించారు.

● తొలితెలుగు వర్ణచిత్రం 'లవకుశ' గీతాల్లో సముద్రాల కలం పరవళ్లు తొక్కింది. జగదభిరాముడు శ్రీరాముడే... రఘుకుల సోముడు ఆ రాముడే...రామకథను వినరయ్యా... ఇహపరసుఖములొసగే సీతారామకథను వినరయ్యా... వినుడు వినుడు రామాయణ గాథ... వినుడీ మనసారా... శ్రీరాముని చరితమును తెలిపెదెమమ్మా... ఘనశీలవతి సీతకథను వినుడోయమ్మ... గీతాలన్నీ సముద్రాల కలం నుంచి వచ్చినవే. ఇందులో రామజననం నుంచి పట్టాభిషేకం వరకూ వివిధ ఘట్టాలను సముద్రాల ఆవిష్కరించారు. ఇదే చిత్రంలో... సందేహించకుమమ్మా... రఘురామ ప్రేమను సీతమ్మా... లేరు కుశలవుల సాటి.. సరివీరులు ధారుణిలో... కూడా సముద్రాల గీతాలే. ఇవి ఎంత జనరంజకమయ్యాయో ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన పనిలేదు. ఈ చిత్రం ఉత్తమ తెలుగు చిత్రంగా రాష్ట్రపతి పురస్కారం అందుకుంది.

● నర్తనశాలలో "జననీ! శివకామినీ! జయ శుభకారిణీ! విజయరూపిణీ! అమ్మవు నీవె! అఖిల జగాలకు... అమ్మలగన్న అమ్మవు నీవె!" అన్న గీతం మంచి ప్రాచుర్యం పొందింది. ఇందులోనే బృహన్నల ఆధ్వర్యంలో ఉత్తర నృత్య శిక్షణ గీతంలో... జయజయ గణనాయక విఘ్నవినాయక భయహర! శుభకర! గజముఖ... విఘ్నేశ్వర స్తుతిగీతం... 'స్వర్ణమంజరి' చిత్రంలో "మందాకినీ సలిల చందన చర్చితాయ... నందీశ్వర ప్రమథనాథ మహేశ్వరాయ... మందార ముఖ్య బహుపుష్ప సుపూజితాయ.. తస్మై మ కారాయ నమశ్శివాయ..." శివస్తుతిగీతం భక్తిభావంతో ఓలలాడేలా చేస్తాయి.

● అష్టదిగ్గజకవుల్లో ఒకరైన నంది తిమ్మన రచించిన 'పారిజాతాపహరణం' ఆధారంగా రూపొందిన శ్రీకృష్ణ తులాభారం చిత్రానికి సముద్రాల సంభాషణలు వన్నె తెచ్చాయి. అహంకారాన్ని ప్రదర్శించే సత్యభామ, భర్తసేవే పరమావధిగా భావించే రుక్మిణి, ఇరువురి నడుమ ప్రణయకలహంతో నలిగిపోయే శ్రీకృష్ణుడు... పాత్రోచిత సంభాషణలు కూర్చారు సముద్రాల. నడివీధిలో శ్రీకృష్ణుని విక్రయించే ఘట్టాలు మురిపిస్తాయి.

● వీరాభిమన్యు చిత్రంలో యుద్ధానికి వెళ్లబోతున్న అభిమన్యుణ్ణి ఉత్తర వారిస్తుంది. కన్నీరు పెడుతుంది. "దేవీ! కన్నీరా..." అని

ప్రశ్నిస్తాడు. "కాదు, ఆనందాశ్రువులు స్వామీ!" అంటుంది. "అవి అలాగే దాచి ఉంచు. రేపు విజయోత్సాహంతో మరలి వచ్చినప్పుడు ఆ అశ్రువుల అవసరం చాలా ఉంటుంది" అని నచ్చచెబుతాడు.

"నేను పోవటం తథ్యం..." అంటాడు. చని పోతాననే పరోక్ష ధ్వనిని సూచిస్తూ సముద్రాల రచన సాగుతుంది.

● దండకాలు రాయటంలో సముద్రాల అందెవేసిన చేయి.

"శ్రీ మన్మహాదేవ దేవీ! త్రిలోకైక సంతోషిణీ!
భక్త చింతామణీ! శోక సంహారిణీ!
అంబ శర్వాణి లోకైక రక్షామణీ!
ఏ పురా పుణ్యమో, నిన్నే నిత్యంబు
పూజించి - "

'తారాశశాంకం'లో సముద్రాల విరచిత ఈ గీతాన్ని లీల మనోహరంగా ఆలపించారు.

● కైలాసే కమనీయ రత్నఖచితే కల్పద్రుమాలే స్థితం...కర్పూర స్ఫటికేన్దు సున్దర తనుం కాత్యాయనీ సేవితం...గంగా తుంగ తురంగ రంగిత జటాభారం కృపాసాగరం... కంఠాలంకృత శేషభూషణ... శివస్తుతి 'సోమవార వ్రత మాహాత్మ్యం' చిత్రం కోసం సముద్రాల రాశారు. అలాగే "కరుణించవె తులసీ మాతా! దీవించవె దేవీ మనసారా!" రుక్మిణి తులసిపూజ- సత్యభామ కల్పకవ్రతం చేస్తూ పోటీ పడే సందర్భంగా ఇద్దరి పాత్రలను దృష్టిలో పెట్టుకుని గీత రచన చేశారు.

● భక్త ప్రహ్లాద చిత్రంలో సుశీల, బాలమురళీకృష్ణ ఆలపించిన "ఈ మాననీ మందిరా! భక్త మందారా! త్రైలోక్య సమ్మోహనకారా! ప్రేమావతారా! జగన్నాథా! లోకాధినాథా"- దండకం బాగా ప్రాచుర్యం పొందింది. ఇదే చిత్రంలో ప్రేక్షకులు మెచ్చిన మరో గీతం- 'జీవము నీవే కదా! దేవా! జీవము నీవే కదా! బ్రోచే భారము నీదే కదా! నా భారము నీదే కదా!". దీంతో పాటు... "నారాయణ మంత్రం శ్రీమన్నారాయణ భజనం, భవబంధాలు పారద్రోలి, వరము నొసంగే విధను..." గీతం సముద్రాల కలం నుంచి జాలువారిందే.

● "ఓ తెరువరీ! వెనుతిరిగి చూడకురా!...గతము తలపకురా...!
మమతగానీ, మరులుగానీ మాసిపోయేవే...
సంపదయినా సొంపులైనా సమసిపోయేవే... మనసులోన వెలుగు జ్యోతి నీకు తోడోయీ!... నీ ధర్మము విడనాడక ముందుకు సాగి పోవోయీ!!"

కర్తవ్య నిష్ఠను ప్రబోధించే ఈ గీతం 'భక్త రఘునాథ్' చిత్రంలోనిది. ఒరియా ప్రాంతానికి చెందిన భక్త రఘునాథుడి గాథకు సినిమా రూపం. ఈ చిత్రానికి సముద్రాల కథ, స్క్రీన్‌ప్లేతో పాటు దర్శకత్వం వహించారు. భక్త రఘునాథుడిగా కాంతారావు, అతని సతీమణి అన్నపూర్ణగా

అని ఆత్మ వైశిష్ట్యాన్ని వివరిస్తారు.

కరుణా విషాదాలు కలిగించునట్టి -
అహమును మమకారమావలపెట్టి
మోహమ్మువీడి ప్రబుద్ధుడివగుమా! అంటూ ప్రబోధిస్తారు.

● "కలిమీ లేమీ
చావునూ బ్రతుకూ
కావడి కుండలురా
కర్మను మునిగి ఫలమును విడిచి

ఎన్ని అనువాదాలో!

ప్రపంచంలోనే అతి ఎక్కువ భాషల్లోకి తర్జుమా అయిన పత్రమేంటి? ఆలోచించండి. మనందరి జీవితాలపై ప్రభావం చూపే అక్షరాల కూర్పు అందులో ఉంటుంది. తట్టిందా అదేంటో!

'ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటన'. డిసెంబరు 10, 1948లో మొదటిసారి లిఖిత రూపంలోకి వచ్చిన ఈ ఆరు పుటల ప్రకటన ఇప్పటి వరకూ 406 భాషల్లోకి వెళ్లింది. రెండో ప్రపంచ యుద్ధ అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాల సారమే ఈ ప్రకటన.

జమున నటించారు.

● "సిరులు కలిగిన వేళ మైమరువరాదు
కష్టములలోన ధైర్యంబు కలిగియుండు" అని హితవు చెబుతాడు ఓ గీతంలో (దేవత)

● "జపమాచరించె జడధారి కన్నా
దానాలు చేసే సంసారి మిన్న
నిరతాన్న దానమే మీ పెన్నిధానం
ఈ దేహమే మురికి కూపం
పాడు మోహాల పడిజేసే పాపం" అంటారు మరో చోట

● "తనువుతో కలుగు బాంధవ్యమ్ములెల్ల
తనువుతో నశియించు ధరణిలో కలియు
తనువనిత్యము, నిత్యమ్ము ఆత్మ యొకటి -"

'శ్రీకృష్ణావతారం' చిత్రంలో శ్రీ కృష్ణుడు అర్జునునికి గీత సారాన్ని బోధించే క్రమంలో సముద్రాల ఈ గీత రచన చేశారు. ఇదే పాటలో..

"చివికి జీర్ణములైన చేలముల్ వదిలి
కొత్త వలువలు గట్టి కొన్నట్టి రీతి
కర్మానుగతి నొక్క కాయమ్ము వదిలి
వేరొక్క తనువు ప్రవేశించు ఆత్మ -
ఆత్మకు ఆదియు అంతము లేదు
అది గాలికెగరదు - తెగదు
నీట నానదు - అగ్ని అంబుతో నీరై పోదు"

సుఖము కనెదవురా"-

స్వాతంత్ర్యానికి ముందే వచ్చిన 'వందే మాతరం' చిత్రంలో 'నౌసటిరాత దాట తరమా" అన్న సాకీతో మొదలయ్యే పాటలో జీవన సారాన్ని గుదిగుచ్చారు.

● దేవదాసు చిత్రంలో 'జగమే మాయ' ఎంత ప్రాచుర్యం పొందిందో కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఇందులోనే -

"కలిమి లేములు కష్టసుఖాలు
కావడితో కుండలనీ...
... ...
కావడి కొయ్యేనోయ్! కుండలు మన్నేనోయ్!
కనుగొంటే నిత్యసత్యమింతేనోయీ" అంటూ వేదాంత సారాన్ని గుదిగుచ్చారు.

● "రాదే చెలి- నమ్మరాదే చెలి-
మగవారినిలా నమ్మరాదే చెలీ-
... ...
మోసకారి కామదాసుల మాటలు
నీటిమూటలే చెలి
వాంఛ కొనసాగునందాకనే-
తమ వాంఛ కొనసాగునందాకనే-
ప్రేమానుబంధాలు-
మనమేమైననూ చూడరాదే చెలీ..."

మగవాడి స్వభావాన్ని, స్త్రీ లోలతను

అందంగా ఆవిష్కరించారు. బెజవాడ రాజరత్నం గానం చేసిన ఈ గీతం బాగా ప్రాచుర్యం పొందింది. చిత్తూరు నాగయ్య హీరోగా నటించిన 'దేవత' చిత్రంలోని ఈ పాట తరహాలోనే- ఆ తర్వాత అనేక గీతాలు వచ్చాయి.

● "నిప్పు వంటి సీతమ్మ నిందల పాలాయె!
తప్పెరుగని సాధ్వీమణి దండన పాలాయె
ఏనాడూ ఆడ బ్రతుకు ఇంతే కదా!
ఆ దేవుని పరీక్షకు అంతే లేదా"- అంటారు ఓ గీతంలో

● "అందాల దాసులె -
మగవారందాల దాసులె
గుణవంతులైన, ధీమంతులైన
జగజంతలైన ఎంతటివారలైన..."

అన్న సముద్రాల.. మహిళపై చురక వేయటానికి వెనకాడలేదు.

"నమ్మకురా నరుడా! మగువల నమ్మకురా!
నాగుపాములను నమ్మవచ్చురా!
నాతి మనసు కనిపెట్టలేవురా" (సతీ సక్కుబాయి) అంటారు.

● జీవితం అశాశ్వతం, క్షణభంగురమని చెబుతూ...

"ఈ వసంతము నిత్యము రాదోయీ
పూవు దొన్నెలో తీయ తీయని
యౌవన మధువు నింపినదోయి!
ఏ గాలి కుదుపునకు కదిలిపోవునో
హాయి హాయిగా తాగవోయీ -
మధుపాయీ!" అంటారు.

గజల్ తరహాలో సాగే ఈ గీతమూ సముద్రాల కలం నుంచి జాలువారిందే.

● ప్రణయ, శృంగార గీతాల్లోనూ సముద్రాల కలం కదం తొక్కుతుంది.

"కోరుకున్న పతి చెంత జేరితే
దారి చూపమని వెంట తగిలితే
కొసరి కొసరి నీ కొంగు లాగితే
ఏం చేస్తావే పిల్లా! ఏం చేస్తావే!
జారు పైట సవరిస్తా!
ఓర చూపులతో ఊరిస్తా!
కొసరి కొసరి నే కవ్విస్తుంటే
ఏం చేస్తాడో చూస్తా!
చెలిచెలి నెచ్చెలి నీవంటి
బిలిబిలి జాబిలి నేనంటి గిలిగిలి కౌగిలి
ఇమ్మంటి
ఏం చేస్తావే పిల్లా!
పకపక నవ్వి పక్క పక్క చేరి
తికమక తికమక తిప్పలు పెట్టి
తకతై తకతై తైతక్కలాడిస్తే
ఏం చేస్తాడో! ఏం చేస్తాడో!"

హాస్య జంట గిరిజ, రేలంగిల మధ్య ప్రశ్న, సమాధానం రీతిలో ఈ గీతం సాగుతుంది.

● "ప్రియురాల సిగ్గేలనే -
నీ మనసేలు మగవాని జేరి..."

శ్రీకృష్ణ పాండవీయంలో ఘంటసాల, పి.సుశీల యుగళగీతం- సముద్రాలకు మంచి పేరు తెచ్చిపెట్టింది.

● "నేర్చావు సరసాలు చాలా
మేలా నీకీ లీలా!
ఆ మూల దాచీ - చేలాలు దోచీ
చెలగాట మాడవుగా" - గోపిక, కృష్ణుల ప్రణయగీతం కవ్విస్తుంది.

● కనకతార చిత్రంలోని "దేవుడి మహిమ తెలియ వశమా?" (1937) గీతంతో ప్రారంభమైన ఆయన గేయవ్యాసంగం శ్రీరామకథ (1968)తో పరిసమాప్తమైంది.

"రామకథా! శ్రీరామకథా!
ఎన్నిసార్లు ఆలించిన గానీ
ఎన్నిసార్లు దర్శించిన గానీ
తనివి తీరని దివ్య గాథా- " పల్లవితో ఈ గీతం సాగుతుంది.

అంతకు ముందు "వీరాంజనేయ" చిత్రంలో కూడా

"శ్రీరామ! రామ! రామా! సీతామనోభిరామా
ఎనలేని నీ నామ మహిమ
శ్రీరామ ఏనాటికెల్లరికి శ్రీరామరక్ష" అని

రాశారు. ఇదే గీతంలో కృష్ణుని ప్రస్తుతి ఉంటుంది.

"ద్వాపర యుగమున
ద్వారక వెలిసి
ధారుణి నేలే నాథుడ వలె!
దానవకోటి దర్పము నణచి
ధర్మము బ్రోచె దైవము నీవె!
శ్రీకృష్ణ! శ్రీకృష్ణ! శ్రీకృష్ణ!! గోపాలా"

● భక్తపోతన చిత్రంలో-
సర్వమంగళ నామా రామా!
సుగుణధామ రఘురామా!
మంగళాంగ సీతారామా!
మధుర మధుర నామా!"

అనే మరో గీతంలో రాముని ప్రశస్తి ఉంటుంది.

పౌరాణికాలు, సాంఘికాలు.. చిత్రం ఏదైనా తనదైన ముద్రతో అలరించారు సముద్రాల. కథ, మాటలు, పాటలు వంటి బాధ్యతలతో పాటు కొన్ని చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు. జయాపజయాల మాటెలా ఉన్నా వెండితెర వెలిగే వరకూ ఆయన చిత్రాలు అభిమానుల్ని మురిపిస్తూనే ఉంటాయి.

పార్థసారథి చిరువోలు
హైదరాబాద్. 99088 92065

కవిత్వమా... కాస్త అర్థంకా!

భాషలోంచి కవిత్వాన్ని పుట్టించే రసవేత్త కవి. చెప్పే విషయాన్ని హృదయానికి హత్తుకునేట్టు చెప్పాలన్నా, ఊహాజనిత భావాలను వ్యక్తీకరించాలన్నా సాధారణ భాషాపదాల బలం చాలదనుకుంటే కవి సొంతంగా భాషని సృష్టించుకుంటాడు. సాధారణ భాష కవిత్వ భాషగా మారే క్రమాన్ని గ్రహించడమే కవిత్వాన్ని అర్థం చేసుకోవడం. తెలుగు భాష గ్రాంధికమని, వ్యావహారికమని రెండు విభాగాలు.

పందొమ్మిదో శతాబ్దానికి ముందున్న వ్యాకరణబద్ధ గ్రంథాల భాషే గ్రాంధికం. ప్రాచీన గ్రంథాలన్నీ ప్రధానంగా కావ్యాలే కాబట్టి ఒక రకంగా ఇది కావ్యభాషే. కవిత్వ భాషన్నా అదే. కవిత్వ భాష పద్యంలో ఉండొచ్చు. వచనంలో ఉండొచ్చు. ప్రాచీనం కావచ్చు... ఆధునికం కావచ్చు. ఆ కవిత్వ భాషను గురించే ఇప్పుడీ ముచ్చటంతా.

పద్యాల్లో ఛందస్సు, ప్రాసలు, అలంకారాదుల కోసం తరచూ పర్యాయపదాలను వాడటం ఒక అవసరం.

శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం
దార సుధా పయోధి సిత తామర సామర వాహినీ శుభా
కారత నొప్పు నిన్ను మది గానగ నెన్నడు గల్గు భారతీ!

అని పోతన భాగవత శారదాంబ స్తుతిలో వాడినట్లు భావార్థాల బలోపేతానికి ఇలా నానార్థపద ప్రయోగాలు చేయడం అప్పట్లో కవులకో సరదా.

'క్లైబ్యం మాస్మగమః పార్థ! నైతత్త్వయ్యుపపద్యతే
క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప!' అర్జునుడి విషాద యోగాన్ని నిరసిస్తూ ధైర్యం నూరిపోసే ఈ భగవద్గీత శ్లోకంలో భగవానుడు విజయుణ్ని చివర్లో 'పరంతప!' అని సంబోధిస్తాడు. 'పరంతప' అంటే 'శత్రువులను తపింప చేసేవాడా!' అని వ్యుత్పత్త్యర్థం. 'పిరికితనం వద్దు. తుచ్ఛమైన ఈ హృదయ దౌర్బల్యాన్ని వదిలి యుద్ధం చెయ్యి!' అంటూ రెచ్చగొట్టేందుకు పని కట్టుకుని మరీ చేసింది పదప్రయోగం.

ప్రాచీన కావ్యాలు ప్రధానంగా శ్రావ్యానందలక్షితాలు అవడం వల్ల శ్రవణ సుభగంగా ఉండే శబ్దప్రయోగం కవిత్వ లక్షణంగా స్థిరపడిపోయింది క్రమంగా. భట్టుమూర్తి వసుచరిత్ర 'నానాసూన వితాన వాసనల నానందించు సారంగమే/ లా నన్నొల్ల దటంచు..' పద్యంలోని ధారే ఇందుకు ఉదాహరణ. శ్రవణ సుభగత్వాన్ని మరింత ఇంపుగా చేసేందుకు అనేక పదాలనిలా ఒకే సమాసంగా గుదిగుచ్చటమూ కవిత్వ లక్షణమే.

'అటజని కాంచె భూమిసురు డంబర చుంబి శిరస్సరఝ్ఝరీ
పటల ముహుర్ముహుర్ లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కలాప కలాపి జాలమున్
గటక చరత్కరేణు కర కంపిత సాలము శీతశైలమున్

అల్లసాని వారి ఈ అల్లిక చదువుతుంటే అర్థమైనా కాకపోయినా మనసు ఉల్లాసంగా ఊయలలూగుతుందా లేదా?

చాలా సమాసాలకుండే మరో పార్శ్వాన్ని తిక్కన భారతంలో మరింత చక్కగా ప్రదర్శించి చూపించాడు. ధర్మరాజు ఘనతను చెబుతూ ద్రౌపది ఒక పద్యంలో

అతడు భూరి ప్రతాప మహాప్రదీప
దూర విఘటిత గర్వాంధకార వైరి
వీర కోటీర మణిఘృణివేష్టి తాంఘ్రి
తలుడు, కేవల మర్త్యుడె ధర్మసుతుడు!

అనొక సుదీర్ఘ సమాసం వదులుతుంది. 'ధర్మసుతుడు 'కేవలం మర్త్యుడే' కాదు సుమా!' అని నొక్కి చెప్పేందుకు ఊతంగానే ముందింత చాంతాడంత సమాసమన్న మాట.

సుదీర్ఘ సమాసాలు సాధించే మరో ప్రయోజనం కూడా ఉంది. అదే క్లుప్తత. బట్టతల మనిషి మండుటెండలో ప్రయాణం చేస్తున్నాడు. బుర్ర కాలిపోతుంటే తట్టుకోలేక నీడ కోసం తాడిచెట్టు కిందకి చేరాడు. అప్పుడే పైనుంచి పెద్ద చప్పుడు చేస్తూ తాడిపండు సరాసరి నెత్తి మీద పడింది తల బద్దలయింది. ఈ పెద్ద కథను

ధర ఖర్వాటుడొకండు సూర్యకర సంతప్త ప్రధానాంగుడై
త్వరతోడన్ పరువెత్తి చేరినిలిచెన్ తాళద్రుమచ్ఛాయ త
చ్చిరమున్ తత్ఫలపాత వేగమున విచ్చెన్ శబ్దయోగంబుగా -

అన్న కేవలం మూడు పాదాల సమాస పద్యంలో కుదించేశాడొక చాటుకవి. ఆధునికులూ ఈ సమాస సంవిధానాన్ని ఓ విచిత్ర భావావిష్కరణకు సాధకంగా వాడుకుంటున్న సందర్భాలనేకం. తిలక్ 'జ్వాలాత్కాష్ట మిలా తలం శష్పధాత్రి నిర్జనమై పరచుకొనెను/ సుప్త దేవహృదయ సృజ్ఞాళము లెగిరిపడెను' అంటాడు.

ఈ కాలంలో ఛందోబద్ధమైన కవిత్వం అంటే చాలా మందికి అదేదో ఛాందసుల పద్య విద్య కింద చులకన గానీ ఒకప్పుడు ఛందస్సు లేని కవిత్వమంటే చంద్రుడు లేని ఆకాశమే. ఇప్పుడు వాడుక భాషలో రాసిందంతా కవిత్వమేననీ కొందరమెలా భ్రమ పడుతున్నామో... అప్పట్లో ఛందస్సులో పెట్టిందేదైనా కవిత్వమేనన్న అపోహ కొందరికి ఉండేది. 'చాఛా జారూ చిజ చంచన్నాయా ఛీజ/ తాథా దాధాతిజ తాతన్నాయా ధూజ/ పాఫా బాభా పిజ పాపయన్నా ఫీజ/ కాఖా గాఘా కిజ కాటన్నాయా టీజ'- పద్యరూపం కుదిరింది కాబట్టి ఇదీ కవిత్వమే అని బుకాయిస్తే బుర్రలు గిర్రున తిరుగుతాయా లేదా!

మరైతే కవిత్వంలో ఇంతలా పెనవేసుకున్న ఛందస్సు అసలు ప్రయోజనం ఏమిటని అడిగితే 'లయ' అని సమాధానం చెప్పాల్సొస్తుంది. గేయాల గతి లాంటిది లయ. వృత్తాల్లో స్పష్టమైన లయ లేదేమో కానీ (మాత్రా ఛందస్సు మినహాయించి) కవిత్వానికొక శబ్ద సౌందర్యాన్నీ, హుందాతనాన్నీ చేకూర్చేది మాత్రం కచ్చితంగా ఛందస్సే. కేవలం ఛందస్సే కవిత్వం కాదు. అయినా నవ్యకవులూ ప్రారంభంలో ఈ రంభా పరిష్వంగ సుఖం నుంచీ అంత సులభంగా బయటపడలేకపోయారు. లయాకర్షణ మరింత బలమైంది. గురజాడ వారి ముత్యాలసరాలు మాత్రా ఛందస్సు. శ్రీశ్రీ మహాప్రస్థానం ఆసాంతం మాత్రా ఛందస్సులమయం. 'నా విన్నవి కన్నవి విన్నవించగా / మాటలకై వెదుకాడగపోతే-అవి/ పుంఖానుపుంఖంగా/ స్మశానాల వంటి నిఘంటువుల దాటి/ వ్యాకరణాల సంకెళ్లు విడిచి/ ఛందస్సుల పరిష్వంగం వదలి-/ వడిగా, వడివడిగా/ వెలువడినై, పరుగిడినై, నా ఎదనడుగిడినై' అని ఎంతలా వాదించినా ఆయన కవితాపాదాల ఒరవడికి మాత్రం మాత్రా ఛందస్సే ప్రధాన కారణం. ఇప్పుడంటే చాలా మందికి కవిత్వంలో చివరికి మిగిలే అనుభూతే ముఖ్యం కావచ్చు. కానీ రాత ప్రక్రియ అంతగా ప్రాచుర్యానికి రాని పాత రోజుల్లో పునఃపునశ్చరణ మంత్రమే మనుగడకి శరణ్యమైనందు వల్ల ఛందస్సు మీద అప్పటి వారికి అంత వల్లమాలిన మమకారం. ఆధునిక కవిత్వమూ శబ్ద ప్రధానమైన ఈ ప్రాచీనాంశాల వాసననింకా పూర్తిగా వదిలించుకోలేదేమో!

బహుముఖాలుగా సాగిన ఆనాటి కవిత్వంలో పురాణాలది కథన శైలైతే, రూపకాలది సంభాషణాత్మక శైలి. ప్రబంధాలది ఆలంకారిక శైలి. ఎంత విస్తృతమైన విషయాన్నైనా అతి తక్కువ పదాల్లో ఛందోబద్ధం చేసే రాయల వారిది మరీ వింత శైలి. ఆయన పద్యాల్లో చాలా చోట్ల అన్వయక్లిష్టమైన వాక్యబంధాలుంటాయి. ఖాళీలు పూరించుకోవటం పాఠకుల పని. 'కాలుని దున్ననందినయి గంటలు దున్నక మంటినా, మహా/ కాలుని నందిదున్న నయి కర్దమమగ్నత లేక మంటినా,/ హాలికు లెన్నడుం దెగని యౌరుల చేలును జాకుమళ్లనుం/ గా లలి నేరుసాగి రిల గల్గు పసింగొని పేద మున్నుగన్'- వ్యవసాయంలో మెట్ట పొలాలను ఎడ్లతోను, భూములను దున్నలతోను చదును చేయిస్తారన్న ఎరుక లేని వారికి ఈ పద్యం కొరుకుడు పడదు. 'యమునాచార్యుడి రాజ్యంలోని రైతులు ఔరుగంట్ల పొదలతో ఉన్న మెరక చేనుని, బురదతో నిండిన జాకుమళ్లనీ కూడా ఎక్కడెక్కడి ఎడ్లు, దున్నలతో దున్నిం చెయ్యడం చూసి యముని వాహనం దున్నపోతుకీ, శివుని వాహనం ఎద్దుకీ భయం పట్టుకుందట. కాకపోతే నేను ఎద్దుని కాదు కాబట్టి నాకు మెరక దున్నే బాధ తప్పిందని యముని దున్నపోతు, నేను దున్నని కాదు కనక బురదలో పొర్లే ఖర్మ తప్పిందని శివుడి ఎద్దూ చివరికి వేటికవే సర్దిచెప్పుకుని సంబరపడ్డాయ'ని చమత్కారం. పేదరైతుల ఏరువాక సైతం అంత ఉద్ధృతంగా సాగిందని రాయల వారి పద్యం అంతరార్థం. ఆధునిక కవిత్వంలోనూ ఇలా వాక్యాల మధ్య ఖాళీలుంచి పాఠకుల్నే పూరించుకోమని సవాలు చేసే కవులు లేకపోలేదు. రాయల వారు క్లుప్తత కోసం పట్టిన బాటను ఈ ఆధునికులు మరో ప్రయోజనార్థం చేపట్టినట్లనిపిస్తుంది. వ్యక్తీకరణకి శబ్దజాలం చాలదనిపిస్తే భావం చుట్టూ ఆవరించున్న విషయాలని వివరించేసి మిగతాది పాఠకుల హృదయాలకి వదిలేసిన ఇస్మాయిల్ శైలే ఇందుకు ఉదాహరణ. 'కొలనులోకి రాయి విసిరారెవరో/ అలలు ఇంకా వ్యాపిస్తూనే ఉన్నాయి/ రాయేదీ!' ఈ కోవకు చెందిందే 'యాన్ ఎంప్టీ ఎపిసోడ్-1/ మొదటి సన్నివేశం'లో 'ఆగస్టు నాలుగు - ఇంకా తెల్లారని రాత్రికి నిద్రపట్టనప్పుడు- గది కిటికీలోంచి బయటి ముసురునా లోపలికి చూస్తూ...' అని అర్ధంతరంగా ఆగిపోయాడు. కవి హృదయం చేరుకోవడానికి మిగతా అడుగులు పాఠకుడు వేసుకోవాలన్న మాట. వ్యాకరణం ప్రకారం చివరి పాదం చివర్లో క్రియాపదం ఉండాలి. లేకపోయినా 'ఫర్వాలే... అర్థమవుతోందిలే...' అని తీసిపారేశారనుకుంటే పొరపాటే! అలా మధ్యలో వదిలేసిన జాగాలోకి స్వచ్ఛందంగా వచ్చి యథాశక్తి రసాస్వాదన చేసుకోవచ్చన్న కవి ఆహ్వానమేమో ఈ అతినవ్య పంథా?

ఆధునిక కవిత్వ ధోరణుల్ని సంపూర్ణంగా విశ్లేషించుకుంటే ఇంకెంతో చెప్పుకోవచ్చు. వాడుక భాష వాక్యం కవిత్వంలో ఎలా మారుతుందో ఓ సారి

రుచి చూసి ఇంకా ఈ ముచ్చట్లు ముగించేద్దాం. 'కవిత్వమంటే శబ్ద సమూహ సంక్షేప ప్రక్రియ' అంటారు గుంటూరు శేషేంద్రశర్మ. పాదాల్లోని శబ్దాలని వీలైనంత వరకూ సంక్షేపించుకుంటూ పోవడం మొదటి మెట్టైతే... ఆఖర్లో పద్యం మొత్తానికీ 'వాక్య సంక్షేమ చికిత్స' చెయ్యడం రెండో మెట్టు. ఇంకేమాత్రం తీసేసినా మూలార్థానికే ముప్పున్నంత దాకా శబ్దాలనూ, వాక్యాలనూ వదిలేసుకుంటూ పోతే... పొల్లు ఊదేసిన పప్పుల్లా అసలు కవిత్వం రసాలూరుతూ తేలుతుందని అనుభూతి కవుల మతం.

"అబ్బే అదేం లేదు?" ఆమె జవాబు

కానీ, "పురుగులు కొరికితే శవానికి నొప్పి తెలుస్తుందా?"

ఆమెలో సుళ్లు తిరుగుతుందో ప్రశ్న-

మనలోనూ సుళ్లు తిరుగుతుందా లేదా ఈ కవిత? శ్లేషలు సంస్కృత పదాలు సమాసాలు ఏవీ లేకుండానే వట్టి పొడిపొడి మాటలతో కట్టిన వాక్యాలే ఓ మాదిరి స్వరంతో ఉచ్చరిస్తే విచిత్రార్థాలు స్ఫురిస్తాయి. ఒకేమాట ఒక్కొక్కరికి ఒక్కో విధంగా తోచే ఈ 'డ్రెమెటిక్ ఐరనీ' కవిత్వంలో పుష్కలంగా పండుతుంది. ఈ వ్యంజన రసాన్ని ఆస్వాదించడం మీదే

పొడుపుకథలు మెదడుకు మేతనిస్తాయి. భాషపైన పట్టును సంపాదించిపెడతాయి. మరి మీరూ ప్రయత్నిస్తారా... పొడుపుకథలను విప్పడానికి!

ముక్కు మీది కెక్కు
రెండు చెవుల కొక్కు
టక్కునిక్కుల సొక్కు
జారిందంటే పటుక్కు
(కళ్ళద్దాలు)

పచ్చనిపెట్టెలో
విచ్చుకోమంది
తెచ్చుకోబోతేను
గుచ్చుకుంటుంది
(మొగలిపువ్వు)

అక్షరాలు, పదాలు పరిమితమే అయినా అవి సృష్టించే సాహిత్యం మాత్రం అనంతం. ఆసక్తి ఉంటే ఏ శబ్దరత్నాకరమైనా తిరగెయ్యొచ్చు... ఒక్కో పదానికి కనీసం నాలుగైదు అర్థాలుంటాయి. ఇవి కాక అదనంగా సందర్భాన్ని బట్టి, వాక్యాన్ని బట్టి, కవిని బట్టి, పాఠకుణ్ని బట్టి ఆ అర్థాలకు మించిన విశేషార్థం ఇంకేదో కూడా స్ఫురింపజేసే శక్తి కవిత్వంలో శబ్దానికుంటుంది. 'తల్లి అల్లం... పెళ్లాం బెల్లం' అంటే తల్లీ పెళ్లాలు - తినే అల్లం బెల్లం అని కాదుగా అర్థం? ఇష్టాయిష్టాలర్థంలో ప్రయోగించారు కదా ఇక్కడ! శబ్దాలకుండే ఈ అర్థభేద వైవిధ్య విశేష గుణమే ఏ కవిత్వానికైనా జవం జీవం. కమలాదాస్ 'పురుగులు' కవితలోని ఈ (పసుపులేటి గీత తెలుగనువాద) పంక్తులు గమనిస్తే...

'నదీతీరంలో, సూర్యాస్తమయ వేళ
ఆమెతో కృష్ణుని చివరి సంగమం...
ఆ రాత్రి భర్త కౌగిలిలో రాధ నిర్జీవంగా...
"ఏమయింది... చెలీ! నా ముద్దులు నీకు రుచించడం లేదా?"

పాఠకులు కవిత్వాన్ని అర్థం చేసుకొనే స్థాయి ఆధారపడి ఉండేది.

వాక్య రచనా వ్యూహం... శ్రవ్య స్వభావాల స్వారస్యం... శబ్దస్థానాల ప్రాధాన్యం... సమాజం, కవిత్వ స్వరూపాల మధ్య ఉండే సంబంధ బాంధవ్యాల రహస్యం... ఇత్యాది సూక్ష్మాలన్నీ... ఎవరికి వారుగా స్వతస్సిద్ధమైన కుశాగ్ర బుద్ధితో అనుభవ, అధ్యయనాల ద్వారా మాత్రమే హృదయగతం చేసుకోగలిగిన వైదుష్య రస విద్యలు. పాలూ, పంచదారా కలిపిన గోరుముద్దల్లైనా మురిపించి, మరపించి మూతికందించడమే తల్లి ప్రేమతో చేయగలిగేది. మింగి జీర్ణం చేసుకుని ఏపుగా ఎదగాల్సిన పని పాపాయిదే కదా! మెదడును ఎంతైనా ఎదగనివ్వండి.

పాపాయి వయసును మాత్రం పదిలంగా దాచుకోండి. కవిత్వం రాయడం... అర్థం చేసుకోవడం అప్పుడు 'నల్లేరు మీద నడకే'.

కర్లపాలెం హనుమంతరావు
హైదరాబాద్. 94403 61381

ఓనమాలు

తెలుగు వర్ణమాలను 'ఓ న మాలు' అంటాం. ఇంతకూ ఈ 'ఓనమాలు' అనే పదానికి అర్థమేంటి?

నన్నయకు ముందు రోజుల్లో తెలుగు నేలపై జైన మతం వ్యాప్తిలో ఉండేది. సహజంగానే, సాధారణ ప్రజలు పిల్లలకి విద్య నేర్పించటం కోసం జైన గురువులనే ఆశ్రయించే వారు. వాళ్లు జైన సమాజ స్థాపకులైన తీర్థంకరులు, సిద్ధుల ప్రార్థనతో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించేవాళ్లు. ఆ ప్రార్థన లో తొలి పదాలు...'సిద్ధం నమః'. కాలప్రభావంతో జైన మత ప్రభావం తగ్గిపోయింది. అయినా... అక్షరాభ్యాస సంప్రదాయం మాత్రం చెక్కుచెదరక 'సిద్ధం నమః' ప్రార్థనతోనే కొనసాగేది.

తర్వాత 10, 14 శతాబ్దాల మధ్యలో శైవ మతం విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. దాంతో, మతాచార్యులు, ఉపాధ్యాయులు వాళ్ల మతాచారం ప్రకారం అక్షరాభ్యాసం 'ఓం నమశ్శివాయ' ప్రార్థనతో మొదలుపెట్టేవాళ్లు. అప్పటికి జైన మూలాలు పూర్తిగా అంతరించక పోవటంతో శైవ ప్రార్థనలో తొలినాళ్ల జైన సువాసనా పరిమళించేది. అలా శైవ, జైన ప్రార్థనల సంగమం మూలంగా 'ఓం నమశ్శివాయ సిద్ధం నమః'తోనే అక్షరాభ్యాసం జరిగేది. ఇదే కాలక్రమేణా 'ఓ-న-మ-శి-వా-య-సి-ద్ధం-నమః'గా మారిపోయింది. దాంతో తెలుగు అక్షరాభ్యాసం ఆ ప్రార్థనలోని మొదటి మూడు అక్షరాల బహువచనం 'ఓ న మాలు'గా పేరు పొందింది.

ప్రేమ లేఖల పోటీలో రూ.1116 గెలుచుకున్న లేఖ

అక్షర ప్రేమాంజలి

ప్రియమైన మీకు,

చాలా ఏళ్ల తరువాత కలం పట్టి అనుభూతుల జల్లులను అక్షరాల్లో రాల్చుదామని ఆలోచనలు పరుగెత్తుతున్నాయి. ఇరవై మూడేళ్లు వెనక్కి. ఎంత చెప్పుకున్నా ఎంతో కొంత మిగిలి ఉండేది భాషకు, భావానికి అందనిది వివాహ బంధంలోని మధురిమ!

1990 చైత్ర మాసపు మంగళకర మధూదయంలో పచ్చని పందిట్లో జీలకర్ర, బెల్లం పెట్టించుకున్న సుముహూర్తంలో అగ్నిహోత్రం సాక్షిగా పవిత్ర వివాహ బంధంతో ఒక్కటైన చూడముచ్చటి జంట మనది.

కాళిదాసు రుతుసంహారంలో వర్ణించిన ప్రకృతి దృశ్యాలమల్లే చైత్రమనగానే గుర్తుకు వచ్చే మామిడి పూత, చిగురులు తొడిగే వివిధ వృక్షజాతులు, వసంత కోకిల రాగాలు ఉగాది మొదలుకొని శ్రీరామనవమి వరకు జరిగే చైత్ర నవరాత్రులు, మల్లెల సౌరభాలు, భక్ష్యభోజ్యాలు ఇలాంటి రమణీయ, మధురమైన మాసంలో జరిగిన మన పెళ్లిరోజు నిజంగా పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయన్న దానికి నిర్వచనంగా ఉంది కదూ!

ఆనాటి అనుభూతుల తాజా పరిమళాలను పొదువుకున్న రంగుల ఛాయాచిత్ర మాలికను తెరిచాను ఈమధ్య ఓ సారి. ఎప్పుడు చూసినా నిత్య నూతనంగా క(అ)న్పించే ఆ ఛాయాచిత్రాల్లో ఓ రంగుల చిత్రం దగ్గర నా కళ్లు అతుక్కుపోయాయి. అదేంటో మీకు జ్ఞాపకం ఉందా? ఆ ఛాయాచిత్ర మాలిక నుంచి అలా అలా మనం రాసుకున్న పాత ఉత్తరాల దొంతరలో దూరి నా మనసు గిలిగింతలు పెట్టింది. గతం తాలూకు అనుభూతుల ఆనవాళ్లుగా మిగిలిన ఆ పాత ఉత్తరాలేగా ఈ నాటికీ మన ప్రేమ జ్ఞాపకాల్ని సజీవంగా పొదువుకున్నవి.

ప్రఖ్యాత ఆంగ్ల నాటక కర్త షేక్స్పియర్ అన్నట్లు 'కళ్లతో కాదు హృదయంతో చేసేది ప్రేమ!' అందుకే దీనికంత కమ్మదనం, కళ్లల్లో తడి ఆరని ప్రేమ చెమ్మదనం. నా పుట్టినరోజున మీ నుంచీ నేనందుకున్న తొలి శుభాకాంక్షల లేఖను ఇప్పటికి భద్రంగా పాత ఉత్తరాల్లో దాచుకున్నాను. అప్పట్లో దేవులపల్లి వారిలా 'యేల నా హృదయము నిన్ను ప్రేమించుట యే!' అనేవారుగా!

అభిరుచులు, ఆసక్తులు మేళవించిన మన జీవనరాగం అల్లరి అలకలతో ఆనందాల పల్లవులతో వెన్నెల జలపాతంలా అప్పుడే రెండు దశాబ్దాలు గడిచాయంటే నమ్మబుద్ధి కావడం లేదు సుమా!

అప్పటికైనా, ఇప్పటికైనా మారని మీ మృదుభాషిత్వం, హుందాతనం, నల్లనయ్య పేరున్న మీ ఆకర్షణీయమైన ముఖవర్చస్సు, అప్పుడప్పుడూ వచ్చిపోయే చిరు కోపాలు అద్దంపై ఆవగింజల్లా.... మన సహజీవన మాధుర్యాన్ని మరింతగా రాగరంజితం చేస్తున్నాయి కదూ!

ఇన్నేళ్ల సంసారజీవనంలో ఎన్ని కష్టాలు, సుడిగుండాలెదురైనా సడలని నిబ్బరంతో నాకు చేయూతనిస్తూ కుటుంబ బాధ్యతల్ని నెరవేర్చే సహకారాన్నీ, స్ఫూర్తినీ ఇచ్చారు. వేయేల! భార్యాభర్తలిరువురూ సమఉజ్జీలేనన్న మీ అభ్యుదయభావాలకు గర్వపడుతున్నాను.

పూర్వజన్మల పుణ్యఫలంగా నన్నూ, నా అభిరుచులను, వ్యాపకాలను ప్రోత్సహించే దైవమిచ్చిన భర్తగా, ప్రియతములుగా మిమ్మల్ని పొందగలిగాను.

కడలిని వీడని కెరటంలా, కంటిని వీడని కనుపాపలా కులదైవం కోనేటిరాయని సాక్షిగా అజరామరం మన ప్రేమబంధం!

అన్నట్టు చెప్పనే లేదు కదా! ఇంతకీ ఆ ఛాయాచిత్రం ఎంగిలిబంతుల్లో... చిన్ని లడ్డు ముక్కతో ఒకరికొకరం నోరు తీపి చేసుకుంటున్న దృశ్యం! ఎంత బావుందో కదూ! అలసిన మనసును సాంత్వన పరచేలా ఆనాటి జ్ఞాపకాల్నీ, ప్రేమల్నీ పదిలంగా పాదుచేసి పోషించుకుంటున్న మన ప్రేమవృక్షం బిడ్డల రూపంలో ఇచ్చిన రెండు అమృత ఫలాలు కుటుంబానికి పరిపూర్ణతను కల్గిస్తూ....

ఎలాంటి అపోహలు, అపశ్రుతులకు తావులేని మన జీవనవేణువు నవ వసంతరాగంలా, మన ఆలుమగల బంధం ఇలాంటి మరెన్నో దశాబ్దాలను చూడాలని, నా హృదయపు లోగిలిలో నింపుకొన్న మీ నిండైన రూపం, మీ మధురమైన ప్రేమతో, ఎప్పటికీ మీ సహధర్మచారిణిగా...

నాలో సగం, నా కలం పేరులో సగమైన మీకిదే అక్షర ప్రేమాంజలి....

మీ
నేను

- బి.కళాగోపాల్
నిజామాబాద్.





వర్షం

– రా.వి.శాస్త్రి

వర్షం దబాయించి జబర్దస్తీ చేస్తోంది. సాయంకాలం అవుతోంది. మబ్బులవల్ల, మామూలుకంటే, చీకటి ఎక్కువగా ఉంది. రోడ్డుపక్క కమ్మలపాక - టీ దుకాణంలో చీకటి చికాగ్గా ఉంది. అడివిపాలెం నుంచి వచ్చి, తన దుకాణంలో చిక్కుకుపోయిన సిటీ బాబుని ఉద్దేశించి,

"మూ(ద్రో)జులక్కాని ఒగ్గదీ ఒరసం" అన్నాడు దుకాణం తాత. ఒగ్గితే సెవి కదపాయిస్తానన్నాడు.

బల్లమీద దిగులుపడి కూర్చుండి పోయేడు సిటీబాబు అనబడే పురుషోత్తం.

"టెసన్‌కి కదు బాబూ ఎళ్ళాలన్నావు?"

ఆకాశం మెరుపుతో చీల్చుకొంది.

"అవును"

"అబ్బో! ఎక్కడ, రెండు కోసులుందే!"

పిడుగు పడ్డట్టుగా ఉరిమింది.

"ఏవిటీ?"

"రెండు కోసులుందయ్యా బాబూ! బొగ్గుల కోసం కుర్రోణ్ణి అక్కడికే తగిల్నాను. సదువుకోనేదు గానీ నాకెరికే. రొండు కోసులుంది" అది రెండు వేల మైళ్ళ దూరం అన్నట్టుగా చెప్పేడు దుకాణం తాత.

"బస్సు దొరకదా?" అని హీనస్వరంతో అడిగేడు పురుషోత్తం.

"ఈ వొరసంలో బస్సు రాగల్దా? ఎర్రేటి నీకు? ఉత్తప్పుడే రాదు. మా కుర్రాడు నడిసే ఎళ్నాడు" పురుషోత్తానికి కొంచెం గాభరా వేసింది. అత్యవసరమైన పని మీద అతను కలకత్తా వెళ్ళవలసి ఉంది. మూడు రోజుల లోపల అక్కడికి వెళ్ళాలీ అంటే మరో రెండు గంటల్లో అతను స్టేషన్ చేరుకోవాలి. బస్సు రాదుట. బళ్లు కనిపించవు. వర్షం చూస్తే పెను ప్రళయంలా ఉంది.

"నేను కలకత్తా వెళ్లాలే."

"ఏవూరూ?"

"కలకత్తా"

"అబ్బో శానాదూరంవే! అక్కడికెళ్లాలా నువ్వు?"

"అవును"

"ఎళ్ళలేవు"

చాలా ఖచ్చితంగా చెప్పేడు దుకాణం తాత. దిగులుపడి కూర్చుండిపోయేడు పురుషోత్తం. కత్తుల్లా మెరుపులు మెరుస్తున్నాయి. కొండలు బద్దలయినట్టు ఉరుములు ఉరుముతున్నాయి. శివాలెత్తి గాలి పరిగెడుతోంది. పగపట్టినట్టుగా వర్షం తెగపడుతోంది. చీకటిపట్టిన పాకలో, కొత్త పంట్లాం, కొత్త చొక్కా, కొత్త జోళ్లు బాగా కనిపిస్తున్నాయి. ఆ మూడూ పురుషోత్తం వేసుకున్నాడు. అతన్ని బాగా చూడాలీ అంటే దీపం వెలిగించి చూడాలి. అతను చక్కనివాడా? ఒప్పుకొనే వాళ్లు తక్కువ. అతని నడుం మాత్రం చక్కగా సన్నగా ఉంటుంది. అతను సింహ మధ్యముడే కానీ సింహంలా ఉండడు. అతని పదిహేనోయేట "ఇరవయ్యేండ్లుడవా?" అని చాలామంది అనుకొనేవారు. దుకాణం తాతని ఆ సమయంలో అడిగితే "నలభై దగ్గిరుండవా" అని అడగ్గలడు. పురుషోత్తం పాతిక సంవత్సరాల క్రితం పుట్టేడన్న సంగతి. ఆ పుట్టుక తెలిసినవాళ్ళకి తప్ప మరొకరికి తెలియదు. అతను ఎదగని పడ్డలా ఉండిపోయేడు.

ఆ సమయంలో ఆ దుకాణంలో దూరేందుకు అతగాడు ఆ ముందురోజు బయల్దేరేడు. పయనమవడం కలకత్తాకనే పయనమయేడు. అంతలో అతని మేనమామ గాలీ ధూళీలా వచ్చిపడ్డాడు. ఆ మేనమామ అందరికీ ఉచితంగా సలహాలివ్వగలడు. అవలీలగా పనులు పురమాయించగలడు. అతగాడు వచ్చిపడి "నీకు పెళ్ళి కావాలనే సంగతి నీకేమైనా తెలుసా?" అని పురుషోత్తాన్ని ప్రశ్నించి టకాయించేడు. టకాయించి "వెళ్ళు. మంచిది, వయసుది, డబ్బుది, అడివిపాలెంలో మున్సబు కూతురుంది. పిల్లని చూసేసి అలా కలకత్తా వెళ్ళిపోవచ్చు. వెళ్లు వెళ్లు. వెళ్ళి చూడు" అని మేనల్లుణ్ణి వెంట తరిమేడు. దాన్తో చేతిలో పెద్ద సంచీ పట్టుకొని అడివిపాలెంలో బంధువులింట్లో ప్రత్యక్షమై సాయంకాలం మున్సబుగారింట్లో కొత్తబట్టల్తో పెళ్ళి కూతురిముందు ప్రత్యక్షమయి పురుషోత్తం. ఆ పిల్ల తన చూపుతో అతనికొక చిక్కు ప్రశ్న వేసింది.

"మునిసీబు" గారిది పాతకాలపు పెంకుటిల్లు. లోపల వరండాలో చాపమీద కూర్చోబెట్టారు పెళ్ళికుమార్తెని. ఆ పిల్ల మఠం వేసుకొని కూర్చుంది. పక్కనే వాకిట్లో తులసికోటపక్క దండెంమీద తెల్లచీర ఒకటి ఆరవేసి ఉంది. వాకిట్లో తోమిన ఇత్తడి గిన్నెలు తడితో మెరుస్తున్నాయి. ఇంటివెనుక మామిడి చెట్టొక్కటి చీకటిగా ఆకుపచ్చగా కనిపిస్తోంది. దానిపక్కనే కొబ్బరి చెట్టొకటి నిటారుగా ఎత్తుగా గంభీరంగా మామిడిచెట్టు కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధంగా నిల్చొంది.

అస్తమించడానికి తటపటాయిస్తూ దూరాన్న సూర్యుడు ఆకాశంలో అవతల గుమ్మం దగ్గర నిల్చున్నాడు. అంతలో గది తలుపులన్నీ గప్పున తెరచి ఆకాశమంతటా కుంకాన్నెవరో కుమ్మరించేరు. అంతటా, చెట్టున మామిడి చిగుళ్ళు, చెట్టున కొమ్మరి కొమ్మలు సంతోషంతో మూగనవ్వు నవ్వేయి. ఆరవేసిన తెల్లచీర వెలుగుని వరండా అంతటా ఎర్రగా గప్పున వెదజల్లింది. మెరిసే ఇత్తడి గిన్నెలు రాగిరంగు కలుపుకొని బంగారంలా మెరిసేయి. తులసికోటలో తులసిమొక్క నర్తకిలా నిల్చొంది.

దీపపు వెలుగున దేవీ విగ్రహంలా కనిపిస్తోంది పెళ్లి కూతురు. ఆమె తల కొంచెం దించి రెప్పలు కొంచెం పైకెత్తి, పురుషోత్తాన్ని నిదానంగా పరిశీలనగా చూసింది. ఆమె కళ్ళు విశాలంగా స్వచ్ఛమైన నీటితో నిండిన తటాకాల్లా ఉన్నాయి. మారుమూల కుగ్రామంలోనే ఉన్నప్పటికీ ఆ తటాకాలు మెరిసే చుక్కల్నీ, వెలిగే చంద్రుణ్ని, మండే సూర్యుణ్ణి కూడా సుస్పష్టంగా చూడగలవు. అవి చాలా దూరం చూడగలవు.

ఏవేవో ప్రశ్నలు వేసి కూతురిచేత జవాబులు చెప్పిస్తోంది తల్లి. ఆ పిల్ల సన్నంగానే మాట్లాడుతోంది. కానీ గుహలో మాట్లాడినట్టుగా గంభీరంగా మాట్లాడుతోంది. ఇంటర్వ్యూ ముగిసేక పురుషోత్తం లేచి నిల్చున్నప్పుడు, ఆమె చాపమీద కూర్చొనే అతణ్ని నిదానంగా మరోసారి బరువుగా రెప్పలు కొంచెం పైకి వంచి అతణ్ని చూసింది. చూసి, నెమ్మదిగా నిల్చొని లోనికి వెళ్ళిపోయింది. ఆమె చూపు అతన్లో ఏదో అలజడి పుట్టించింది. కానీ అతనికేమీ సరిగా అర్థం కాలేదు.

మర్నాడు బంధువులింట్లో మధ్యాహ్నం భోజనం చేసి రెండెడ్ల బండి ఎక్కి రోడ్డు జంక్షన్‌కి బయల్దేరాడు. మధ్యాహ్నం ఒంటిగంటయింది. మువ్వల చప్పుడు చేస్తూ ఎడ్లు ముందుకు సాగాయి. దార్లోనే ఉన్న మున్సబు గారింటిని, బండి దాటుతూండగా ఆ అమ్మాయి ఎందుకోసమో వీధి నడవలోకి వచ్చి బండిచూసి ఇంట్లోకి వెళ్ళి పోకుండా, అక్కడే ఆగి, గుమ్మాన్ని ఓ చేత్తో ఆనుకొని నిశ్చలంగా నిల్చొని అతణ్ణి నిశ్చలంగా చూసింది. బండి ముందుకి సాగిపోయింది. ఆమె దూరాన్న ఉండిపోయింది. కానీ ఆ చూపు అతణ్ని వెంట తరుముతోంది. మరో విధంగా చెప్పాలంటే ఆ చూపు అతన్లో గోతులు తవ్వుతోంది. కొన్నాళ్ల క్రిందట పురుషోత్తం జబ్బుపడి అస్పత్రికి వెళ్లేడు. అప్పుడతను చాలా నీరసపడి చిక్కిపోయున్నాడు. ఆస్పత్రిలో డాక్టర్ల వెనకనుంచి ఓ నర్సు ముందుకొచ్చి "ఇలారా" అని అతణ్ని తూకపు మెషీను దగ్గరికి తీసుకువెళ్లింది. తీసుకువెళ్తూ తనని ఆమె చూడ్డం అతను గమనించేడు. ఆమె చాలా లేతగా ఉంది. రోగుల బాధలకి బాగా అలవాటుపడిపోగా ఆమె ఇంకా అమానుషంగా తయారవలేదు. ఆమె కళ్ళు చాలా చిన్నవి. ఆమె చూపులో అర్థం అతనికి తూకం మెషీను చూసేదాకా బోధపడలేదు. దాన్ని చూసేక "ఓహో! ఈమె నా బరువెంతో అంచనా కడుతోంది. అనుకున్నాడు. మెషీన్ మీంచి అతను దిగిన తరువాత ఆమె జాలిగా చూసి, హెచ్చరికగా నవి, "మరేం భయం లేదు. ధైర్యంగా ఉండు. నిమిషంలో నయమవుతుంది. జబ్బు" అని హుషారిచ్చింది. కృతజ్ఞత ఎలా తెలియజేయాలో తెలియక అతనప్పుడు కంట తడిపెట్టేడు. బండిలో కూర్చొని వెళ్తుంటే ఆ లేత నర్సెందుకోగానీ గుర్తుకొచ్చింది. పురుషోత్తానికి. దూరంలో నల్లకొండలు, ఇవతల కొబ్బరితోటలు, పక్కన పచ్చని చేలు, పైన తెల్లటి మేఘాల చాందినీ, అంతా అలా చూస్తోనే అతను ఆలోచనలో పడిపోయాడు. నేను సరియైన బరువులేనా? అని ఓసారి అనుకున్నాడు. కానీ అతనికేమీ సరిగా అర్థం కావడం లేదు. తడికర్రకి నిప్పంటనట్టుగా, అతని మనసు రాజుకోడం లేదు. బండి తాజుగా వెళ్తోంది. "ఒహోయ్! హోయ్ హోయ్" మంటూ బండివాడు ఎడ్లని ఆపేటప్పటికి తుళ్ళిపడి, బండిలోంచి దిగేడు పురుషోత్తం. ఆసమయంలో ఎక్కడో ఆకాశం దద్దరిల్లింది. తోటల్లో గాలి గలగలమంది; రివ్వు రివ్వుమంది. పురుషోత్తం ఆకాశంకేసి చూసేడు, తెల్ల మబ్బుల్ని గాలి తుడిచిపారేసింది. ఓ పక్క నల్ల మబ్బులు,

లావాలా పెనుగడ్డల్లా పెల్లుబుకి, వాహినిగా విజృంభించి ముందుకొస్తున్నాయి.

నాటురోడ్డూ ట్రంకురోడ్డూ కలిసేచోట, రోడ్డు పక్క, అధికారిలా నిల్చున్న చింత చెట్టు ఈదురుగాలికి తల విసిరి ఆకాశాన్ని ఎదిరిస్తోంది. చెట్టుకింద కమ్మలపాక చలిగాలికి ముసలమ్మ వణికినట్టు వణుకుతోంది. అంతలోనే మబ్బులు ముంచుకొచ్చేయి. ఎండవేడికి పలకమీది నీరు మాయమైనట్టు ఎండంతా కూడా చూస్తోండగా మాయమయింది. పొలాల మీద మబ్బుల నీడ ప్రవాహంలా పరిగెట్టింది.

బండివాడు గాలినీ ధూళినీ బూతులు తిడుతూ బండిని మళ్లించి మొత్తాలమీదికి చెంగున ఎగిరేడు. ధూళిని చీలుస్తూ ఎడ్లు దౌడుతీసేయి. పురుషోత్తం ఎదురుగావున్న కమ్మలపాకలోకి దూరేసరికి వర్షం దడదడ లాడుతూ దిగింది. జోరుగా వీస్తోన్న గాలిమరికొంత జోరుచేసే సరికి, ప్రవాహం ఒక్కసారిగా పల్లానికి దిగినట్టు వర్షపు దార పాకని ముంచేసి హోరుమంటూ ముందుకుపోయింది.

కమ్మలపాక 'టీ' దుకాణంలో బల్లమీద గంటపైనుంచీ కూర్చున్నాడు పురుషోత్తం. 'టీ' బల్లమీద గళాసులు పనిలేక పడున్నాయి. కెటిల్‌వంటిదొకటి పొయ్యి మీద పడుకుంది. పొయ్యిలో నిప్పు చల్లబడిపోతుంది. దుకాణం అంతా తీరు బాటుగా ఉంది. టీ చెయ్యటం తనపని కానట్టుగా ముక్కాలిపీటమీద ముసలిపిల్లిలా కూర్చున్న దుకాణం తాత, ఆరిపోయిన చుట్టని రెండు పీల్పులు పీల్చి, అంటించకుండా దాన్ని టీ బల్లమీదపెట్టి, "ఏవూరు బాబూ మన్దీ?" అని పురుషోత్తాన్ని మొదటి ప్రశ్నగా అడిగేడు. తరువాత వరుసగా, నెమ్మదిగా కమ్మల చూరునుంచి వానజల్లుకి ఒకటీ ఒకటీగా నీటిబొట్లు తాజుగా కిందికి దిగినట్టు ప్రశ్నల్ని వరసగా దింపడం ప్రారంభించేడు. జవాబివ్వకపోతే ఏం కొంప మునిగిపోతుందో అన్నట్టు వాటన్నిటికీ పురుషోత్తం జవాబిస్తున్నాడు.

అన్నీ తెలుసుకుని, ఆఖరికి, నువ్వు వెళ్లదలచుకున్న చోటికి వెళ్లలేవు. అని ఖచ్చితంగా పురుషోత్తంతో చెప్పేసి అందుగురించి సంతృప్తిపడి నవ్వుకున్నాడు దుకాణం తాత.

పైన వర్షం జోరుచేస్తోంది. గాలీ గీcకొడుతుంది. ఆకాశాన్ని మెరుపులు చీలుస్తున్నాయి; ఉరుములు బద్దలుకొడుతున్నాయి. దుకాణంలో పొయ్యిలో నిప్పుకి గాలి అందడం లేదు. మీదనుంచి కురిసే నీరుమాత్రం కెటిల్‌మీంచి జారి నిప్పుల్లో ఇంకుతోంది.

నవ్విన నవ్వుని మాసిన గడ్డంలో మాయం చేసేసి "బొగ్గులకెళ్ళేడు. కుర్రోడింకా రానేదు బాబూ. ఎక్కడుండిపోనాడో ఏటో" అన్నాడు దుకాణం తాత.

"అయితే బస్సు రాదంటావా?" అన్నాడు పురుషోత్తం.

"ఆ మాటకొస్తే రెయిల్ గాడీ నేరాదు. ముండమోపి బస్సుకి నెక్కేటి?" అని, ప్రపంచమంతా ఆ విధంగా వర్షం వల్ల స్తంభించిపోయినందుకు, హర్షం వెలిబుచ్చాడు దుకాణం తాత. గాలికీ వానకీ పాకమీద పాములు జారినట్లుగా చప్పుడౌతోంది. ట్రయిన్ రావడానికి పూర్తిగా రెండుగంటలైనా వ్యవధిలేదు.

"పెందలికాడు బయలెల్లి నడిచేసినా అందేద్దువు. మరింకిప్పుడీల్లేదు. ఏళ్లూ వూళ్లూ ఏక వేc మరింక"

నడచి వెళ్లడానికి వీలుపడనందుక్కూడా హర్షం వెలిబుచ్చేడు దుకాణం తాత. బాధింపబడుతూ అలానే కూర్చున్నాడు పురుషోత్తం. బొగ్గులకోసం పయనమైన కొడకడింకా రానేదని దుకాణం తాత విసుక్కుంటున్నాడు. పాకంతా తడిసి ముద్దయింది. చలి హెచ్చూ, చలిగాలి జోరూ అయేయి. పైన వర్షం పడుతోంది.

"పడకెటి చేస్ది బాబూ? దాని టయాం అది."

ట్రెయిన్ రాడానికి రెండుగంటలైనా వ్యవధిలేదు. రెండు కోసులదూరం అలానే ఉండిపోయింది. బస్సు ఎక్కడో ఆగిపోయింది. ఆకాశం విరుచుకుపడిపోతోంది.

"నరమానవుడన్నవోడు బైట అడుగెట్టాడానికిల్లేదు" రెస్టు లేని వాళ్లా పురుషోత్తం అటూ ఇటూ తిరిగేడు. పనిలేక గింజుకున్న వాళ్లా గింజుకున్నాడు.

"అగ్గుందా బాబూ?"

"లేదు"

"ఉండదనే అనుకున్నాన్లే. నీట్లో అగ్గి పుట్టించాలగాని, మరి దొరకదు. ఈడు

బలమైన ముద్ర

రాచకొండ విశ్వనాథశాస్త్రి పరిచయం అవసరంలేని రచయిత. 1922 జులై 30న శ్రీకాకుళంలో జన్మించిన ఆయన 1946లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచీ బి.ఎ పట్టభద్రుడై, మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి న్యాయవాద పట్టా పుచ్చుకున్నారు. 1950లో సొంతంగా ప్రాక్టీసు ప్రారంభించారు. వ్యక్తిగత ప్రవృత్తి సాహిత్య సేవే. ఉత్తరాంధ్ర మాండలికాన్ని తన కథల్లో చాలా అందంగా వాడుకున్న ఆయన, 'అల్పజీవి' నవలతో సాహితీ ప్రపంచానికి రా.వి.శాస్త్రిగా పరిచయమై ప్రసిద్ధిగాంచారు. అప్పటికే చైతన్య స్రవంతి పద్ధతి ఆంగ్లసాహిత్యాన్ని ఒక ఊపు ఊపుతోంది. అదే పద్ధతిని తెలుగులోకి తీసుకొచ్చిన నవల 'అల్పజీవి'. కథని ఎలా రాయాలో, దానికి ఎంత బలమైన అభివ్యక్తీకరణ అవసరమో తెలిసిన రా.వి.శాస్త్రి రచనలు ఎప్పటికీ కొత్త రచయితలకు పాఠాలే. ఈ కథలోనూ కథ ఎక్కడ ఎలా మొదలైందో, చివరికి ఎలా మలుపు తిరిగిందో చదివి పాఠకుడు సంభ్రమానికి గురవుతాడు. సమస్య వర్షమైతే... సంకల్పమే చీల్చుకెళ్లే బలమవుతోందని ఓ పన్నెండేళ్ల పిల్లాడి చేతలతో చెప్పించడమే ఈ 'వర్షం'. కథని నడిపిన తీరు, ఉత్తరాంధ్ర మాండలికంలోని సొబగు, సందర్భానుసారంగా వాడిన ప్రతీకలు కథ చదివిన చాలా కాలం వరకూ మనసు మీద నుంచి మాసిపోవు.

జూస్తే ఇంకా రానేదు. ఎక్కడ టిక్కడిపోనాడో ఏటో? గేటుకాణ్ణుంచి బొగ్గులు పట్టుకొస్తానని పారెల్లాడు బాబూ. కుర్రోడే గాని శండశాసనమ్ముండకొడుకులే! ఒరసవేఁనన్న మాటేటి, దిమదిమలాడుతూ ఏనుగులు దిగేసినా నెక్కసెయ్యు" కుర్రవాడు వెళ్లడం, బొగ్గులు తేవడం ఏనుగులు దిగడం వీటిని గురించి వినడం లేదు పురుషోత్తం. చుట్టూ పాకంతా బందిఖానాలా అవుపిస్తోందతనికి. ఇనపఊచలు దిగ్గొడుతున్నట్టుగా వర్షధారలు చుట్టూ దిగుతున్నాయి. అతను ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. పరిస్థితులకి చిరాకుపడి పోతున్నాడు.

వెళ్లు వెళ్లంటే వెళ్లిపోయి వచ్చేడు తను. ముందు కలకత్తా వెళ్లి అక్కడి పరిస్థితులు చూచుకొని ఆ తరవాతే వచ్చి పెళ్లికూతుర్ని చూడవలసింది. ఎప్పుడూ ఇలాగే అవుతోంది. ఆ పిల్ల కరెక్టుగానే ఆచోకి కట్టినట్టుంది. ఛ! తనెప్పుడూ ఇంతే. కలకత్తా రావాలిస్మా అన్నారు. ఒస్తున్నానన్నాడు. అడివిపాలెం ఫో అన్నాడు మాఁవఁ. పోతున్నానన్నాడు. చిన్నప్పటినుంచీ కూడా ఇంతే. చదువుకోకపోతే చెడిపోతావు. చదువుకో అన్నారు. చదువుకుంటానన్నాడు. బుద్ధిగా ఉండకపోతే బాగుపడవుస్మీ అన్నారు. బుద్ధిగా ఉంటానని లెంపలు వేసుకున్నాడు. మజాలేని వెధవలు మంచిగానే ఉంటారు మరి అన్నాడొక స్నేహితుడు. అవునవునని తను ఒప్పుకున్నాడు, ఇలాగే అన్నీను. ఈత రాకుండా నీట్లోకి దిగేవు జాగ్రత్త! "దిగను" దీపం లేకుండా చీకట్లో నడిచేవు జాగ్రత్త! "నడవను". చక్కని రాజమార్గాలుండగా సందులంట తిరిగేవు జాగ్రత్త "తిరగను" వాళ్లెలాచస్తే నీకెందుకు? వాళ్ల జట్టీల్లోకి నువ్వు వెళ్లేవు జాగ్రత్త "వెళ్లను" అన్యాయం, అధర్మం! నీకేలదంతా? నీపని నువ్వు చూసుకో, లేకపోతే తన్నులు తగిలేను జాగ్రత్త! "అదంతా నాకెందుకు?! ఆ తన్నులు నాకెందుకు? నాపని నే చూసుకుంటాను." టైఫాయిడ్, న్యుమోనియా, మరేదో, మరేదో ఏదైనా ఒస్తుంది. వర్షంలో చొరపడేవు జాగ్రత్త! "చొరబణ్నే. ఇక్కడే ఉంటాను".

తుళ్ళిపడ్డాడు పురుషోత్తం. మర్రైతే కలకత్తా వెళ్ళడం ఎలాగ! గంటన్నరకంటే మరింక టైమ్ లేదు. ఏం చెయ్యడానికి పాలుపోక పురుషోత్తం మళ్ళీ బల్లమీద కూర్చోబోతూ వుండగా దుకాణం తాత చూరుకిందనించి రోడ్డు వైపు చూసి "ఆ! ఒస్తదొస్తన్న హదిగదీ! రేసుకుక్కే! పార్రా! పార్రా!" అని ఉత్సాహంతో కేకలు వేసేడు. పురుషోత్తం కూడా వంగొని, చూరుకిందనుంచి చూసేడు.

ఎదురుగా తిన్నగా దూరానికి కనిపిస్తోంది రోడ్డు. రెండుపక్కల ఉన్న చెట్లు సిపాయిల్లా నిల్చొని అలజడి చేస్తున్నాయి. రోడ్డంతా నీటితో ఏటికాలవలా ఉంది. అందుమీద ఆరని నిప్పుతునకలా, నీటిమీద బోటులా, చెట్లని చీల్చుకొని బాటవేసుకొని వస్తున్నట్టుగా ఓ కుర్రవాడు భుజాన్న మూటవేసుకొని పరిగెట్టుకొని కొట్ కొస్తున్నాడు.

కుర్రవాడికి హుషారిచ్చిన తరవాత దుకాణం తాత బుగ్గలు పూరించి పొయ్యి ఊది "ఆరిపోనా దనుకున్నాను. అగ్గుందిరా బాబు" అని ఇంకా జోరుగా ఊదడం ప్రారంభించేడు.

కుర్రవాడు పరిగెట్టి, పరిగెట్టి పాకలోకి ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. "ఒచ్చీసినా న్తాతా!" అని వచ్చీరావడంతో కేకవేసి, మూటనుండి భుజాన్ని సుళువుగా తప్పించి బొగ్గులమూటని చక్కున కిందకి విసిరేడు. కుర్రవాడికి పన్నెండేళ్ళకి మించి ఉండదు వయసు. సరిగ్గా రేచుకుక్కలాగే ఉన్నాడు. అర నిమిషంలో, జుట్టునుంచి నీటిని నొక్కేసి, బట్టల్నించి నీటిని పిండేసి ఆ పాకలో పొడిగా గెంతులు వేసేడు.

"వారసంలో దార్లో సత్తే ఏటిజేద్దువురా మనవడా!" అన్నాడు దుకాణం తాత, బొగ్గులమూట విప్పుతూ మూటల విప్పగానే రాక్షసిబొగ్గులు నిగనిగ మెరిసేయి. "ఒరసవాఁ మన సంగ తెల్దేటి తాతా? ఒరసాన్ని సంపిడిసి పెడతాడీపోతురాజు" అని మూడులోకాలూ ఏలేవాళ్ల జవాబు చెప్పి, పొయ్యి విసరడానికి విర్రవీగుతూ వెళ్లేడు కుర్రవాడు. ఆ పాకలో పాతుకుపోయినట్టుగా నిశ్చలుడై నిల్చుండిపోయేడు పురుషోత్తం. ఆకాశం ఒక్కసారి గప్పున మెరిసింది. అంతవరకూ పురుషోత్తాన్ని వెంటతరిమిన పెళ్లికుమార్తె చూపు ఆ క్షణంలో అతని ముందుకొచ్చి మూర్తీభవించి నిల్చొంది. ఆమె చూచిన చూపు, ఆనాటి నర్సు నవ్విన లేనవ్వు; చిగిర్చిన మామిడిమొక్క, ఎగిసిన కొబ్బరి చెట్టు; ఈదురుగాలి; హోరున వర్షం; నీటిలో నిప్పు, మనిషిలో జ్వాల అన్నీ అతనికి అర్థమయేయి. అర్థయుక్తంగా, స్పష్టంగా తెరమీది కథలా అతనికంతా బోధపడింది. అంతా చూస్తూ అతనలా నిల్చుండి పోయేడు.

పైన వర్షపు ధారలు స్తంభించినట్టుగా అలానే ఉండిపోయేయా అన్నట్టుగా అనిపిస్తోంది. ఆకాశం ఇంకా దట్టంగా మూసుకొంటుందే గానీ పల్చబడ్డం లేదు. గుర్రాల్ని కట్టుకొని ఝుమ్మని అన్నింటినీ తొక్కుకుపోతోంది. ఈదురుగాలి. మెరుపులు పిడుగులయి అందిన దాన్నల్లా హతమార్చేస్తున్నాయి. మబ్బులు కమ్మిన కొద్దీ పాకలో చీకటి చిక్కనవుతోంది.

పొయ్యి విసురుతూన్న కుర్రవాడు ఇసుంలా ఎర్రగా మెరుస్తూన్నాడు.

కొద్దిసేపయింది.

అటూ ఇటూ హడావిడిగా తిరుగుతూన్న దుకాణం తాత ఏదో గుర్తుకొచ్చినట్టుగా టక్కున ఆగి, కళ్లు చిట్లించి, అటూ ఇటూ చూసి, మనవణ్ని "పోతురాజొరే" అని పిలిచి "ఇప్పుడిప్పుడిక్కడున్నాడు! చిటీబాబెక్కడికి పోనాడ్రా?" అని ఆశ్చర్యపడుతూ, సిటీబాబుని ఎన్నెమ్మకాని ఎత్తుకుపోయిందా?! అన్నట్టు అడిగేడు.

"అడుగో" అన్నాడు పోతురాజు

"ఏడీ?"

"అడుగడుగడుగో" అని రోడ్డువైపు చూపించేడు పోతురాజు.

"ఏటీ! పప్పు ముద్దనా సతికిలబడిపోనాడు; ఒరసం ఒగ్గనట్టు పాకొగ్గడనుకున్నాన్రోరె, ఆ! ఆ! కదిన్నాడే" అంటూ మోకాళ్లు వంచి వీపు విరిచి చూర్లోంచి పైకి చూసేడు దుకాణం తాత.

మనసచీకట్లో తిన్నగా సూటిగా, ఈదురుగాలికెదురుగా, వర్షాన్ని సరకుచేయకుండా, తెర్ని ఛేదించుకొంటూ చకచకా ముందుకి వెళ్తున్నాడు పురుషోత్తం, అతణ్ని చూసి తల పంకించి, హింసించి "సెబాసా" అని మెచ్చుకున్నాడు దుకాణం తాత.

సర్వం శ్రీజగన్నాథం

సర్వ మానవ సమానత్వం... అదే జగన్నాథ తత్వం. దాన్ని అర్థం చేసుకున్న నాడు ఈ లోకమంతా ఆనందమయమవుతుంది. కుల మత వర్ణ వైరుధ్యాలకు అతీతమైన సమసమాజం సిద్ధిస్తుంది.

'వస్తున్నాయొస్తున్నాయ్... జగన్నాథ... జగన్నాథ... జగన్నాథ రథచక్రాల్... జగన్నాథుని రథచక్రాల్' అంటూ ఒక్కసారైనా శ్రీశ్రీ కవిత్వాన్ని తలవని సాహిత్య అభిమాని తెలుగునాట కనిపించడు. తెలుగు సాహిత్యంలో 'మహాప్రస్థానం' ఒక ప్రభంజనం. శ్రీశ్రీ ఉట్టంకించిన జగన్నాథ ఆయన పేర్కొన్నారు. ఆయన 'పద'గర్జనతో ఊగిపోయిన తెలుగు నేలలో ఎందరికో ఆ రథచక్రాలు ఎలా ఉంటాయో చూడాలన్న, తెలుసుకోవాలన్న జిజ్ఞాస పుట్టడంలో వింత లేదు. స్వయానా శ్రీశ్రీ సతీమణి సరోజది కూడా అదే పరిస్థితి. అందుకే ఆయన అనుమతితో ఆమె ఆ కోరిక తీర్చేసుకున్నారు.

రథచక్రాలు తిరుగాడే ఒడిశాలో పూరీ ఓ దివ్యధామం. విశ్వవిఖ్యాతమైన ఆ దేవాలయ నగరితో పాటు ప్రపంచమంతా సుమారు 60 దేశాల్లో ఈనెల 10న జగన్నాథ రథచక్రాలు మరోసారి ముందుకు కదలనున్నాయి.

హీనులారా, దీనులారా అని పిలుస్తూ జగన్నాథ రథచక్రాల్ వస్తున్నాయనడంలో మహాకవి ఆంతర్యం... సమసమాజం రాబోతోందనే. జగన్నాథ సంస్కృతిలో అంతర్భాగమైన సామ్యవాదం మన ముందుందని ఆయన వెంట కటక్ వెళ్లినప్పుడు సమీపంలోని పూరీకి వెళ్లి వచ్చారు. 'ప్చ్... ఫలితం లేకపోయింది. ఏదో కనిపిస్తుందనుకున్నాను. ఏమీ లేదక్కడ' అని ఆమె తిరిగి వచ్చి నిట్టూర్చారు. అప్పుడు.. రథయాత్ర నాడు రథాన్ని, రథచక్రాలను చూడాలని శ్రీశ్రీ అనునయించినట్లు ఆమె ఒకచోట రాశారు.

శ్రీశ్రీ ప్రవచించిన సామ్యవాదం జగన్నాథ సంస్కృతిలో అంతర్భాగం. అందుకే 'సర్వం శ్రీజగన్నాథం' అని జీవితంలో ఒక్కసారైనా అనుకోని వారు తెలుగునాట ఉండరు. పూరీలో ఎంగిలి అంటదు. అన్నప్రసాదాలను ఆనందబజారులో అందరికీ ఒకే పంక్తిన విక్రయిస్తారు. దానికి వర్ణభేదం లేదు. ఎవరైనా వడ్డించవచ్చు. ఎవరైనా తినవచ్చు. ఎవరు తిన్నదైనా వేరొకరు తినవచ్చు. పూర్తిగా వినియోగించవలసిందే. పారబోయడానికి వీలు లేదు. ఇందులో ఎటువంటి భేదాలు ఉండవు. ఇలా మడితడి లేకుండా జరిగినప్పుడు, కట్టుబాట్లు వికటించినప్పుడు 'సర్వం శ్రీజగన్నాథం' అనుకోవడం జరుగుతూంటుంది. దానికి ఈ పద్యమే నిదర్శనం

హీనుడు ముట్టినా దనుచు నెంచి మదీయ మహా
ప్రసాదమున్
దానుపభక్తియోగ్యమని తత్పర బుద్ధి పరి గ్రహింపకే
మానిన సద్విజుండు వ్రుతమంగళుడై భవ రోగ
బారియై
న్యూనత చెంది పంచముని యోగమునందు
వసించు నెప్పుడున్

ఇది జగన్నాథ మాహాత్మ్యాన్ని చెప్పే ముక్తి చింతామణి ప్రబంధంలోనిది. దీన్ని రాజమహేంద్రానికి చెందిన యతిరాజ వెంకటాచార్యుడు రాసి పూరీ జగన్నాథునికి అంకితమిచ్చాడు.

పూరీ జగన్నాథుడు ఆంధ్రదేశంలోనూ కనిపిస్తాడు. పూర్తిగా పూరీ సంప్రదాయాన్ని పాటించకపోయినా ఇక్కడ కూడా రథయాత్రలు జరుగుతున్నాయి. చాలామందికి తత్వం తెలియకపోయినా జాతర(యాత్ర)ల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జగన్నాథుడు జాతికి బోధిస్తున్న జీవనసత్యాలను గుర్తించకపోయినా ఉత్సాహంగా రథాన్ని లాగుతున్నారు. 'సర్వం శ్రీజగన్నాథం' అంటూ సహపంక్తి భోజనాలలో పాల్గొంటూ సమసమాజ స్థాపనకు పరోక్షంగా పాటుపడుతున్నారు. ఉత్తరాంధ్రలో ఆలయాలు ఎక్కువగా ఉన్నా బందరు, కర్నూలు వంటి చోట్ల కూడా జగన్నాథుని కొలువులు కనిపిస్తాయి. ఇటీవల హైదరాబాద్‌లో కొత్తగా ఆలయం నిర్మితమైంది. తమ పిల్లలకు జగన్నాథం, జగన్నాథరావు, జగన్నాథస్వామి, సుభద్ర, సుభద్రారావు అంటూ పేర్లు పెట్టుకోవడం

ఉత్తరాంధ్రలో అధికం. జగన్నాథ సేవలోనే కాదు... ఆ జగన్నాథుడి భక్తుల సేవలోనూ తెలుగువారే ముందుంటారు. పూరీ సముద్ర తీరంలో స్నానానికి దిగే పర్యాటకుల రక్షణ బాధ్యత వహించే వారంతా దాదాపుగా తెలుగువారే. ఇక్కడికి సమీపంలోని పెంటకోటలో స్థిరపడిన మత్స్యకారులే ఇప్పటికీ సముద్రతీరంలో 'తెలుగు' మాటలు వినిపిస్తుంటారు. దశాబ్దాల కిందటే ఇక్కడికి వలస వచ్చినా... ఇప్పటికీ వీరు 'తెలుగు'ను మర్చిపోలేదు.

శ్రీశ్రీని వెలుగులోకి తెచ్చినట్లుగా చెబుతున్న పురిపండా అప్పలస్వామిని సరదాగా కొందరు 'పూరీ పండా' అప్పలస్వామిగా అనేవారు. పూరీలో పూజారులను పండాలంటారు. అప్పలస్వామి ఉత్తమ ఆధ్యాత్మిక గ్రంథాలను రాయడం కూడా ఇలా అనడానికి కారణమై ఉండవచ్చు. పూరీ జగన్నాథుణ్ని స్తుతిస్తూ జయదేవుడు రచించిన గీతగోవిందం, అష్టపదులు... మన నృత్యరీతి కూచిపూడిలోనూ ప్రఖ్యాతి చెందడం విశేషం. ఈ గీతాలపై నర్తించి తెలుగు నృత్యకారులు ఏనాడో జగన్నాథ సేవ చేశారు.

జగన్నాథుడిపై తెలుగులోనూ చెప్పుకోదగిన స్థాయిలోనే రచనలు వచ్చాయి. యతిరాజ వెంకటాచార్యుడి 'జగన్నాథ మాహాత్మ్యం' అముద్రితం. అదే పేరుతో రామయ్యగారి సూరయ్య ఓ రచన చేశారు. అయితే,

ఆ కావ్యం పూర్తిగా అందుబాటులో లేదు. దానికి సంబంధించిన రెండో ఆశ్వాసంలోని కొంతభాగం కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు వారి దగ్గరుందని 'సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర'లో ఆరుద్ర చెప్పారు. ఈ కావ్యాన్ని భద్రాచల రామునికి అంకితమిచ్చారట కవి. వెంకటగిరి ఆస్థాన కవి చదలవాడ సుందరరామశాస్త్రి (1865-1925) జగన్నాథ శతకాన్ని రచించారు. ప్రఖ్యాత కథకులు చాగంటి సోమయాజులు విజయనగరంలో జరిగిన రథయాత్రను నేపథ్యంగా తీసుకుని 'రథయాత్ర' పేరిట ఓ కథ రాశారు. అలాగే, అల్లం శేషగిరి రావు 'మంచిముత్యాలు' కథల సంపుటిలోని 'నరమేధం' కథలో జగన్నాథుని రథయాత్ర ప్రస్తావన కనిపిస్తుంది. రథయాత్ర సమయంలో ఢక్కు జాతికి చెందిన వ్యక్తి జగన్నాథుణ్ని నిందిస్తే గానీ రథం ముందుకు కదలదని రచయిత చెబుతారు.

జగన్నాథాష్టకం లోకప్రసిద్ధం. కానీ, దీన్ని ఆదిశంకరాచార్యులు రాయలేదని, విజయనగరం జిల్లా నాగూరు అగ్రహారానికి చెందిన నడిమింటి సర్వమంగళేశ్వరశాస్త్రి రచించారనే వాదన ఉంది.

త్రికళింగ దేశంలో గోదావరి నుంచి వంశధార వరకు దక్షిణ కళింగగా ప్రసిద్ధమైంది. వంశధార నుంచి మహానది వరకు మధ్య కళింగగా చరిత్రకారులు గుర్తించారు. గజపతి రాజులు విజయం సాధించి తిరిగి వెళుతూ విజయబహుదా (విజయంతో తిరుగు పయనం)గా పేరు పెట్టినట్లు... అదే కాలక్రమంలో విజయవాడగా మారింది. వారి కాలంలో తెలుగు నేలపై జగన్నాథుడి ఆలయాలు నిర్మాణమయ్యాయి.

ఆధ్యాత్మికంగా చూస్తే.. ఆదిశంకరుడు పూరీని సందర్శించి ఏకంగా పీఠాన్నే నెలకొల్పారు. గోవర్ధన పీఠంగా వాసికెక్కిన అది ఇప్పటికీ ఆలయ నిర్వహణకు మార్గదర్శకంగా నిలుస్తోంది. జగన్నాథుడిని సేవించిన రామానుజులు వైష్ణవ సంప్రదాయాన్ని ప్రతిష్ఠించడానికి ప్రయత్నించారు. వీరి ద్వారా కూడా తెలుగునాట 'జగన్నాథ సేవ' ప్రాచుర్యం పొందింది. చైతన్య మహాప్రభువు చివరి వరకు అక్కడే ఉండిపోయారు. పూరీ వెళ్లిన ప్రముఖులెవరూ తిరిగి వెనక్కి రారని, స్వామి సేవలోనే జీవితాన్ని ముగిస్తారన్న ఒకే ఒక్క నమ్మకం... వివేకానందుడి పూరీయాత్రను అడ్డుకునేలా రామకృష్ణ పరమహంసను ప్రేరేపించిందని చెబుతారు.

శ్రీశ్రీ ఆశించిన... సమపాలన... సమభావం... సామ్యవాదం మనకు పూరీలో కనిపిస్తాయి. ధనికుడు, దరిద్రుడు ఇద్దరూ ఒకే వరుసలో ఆయణ్ని దర్శనం చేసుకోవాల్సిందే. ఇతర ఆలయాల మాదిరిగా జగన్నాథ దర్శనంలో 'ప్రత్యేక'తలు, టిక్కెట్లు లేవు. 'పరమాణిక్ దర్శన్' ఇందుకు మినహాయింపు. తోబుట్టువులను గౌరవించాలనే విషయంలో కానీ, ఎవరు ముందు... ఎవరు వెనుక... అనే తేడాల్లో కానీ... అన్నింటా మన జీవనంలో ప్రతీ అంశంలో కచ్చితమైన విధానాన్ని జగన్నాథుడు నిర్దేశిస్తాడు. అంతా సమమేనని చెబుతాడు. అందుకే ఆయన అందరివాడుగా ప్రఖ్యాతమయ్యాడు. విశ్వవ్యాప్తంగా ఆరాధ్యుడయ్యాడు. తెలుగు వాకిళ్లలోనూ తెలతెలవారుతూనే 'నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే! సుభద్రా ప్రాణనాథాయ జగన్నాథాయ మంగళమ్!!' అని మంగళ స్తుతి అందుకుంటున్నాడు.

గోపి శ్రీభాష్యం
శ్రీకాకుళం.
80080 01760

వానా... వానా... వెన్నెల వాన!

చినుకు నేలకు దిగే వేళ... ప్రకృతి హరిచాపమవుతుంది. ప్రచండ మార్తాండుని సెగలతో ఉడికిపోయిన లోకమంతా ఊపిరి పీల్చుకుంటుంది. తడారిపోయిన మట్టి తిరిగి జవసత్వాలద్దుకుంటుంది. ప్రాణకోటి కడుపు నింపడం కోసం నవ్వుతూ నాగలి పోట్లను భరిస్తుంది. అరికాళ్లు కాలిపోయే వేడికి భయపడి నాలుగు గోడల మధ్య బందీ అయ్యే బాల్యం... వానా వానా వల్లప్ప అని పాడుకుంటూ ఆనంద నృత్యాలు చేస్తుంది. ఇలా సమస్త మానవాళిని హర్షాతిరేకాల్లో ముంచే వర్షాన్ని వర్ణించని తెలుగు కవులు లేరు. మరీ ముఖ్యంగా ప్రాచీన కావ్యకర్తలైతే వరుణుడికి పోటీగా తమ కలాల నుంచి తీయటి మాటల సోనలనే కురిపించారు.

మహోగ్రంగా ప్రకాశించే భానుడిపై కారుమబ్బులు దండెత్తుతాయి. దినకరుణ్ని నిరుత్తరుణ్ని చేసి నిలువరించేస్తాయి. కడుపులో దాచుకున్న సుధను వసుధకు పంచిపెట్టేందుకు సిద్ధమవుతాయి. అప్పుడే చిన్నగా తుంపర మొదలవుతుంది. నేలపై నుంచి ఆవిరి నింగికెగుస్తుంది. పీడ వదిలిపోయిందనట్లు వృక్షాలు ఆకులను కదిలిస్తూ సంకేతమిస్తాయి. తుంపర జల్లుగా మారుతుంది. జల్లు కుంభవృష్టి అయిపోతుంది. నదులు నిండుతాయి. ఏరులు పొంగుతాయి. క్రమంగా వాన వెలుస్తుంది. మయూరాల నృత్య ప్రదర్శన ప్రారంభమవుతుంది. ఈ సుందరమైన దృశ్యాన్ని 'పారిజాతాపహరణం'లో అద్భుతంగా వర్ణిస్తాడు నంది తిమ్మన. తను ఒక్కడే కాదు... వాన హోరును ప్రతి ప్రబంధ కవీ అక్షరీకరించాడు. ఎందుకంటే, అష్టాదశ వర్ణనల్లో రుతువర్ణన ఒకటి కాబట్టి. ఆముక్తమాల్యద, మనుచరిత్ర, వసుచరిత్ర, కళాపూర్ణోదయం తదితరాలన్నింటిలోనూ వర్షాకాలపు ప్రకృతిని విశదీకరించే పద్యాలున్నాయి. అసలు ఈ ప్రబంధ యుగానికంటే ముందే వానకు తమ రచనలో ప్రాధాన్యమిచ్చారు ఎర్రన లాంటి కవులు. 'హరివంశం' పూర్వభాగం ఏడో ఆశ్వాసంలో జడివాన ఉగ్రరూపం దర్శనమిస్తుంది. పగబట్టి గోవర్ధనగిరిపై ఇంద్రుడు చేయించే దాడిని కళ్లకు కట్టినట్లు వర్ణిస్తాడు ఎర్రన. ఆయన కాలానికే చెందిన దోనయామాత్యుడు... 'సస్యానందము' కావ్యకర్త. జ్యోతిషశాస్త్రాన్ని అనుసరించి ఏయే గ్రహాలు ఏయే స్థానాల్లో ఉన్నప్పుడు వర్షాలు పడతాయో తనీ గ్రంథంలో చెప్పాడు.

పూర్వవాయువులు ప్రభూతంబులై వీచె
బడమట నింద్రచాపంబు దోచె
బరివేషయుక్తమై భానుమండల మొప్పె
మెఱపు లుత్తరదిశ మెఱవ దొడగె
దక్షిణగాములై తనరె మేఘంబులు
జలచరానీకంబు సంతసించె
జాతకంబుల పిపాసలు కడపల జేరె
గాంతారవపహ్నుల గర్వమడగె

తూర్పు నుంచి పెనుగాలులు వీచాయి. పశ్చిమాన ఇంద్రధనుస్సు వెలసి ఆకాశన్నంతా ఆక్రమించింది. ఉత్తరంలో మెరుపులు ప్రారంభమయ్యాయి. మేఘాలు దక్షిణం వైపు పరిగెడుతున్నాయి. వర్షం కురవబోతోందని తెలిసి ప్రాణులన్నీ సంతోషిస్తున్నాయి. భూమిలో ఉన్న వేడికి గర్వం అణగిపోయింది. పోతనామాత్యుడు భాగవతంలో చెప్పిన పద్యమిది. వాన ఆనవాళ్లను ఎంత చక్కగా చెప్పాడో కదా.

భూమిపై ఉన్న నీరు ఆవిరవుతుంది. దాంతో ఆకాశంలో మేఘాలేర్పడి వర్షాలు కురుస్తాయి. చిన్నతనంలో వైజ్ఞానిక శాస్త్ర పాఠ్యగ్రంథాల్లో ఈ విషయాన్ని చదువుకున్నాం. దీని గురించి శతాబ్దాల కిందటే చెప్పాడు పోతన. చూడండి...

నిజకరాళి వలన నీరజబంధుండు
దొల్లి పుచ్చుకొనిన తోయమెల్ల
మరల నిచ్చుచుండె మహి కర్షకానంద
కందమైన వాన కందు వందు

ఎండాకాలంలో అతివేడిని పుట్టించి... తాను తోడుకున్న నీటినంతటిని మళ్లీ భువికి పంపుతున్నాడు రవి. ఇది చూసిన అన్నదాతలందరూ ఆనందభరితులవుతున్నారు. కవి కాలాన్ని దాటి చూడగలడనడానికి నిదర్శనమిదే.

చెలువుడు ప్రావుట్కాలుడు
పొలసిన బులకించు భూమి పులకములనగా
మొలచి తలలెత్తి నిక్కుచు
సలలితగతి జాలువారె సస్యము లధిపా!

మేఘం గర్జించినప్పుడు భూమి పులకరిస్తుంది. విత్తనాలు మొలకలెత్తి దినదినాభివృద్ధి చెందుతాయి. చక్కగా పంటలు పండుతాయి. అంతకంటే కావల్సిందేంటి! పోతన అక్షరసేద్యం అమూల్యం.

భువన విజయ నిర్మాత శ్రీకృష్ణదేవరాయలు కృతిభర్తగానే కాదు కృతికర్తగా కూడా రాణించిన మహనీయుడు. తన 'ఆముక్తమాల్యద'లో వానజల్లుల్లోని తేడాలు చెబుతాడు.

ఎలగోలు జల్లు ముస్పెళపెళ నేటవా
ల్పడి గాలినట్టిండ్ల దడిపి చనగ;
నట్టెతో వడగండ్ల కట్టావుల దుమార
మావుల రేచి రెండవదియు జన
మఱి మూడవది నిల్చి మెఱసి బిట్టుఱిమి శీ
కరవారి సృష్టి జీకటిగ నలను
నుయ్యేల చేరుల యోజబైపై వెండి
జల్లుపై జల్లు పెల్లలు కొనగ
భూభిదాపాదది దుర్భరాంభోభరంపు
వడిమరుజ్ఝంఝ దెరలక కడవ వంచి
నట్లు హోరని దారౌఘమైక్య మొంది
విన్ను మిన్నును నొకటిగా వృష్టి బలపె

ముందు ఏటవాలుగా జల్లు మొదలవుతుంది. వెచ్చని పొగలతో ధూళి రేపుతూ రెండో జల్లు కొడుతుంది. తర్వాత జల్లుతో లోకం కాస్త మసకబారుతుంది. తర్వాత వచ్చే వానతో ఝుంఝూమారుతాలు కలుస్తాయి. భూమిని ఆకాశాన్ని కలుపుతూ ఒకే ధారలా వృష్టి విస్తరిస్తుంది. ఎంత ప్రకృతి పరిశీలన! ఈ వాన అల్పజీవులకు ఆనందం పంచుతోందని మరోచోట చమత్కారంగా చెబుతాడు రాయలు.

కాకోదరా హితుల వ
ల్మీకంబుల దూర్చె మెఱసి మేఘుం, డని గుం
పై కనగొని పొగడెనన్
భేక ధ్వనులెసగె వృత్త భేదానుకృతిన్

మేఘాల గర్జనలు విని పాములు భయంతో పుట్టల్లోకి పారిపోయాయట. అది చూసి కప్పలు సంతోషంతో గట్టిగా శబ్దాలు చేస్తున్నాయట.

'నదీనాం సాగరో గతిః' దీన్ని వర్ణించడంలో రాయలు చక్కని ఉపమానాన్ని ప్రయోగించాడు.

పెళపెళ మబ్బు బిట్టురుచు, భీతి విదూర
శిలాంకురచ్ఛటో
త్పులకిని యై ప్రియున్నిదురవోవుహరి
న్వడి గౌగిలింపగా
దలరి ధరిత్రి సాచుగఱు దాలుపుగేల్లన
గంకణంపు మ్రో
తలబులు దేల వండు పయిదాల్చి నదుల్వెస
జొచ్చెవారిధిన్

వరుణుడి ఉగ్రరూపానికి భయపడిన భూదేవి తన భర్త విష్ణువును కౌగిలించుకున్నట్లు నదులు వెళ్లి సముద్రంలో కలుస్తున్నాయట!

ప్రాణికోటికి ఎంత ఆధారభూతమైనదైనా... వానపడేటప్పుడు కూడా కొన్ని ఇబ్బందులు తప్పవు. అవేంటో కూడా రాయలే చెప్పాడు.

రవి జూచి కుడుచు వారలకును గ్రుకలాస
ములకును దృష్టి మిన్నులనె నిలిచె
సంధ్యార్ఘ్యదాయి ద్విజశ్రేణికిలుసేరు
మొదవులకును భ్రాంతి మది జనించె
హలజీవి సందోహములకు బలాకికా
విసరంబులకు మంచి వెదలు దొరకె
నెలమి బొల్పగు యూధికలకు సంతలకూట
ములకును మతివిచ్చు మొగ్గలొదవె
నతిథి సంఘంబునకు నీనినట్టి యెనుప
కదుపు లేగల గమికి వాకట్టు లెసగె
మంటి మిద్దెల వారికి మరుపనులకు
నెలత బాసిన వారికి నిదుర చెడియె

సూర్యుణ్ని చూశాకే భోజనం చేసేవారికి పస్తులు తప్పట్లేదు. త్రికాల సంధ్యావందనం చేసే వారికి భాస్కరుడు కనిపించట్లేదు. ప్రయాణికులు వర్షంలో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. సంచార జీవనం సాగించేవారికి తినడానికి ఏమీ దొరకట్లేదు. చలికి తట్టుకోలేక లేగ దూడల దవడలు మూసుకుపోయాయి. దాంతో అవి పాలు తాగలేకపోతున్నాయి. వానదేవుడి ప్రతాపానికి తమ మట్టిళ్లు కూలిపోతాయేమోనని భయపడుతున్నారు కొందరు... సన్నివేశాలను కళ్లకు కట్టించే శక్తి రాయల అక్షరాలకే సాధ్యం.

వాన కష్టాలను జిగిబిగి అల్లికల అల్లసాని పెద్దన కూడా ఏకరవు పెట్టాడు. 'మనుచరిత్ర'లోని ఈ పద్యం దీనికి సాక్ష్యం.

వండనలయదు వేవురు వచ్చిరేని
అన్నపూర్ణకు నుద్దియౌ అతని గృహిణి
అతిథులేతర నడికిరేయైన పెట్టు
వలయు భోజ్యంబు లింట నవ్వారి కాగ

ఇంటికి వచ్చిన అతిథులందరికీ

అర్థం గాలికి వదలకు

పదముల గారడి చేయకు
పదపదమని తోసితోసి పలుకకు పలుకుల్
నదివోలిక సృజియింపుము
మదిలో ఏ అడ్డులేక మధుర కవితలన్.

అర్థము గాలికి వదలకు
వ్యర్థ పదమ్ములను కుప్పవలె పోయకుమా!
సార్థక రచనలనీయుము
అర్థించెడి పాఠకాళి ఆనందింపన్

రాసిని చూడకు కవితల
వాసిగనున్నట్టి చిన్న వచనంబైనన్
త్రాసున బరువై నిలుచును
భాసిల్లును మంచి కవిత పదికాలమ్ముల్

నన్నయలున్నారిప్పుడు
చిన్నయ్యలు ఊరికొకరు సిరులై నిలువన్
మిన్నుల వెలిగెడి తారల
విన్నాణము తీరు తెలుగు వీధి వెలుంగున్

కవితలు రాయుము తెలుగున
భువిలో నసమాన దీప్తి పొంగులువారన్
సువచన పద్యము గేయము
నవనవభావాళి యెదుట నర్తన సేయన్.

- అయాచితం నటేశ్వర శర్మ
కామారెడ్డి, నిజామాబాద్
94404 68557

అన్నపూర్ణలా ఆకలి తీర్చేది ప్రవరుని భార్య. అయితే, వర్షాకాలంలో మాత్రం వారికి భోజనాలు పెట్టేందుకు ఇబ్బందిపడేదట. వంట చేయడానికి నిప్పు దొరికేది కాదట. ఇంటింటికి వెళ్లి అడిగితే ఎక్కడో లభించేదట. దానికి కొంచెం గడ్డి తీసి విసిరితే అంటుకునేది. కానీ, ఆ మాత్రపు సెగతో పదార్థాలు ఉడికేవి కాదు. ఉడికినా పొగ వాసన వచ్చేవట!

అలాగే, స్వరోచి వేటకు వెళ్లిన సందర్భంలో పడే వర్షాన్ని శబ్ద చమత్కారాలతో వర్ణిస్తాడు పెద్దన.

కరకాచి పటరవభీ
కరమై పెళ పెళ నినాద ఘనమై ఝుంఝూ
మరుదుజ్ఝితబిలమంద్ర
స్వరమై యక్కొండ నొక్క వర్షము గురిసెన్

భయంకరమైన శబ్దాలతో ఉద్ధృతంగా కురుస్తున్న వానను వర్ణిస్తూ 'కళాపూర్ణోదయం'లో పింగళి సూరన చెప్పిన ఈ పద్యం లోకప్రసిద్ధం.

మిగుల జగంబు బెగ్గడిల మించె దదుద్ధత వృష్టి యుద్భుతం
బగుచు ఘనా ఘనౌ ఘనసముదగ్ర నిరర్గళ ఘుర్ఘురార్భటీ
లగన ఘనోచ్ఛలజ్జల ఝుళంఝుళ నిర్ఝర జర్ఝరీభవ
న్నగ విగళచ్ఛిలాగణ ఘుణం ఘుణ ఘోషణ భీషణంబుగన్

'ఆర్భటీ' అనే పద ప్రయోగంతో వర్ష ఉద్ధృతిని వివరించాడు కవి. వాన ధాటికి శాలీనుడు తోటలో చిక్కుబడిపోయినప్పుడు... సుగాత్రి వ్యధ చెందే సందర్భంలో వచ్చే అక్షరాల కూర్పు ఇది.

అష్టదిగ్గజాల్లో ఒకరైన అయ్యలరాజ రామభద్రుడు... తన 'రామాభ్యుదయం'లో వర్షానికి ప్రబంధాలకు పోలిక చెబుతాడు

ధారాశుద్ధి ప్రసిద్ధిగాంచి ఘనశబ్ద స్ఫూర్తి వర్ధిల్లగా
దోరంబైన రసస్థితిన్ దరళ విద్యున్మాలికా లక్షణో
దారంబై కవిసేవ్య మౌవన మయూరారూఢి బ్రాపించి వ
ర్షా రంభంబు ప్రబంధ మట్లఖిల పద్యాక్రాంత మయ్యెందగన్

ప్రబంధాల్లో ధార వర్షంలా సాగిపోవాలి. మేఘగర్జనల్లా మంచి శబ్దాలు వినిపించాలి. నవరసాలొలికిస్తూ మయూరాల నృత్యమంత అందంగా రచన ఉండాలి. మన ప్రబంధాలు అలా ఉన్నాయి కాబట్టే కాలానికి అతీతంగా నిలిచాయి.

దీపముడుగ జీకటియును
గోపముడుగ శాంత గుణము గోల్కను క్రియనా
టో పోద్భటమగు వేసవి
కైపు సలడిల దోచెగారు కాలము దళమై

తెనాలి రామకృష్ణుడు వానరాకలో వేదాంతాన్ని దర్శించాడు. దీపం ఆరినప్పుడు చీకటి కమ్ముకున్నట్లు, కోపం పోయాక శాంతం వచ్చినట్లు గ్రీష్మం వెళ్లాక వర్షరుతువు వచ్చిందంటాడు తన పాండురంగ మాహాత్మ్యంలో. అయితే, అదే కవి 'ఘటికాచల మాహాత్మ్యం'లో వేరే ఉపమానాన్ని ప్రయోగిస్తాడు. 'ఆకాశమనే మర్రి చెట్టు నుంచి భూమిలోకి పాతుకు పోయిన ఊడల్లా వర్ష ధారలు దర్శనమిస్తున్నా'యని చెబుతాడు.

అలాగే, మరోచోట వడగళ్ల గురించి చెబుతూ జీర్ణమవ్వని ఆహారాన్ని వాంతి చేసుకున్నట్లుందని అంటాడు తన సహజధోరణిలో. వడగళ్లను రాయలు... 'మేఘాలు తెల్లని మణుల్ని కక్కుతున్నాయ'ంటూ వర్ణిస్తాడు. 'కవికర్ణ రసాయనం'లో నృసింహ కవి వడగళ్లను 'హంసీ గర్భదండ పిండ ఖండములని' అన్నాడు. అంటే, మేఘగర్జనల శబ్దానికి హంసలు భయపడి... తినే తినే తామరతూడులను విడిచిపెట్టాయట! ఈ వడగళ్లు ఆ తామరతూళ్లలా ఉన్నాయట!

ఇలా ఎందరో కవులు... వర్షపు జల్లుల్లో తడిసి ముద్దయ్యారు. వానాకాలపు మట్టివాసనలను ఆస్వాదించారు. తమ అనుభూతులను అక్షరాల్లోకి అనువదించి తెలుగు వారందరి చేత ఆస్వాదింపజేశారు.

- తెలుగు వెలుగు బృందం

తెలుగుకు 'పొగ'బండి



ప్రయాణికులకు విజ్ఞప్తి...

రైల్వే స్టేషన్లోకి అడుగుపెట్టగానే వినిపించే తెలుగు మాట ఇది. బాగుంది. టిక్కెట్టు తీసుకుని రైలెక్కుతాం. అక్కడ తెలుగు కనిపిస్తుందా? ఏవో కొన్ని రైళ్లలో తప్ప 'సూచన'లేవీ తెలుగులో ఉండవు. కావాలంటే... సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడిచే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌ను చూడండి. ఆంగ్లం, హిందీలు మాత్రమే ఉంటాయి. తెలుగేం పాపం చేసుకుంది? తెలుగు నేలపై తిరగాడే రైల్లో తెలుగు ఉండక్కర్లేదా?

దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే జోన్లన్నింటిలో హిందీనే వినియోగించడానికి కారణం... అది జాతీయ భాష. కొందరు చేసే వాదన ఇది. అది శుద్ధ తప్పు. హిందీ మన జాతీయ భాష కాదు. కాదంటే కాదు. అధికార భాష మాత్రమే. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 343... హిందీకి ఇచ్చిన హోదా అదే. గుజరాత్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా మూడేళ్ల కిందట ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. మన దేశానికి జాతీయ భాష అంటూ ఏదీ లేదని! దీని అర్థమేంటి? కేంద్ర స్థాయిలో హిందీకి, రాష్ట్రాల పరిధిలో స్థానిక భాషలకే పట్టం కట్టాలని కదా! మరెందుకు దక్షిణమధ్యరైల్వే (ద.మ.రై. - ప్రధాన కార్యాలయం సికింద్రాబాద్) తెలుగును పక్కనబెట్టేసి తెలుగు ప్రయాణికుల నెత్తిన హిందీని రుద్దుతోంది?

ద.మ.రై.లో 'రాజభాషా విభాగం' అని ఒకటుంది. అది హిందీ కోసం మాత్రమే పని చేస్తుంటుంది. రైల్వే ఉద్యోగుల్లో హిందీ పరిజ్ఞానాన్ని పెంచడం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తుంటుంది. ఇందుకు గానూ హైదరాబాద్, కాజీపేట, డోర్నకల్, భద్రాచలం, రామగుండం, బెల్లంపల్లి, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో హిందీ గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. హిందీ ప్రచారం కోసం చేసిన ఇతరేతర కృషికిగానూ... రైల్వేమంత్రి ఇచ్చే 'రాజభాషా బహుమతి' ఈ ఏడాది దక్షిణ మధ్య రైల్వేనే వరించింది. చూడండి... ఈ దురవస్థను! ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక ప్రాంతాన్ని, కర్ణాటక, మహారాష్ట్రల్లోని కొన్ని ప్రాంతాలకు సంబంధించిన ద.మ.రై.కు హిందీ బహుమతి!!! మరి ఈ రాష్ట్రాల స్థానిక భాషల పరిస్థితేంటి? ఆయా ప్రాంతాల్లో అవే రాజభాషలు కదా. వాటిని ప్రోత్సహించే బాధ్యతను రైల్వేలెందుకు స్వీకరించవు? ప్రోత్సాహం సంగతి తర్వాత... స్థానిక ప్రయాణికులకు స్థానిక భాషల్లోనే సూచనలందివ్వాలన్న కనీస తెలివిడి ఎందుకు ప్రదర్శించట్లేదు?

నాలుగైదు దశాబ్దాల కిందట సికింద్రాబాద్ రైల్వే డివిజను... దక్షిణ రైల్వేలో భాగంగా ఉండేది. అప్పట్లో రైలు నిలయం (ఇప్పటి ద.మ.రై. ప్రధాన కార్యాలయం)తో సహా అన్నిచోట్లా తమిళమే అధికార భాషగా చెలామణీ అయ్యేదట! ఈ విషయాన్ని ఇప్పటికీ పెద్దలు చెబుతుంటారు. ప్రస్తుతం మనకు ప్రత్యేకమైన రైల్వే జోన్ ఉంది. అయినా... తెలుగు కనిపించట్లేదు. ఆనాటి తమిళం స్థానాన్ని హిందీ (ఆంగ్లం కూడా) ఆక్రమించింది. ఈ పరిస్థితి మారాలి. మన రాష్ట్రంలో తిరిగే, రాష్ట్రం గుండా వెళ్లే ప్రతి రైలులోనూ తెలుగు కనిపించాలి. దాని కోసం మనందరం పట్టుబట్టాలి. కొత్తగా నిర్మితమవుతున్న హైదరాబాద్ మెట్రోలో కూడా తెలుగుకే అగ్రతాంబూలం ఇవ్వాలి.

చివరగా... మన అధికార యంత్రాంగం నేర్చుకోవాల్సిన విషయం ఒకటుంది. దాన్ని ఎమిరేట్స్ విమానాల్లో దుబాయి - హైదరాబాద్ మధ్య ప్రయాణించిన వారు గమనించే ఉంటారు. ఆ విమానాల్లోని మెనూ కార్డుల్లో అరబిక్, ఆంగ్లంతో పాటు తెలుగు అక్షరాలు కూడా తళుక్కుమంటాయి. 'షాంపేన్ మినహాయించి, అందించే అన్ని పానీయాలు ఉచితమైనవే', 'తరిగిన కీరదోసకాయ, ఉల్లిపాయలతో...' ఇలా ప్రతి విషయం గురించి తెలుగులో సమాచారమిస్తుంది ఆ కార్డు. ఎక్కడో సముద్రాలకవతల ఉన్న వారు స్థానిక భాషల ప్రాధాన్యతను గుర్తించారు. అదీ స్వచ్ఛందంగా! మరి మనవాళ్లు ఆ పని చేయలేరా! చేయకపోతే... మనం చేయించలేమా!

– సత్తి లలితారెడ్డి,
హైదరాబాద్. 94926 41252

అస్పృశ్యతపై కవితాస్త్రం

"నాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్రహృదయంబు గూడ కొంతవసరంబు"
[illegible]
చెప్పే శైలితో ప్రజాజీవితాన్ని చైతన్యవంతం చేయాలని ప్రయత్నించారు మహాకవి గుర్రం జాషువా. ప్రజల యోగక్షేమాలు కోరుకున్నప్పుడే కవి సమాజసేవ చేసినవాడవుతాడు. అప్పుడే అతని రచన లోకానికి [illegible] నూటికి నూరుపాళ్లూ ఈ కార్యాన్ని సాధించింది. ఆయన స్పృశించిన ప్రతి అంశం హృదయం లోతుల్లో నుంచి పెల్లుబుకి వచ్చిన సజీవ భావలహరి అయ్యింది. సమాజ హితమే పరమావధిగా సాగిన జాషువా కవితా శక్తికి అస్పృశ్యతాంశమే ప్రధానమైంది.

"జీవితం నాకెన్నో పాఠాలు నేర్పింది. నా గురువులిద్దరు.. పేదరికం, కులమత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండోది నాలో ఎదిరించే శక్తిని పెంచిందే కానీ బానిసగా మాత్రం మార్చ లేదు. దారిద్ర్యాన్ని, కులభేదాన్ని చీల్చి వేరు మనిషిగా నిరూపించు కోదలచాను. వాటిపై కత్తికట్టాను, అయితే నా కత్తి.. కవిత నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపైనే ద్వేషం" అని తన భావాలను సూటిగా వెల్లడించారు జాషువా!

నివాసం, విద్య, జీవించే పద్ధతుల్లో రాజ్యమేలుతున్న వివక్ష బాల్యంలోనే జాషువాను కదిలించి, రగిలించింది. పిల్లల ఆటల్లో పొరపాటున వైశ్యబాలుడిని తాకి చెంపదెబ్బ తినడం మొదలు.. బళ్లో ప్రత్యేక బెంచీలు, నీళ్ల కుండలు... చెట్ల కింద చదువు, నేల మీద రాతలు ఇలా జాషువా బాల్యాన్ని అల్లకల్లోలం చేసిన అంశాలెన్నో...!

చెళ్లుమనిపించుకున్న చెంప కంటే, జరిగిందంతా విన్న కన్నతల్లి అనునయింపు మాటలతో... గుండె పదింతలు మండింది. ఆ మాన్యురాలిచ్చిన సమాధానాన్ని కవి తర్వాత ఇలా వివరించారు.

ఏడిచి చెప్పితిన్ విసయమెల్లన నా జనయిత్రి ఎత్తిము
ద్దాడుచు నాయనా ఇది భయంకర దేశము వర్ణభేదముల్
గూడులు కట్టుకొన్న ఒనగూడదు పంచమజాతివారికిన్
గూడు హుళక్కి మానవతగూడ హుళక్కి హుళక్కి జన్మమున్

భయంకర దేశమని, తరతరాలుగా వర్ణభేదాలు గూడుకట్టుకు న్నందు వల్ల కూడు లేదు సరికదా అసలు మానవతే లేదు, అసలా మాటకొస్తే జన్మేలేదు పొమ్మని తన తల్లిచే పలికించిన జాషువా భావ తీవ్రతను ఈ పద్యంలో అర్థం చేసుకోవచ్చు. హిందువుల దూషణలు, తృణీకారాలు జాషువాపై బలమైన ప్రభావాన్నే చూపాయి. బహుకళావల్లభుడైన గుర్రం జాషువా.... 'వాచకత్వం, చిత్రలేఖనం, నేత్రావధాన'కళలను పక్కకు నెట్టి అస్పృశ్యతా నివారణా సాధనంగా ఆయుధంగా కవిత్వాన్ని ఎంచుకున్నాడు. భాషాజ్ఞానాభివృద్ధి కోసం తొలుత పురాణేతిహాసాల పఠనం ప్రారంభించారు. జాషువా హిందువైపోతున్నాడంటూ ఇటు క్రైస్తవులు, అంటరానివాడు శాస్త్రాలు చదవటమేమిటని అటు హిందువులు ఏకకాలంలో గగ్గోలు పెట్టడంతో జాషువా పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఆఖరికి "కవితలల్లిన అంటరానివాడిని నరికినా సమంజసమే"నని పురాణేతిహాసాలు ఘోషిస్తున్నాయంటూ తన అక్కసునంతా వెళ్లగక్కాడో పూజారి. ఆ వైనాన్ని జాషువా ఇలా చెప్పుకొచ్చారు.

తెరిపారా నన్ను దిలకించి మాటల
నడుమ లలిత కళల గొడవదెచ్చి
పృథివిసురులు దక్క నితరజాతులు కైత
లల్లరాదు నేరమండ్రు బుధులు

దీని తర్వాత కూడా జాషువాను పరాభవాలు అనుసరిస్తూనే ఉన్నాయి. అంటరానితనం దెబ్బలతో రాటుదేలిన జాషువా హృదయం క్రమేపీ తిరుగుబాటు స్వభావాన్ని అలవర్చుకుంది. ఎదురుదెబ్బలను తట్టుకొని నిబ్బరమబ్బిన గుండె నిఖిలలోకాన్నైనా

ఎదిరించి నిలదొక్కుకోగలుగుతుందనడానికి ఈ కవిత చక్కటి ఉదాహరణ.

కులమతాలు గీచుకున్న గీతల జొచ్చి
పంజరాన గట్టువడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన, నాకు
తిరుగులేదు విశ్వనరుడ నేను

అయితే విశ్వనరుడిగా కవి కోకిల తనను తాను భావించుకున్నా అలా జీవనం కొనసాగించడం అతి దుర్లభం. కులచట్రంలోంచి బైటకొచ్చి ఇతరుల ప్రతిభను గుర్తించగలిగే స్థాయి ఇంకా అలవరచుకోలేని పరిస్థితి అప్పటి సమాజానిది. అయితే, ఫలితం ఏదైనా, ఎలాంటిదైనా.. అసమానత, అన్యాయం, అమానుషత్వం ఆయన వ్యధిత హృదయాన్ని కదిలించేవి, కలం తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోయేది.

శ్వాసించే గాలిగా హేళన, వెన్నంటే నీడగా విమర్శ జాషువాను ఎల్లవేళలా అనుసరించే ఉండేవి. అయితే విమర్శకు ప్రతి విమర్శ చేయడం జాషువా తత్వం కాదు. విమర్శకుల నోరు చప్పున మూయించేంత అందంగా ఆయన కవితాధాటి ఉండేది.

ఒకనాడొక నిండు సభలో జాషువాను మరొక కవి విమర్శలతో తూలనాడినప్పుడు...

గవ్వకు సాటిరానిది పలుగాకులు లోకు
లసూయచేత న
న్నెవ్విధి దూరినన్ నను వరించిన శారద
లేచిపోవునే
ఇవ్వసుధాస్థలిన్ పొడమరే రసలుబ్ధులు
గంటమూనెదెన్
రవ్వలు రాల్చెదన్ గరగరల్ సవరించెద
నాంధ్ర వాణికిన్

అంటూ బదులిచ్చి విమర్శకులకు తగిన జవాబిచ్చారు ఆ నవయుగ కవి చక్రవర్తి. అయితే ఆయన తన కవితా శరాలను ఎక్కుపెట్టి వదిలినా ఆ ఆవేశం వెనుక నొచ్చుకున్న హృదయాక్రోశం వెయ్యి గొంతుకలతో అరచి ఆయన కలాన్ని పరుగులు పెట్టించేది. తన పరిస్థితిని వాస్తవ దృక్పథంతో ఆలోచించి హృదయాన్ని తేలికపరుచుకునే యథార్థవాది జాషువా. ఆయన వ్యక్తిత్వాన్ని ఇనుమడింపజేసి, మానవతా విలువలను పెంచింది ఈ

జాగ్రత్త సుమా!

సాహిత్యమంటే కల్పిత కథలు, వర్ణనలు అని అనుకుంటాం. కానీ సాహిత్యమంటే అవి మాత్రమే కాదు. కావ్యంలో అంతర్లీనంగా ఎన్నో సూక్తులు ఇమిడి ఉంటాయి. అలాంటివి మన తెలుగు సాహిత్యంలో కోకొల్లలు. దీనికి ఓ 'మెచ్చుతునక' ఇది...

మనలో ప్రతి ఒక్కరికీ చిన్నదో, పెద్దదో లక్ష్యం ఉంటుంది. ఉండాలి కూడా. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే సరైన మార్గంలో శ్రమించాల్సిందే. ఈ లక్ష్యం చేరుకునే మార్గంలో పయనిస్తున్నప్పుడు ఎన్నో ఆకర్షణలు మనల్ని లోబర్చుకునేందుకు దారి పొడవునా పొంచి ఉంటాయి. ఇలాంటి వాటికి లోను కావద్దని కవి కోకిల, మధుర శ్రీనాథ గుర్రం జాషువా 'గబ్బిలం' కావ్యంలో ఒక చక్కని పద్యాన్ని చెప్పారు. 'గబ్బిలం' సందేశ కావ్యం. భారతదేశంలో తరతరాలుగా వేళ్లూనుకున్న అంటరానితనం గురించి విశ్వనాథుడికి వివరించి, పరిష్కారం పొందేందుకు కైలాస యానానికి 'గబ్బిలా'న్ని నియోగిస్తాడు కవి. కులవ్యవస్థ వల్ల తలెత్తిన పరిస్థితులను వివరించి, కైలాసానికి వెళ్లే గబ్బిలానికి ఉత్సాహం కలిగించేందుకు దేశ చరిత్రను వర్ణిస్తాడు. అలా తమిళనాడులోని తంజావూరుకు దక్షిణంగా ఉన్న ప్రదేశం నుంచి మొదలైన ప్రయాణం హిమాలయాల దాకా సాగుతుంది.

హిమాలయాల ప్రకృతి సౌందర్యానికి పరవశించి 'గబ్బిలం' తాను వెళ్లిన పని నుంచి దారి తప్పే అవకాశముందని గ్రహించిన కవి ఇలా చెబుతాడు...

రేగిన గంధపుందరు పరీమళముంగొని
మోసపోయి అం
దాగి పదంబు మోపవలదచ్చట కొమ్మల
నాశ్రయించి మి
న్నాగులు తాండవించు మరణంబును పుక్కిట
బట్టి యాపదల్
దాగిన తావులే వలపులం దొనికించి మనస్సు
నీడ్చెడిన్

నువ్వు కైలాస యానంలో భాగంగా హిమాలయాల్లో గంధపు చెట్ల పరిమళానికి ఆకర్షితురాలివై దారి తప్పుతావేమో! కానీ గంధపు చెట్లను ఆశ్రయించి మరణాన్ని పుక్కిట పట్టాయా అన్నట్లుండే మిన్నాగులు తాండవమాడుతుంటాయి. ఆపదలు పొంచి ఉన్న ప్రదేశాలే మనల్ని విపరీతంగా ఆకర్షిస్తాయి. దాంతో మోసపోయి దారితప్పుతాం. చేయాల్సిన పని మరచిపోతాం... అని దీని భావం.

నిజానికి హిమాలయాల్లో గంధపు చెట్లు ఉండవు. శివుడికి సందేశాన్ని చేరవేసే క్రమంలో దారి తప్పొద్దని గబ్బిలానికి, కావ్యం ద్వారా సమాజానికి గొప్ప సందేశం ఇచ్చేందుకు కావాల్సిన వాతావరణాన్ని కవి సృష్టించాడు.

మనం కూడా జీవన యానంలో ఎన్నో ఆకర్షణలు, వ్యసనాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అలాంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

- చింతలపల్లి హర్షవర్ధన్
హైదరాబాద్ 80085 51841

లక్షణమే! తన కవిత్వాన్ని పొగిడి తన కులం తెలిశాక చివ్వున లేచిపోయిన ఓ కవి పుంగవుడి వాలకం తననెంత వ్యథకు గురిచేసిందో వెంకటగిరి రాజావారికి జాషువా ఈ కవిత ద్వారా విన్నవించుకున్నారు.

నా కవితావధూటి వదనంబు నెగాదిగ జూచి రూపురే
ఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళీ! యన్నవాడె మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర, వచింప సిగ్గగున్

కష్టించి, కవిత్వంపై పట్టు సాధించి సంఘ విధానాలపై కవితాస్త్రాలను సంధిస్తున్నా ఏ మాత్రం చలించని అంటరానితనమనే

జ్ఞాపకం

ఇది నీ జ్ఞాపకం
మరి ఇంకేదీ జ్ఞాపకముండదు.
నీ జ్ఞాపక మొక్కటే నాకు
జ్ఞాపకం.
మిగిలిన సంగతులన్నీ
రాయి విసిరినప్పుడు
విస్తరిస్తూ సాగిన
నీటి వలయాల్లా నెమ్మదిగా
దూరమౌతాయి.

నేను చేస్తున్న ప్రతి పనిలో
నేను చూస్తున్న ప్రతి బింబంలో
నా ప్రతిబింబంలో ఎక్కడైనా, ఎప్పుడైనా
కన్పించేది నీ జ్ఞాపకమే.
అది నీ జ్ఞాపకం
నేను దాచుకున్న ఒకే ఒక్క జ్ఞాపకం
ఈ క్షణం నీ జ్ఞాపకం
ఈ రోజు నీ జ్ఞాపకం
ఈ జ్ఞాపకమే - నీ జ్ఞాపకమే - నా జీవితం

- కల్యాణదుర్గం స్వర్ణలత
కర్నూలు

జాడ్యం జాషువా కలాన్ని నిలువరించే ప్రయత్నం నిరంతరాయంగా చేస్తూనే ఉంది. తలవంచని ఆత్మగౌరవం, వెనక్కు తగ్గని గుండె నిబ్బరం ఆయనను కవితాసాగరాన్ని ఎదురీదేలా చేశాయి. తత్ఫలితంగా వెలువడిన కావ్యమే "గబ్బిలం". ఆ కావ్యం జాషువా ఆంతరంగిక క్షోభకు నిలువుటద్దం. ఆ కావ్యంలోని ప్రతి అక్షరం ఆవేదనాభరితం.

ఆ ఖండకావ్యంలో వస్తు ఎంపిక జాషువా మనోవ్యథకు అద్దం పడుతుంది. కాళిదాసు మేఘాలతో ప్రియురాలికి సందేశం పంపితే, ఈ కావ్యంలో గబ్బిలంతో శివునికి సందేశం పంపించి ప్రత్యేకతను చాటుకున్నారు జాషువా. తరతరాలుగా నరనరాల్లో జీర్ణించిన కులభేదాలను కూకటివేళ్లతో పెళ్లగించాలనే కవి ప్రయత్నం గబ్బిలం కావ్యంలో కనిపిస్తుంది.

ఆ కావ్యంలో...

కసరి బుసగొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు!

అని చతుర్వర్ణాలను విషపూరిత సర్పంగా వర్ణించి, కులవ్యవస్థ ప్రమాద తీవ్రతను తెలియజెప్పే ప్రయత్నం చేశారు. జాషువా గబ్బిలంలో నివేదన పుణ్యక్షేత్రాలన్నింటినీ వర్ణించి వాటి నిర్మాణంలో దళితుల పాత్ర ఉందని చెప్పి ఆలయాల్లో దళితుల ప్రవేశ నిషేధాన్ని నిలదీశారు. అంటరానివారిపై కొనసాగే సామాజిక వివక్ష, దౌర్జన్యాలన్నీ గతజన్మలో వారు చేసిన పాపఫలమనే కర్మసిద్ధాంతాన్ని, దాని ప్రామాణికతను గబ్బిలం కావ్యంలో జాషువా ఎండగట్టారు.

గబ్బిలం ఎలాగైతే అశుభసూచకమై అటు జంతువు, ఇటు పక్షి కాకుండా ఉంటుందో, అంటరాని మనిషి కూడా సమాజంలో మనిషిగానే పుట్టినప్పటికీ మనిషి హోదా పొందటం లేదనేది జాషువా భావన.

పైగా కథానాయకుడిని అవివాహితుడిగా చిత్రించడం, కుల బహిష్కృతుడిగా ఉంటూ పెళ్లి చేసుకోవడమెందుకనే అతని ఉద్దేశాన్ని తేటతెల్లం చేస్తుంది.

గబ్బిలం నివేదనలో... జాషువా మనోవేదనకు అద్దం పట్టే ఒక పద్యం ఇలా సాగుతుంది.

కర్మ సిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థలోలురు నాభుక్తి ననుభవింత్రు
కర్మమననేమొ దానికీ కక్షయేమొ
ఈశ్వరుని చేత రుజువు చేయించవమ్మ

గబ్బిలం కావ్యం జాషువా కవిని లబ్ధప్రతిష్ఠుడిగా, సంస్కరణాభిలాషగల ఎదురీతగాడిగా నిలబెట్టింది. ఆచంద్ర తారార్కం నిలువగల సాహిత్యాన్ని సృష్టించిన నవయుగ కవి చక్రవర్తిగా జాషువా కీర్తి దేశం నలుచెరుగులా వ్యాపించేలా చేసింది. మహాకవి జాషువా తన జీవితప్రస్థానాన్ని సత్యనిష్ఠతో సాగించారు. ఒక ప్రత్యామ్నాయ కవితామార్గాన్ని నిర్మించి లోకకల్యాణానికి దోహదకారి అయ్యారు జాషువా. కాబట్టే ఆయన కవిత్వం సార్థకమైంది.

జాషువా వ్యక్తిత్వం రెండింటిలో హుందాతనం ప్రతిఫలిస్తుంది. నిండు ఆరోగ్యంతో తిరుగాడినప్పటి హుందాతనం మాట పడిపోయి మంచం పట్టినప్పుడు కూడా ఆయన్ను వీడలేదు. "కవి గారూ ఎలా ఉన్నారు?" అని అడిగినప్పుడు జవాబుగా మాట పెగలని పరిస్థితిలో సైతం. మీసం మీద చెయ్యేసి మెలితిప్పిన గడసరి కవితా విశారద గుర్రం జాషువా..

రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజల నాలుకలయందు

అంతటి గొప్ప వ్యక్తిత్వం, ఆత్మగౌరవం కలిగిన కవి జాషువా. అందుకే ఇప్పటికీ మన ఆలోచనల్లో కదలాడుతున్నారు.

తెలుగు వెలుగు బృందం

ఆహ్వానం

ఏదైనా శుభకార్యానికి ఇలాంటి సృజనాత్మక ఆహ్వానాన్ని మీరూ రూపొందిస్తే... దాన్ని మాకు [illegible] అయి ఉండాలన్నవి నిబంధనలు.

మన పెళ్లి ముచ్చట్లు!

వడియాలు అడిగితేనూ వగలమారి పెద్దవదినె
వడియాలు లేవని కడియాలు తిప్పసాగె...

వియ్యాల వారి హాస్యం తెలుగు పాటగా మారిన పెళ్లింటి సంబరం.

పచ్చని పసుపు కాళ్లకు పూసి
వెండి మట్టెలు వేళ్లకు బెట్టి...
[illegible]
పట్టెడంతా గుండెలోన పట్టరాని బాధతో
పుట్టినింటిని వదలలేక ఎట్టకేలకు వస్తువులతో...

[illegible] ఇవే కాదు... జీలకర్ర - బెల్లం, మాంగల్యధారణ, బ్రహ్మముడి, [illegible] దర్శనమిచ్చింది. ఎక్కడంటే... ఓ అరుదైన పెళ్లిపుస్తకంలో! [illegible] పుస్తకం అది. తమ ఇంటిలో జరుగుతున్న వివాహానికి [illegible] నుంచి అప్పగింతల వరకూ పెళ్లికి సంబంధించిన ప్రతి దశను [illegible] ఆ పొత్తంలో ప్రచురించారు. ఈ ఏడాది మేలో జరిగిన వాళ్ల అబ్బాయి శ్రీధర్ పెళ్లి సందర్భంగా వారీ చక్కటి ప్రయోగం [illegible] ఇలాంటి ప్రయత్నాలు దోహదపడతాయి.

ఏడు తరాలు నీడ

ఉత్తమ సాహిత్యం ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతిని, రచనకు చెందిన స్థలకాలాల్ని ప్రతిబింబిస్తూనే ప్రపంచంలోని అందరినీ కదిలించగల అంశాలు తనలో దాచుకుంటుంది. అందుకే వాటి అనువాదాలు చదివితే ఆ భాషీయుల విలక్షణ సంస్కృతి అవగాహన కావడమే కాక మానవాళిని అన్నదమ్ముల్ని చేసే వెతలు, ఆనందాలు కూడా అనుభవానికి వస్తాయి. తెలుగు భాషను పరిపుష్టం చేసేందుకు ఎందరో ప్రఖ్యాత కవులు, రచయితలు అనువాద ప్రక్రియను చేపట్టి తమని ప్రభావితం చేసిన, తమకు నచ్చిన పుస్తకాల్ని తెలుగు పాఠకులతో పంచుకున్నారు. దాశరథి కృష్ణమాచార్యులు, దాశరథి రంగాచార్యులు, తిరుమల రామచంద్ర, శ్రీశ్రీ వంటి వారెందరో అలా తమకు అభినివేశం ఉన్న భాషలో సాహిత్యాన్నో, తమను ప్రభావితం చేసిన సిద్ధాంతానికి చెందిన రచనల్నో అనువదించారు. ఇలా ప్రసిద్ధ రచయితలు అనువదించిన రచనలే కాక అనువాదాల వల్లనే ప్రసిద్ధులైన రచయితలు కూడా ఉన్నారు. వారిలో ముందు వినిపించే పేరు సహవాసి. ఆయన ఆంగ్లం నుంచి సంక్షిప్తీకరించి, అనువదించిన నవలే 'ఏడు తరాలు'. అమెరికా చరిత్రలో చీకటి కోణాల్ని ఆర్ద్రంగా స్పృశిస్తూ అలెక్స్ హేలీ రాసిన 'రూట్స్'కు ఇది అనువాదం.

ప్రపంచం ఒక కుగ్రామమైపోయిందని చెప్పుకున్నా మౌలికంగా మనిషి తన జాతి, తన భాష, తన వంశం, తన చరిత్ర వంటి వాటిలో తన ఉనికిని గుర్తించుకుంటాడు. తన భాషలోని అద్భుత సాహిత్యాన్నీ, తన జాతివారు చేసిన ఆవిష్కరణల్ని తన ఆస్తిగా గర్విస్తాడు. తమ వారు గతంలో సాధించిన విజయాలకు పులకిస్తాడు. తన జాతి అనుభవించిన కష్టాలకు తాదాత్మ్యత చెంది కన్నీరు పెడతాడు. తాను ఏ జాతివాణ్నో, తమ వారు ఎక్కణ్నుంచి వచ్చారో తెలియని వారి బాధ వర్ణనాతీతం. ఆ బాధను మాన్పించేందుకు తమ ఆఫ్రికన్ మూలాల్లోకి అమెరికన్ రచయిత అలెక్స్ హేలీ చేసిన అన్వేషణే ఈ నవల.

ఇది పూర్తిగా కల్పిత గాథ కాదు. హేలీ నిజ జీవితంలో తన వంశపు మూలాలపై

చేసిన లోతైన పరిశోధనకు అక్షరరూపం. ఈ నవల ఆంగ్లంలో విడుదలైనపుడు పెను సంచలనాలు సృష్టించింది. హేలీకి పురస్కారాలు పండించింది. టీవీలో ధారావాహికగా, వెండితెరపై చలనచిత్రంగా చిత్రీకరించారు. ఈ నవలను నల్లజాతి ప్రజలు తాము అనుభవించిన అణచివేతకు, తమ ఆత్మగౌరవానికి ప్రతీకగా దాచుకుంటే, తెల్లవారు గతంలో జరిగిన తప్పులకు పశ్చాత్తాపంగా చదివారు. మొత్తానికి ఆఫ్రికన్ అమెరికన్లలో ఓ పవిత్రగ్రంథం స్థాయి గౌరవం పొందిందీ నవల.

1750లో ఉత్తర ఆఫ్రికాలో గాంబియా తీర గ్రామమైన జఫర్‌లో కింటో, రెబ్బాలకు కొడుకు కుంటా పుట్టడంతో కథ ప్రారంభమౌతుంది. డేవిడ్ అబ్రహాంలు మూల పురుషులుగా ఇస్లాం మతంగా వస్తున్న పురాతన తెగ మాండికోకు చెందినవారు వాళ్లు. ఆఫ్రికాలోని ప్రకృతి సౌందర్యాన్నీ దానిలో మమేకమై జీవించే ఆ తెగవారిని, వారి వింత సంప్రదాయాలను ఎంతో చక్కగా చిత్రిస్తారు రచయిత. ముఖ్యంగా కుర్రాళ్లకు పూర్తిస్థాయి పురుషులై తెగను రక్షించుకునేందుకు అడవిలోకి పంపి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వంటివి వింతగా ఉంటాయి.

ఆ పురాతన నాగరికతలో 16 ఏళ్లు పెరుగుతాడు కుంటా. పురుషత్వ శిక్షణ ముగించుకుని పొలానికి కావలిగా పడుకొని భవిష్యత్తులో వైవాహిక జీవనం గురించి మధురమైన కలలు కంటాడు. తర్వాత రోజు ఉదయాన్నే తమ్ముడికి డప్పు చేసేందుకు మంచి కలప కోసం అడవికి వెళ్లిన కుంటా తెల్లదొరలకు దొరికిపోతాడు. వేటకుక్కలతో, మారణాయుధాలతో వేటాడి ఉచ్చువేసి పట్టుకుంటారు. మనుషులను ఎత్తుకుపోయే తెల్ల గెద్దం వారి గురించి, వారి నుంచి వచ్చే చచ్చిన కోడి వాసన వంటి ఎన్నో జాగ్రత్తలు గతంలోనే తండ్రి చెప్పినా పొరపాటున ఆదమరచి ఉన్న సమయంలో దొరికిపోతాడు. కొట్టి, కొట్టి స్పృహ తప్పేలా చేసి తీసుకుపోతారు వారు.

అక్కడితో అతని జీవితంలో స్వేచ్ఛ అంతరించి ఘోరమైన బానిసత్వం ఉదయిస్తుంది. వందలాదిమంది నల్లవారిని బానిసలుగా పట్టుకుని అమెరికా తరలిస్తున్న ఓడలోకి కుంటాని సంకెళ్లతో చేరుస్తారు. అక్కడ డెక్‌పైనున్న బానిసలను అందర్నీ వివస్త్రలను చేసి, ఎదిరించినవారిని హింస్తారు. నల్లజాతి స్త్రీలపై ఘోరమైన అత్యాచారాలు చేస్తుంటారు. బానిసగా గుర్తుకోసం కాల్చిన ఇనుపకడ్డీతో ముద్రవేస్తారు. అనంతరం ఎక్కడో ఓడ అడుగు భాగంలో సంకెళ్లతో కట్టిపడేస్తారు. ఆ చీకటి గుయ్యారంలో గాయాలైన పుళ్లు, తమ మలమూత్రాల మధ్య ఘోరమైన ప్రయాణం అనంతరం అమెరికాలో దిగుతాడు కుంటా. అతని శరీరాన్ని, అవయవాల పటుత్వాన్ని పరీక్షించుకుని ఓ తెల్ల భూస్వామి కొనుక్కుంటాడు.

కుంటా నిరంతరం ఆ కూపం నుంచి

తప్పించుకుని పారిపోయే ప్రయత్నాలు చేస్తుంటాడు. ప్రతి ప్రయత్నం విఫలమౌతుంది. ఓమారు తప్పించుకుని దొరికిపోయిన బానిసల్ని పట్టుకునే తెల్లవాడు శిక్షించదలిచి జననాంగాన్నో, పాదాన్నో ఒకటే ఎంచుకోమని గొడ్డలి ఎత్తి సైగ చేస్తాడు. ఏ పురుషుడూ సృష్టి చేసే శక్తిని వదులుకో కూడదన్న తమ తెగ సంప్రదాయం మేల్కొంటుంది. కుంటా మర్మావయవాన్ని కప్పుకుంటాడు. పాదాన్ని తెల్లవాడు నరికేస్తాడు. ఇక తప్పించుకునే అవకాశం లేదని తెలుసుకుని బానిస బతుకుతో సమాధానపడతాడు కుంటా. తోటి బానిస స్త్రీ బెల్‌ను పెళ్లి చేసుకుంటాడు. వారికి కిజ్జీ అనే కూతురు పుడుతుంది.

పరిస్థితులు ఇలా ఉన్నా కుంటాకి తన తెగ సంప్రదాయాలు, మత విశ్వాసాల పట్ల అపారమైన నమ్మకం ఉంటుంది. చావడానికైనా సిద్ధపడతాడు కానీ వాటిని భంగపరిచేందుకు ఇష్టపడడు. అయితే ఆ ఘోరమైన పరిస్థితుల్లో తన భాషలో మాట్లాడటం, మతాచారాలు పాటించడం లాంటివి నిషేధం. అయినా రహస్యంగా అవి సాగిస్తూనే ఉంటాడు. కుంటా తన సంప్రదాయాల ప్రకారమే తన కూతురు కిజ్జీని పెంచుతాడు. తన మాతృభాషలోని కొన్ని పదాలు నేర్పుతుంటాడు. తన కథ అంతా చెప్తాడు. అంతే కాదు రాబోయే తరాలకూ ఈ కథ చెప్పాలని కోరతాడు.

ఆ తర్వాత కథలో కిజ్జీ, ఆమె వారసులు పడే దారుణమైన అవమానాలూ, బాధలూ ఉంటాయి. కుంటా తర్వాత తరాల వారు అంతర్యుద్ధం అనంతరం అందరు బానిసల్లాగానే విముక్తి పొందుతారు. వివక్ష అనుభవిస్తారు. ఇన్నింటి నడుమా కుంటా వంశీకుల్లో అతని కథ పరంపరానుగతంగా అన్ని తరాలకూ వస్తూంటుంది. అలా కుంటాకి ఏడో తరం వాడైన రచయిత అలెక్స్ హేలీకి కూడా తెలుస్తుంది. అతను ఆ కథను ఆధారంగా చేసుకుని తన మూలాల్ని అన్వేషిస్తాడు. పదేళ్ల దీక్షగా బానిసల వివరాలు, వారిని తీసుకొచ్చిన ఓడల రాకపోకలు నమోదైన పురాతన ప్రభుత్వ పత్రాలను అమెరికా దక్షిణ ప్రాంతంలోని గ్రంథాలయాల్లో పరిశోధించి వివరాలు సేకరించాడు. చివరకు తన ముత్తాత పుట్టిపెరిగిన ఉత్తర ఆఫ్రికా ప్రాంతాన్నీ, అక్కడ నదిని చూస్తాడు. కుంటా కథలోని పదాల ఆధారంగా అతను పుట్టిపెరిగిన ఊరికి చేరతాడు. అక్కడ మాండికో తెగవారు కంఠస్థం చేసి వినిపించే వంశవృక్షంలో తప్పిపోయిన వ్యక్తిగా కుంటా కింటో పేరు విని ఆనందం, ఉద్వేగం ముప్పిరిగొని చలించిపోతాడు. ఈ సన్నివేశం చదువుతూ కంటతడి పెట్టుకోని మనిషి ఉండడు. కుంటా కథని వినిపించి, తమ బంధువులను కలుసుకోవడంతో ముగుస్తుంది కథ.

'సహవాసి' కలం పేరుతో ప్రసిద్ధులైన జంపాల ఉమామహేశ్వరరావు అనువదించిన ఈ నవల తెలుగు అనువాద రంగంలో బాగా పేరుపొందిన పుస్తకం. ఒక పక్క నవల రాసిన స్థల కాలాల స్పర్శ అందిస్తూనే, మరోపక్క నేరుగా తెలుగులో వచ్చిన నవలే చదువుతున్నామనిపించే అనువాద శైలి సహవాసిది. 'రక్తాశ్రువులూ, తిరస్కృతులూ, విముక్తి' వంటి ఎన్నో నవలలను అనువదించి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిన చిర యశస్వి సహవాసి.

హేలీ ఈ రచన విషయంలో విమర్శలను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కుంటా కింటేనే టోబీ (బానిస

పేరుగా రికార్డుల్లో దొరికింది) అనడానికి ఉన్న ఆధారాలు చాలా బలహీనమైనవని కొందరు విమర్శించారు. అవే ఆయన రచనకు విలువ పెంచాయి. ఇంత శ్రమకోర్చిన ఆయన మూలాలను తెలుసుకోలేరని భావించాల్సి వస్తే ఆ వేళ్లకు పట్టిన బానిసత్వమనే పురుగు ఎంత లోతుగా చొచ్చుకుపోయిందో ఊహించుకోవచ్చు. బానిసల కష్టాలు, అవమానాలు, బానిస స్త్రీలపై లైంగిక హింస వంటివి కలచివేస్తాయి. ఇక సాంస్కృతికంగానూ అణచివేసేందుకు బానిసల పూర్వ మతాచారాలు అనుసరించకూడదనీ, మాతృభాషలో మాట్లాడకూడదనీ నిషేధిస్తారు. చివరకు బానిసల పేర్లు కూడా మార్చేస్తారు. వేలాది ఎకరాల్లో పత్తిని పండించేందుకు లక్షలాది బానిసల జీవితాలు బుగ్గిపాలు చేసిన దౌర్భాగ్యకరమైన చరిత్రకి ఈ నవల ప్రత్యక్ష సాక్ష్యం. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఈ నవల ఎలాంటివారికైనా హృదయాన్ని కల్లోల పరచి మానవత్వాన్ని మేల్కొలుపుతుంది.

ఆంగ్లభాషకూ, పాశ్చాత్య నాగరికతకూ పట్టం కట్టి తమంత తాముగా స్వచ్ఛంద సాంస్కృతిక బానిసత్వంలో ఇరుక్కున్న తెలుగువారు తప్పక చదవాల్సిన నవల ఇది.

సూరంపూడి పవన్ సంతోష్
తాడేపల్లిగూడెం
96406 56411

చందమామ రావా

రామా లాలీ... మేఘశ్యామా లాలీ...
తామరస నయనా దశరథ తనయా లాలీ...

కమ్మని లాలి పాటలు, హాయిగా వినిపించే జోలపాటలు అమ్మల నోటి నుంచి జాలువారే అమృత ధారలు... వింటూనే మానవ జీవనయానం ఆరంభమవుతోంది. పొత్తిళ్ల నుంచి వార్ధక్యం వరకూ జీవితపు ప్రతి దశలోనూ ఒక భాగంగా కలిసిపోయిన పాటలు... ఇప్పుడు క్రమంగా కనుమరుగైపోతున్నాయి.

"జోల పాడు కృష్ణ, జోకొట్టు రంగా...
నిద్రపో బలభద్ర రాము తమ్ముడవు...
జో... లాలీ"



జీర్ణం... జీర్ణం...
వాతాపి జీర్ణం

పొత్తిళ్లలోని బిడ్డ
తాగిన పాలు
చకచకా
అరగాలి...
త్వర
త్వరగా ఆ
పాప ఎదగాలి. దీన్నే పాట రూపంలోకి మార్చిపాడే వారు ఆనాటి అమ్మలు.

జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
గుర్రాలు తిన్న గుగ్గిళ్లరిగి
ఏనుగులు తిన్న ఎలక్కాయలరిగి
అర్జునుడు తిన్న అరటిపళ్లరిగి
భీముడు తిన్న కజ్జాలరిగి
అబ్బాయి తాగిన పాలు ఆముదమరిగి
పండల్లే పాప, కుండల్లే కూర్చొని
నందల్లే నడిచి, గుర్రమంత పరుగు
ఏనుగంత సత్తువ ఉండేటట్టు
సాకుమీ ఈ బిడ్డను సంజీవరాయా!

"చిట్టి చిట్టీ రావే... శ్రీలక్ష్మి రావే...
ఆదిలక్ష్మి రావే... అమ్మాయితో ఆడ...
జో... లాలీ"

అంటూ గది మధ్యలో చీరెతో కట్టిన ఉయ్యాల ఊపుతూ జోల పాడి నిద్రబుచ్చే వారొకప్పుడు. అంతేనా!

బిడ్డకు ఆకాశంలో చందమామని చూపిస్తూ...

"చందమామ రావే... జాబిల్లి రావే...
కొండెక్కి రావే... గోగు పూలు తేవే...
బండెక్కి రావే... బంతి పూలు తేవే...
తేరు మీద రావే... తేనె, పాలు తేవే...
అన్నిటినీ తేవే... అమ్మాయి కీయవే..."

అని మురిపిస్తూ గోరుముద్దలు తినిపించేవారు.

కాళ్లమీద బిడ్డని బోర్లా పడుకోబెట్టుకుని కాళ్లని నెమ్మదిగా పైకి మడుస్తూ, కొద్దిగా వెనక్కి వాలి....

"ఉయ్యాల... జంపాల...
కొండెక్కి... జామెక్కి...
సిరిమువ్వ... చిట్టితల్లి..."

అంటూ కాళ్లని ఊపుతుంటే పిల్లలు కిలకిలలాడే వారు. తల్లులకి ఈ ఆటా-పాటా ఒక వ్యాయామంగా పొట్ట తగ్గడానికి ఉపయోగపడేది.

పిల్లల్ని కాళ్లు జాపమని వారి చేతులతో కాళ్లు తడుతూ "కాళ్లా గజ్జే... కంకాళమ్మ..." పాడేవారు. ఆ పాటలో 'పెట్టు' అన్న పదం ఏ కాలును తడుతున్నపుడు వచ్చిందో ఆ కాలు మడిపించి, మళ్లీ పాట పాడుతూ కాళ్లు తట్టడం మొదలెట్టేవారు. ఇప్పటికీ



పాటే మందు!

మన పాటల్లో అద్భుతమైన ఔషధ రహస్యాలున్నాయి. కావాలంటే 'గచ్చకాయలాట'లో పాడే ఈ పాటను చూడండి...

కొండమీద ఎండిగిన్నె
కొక్కిరాయి కాలిరిగె
దానికేమి మందు?
యాపాకు సేదు
ఎల్లుల్లి గడ్డ
నూనెలో మడ్డి
నూటొక్కసారి
పూయవోయ్ నూరి
పూటకొక్కతూరి!

బూచోడొత్తున్నాడు!

నువ్వింతే ఏడిస్తే బూచోడెత్తుకుపోతాడు! పిల్లల ఏడుపును ఆపడానికి తెలుగింట అమ్మలు సరదాగా చెప్పే మాట ఇది. పాటలోంచి పుట్టిన పలుకు ఇది.

అడుగో బూచోడు
మన అటక మీదున్నాడు
ఏడుస్తే వాడు నిన్నెత్తుకుపోతాడు
మిట్ల గుడ్డివాడు
పొణకంత పొట్టివాడు
మన తట్టలో దాగున్నాడు
జడపట్టుకు లాగుతాడు
నోరు చూపుతాడు
పలు కోరలు చూపుతాడు
నీ ఆరడి విన్నాడూ
ఈసారి ఊరుకోడు

పెద్దవారికి ఈ పాట గుర్తుండే ఉంటుంది.

అలాగే, చేతి వేళ్లని చూపించి నేలమీద ఆన్చి, వేళ్లని తడుతూ "చిట్ల పొట్లకాయ, సీమ చింతకాయ, బళ్ల బచ్చలికూర" అని పాడుతూ వేళ్లు మడిపించే ఆట కూడా ఉండేది.

కొంచెం పెద్ద వాళ్లయిన తర్వాత ఆడ, మగ పిల్లలందరూ కలసి ఇంటి ఆవరణలో దాగుడు మూతలు ఆడేవారు.

"దాగుడు మూతా దండా కోర్,
పిల్లీ వచ్చే, ఎలుకా... హుష్,
ఎక్కడి దొంగలక్కడే గప్ చిప్"

అంటూ కళ్లకు గంతలు కట్టుకుని చేసే సందడికి అంతుండేది కాదు. క్రమంగా మగపిల్లలు చెడుగుడులు, చెరువుల్లో ఈతలు వంటి ఆటల్లో మునిగి పాటకు దూరమయ్యేవారు. కానీ, ఆడపిల్లలకు ఆటా... పాటా... కలిసే ఉండేవి. ఇద్దరు లేదా ముగ్గురు కలిసి చేతులు గట్టిగా పట్టుకుని గుండ్రంగా తిరిగే 'ఒప్పుల కుప్ప'ను పెద్దవాళ్లవరైనా మర్చిపోగలరా!

"ఒప్పుల కుప్ప - వయ్యారి భామ,
చిన్ని మువ్వ - సన్న గాజు,
సన్న బియ్యం - చాయ పప్పు,
కొబ్బరి కోరు - బెల్లం పచ్చు,
గూట్లో రూపాయ్ - నీ మొగుడు సిపాయ్,
రోట్లో తవుడు - నీ మొగుడెవడు?"

అని సిగ్గు పడుతూ, కిలకిల్లాడుతూ, గిరగిరా తిరుగుతున్న ఒకప్పటి ఆడపిల్లల అందం ఇప్పటికీ కళ్ల ముందే కదలాడుతోంది.

"చెమ్మ చెక్క - చేరడేసి మొగ్గ,
అట్లు పొయ్యంగ - ఆరగించంగా,
ముత్యాల చెమ్మచెక్క - ముగ్గులేయంగా,
రత్నాల చెమ్మచెక్క - రంగులేయంగా,
సుబ్బారాయుడి పెళ్లి - చూచి వద్దాం రండి,
మా ఇంట్లో పెళ్లి - మళ్లీ వద్దాం రండి"

ఇద్దరు ఆడపిల్లలు ఎదురెదురుగా నిల్చొని చప్పట్లు చరుస్తూ, చేతులు తాకిస్తూ, అడుగులు ముందుకీ వెనక్కీ వేస్తూ పాడే ఈ 'చెమ్మ చెక్క' పాట ఏమైందిప్పుడు?

రేడియో వచ్చిన తొలి నాళ్లలో చిన్నారుల కోసం మంచి పాటలు వినిపించేవారు.

"ఆటలు ఆడీ, పాటలు పాడీ, అలసి వచ్చానే...
తియ్య తియ్యని తాయిలమేదో తీసిపెట్టమ్మా!
గూటిలోని బెల్లమ్ముక్కా కొంచెం పెట్టమ్మా,
చేటలోని కొబ్బరి కోరు చారెడు తియ్యమ్మా,
అటకా మీది అటుకుల కుండ అమ్మా! దించమ్మా
తియ్య తియ్యని తాయిలమేదో తీసిపెట్టమ్మా!
పిల్లీ పిల్ల కిటికీలోంచి తొంగి చూస్తోంది.
కుక్కాపిల్ల తోకాడిస్తూ గుమ్మం దాటింది.
కడుపులోని కాకిపిల్ల గంతు లేస్తోంది...
తియ్య తియ్యని తాయిలమేదో తీసిపెట్టమ్మా!"

ఈ పాట ఒక ఉదాహరణ మాత్రమే.

ఏవీ...? నేడెక్కడ ఉన్నాయి ఈ మధురమైన భావజాలాలు? పిల్లల సహజ సిద్ధమైన స్వభావ చిత్రణ ఇప్పుడు ఎక్కడ



ఎవరు దొంగ?

గూట్లో దాచిన పప్పులు మాయమయ్యాయట! చెల్లెలే తినేసిందని అన్నగారికి అనుమానం. దాన్ని పాటగా మార్చి ఎంత ముద్దుగా అడుగుతున్నాడో చూద్దామా...

చిట్టిపొట్టి చెల్లెలా
చిట్టి ఎలుక నేస్తమా!
వేరుసెనగ పప్పులన్నీ
ఎట్ల మాయమయ్యెనే
చిట్టీ నీదు వంతు ఎంత?
చిట్టి ఎలుక వంతు ఎంత?



కాపాడు నా తండ్రీ!

ఏడ్చి ఏడ్చి బిడ్డ నిద్దరోతోంది. అమాయకమైన ఆ పసిదాన్ని చల్లగా చూడమని దేవుణ్ని వేడుకుంటుంది తల్లి. అదీ పాట రూపంలో...

ఆయి ఆయి ఆయి ఆపదలు గాయి
చిన్నివాళ్లను గాయి శ్రీవెంకటేశ
గాయి గాయి గాయి యేదమ్మ గాయి
అంగళ్ల ఆడేటి అబ్బాయి గాయి
పోలేరమ్మ పొత్తిళ్ల గాయి
పొత్తిళ్ల నాడేటి అబ్బాయిగాయి

దాక్కుంది...? రాసేవారు లేరా అంటే ఉన్నారు. రాస్తూనే ఉన్నారు. కానీ వాటిని చదివే తీరిక, పాటలుగా పాడే శ్రద్ధ మాత్రం లేవు. అచ్చ తెలుగు అమృతత్వాన్ని అందుకునే సమయం ఇప్పుడెవరికీ లేదు. తల్లిదండ్రులు పని ఒత్తిడిలో, పిల్లలు చదువుల ఒత్తిడిలో మునిగిపోయారు.

ఇంత చక్కని తెలుగుని ఆనందంగా తమ పెద్దల నుంచి నేర్చుకున్న ఈ తరం పెద్దలు... ఆ తెలుగుని తర్వాత తరాలకు అందించే బాధ్యత తీసుకోవాలి. మనుమలు మనుమరాళ్లకు తెలుగుదనం అందించే ప్రయత్నం చేయాలి. పిల్లల సర్వతోముఖాభివృద్ధి ఈ అమృత బంధాల్లోనే ఉందని తెలుసుకోవాలి.

వి.రాధ
విజయవాడ. 90320 44635

జులై సంచికలు మార్కెట్లో ఉన్నాయ్!

అతడు అడవే లోకంగా బతికే ఓ ఆదివాసి. అనుకోని పరిస్థితుల్లో మరణశిక్షకు గురయ్యాడు. అతడు ఆఖరి కోరికగా అధికారులను కోరిందేమిటి? హృదయాల్ని మెలిపెట్టే కథనంతో సాగిన అన్వర్ కమర్ ఉర్దూకథ **ఉరిశిక్ష** చదవండి!

- జ్ఞానపీఠ గ్రహీత యు.ఆర్. అనంతమూర్తి కన్నడ కథ **అమ్మ**
- సుప్రసిద్ధ కథకులు క్రొవ్విడి లింగరాజు **గొప్పోళ్ల న్యాయం** కథకుల ఫైల్‌లో...
- విలక్షణ కథకుడు త్రిపుర తెలుగు కథ **పాము**
- దేవుడి అంతర్యాన్ని విప్పిచెప్పే ఒడిశా కథ **చిట్టా**
- ప్రసిద్ధ సినీ సంగీతదర్శకుడు మాధవపెద్ది సురేష్ **పరామర్శ**
- నవనవోన్మేషం అనిపించే విభిన్న కథలతో, ఆసక్తిని పెంచే ప్రత్యేక శీర్షికలతో మీ ముందుకు వచ్చింది జులై విపుల!

రెండిటికీ సాలు చందా రూ. 280/-



డిగ్రీ చదివే శశి తమకు పాఠాలు చెప్పే అధ్యాపకుడినే ఆరాధించింది. తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టాక అసలు విషయం చెప్పింది. ఇంతకీ ఆమె ప్రేమ ఫలించిందా? జీవితంలో ఆమె ఎలాంటి ఆటుపోట్లు ఎదుర్కొంది? కాలేజీ నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తిగా సాగే జి. ఉమాపతి నవల **శశి** చతురలో!

- జ్ఞానపీఠ గ్రహీత ఇందిరా గోస్వామి అస్సామీ కథ **పాపం**
- కాలాతీతం: మార్సెల్ ప్రూస్ట్ **రిమెంబ్రెన్స్ ఆఫ్ థింగ్స్ పాస్ట్**

ఇంకా..అక్షరధార, చతుర ప్ర.జ., చతురంగం, చతుర ప్రపంచం, వారెవ్వా.. మరెన్నో మీకోసం!

చందా ఆన్‌లైన్ బుకింగ్‌కు డబ్బు పంపినవారు నేరుగా చందా చెల్లించాలనుకున్నవారు దిగువ చిరునామాలో సంప్రదించండి.
మేనేజర్, వసుంధర పబ్లికేషన్స్, ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ హైదరాబాద్-82
email : vipula.chatura@eenadu.net - vipula.chatura@gmail.com
ఫోన్: 040 23318181 Ext: 6441

మాటకట్టు



అడ్డం:

1. రైతు నాగలి పట్టి పొలం దున్నే పని (4)
4. ముత్యంలాగ మెరిసే ఒక నక్షత్రం (2)
5. కావ్యము (2)
7. కోరికను కలిగించేది (3)
8. కోరిక (2)
9. యుగాలలో మూడోది (3)
10. రాత్రి (3)
12. బచ్చలికి తోడు ఒక దుంప (2)
14. కోకకి జతగా స్త్రీ ధరించే వస్త్రం (3)
16. తల (3)
18. వేపచెట్టు కావాలా? ఏ గింజ నాటాలి? (4)
19. నాలుక తెలియచేసేది (2)
20. కూర వండుకునే చిన్న మట్టి పాత్ర - వరకు (2)
21. భర్త - ఒప్పిదమైన (3)
23. పసందైన తీయని తొనలనిచ్చే ఫలం (3)
25. హిమాలయం తిరగబడింది (3)
27. బంధుత్వం (2)
28. నుదురు (3)
30. జలము (2)
31. ఓ మోటారు వాహనం (2)
33. పత్రికలకు వార్తలు పంపే వ్యక్తి అటునుంచి (4)
35. లక్ష్యం (2)
36. విష్ణువు (2)
37. మరోలా బంధం (2)
38. జలుబు (4)

నిలువు:

1. ఒంటరి (3)
2. సుగ్రీవ సతి (2)
3. రామునికి సాయం చేసిన సేన (3)
4. యజమాని (2)
5. దయ (2)
6. మాటల్లో తికమక పెట్టే మెలిక (4)
8. తృప్తి (3)
9. పన్నెండో తిథి (3)
11. కీటకాలు తొందరగా నేల మీద పాకే విధం (4)
13. ఇరవై ఒక్క అక్షరాల పాదం కలిగిన పద్య ఛందస్సు (5)
15. 5 నిలువు లాంటిదే (3)
17. నాలుక (3)
18. కృష్ణా తీరంలోని ఒక పుణ్యక్షేత్రం - నారాయణ తీర్థుల వారి అత్తవారి గ్రామం (3)
22. బుద్ధి - మదికి ప్రకృతి (2)
23. వజ్రాయుధం (2)
24. కొలను (3)
26. ...లో ఓహోజగమే ఊగెనుగా - తడబడిన మైకం (3)
27. నవారులో వీరు కాదు (2)
29. ఒక నాణెం - పగిలిన గిన్నెలకు అతుకులు వేసేది (3)
30. నావి కాదు (2)
31. బల్లెం వంటి ఒక ఆయుధం (3)
32. మనసులోని ఆలోచన (2)
34. జింక (2)
35. దేవాలయం (2)

ఆధారాలు

7

ద్విభాష్యం కామరాజు
చంద్రేడు, తూర్పు గోదావరి
95506 07675

సమాధానాలు 65లో...

చెప్పుకోండి చూద్దాం!

పాట పాడుగాని ప్రాణంబు మరిసున్న
మాటలాడుగాని మరయు లేదు
గాలి భుక్తి అయ్యె గాలించి మరిచూడ
దీని భావమేమి తిరుమలేశ

అడవిలో అక్కమ్మ తల విరబోసుకుంది

చుక్... చుక్... బండి!

పొగబళ్లు కొత్తగా వచ్చిన కాలమది. ఆనాడు సామాన్యులకు వాటిలో ప్రవేశం లేదు. ఆ రైళ్లను, అవి విడిచిపెట్టే పొగను చూసిన... వాటి కూతలను విన్న జానపదులు ఓ పాట కట్టుకున్నారు. అప్పటికి వారికి ఆశ్చర్యంగా అనిపించిన విషయాలకు కాస్త కల్పన జోడించి పాడుకున్నారు.

అందమైన ఆ జానపద గీతం...
బండీరా పొగ బండీరా - అది దొరలెక్కే బండీరా
ఒంపూ సొంపుల బాటరా - అది మైనా సుందర బాటరా
ఏగాలేసిన దానిపైనా - కోగీలాడుతుందీ రా
ఆడా కూతా లేసేరా - అది ఈడా కూతా లేసేరా
నీలగిరీ సంతలోనా - నిలిచి కూతా లేసేరా
పుంగనూరి పేటాలోనా - పిలిచీ కూతా లేసేరా

చరమాంకం



ఆ రోజు వాహ్యాళికి వెళ్లినప్పుడు నా మిత్రుడు రామదాసు కనిపించి "శంకరం, రాఘవ గురించి విన్నావా? వాడికి ఒంట్లో బాగోలేదట. గొంతులో ఏదో సమస్య వచ్చిందట. వాడిక మాట్లాడలేడట. నిన్ననే ఫోన్ చేసి 'ఇంక నేను నాటకాలు వెయ్యడం కుదరదురా' అంటూ ఏడుస్తూ చెప్పాడు" అన్నాడు.

ఆ మాటలు విని ఆశ్చర్యపోయాను. రాఘవకి ఒంట్లో బాగోలేకపోవడమా?! అదీ గొంతులో.... చిన్నప్పుడు వాడు పద్యం పాడితే రెండు మైళ్ల దాకా వినిపించేది. అంత పెద్ద గళం వాడిది. అన్న పానాదులు లేకపోయినా బతకగలడు కానీ నాటకాలు లేకపోతే ఉండలేడు... అసలు నాటకాన్నీ, వాడినీ వేరు చేసి చూడలేం. నేను ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నన్నాళ్లూ ప్రతీ నెలా వాడిని చూడటానికి మా ఊరు వెళ్లేవాణ్ని. కానీ రెండేళ్ల క్రితం పదవీ విరమణ చేసిన తరువాత అలా కుదరటం లేదు. ఆలోచనల్లోంచి బయటపడి "వాడికి ఫర్వాలేదు కదరా?" అని అడిగాను రామదాసుని.

"చికిత్స చేస్తే మాటరాకపోయినా ప్రాణభయం ఉండదని వైద్యులు చెప్పారట. కానీ అందుకు ఆరేడు లక్షల దాకా ఖర్చవుతుందట. నువ్వు వస్తానంటే రేపే వెళ్లి వాడినోసారి చూసొద్దాం. ఎంతైనా వాడు మన చిన్ననాటి స్నేహితుడు... పుట్టెడు కష్టంలో ఉన్నాడు. ఇలాంటి పరిస్థితిలో వాడిని పరామర్శించడం మన విధ్యుక్త ధర్మం" అన్నాడు రామదాసు.

"తప్పకుండా... రేపు మొదటి బస్సుకే వెళ్దాం. నువ్వు తిన్నగా బస్టాండ్‌కి వచ్చెయ్" అని వాడితో చెప్పి ఇంటికెళ్లిపోయాను.

ఇంటికి వెళ్లానే గానీ నా మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది. ఎలా ఉండేవాడు రాఘవ! ఆరడుగుల విగ్రహం, ఆజానుబాహుడు, స్ఫురద్రూపి. నాటకంలో ఏ పాత్ర వేసినా అందులోకి పరకాయ ప్రవేశం చేసేవాడు. అటువంటి వాడికి ఏమిటీ విషమ పరీక్ష... అని నా మనసు బాధపడింది.

ఆ సమయంలో రాఘవతో మేం గడిపిన బాల్యం గుర్తుకొచ్చింది. నా ఆలోచనలు నలభై ఏళ్లు వెనక్కెళ్లాయి. గతం కళ్లముందు కదలాడుతోంది.

మాది ఏటి ఒడ్డున ఉండే ఓ అగ్రహారం. చిన్నప్పట్నుంచీ నేను, రాఘవ, రామదాసు ప్రాణ స్నేహితులం. ముగ్గురం బళ్లో ఒక దగ్గరే కూర్చునేవాళ్లం. రామదాసుకి చదువు కన్నా సినిమాలంటే పిచ్చి. ఇక రాఘవదో ప్రత్యేక లోకం. వాడికి నాటకాలంటే ప్రాణం. వాడు ఆరో తరగతి కొచ్చేసరికి 'శ్రీకృష్ణ రాయబారం' ఘట్టంలోని పద్యాలన్నీ కంఠస్థం చేశాడు. ముఖ్యంగా 'చెల్లియో చెల్లకో' పద్యాన్ని షణ్ముఖి ఆంజనేయరాజు పెద్ద రాగంతో ఎలా పాడేవాడో, పీసపాటి రాగం లేకుండా ఎలా పాడతాడో రెండూ తనే పాడి వినిపించేవాడు.

మేము సాయంత్రం పూట ఏటి ఒడ్డున కబడ్డీ ఆడుకునేందుకు వెళ్లినప్పుడు పద్య కచేరీ మొదలు పెట్టేవాడు. ఊళ్లోని రైతులైతే వాణ్ని అడిగి మరీ హరిశ్చంద్ర



నాటకంలోని 'భక్త యోగ పదన్యాసి వారణాసి' పద్యాన్ని రోజూ పాడించుకునేవారు. వాడికి నాటకాల మీద అంతమోజు కలగడానికి కారణం మా ఊళ్లోని రామారావు మాస్టారు. ఆయన నిజానికి హార్మోనిస్టు. నాటకాలంటే ఉత్సాహం చూపించే ఎవ్వరికైనా ఆయన పద్యాలను నేర్పేవాడు. అలా ఎన్నో నాటక సమాజాలను తయారు చేశాడు. చిన్న పిల్లలతో బాల నాటక మండలిని స్థాపించి వాళ్ల చేత 'కురుక్షేత్రం' నాటకాన్ని ఎన్నోమార్లు ప్రదర్శింపజేశాడు. ఆయనిల్లు ఎప్పుడూ రంగస్థలంలా ఉండేది. ఉదయం ఏడు నుంచి రాత్రి పదిదాకా అక్కడ హార్మోనియం విరామం లేకుండా మోగుతూనే ఉండేది. మా రాఘవ కూడా ఆయన దగ్గరే అయిదో తరగతి నుంచీ పద్యాలు నేర్చుకోవడం మొదలెట్టాడు.

రాఘవది అలుపెరుగని, జీరలేని గంభీరమైన గాత్రం. వాడుగానీ పద్యం మొదలెడితే వీధిలో వెళ్తున్నవారు కూడా ఒకసారి ఆగి ఆసాంతం విని మరీ వెళ్లేవారు. కొందరు అసూయపరులు మాత్రం వాడిది బాలగాత్రం అనీ కొన్నాళ్ల తర్వాత అది పోతుందని అనేవాళ్లు.

ఇలా పద్యాల పిచ్చిలో పడి వాడు చదువుని అశ్రద్ధ చేశాడు. శివరాత్రికి మా ప్రాంతంలో ఎక్కువగా నాటకాల ప్రదర్శనలు జరిగేవి. ప్రతి ఊరూ నాటకాల కోసం పోటీలు పడేది. ఒక ఊళ్లో పీసపాటి 'కురుక్షేత్రం' నాటకం జరిగితే ఇంకో ఊళ్లో షణ్ముఖి నాటకం పోటీగా జరిగేది. ఆ తరువాత ఏప్రిల్, మే నెలల్లో వచ్చే గ్రామదేవతల పండుగలకి కూడా నాటక ప్రదర్శన జరిగేది.

మా ఊళ్లో ఏ నాటకాన్ని పెట్టించినా అది అర్ధరాత్రి పన్నెండు గంటలకు గానీ ప్రారంభమయ్యేది కాదు. దాన్ని చూడటానికి వచ్చే వేలాది ప్రజలు త్వరగా మొదలు పెట్టమని గొడవ పెడుతుంటే వాళ్లని సరిదిద్దడానికి మా ఊరి పెద్దలు రాఘవని బ్రహ్మాస్త్రంలా వాడుకునేవారు. రాఘవ తొమ్మిది గంటలకే వేదిక ఎక్కి మళ్లీ నాటకం ప్రారంభమయ్యేదాకా జనాల్ని తన పద్యాలతో కట్టిపడేసేవాడు. వాడు 'జెండాపై కపిరాజు' పద్యం పాడితే కనీసం నాలుగు సార్లైనా ఆ పద్యాన్ని పాడించుకునేవారు.

అలా చిన్నా చితకా ప్రదర్శనలిస్తూ పదోతరగతికొచ్చేసరికి చదువుకి స్వస్తి చెప్పి బాలనాటక కళామండలిలో చేరిపోయి నాటక ప్రదర్శనలివ్వడం మొదలుపెట్టాడు. అప్పట్లో కురుక్షేత్రం నాటకంలో ముగ్గురు కృష్ణులు ఉండేవారు. మొదట కృష్ణుడిది పడక సీను. దాన్ని మొదట్లో రాఘవ వేసేవాడు. ఆ సీన్లో 'బావా ఎప్పుడు వచ్చితీవు సుఖులే భ్రాతల్ చుట్టముల్' పద్యాన్ని చాలా శ్రావ్యంగా పాడేవాడు. ఆ తరువాత రాయబారం సన్నివేశానికి పదోన్నతి పొందాడు. మా ఊరి వాళ్లైతే ప్రతి శివరాత్రికి రాఘవ నాటకాన్ని పెట్టేవారు.

చుట్టు పక్కల గ్రామాల వాళ్లు రాఘవ రాయబారం పద్యాలంటే చెవి కోసుకునేవారు. కొందరైతే కేవలం వాడి పద్యాల కోసమే వచ్చి ఆ సన్నివేశం పూర్తికాగానే వెళ్లిపోయేవారు. అలా జనం గుండెల్లో శ్రీకృష్ణుడిగా ఓ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నాడు.

మొదట్లో శ్రీకృష్ణుడి పాత్రనే ఎక్కువగా వేసిన రాఘవ రానురానూ పీసపాటి, షణ్ముఖి, డి.వి.సుబ్బారావుల ప్రభావంతో హరిశ్చంద్ర, రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం వంటి నాటకాల్లో హరిశ్చంద్రుడు, రాముడు, అర్జునుడు వంటి పాత్రలు కూడా వేయడం మొదలు పెట్టాడు. ఒకసారి గ్రామదేవత పండుగకు పెట్టిన గయోపాఖ్యానం నాటకంలో రాఘవ అర్జునుడిగా వేసి పీసపాటికే ముచ్చెమటలు పట్టించాడు. అప్పట్లో అదో సంచలనం.

ఈలోగా నేను, రామదాసు డిగ్రీలు, బీఈడీలు పూర్తిచేసి ఉపాధ్యాయులుగా స్థిరపడ్డాం. చూస్తుండగానే రాఘవ వామనుడిలా 'ఇంతింతై వటుడింతైనట్లు' మా కళ్లముందే పెద్ద నటుడిగా ఎదిగాడు. ఆ ప్రస్థానం ఎంత దాకా సాగిందంటే ఓ సారి పరిషత్ నాటక ప్రదర్శనల పోటీలో ధర్మవరం కృష్ణమాచార్యులు రాసిన 'చిత్రనళీయం' నాటకంలో నలుని పాత్ర ద్వారా ప్రథమ బహుమతి అందుకున్నాడు. ముఖ్యంగా అందులోని నక్షత్రమాల పద్యాలు అద్భుతంగా పాడి ముఖ్యమంత్రి చేత సన్మానం అందుకున్నాడు. అది రాఘవ నాటక ప్రస్థానంలో ఉచ్ఛదశగా వర్ణించవచ్చు.

అలా వాడి నాటక జీవితం ఉజ్వలంగా వెలుగుతున్న కాలంలో వాడికి మా పక్క ఊరి అమ్మాయి భానుతో పెళ్లైంది. తరువాత వాడికిద్దరు కొడుకులు. బతకలేక బడిపంతులుద్యోగాలు చేసి మేమిద్దరం ఇరవయ్యేళ్లైనా ఒక ఇల్లూ కొనుక్కోలేకపోయాం. కానీ రాఘవ మాత్రం పదేళ్లలోనే ఊళ్లో పదెకరాల పొలం, పట్నంలో రెండిళ్లు కొన్నాడు. పిల్లల్ని బాగా చదివించాడు.

ఇలా కాలచక్రభ్రమణంలో పాతికేళ్లు గడిచాయి. మేం ముగ్గురం అరవయ్యో పడిలో పడ్డాం. అప్పటికే నాటకాలు ఉచ్ఛ దశ నుంచి చలనచిత్రాలు, టీవీల వల్ల తమ ప్రాభవాన్ని కోల్పోవడం మొదలైంది. కొత్తతరం వాళ్లెవరూ నాటకాల మీద మోజు చూపకపోవడంతో నాటకాలు హీనదశకు చేరుకున్నాయి. పల్లెల్లో ఎక్కడ చూసినా నాటకాల స్థానంలో రికార్డింగ్ డాన్సులు, డాన్స్ బేబీ డాన్సులు మొదలయ్యాయి. నాటకాల పతనంతో రాఘవ దశ కూడా మారిపోయింది. అయినా సరే రాఘవ నాటకాలు వేయడం మానలేదు. తన సొంత డబ్బుతో ఒక మండలిని తనే స్థాపించి ఎన్నో ప్రదర్శనలు అడపాదడపా ఇవ్వడం మొదలుపెట్టాడు. దానివల్ల వాడు చాలా డబ్బుని పోగొట్టుకున్నాడు. పదెకరాల పొలం హారతి కర్పూరంలా హరించుకు పోయింది. ఏ నాటకాల ద్వారా అయితే అంత డబ్బుని సంపాదించాడో మళ్లీ అదే నాటకాల వల్ల డబ్బుని పోగొట్టుకున్నాడు. ఇప్పుడు వాడికి పట్నంలోని ఇల్లే మిగిలి ఉంది. కొడుకులిద్దరూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

ఇలా ఉండగా రెండేళ్ల క్రితం రాఘవ భార్య అకస్మాత్తుగా చనిపోయింది. అప్పుడు పరామర్శించడానికి వెళ్లినప్పుడు వాణ్ణి చూసి ఆశ్చర్యపోయాను. స్ఫురద్రూపిలా ఉండేవాడు. ఇప్పుడు అందవిహీనంగా, బక్కచిక్కిపోయాడు. మనిషిలో బాగా మార్పొచ్చింది. ముఖ్యంగా నాటకాల తిరోగమనం వాణ్ని కుంగదీయడంతో అది వాడి ఆరోగ్యంపై ప్రభావం చూపింది. ఆ సమయంలో మమ్మల్నిద్దర్నీ చూసి కంట నీరు పెట్టుకున్నాడు. తన జీవితంలో ఇలాంటి స్థితి వస్తుందని ఊహించలేదని వాపోయాడు. అప్పుడు వాణ్ని ఓదార్చటం మా వల్ల కాలేదు. మళ్లీ ఇన్నాళ్లకు వాడి కబురు తెలిసి తనని చూడటానికి వెళ్లాల్సి వచ్చింది. మేం రాఘవ ఇంటికి వెళ్లేసరికి వాడొక్కడే ఉన్నాడు. కొడుకులిద్దరూ రెండు రోజుల క్రితమే వెళ్లి పోయారన్నాడు. మనిషి బాగా శుష్కించిపోయాడు. మమ్మల్ని చూసి సంతోషించాడు.

"ఎప్పట్నుంచిరా" అడిగాను వాణ్ని.

"ఆరు నెలల క్రితం గొంతులో జీర, బొంగురు పోవడం మొదలవడంతో అనుమానమొచ్చి విశాఖపట్నంలో వైద్యునికి చూపిస్తే అతను పరీక్షలు చేసి స్వర పేటిక బాగా దెబ్బ తిందనీ, దానికి ఎక్కువ శ్రమ ఇస్తే అది ముదిరి కాన్సర్‌గా మారే ప్రమాదముందనీ అందుకని పద్యాలు పాడొద్దనీ చెప్పారు. చికిత్స చేస్తే నయమయ్యే అవకాశం కొద్దిగానే ఉందన్నారు. దానికి ఆరేడు లక్షలు ఖర్చవుతుందనీ చెప్పాడు. ప్రస్తుతం నా దగ్గర అంత డబ్బు లేదు. అవసరమైతే ఇల్లు అమ్మాలి. కానీ కొడుకులిద్దరూ దానికి ఒప్పుకోవటం లేదు" అని కంటనీరు తుడుచుకుంటూ చెప్పాడు. వాడి మాటలు వింటుంటే నాకూ కంటనీరు తిరిగింది.

"అయినా వాటిని మానేయొచ్చు కదరా... నీ ఆరోగ్యం కన్నా అవి ఎక్కువా చెప్పు"? అన్నాను కోపంగా. నా మాటలు విని వాడు చాలా సేపు మౌనంగా ఉన్నాడు. తర్వాత మాటలు మొదలెట్టాడు.

"శంకరం... చిన్నప్పట్నుంచీ ఆ దేవుడు నాకు గొంతునే ఆస్తిగా ఇచ్చాడు. ఆ స్వరమే నాకు వరమనుకునే వాణ్ణి. అదే నాకు పేరునీ, ఆస్తుల్నీ తెచ్చింది. అలాంటిది ఆ గళమే ఇవాళ మూగబోతే నేనెందుకు బతకాలిరా. జీవచ్ఛవంలా ఇలా బతికే కంటే

అక్షరం నా ఊపిరి

విశ్రాంత జీవనంలో
ఒంటరినై విలపిస్తున్నాను...
కాలం కదలడం లేదనిపిస్తోంది
ఎవరైనా 'ఊ' కొడితేచాలు
స్వోత్కర్ష గంటలతరబడి
హితబోధలు విరామంలేకుండా
శ్రోతలే కరవు...
భార్య...
ఊకదంపుడు ఆపమంటుంది
పుత్రరత్నం...
ఛాదస్తం ముదిరిందంటాడు
కోడలు...
చాకిరీకితోడు సోదొకటి...ట..
మనవరాలికి...
తాతమాట తలపోటు...
మనవడికి...
నా పలుకు పరమచిరాకు...
కిం కర్తవ్యం...
నీరసం ఆవహించి
దిగులుగా చూస్తుంటే...
అల్మారాలో పుస్తకం
అభిమానంగా పలకరించింది
స్నేహితునిలా ఆదరించింది
తోడునీడై...
నాలో ఉత్సాహాన్ని నింపింది
అక్షరాల ఆత్మీయ ఆలింగనంతో
మనసులో వ్యథమటుమాయం
పుస్తకపఠనం
వృద్ధాప్యాన్ని
అర్థవంతంగా తీర్చిదిద్దింది...
నేనిప్పుడు కాలాన్ని జయించాను.



- ఇంద్రగంటి నరసింహామూర్తి,
కాకినాడ.

త్వరగా చచ్చిపోతే మంచిదిరా. ఎప్పుడైనా తిండి లేకుండా ఉన్నాను కానీ పద్యం పాడకుండా ఏ రోజూ ఉండలేదు. ఒక కళాకారుడికి ఇంత కంటే ఘోరమైన స్థితి మరొకటి ఉండదురా... ఒరేయ్... మీ ఇద్దరూ నా ప్రాణస్నేహితులు. అదృష్టవశాత్తూ మీరిద్దరూ ఏకాదశి పర్వదినాన వచ్చారు. ఈ రోజు ఇక్కడ 'హరిశ్చంద్ర' నాటకాన్ని వేస్తున్నాం. ఎలాగూ ఎక్కువ కాలం బతకను కాబట్టి చనిపోయేలోగా ఒక్కసారైనా ముఖానికి రంగు వేసుకొని మళ్లీ మన ఊరి వాళ్ల మధ్య పద్యాలు పాడాలని ఉందిరా... నా నాటకాన్ని చూసి వెళ్లండి" అన్నాడు రాఘవ...

ఆ మాటలు నాకు కోపాన్ని తెప్పించాయి. "వైద్యుడు నిన్ను మాట్లాడొద్దంటే, నువ్వు ఏకంగా నాటకాలే వేస్తావుట్రా... నీకేమైనా పిచ్చా" అంటూ కోప్పడ్డాను. అయినా వాడు వినలేదు.

ఆ రోజు రాత్రి హరిశ్చంద్ర నాటకంలో రాఘవ తన విశ్వరూపాన్ని చూపాడు. ముఖ్యంగా శ్మశానఘట్టంలో పద్యాలు ఊరి జనాలకు కంటనీరు తెప్పించాయి. "రాజే కింకరుడగు కింకరుడే రాజగు కాలాను గుణంబుగా" పద్యం చదువుతుంటే ఆ ప్రాంగణమంతా ఈలలతో మారు మోగిపోయింది. ఆ ఆవేశంలో ఆనందంలో పాడుతూ రాగం తీస్తూ రాఘవ ఒక్కసారిగా వేదిక మీద రక్తం కక్కుకుంటూ పడిపోయాడు. జనంలో కలకలం... హుటాహుటిన వాణ్ని ఆస్పత్రికి తీసుకెళ్లాం.

ఆస్పత్రిలో రాఘవ అచేతనంగా పడున్నాడు. వైద్యులు అతను ఎక్కువ సమయం బతకడనీ కొడుకులకు కబురు పెట్టమనీ చెప్పడంతో వాళ్లకి ఫోన్‌లో విషయాన్ని చెప్పాను. నేను, రామదాసు వాడి మంచం దగ్గరే కూర్చున్నాం. ఓ గంట తరువాత వాడు కళ్లు తెరిచి ఏడుస్తూ చేతులతో తాను వెళ్లిపోతున్నట్లు సంజ్ఞ చేసి ఒక ఉత్తరాన్ని ఇచ్చాడు. ఆ తరువాత ఏదో మాట్లాడాలని విశ్వ ప్రయత్నం చేసి అలాగే తల వాల్చేశాడు. అలా రాఘవ పాత్ర ముగిసింది. కంట నీటిని తుడుచుకుంటూ వాడు రాసిన ఉత్తరాన్ని చదవడం మొదలు పెట్టాను.

"శంకరం, ఈ నాటకం తరువాత మీతో ఎన్నో విషయాలు మాట్లాడదామనుకున్నాను. కానీ ఆ దేవుడు ఆ అవకాశాన్నివ్వకుండా నా గొంతుని శాశ్వతంగా నొక్కేశాడు. ఇన్నాళ్లూ ఆ గొంతును చూసేగా నేను విర్ర వీగాను.

నాటకాలు వేసే నేను జీవితంలో పేరు, డబ్బు సంపాదించాను. ఆ డబ్బంతా భార్యా, పిల్లల కోసమే ఖర్చు పెట్టాను. వాళ్లకి పెద్ద చదువులు చెప్పించాను. ఇద్దరికీ రెండిళ్లు కొనిచ్చాను. చికిత్స చేస్తే నా గొంతు మామూలుగా అవుతుందని చెబితే అంత డబ్బు ఖర్చుపెట్టే స్థితిలో లేమన్నారు నా కొడుకులు. ఒక వేళ చేస్తే ఆ పట్నంలోని నా పేరున ఉన్న ఇంటిని అమ్మేయాల్సి వస్తుందన్న స్వార్థంతో వాళ్లు అలా చేశారని తరువాత నాకు తెలిసింది. స్వార్థానికి ఇంతకన్నా పరాకాష్ఠ ఉంటుందా చెప్పు? 'అపుత్రస్యగతిర్నాస్తి' అన్న ఆర్యోక్తినే పరిహసించేటట్లు ప్రవర్తించారు వాళ్లు. అప్పట్నుంచీ జీవితం మీదే విరక్తి పుట్టింది.

బాల్యం నుంచి నా మధుర స్వరంతో ఆ నాటక కళామతల్లికి పద్యార్చన చేసిన నాకు మూగగా బతకడం వ్యర్థమని పించింది. ఒకప్పుడు రారాజులా వెలుగొందిన ఈ నాటక రంగం చరమాంకానికి చేరువ కావడం, అదే సమయంలో నా జీవితం కూడా చరమాంకానికి దగ్గర కావడం నన్ను మానసికంగా కుంగదీశాయి.

అందుకే నా జీవిత నాటకంలోని చరమాంకంలో ఎలాగైనా నాకెంతో ప్రీతి పాత్రమైన ఈ పద్య నాటకాన్ని చివరిసారిగా మీ అందరి ముందు ప్రదర్శించాలని ముఖానికి రంగు పూసుకున్నాను. వేదిక ఎక్కేముందు ఇదే నా ఆఖరి ప్రదర్శన కావాలని ఆ నటరాజుని వేడుకొని మరీ 'పరాబ్రహ్మ' పద్యం మొదలు పెట్టాను. ఎలాగైతేనేం ఆ దేవుడు నా మొర ఆలకించినట్లున్నాడు.

ఒక కళాకారుడికి రంగస్థలం మీద నటిస్తూ జన సందోహం ఈలల మధ్య చనిపోవడం కన్నా గొప్ప వరం ఏముంటుంది చెప్పు. అలాంటి వరాన్ని నేను పొందాను. ఈ జన్మకిది చాలు. పద్యనాటకాలన్నవి మన తెలుగు భాషకే సొంతం. దాన్ని నిరాదరిస్తూ మనం ఒక చారిత్రక తప్పిదం చేస్తున్నాం. ఇవన్నీ మీతో పంచుకోవాలని శరీరం సహకరించక పోయినా ఈ ఉత్తరం రాశాను. మళ్లీ జన్మలో కూడా నాటక కళాకారుడిగానే పుట్టాలని కోరుకుంటూ "రాఘవ".

ఆ ఉత్తరం చదువుతుంటే నాకు తెలియకుండానే కన్నీరు ధారలుగట్టింది.

గన్నవరపు నరసింహమూర్తి
విశాఖపట్నం. 84558 85269

ACHARYA NAGARJUNA UNIVERSITY
CENTRE FOR DISTANCE EDUCATION NAGARJUNANAGAR - 522510., A.P.

ADMISSION NOTIFICATION FOR THE CALENDER YEAR : 2013

Applications are invited from all over India for admission into the following courses offered by the Centre for Distance Education, Acharya Nagarjuna University under the Distance Mode for the Calender Year 2013 batch.

A : Direct Admission with Prescribed Qualifications

BA / B.Com / B.Sc / BBM / BHM / BLISC / MLISC / MA (English, Telugu, Hindi, Economics, History, Political Science, Sociology, Journalism & Mass Comm.,) / M.S.W. / Master of Business Economics / M.Com / MHRM / LLM / M.Sc. (Botany, Zoology, Physics, Chemistry, Microbiology, Mathematics, Psychology, I.T., Computer Science, Statistics, Food & Nutrition, Bio Informatics) / UG Diploma in Real Estate Management / PG Diploma (Bio-Informatics, Biotechnology, Hospital & Health Care Mgt., Business Mgt., Marketing Mgt., HRM, Financial Mgt., Banking & Financial Mgt., International Business, Travel & Tourism Mgt., Insurance Mgt., Hotel Mgt., Journalism & Mass Comm., Computer Applications, I.T., Real Estate Management)/ Certificate Course in HIV / AIDS Counselling, Hotel & Hospital House Keeping, Teacher Education.

Last date for submission of filled in applications	Without late fee	With a late fee of ₹ 100/-
a) M.Sc., PGDBT, PGDBI Courses	: 06-05-2013	20-05-2013
b) M.A., M.Sc. Maths, M.Com., M.H.R.M, B.L.I.Sc., M.L.I.Sc., M.B.A, UG Diploma, PG Diploma, Diploma, Certificate Courses	: 12-05-2013	03-06-2013
c) B.A., B.Com., B.Sc., B.H.M. B.B.M. Courses	: 24-06-2013	08-07-2013

Refer to www.anucde.info or prospectus for complete details of all the courses such as eligibility, fee structure, course structure and list of study centres. Sale of Applications : Applications for all the courses can be obtained from the study centres and also from the Centre for Distance Education, Acharya Nagarjuna University by submitting Crossed Demand Draft from any scheduled commercial bank drawn in favour of "Director, Centre for Distance Education, Acharya Nagarjuna University" payable at Nagarjuna Nagar or Guntur. Applicant should invariably write his / her name, address and the course name on the reverse side of the D.D. Applications can also be downloaded from www.anucde.info and cost of application must be enclosed to the downloaded application. or through SBI Internet Banking I-Collect Facility.

COST OF APPLICATION FORM CUM PROSPECTUS	By Hand	By Post / Internet
1. Admission into MBA (3 Yrs) / MBA (2 yrs) with prescribed qualification	₹ 300.00	₹ 350.00
2. Admission into UG / PG / UG & PG Diploma / Diploma / Certificate / B.L.I.Sc. / M.L.I.Sc. Courses with prescribed qualification	₹ 100.00	₹ 150.00

Ph: 0863-2293299, 08645-211023 Cell : 94908 20973 / 74 / 98482 85518

Nagarjunanagar Date: 23-01-2013 | Web site www.anucde.info | Director Centre For Distance Education

నను బ్రోవమని చెప్పవే...

భారతీయులకు సీతారాముల్ని మించిన ఇలవేల్పులు లేరు, కనుకనే వారిని అభిమానించారు, ప్రేమించారు, ఆరాధించారు. సీతమ్మ కష్టాలు తలచుకొని కన్నీరు నింపని భారత స్త్రీ ఉండదనటంలో అతిశయోక్తి లేదు. సీతమ్మ సహనశీలి, మహా పతివ్రత. ఎన్ని విధాల ఆమెను స్తుతించినా అవన్నీ సీతమ్మను రాముని తెరవెనుక ఉంచిన కథలే అయ్యాయి. కానీ రామదాసు కీర్తనల్లో సీతమ్మ అనేక రూపాలు ధరించింది. రాముని అడుగుజాడల్లో ఒదిగొదిగి నడుస్తున్న సీతమ్మను, రామదాసు తన కీర్తనల్లో శృంగార నాయికగా, సంపూర్ణమైన మాతృమూర్తిగా అభివర్ణించాడు.

తల్లిదండ్రులుగా, రామదాసు సీతారాములను పూజించినా, అతని కీర్తనల్లో సీతమ్మ పట్ల మాతృవాత్సల్యం ఒకింత అధికంగానే తొణికిసలాడుతుంది. లోకంలో తల్లికి తనయుడు కష్టసుఖాలను చెప్పుకునే రీతిలోనే రామదాసు సీతమ్మతో తన గోడును వెళ్లబోసుకున్నాడు. రామదాసు జీవితంలో ప్రతి స్థాయిలోనూ సీతమ్మ చిత్రణను గమనిస్తే, రామదాసు మొదటి కీర్తనగా చెపుతున్న "ఆశ పుట్టెనే - శ్రీరాములతో ఆహా నేపుట్టనైతిని" కీర్తనలో...

"కనక మృగము రాగా కాంత తెమ్మంటే
ఆ మృగమును తెచ్చమ్మకిస్తను గద హరిని
నేను బోవలదందును కద"

అని చెప్పటంలో జానకిని ముగ్ధగా చిత్రిస్తూనే శ్రీరాముడు బంగారు లేడిని తీసుకు రావటానికి వెళ్లాల్సి వచ్చినపుడు జరిగిన అనర్థాలన్నింటికీ తను అక్కడ లేకపోవటం కారణంగా భావించి రామదాసు తెగ బాధ పడ్డాడు.

హనుమంతునికి బదులు తనే వెళ్లి లంకను గాలించి అంగుళీయకమిచ్చే దూతగా తనను తాను భావించుకున్నాడు. 'రణములో రావణుని ద్రుంతును మంగళ పవిత్రను మాధవు కర్పించి' మురిసిపోతానన్నాడు. 'అమ్మకు మాఱుగా అగ్నిలో జొత్తును' అని రామదాసు భక్తిని హృదయంగమంగా చిత్రించాడు. ఇక్కడ తల్లి పాతివ్రత్య పరీక్షను రంగరించాడు. అగ్నిలో సీతమ్మ బదులు తను దూకుతానన్న రామదాసు భక్త హృదయం ఆశ్చర్యకరంగా, తరువాత జీవితంలో అనేక అగ్ని పరీక్షలకు గురయ్యింది. భద్రాచలం చేరిన రామదాసు "వామాంకస్థితి" పొందిన సీతమ్మను కాకుత్థ్స రాముని కొమ్మగా అభివర్ణించాడు.

కరుణ జూడవే ఓ యమ్మ కాకుత్థ్స రామునికొమ్మ
భద్రాద్రి వాసుని కొమ్మ భద్రాద్రి శ్రీరామదాసుని కమ్మ
భద్రము లొసగుమి అమ్మ భద్రం భవతుతే మాయమ్మ

'ఇంద్రాదులకైనా నీ మహిమల నెన్నగా తరమా?'అని ఆమెను మహిమాన్వితురాలిగా చెప్పి, 'తథ్యమిది యని స్మృతులచే విన్నా' అని భవిష్యత్తులో సీతమ్మ నిర్వహించే పాత్రను సూచించాడు. 'ఘనుని చెలిమి చేసిన పరమ కళ్యాణి' సీతమ్మ స్నేహం వల్లనే రామునికి కీర్తి ప్రతిష్ఠలధికమయ్యాయనే రామదాసు భావన అమోఘమైంది. దేవాలయోద్ధరణ కావించి, చిక్కుల్లో పడిన రామదాసు తన రుణ బాధలను, సీతమ్మకు మనసులోనే చెప్పి, శ్రీరామునికి తన మాటగా చేరవేయమని అర్థించాడు.

"నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ
నను బ్రోవమని చెప్పవే॥ ॥నను॥"

రామదాసు హృదయాన్ని చీల్చుకుని వచ్చిన ఈ కీర్తన భక్తి సాహిత్యంలో ఒక మణిపూసంటే ఆశ్చర్యం లేదు. పల్లవిలో తనను బ్రోవుమని రామునికి చెప్పమనటమే ఆశ్చర్యం. అంటే శ్రీరామునికి భక్త సంరక్షణ చేయమని ఎవరైనా రాయబారం పంపాలా? అని ప్రశ్నించుకుంటే 17వ శతాబ్దంలో రామదాసు ఉన్న సాంఘిక పరిస్థితుల్లో రాయబారాలు, లంచాలు, బహుమతులు అన్నీ చాలా సహజమైనవై ఉండొచ్చు. ఆ విషయం రామునికి కూడా రామదాసు

అన్వయించాడు. 'చూద్దాంలే ఇలాంటి భక్తులు చాలామంది ఉంటారు' అని శ్రీరాముడు ఉదాసీనత వహించకుండా ఉండాలనే భావంతో సీతమ్మని రామదాసు తన పక్షాన మాట్లాడమని బతిమాలాడు. ఆమె కీర్తి ప్రతిష్ఠలను ఆమెకు జ్ఞప్తికి తెచ్చి, 'నీవు నారీశిరోమణివి', 'జనక మహారాజు కుమార్తెవి' అని పలికి 'జనని' అని చెప్పి సీతాదేవి పుట్టిన విధానం భక్తులకు అర్థమయ్యేలా వివరించాడు.

ఇన్ని విధాలుగా ఆమెను పొగిడినా సీతమ్మ ముగ్ధ, కల్లాకపటం తెలియని అమాయకురాలు. ఎప్పుడు ఏ విషయం చెప్పాలో ఆమెకు తెలియకపోతే కార్యం సానుకూలం కాదు. ఆమె శ్రమ వృథా అవుతుందని భావించిన రామదాసు... ఎప్పుడు తన విషయం రాముని చెవిన

వేయాలో చెప్పి, ఒక్కసారి ప్రజలను ఉలిక్కిపడేటట్లు చేశాడు. భక్తి సాహిత్యంలో ఇంత చనువు, స్వతంత్రం తీసుకున్న కవి రామదాసులా మరొకడు లేడు. సీతారాముల అన్యోన్య దాంపత్యాన్ని అనేక విధాలుగా కవులు పొగిడారు. దంపతులు ఎవరైనా సరే సీతారాముల్లా ఉంటేనే అన్యోన్య దాంపత్యమని, ఒక కొలబద్దని సృష్టించారే గానీ సీతమ్మని శృంగార నాయికగా భావించటానికి సాహసించలేదు. సీతమ్మ రామునికి విషయం చెప్పాల్సిన సమయాన్ని రామదాసు నిర్దేశించాడు. ఆ సమయం ఎప్పుడంటే,

"పక్కను చేరుక చెక్కిలి నొక్కుచు
చక్కగ మరుకేళి సొక్కి యుండెడి వేళ"

ఒక పర్యాయం చెప్పినంత మాత్రాన పని సానుకూలం కాకపోవచ్చు.

"లోకాంతరంగుడు శ్రీకాంతు నిను గూడి
ఏకాంతమున ఏకశయ్యనున్న వేళ"

రెండో పర్యాయం రామదాసు కష్టాలు విన్నవించుకున్నాడు. ఈ చిన్న మెలకువ అందరికీ తెలిసిందే అయినా, ఏకాంత సమయంలో శ్రీరామునికి సీతమ్మ చేత తన విషయం చెప్పించుకొనే ధైర్యం ఉన్న భక్త కవి మాత్రం రామదాసు ఒక్కడే. మరొకడు 'నభూతో న భవిష్యతి'. ఇన్ని విన్నపాలు చేసిన రామదాసు, సీతమ్మ ముచ్చటగా మూడోసారి తన విషయం 'నిద్రమేల్కొను వేళ' శ్రీరామునికి బోధించమన్నాడు. శ్రీరామునికి జానకి శృంగార నాయిక. మధురానుభూతులతో తెల్లవారిన శ్రీరామునికి జానకి పట్ల అనురాగం అధికంగానే ఉంటుంది. తెల్లవారగానే చేసే విన్నపం తప్పకుండా ఫలిస్తుంది. అందులోనూ భక్తపరాయణుడు కాబట్టి మరింతగా నెరవేరుస్తాడు. ముచ్చటగా మూడుసార్లు సీతమ్మతో రాయబారం పంపిన రామదాసు భక్తిని శంకించాల్సిన అవసరం లేదు. పని సానుకూలత, లౌక్యం తెలిసిన వ్యక్తిగానే భావించాలి.

ఆ లౌక్యాన్ని భక్తిపూర్వక నమ్రతతో కలగలిపి సీతమ్మకి విన్నవించిన తీరు, ప్రజల హృదయాలను సున్నితంగా చేరింది. గిలిగింతలు పెట్టింది. ఆ చమత్కారానికి జనులు పులకరించారు. పోతన భాగవతంలో గజేంద్రుని రక్షించే సందర్భంలో శ్రీమహావిష్ణువు పరుగెత్తుకొచ్చిన విధానం విమర్శకుల్లో దుమారం లేపింది కానీ, 'మరుకేళి సమయంలో చేయమన్న విన్నపం పట్ల పెద్దలెవరూ అనుమానం వ్యక్తం చేయలేదు. సంప్రదాయ నిష్ఠులెవరూ లెంపలు వేసుకోలేదు. బహుశా ఆమె చేసిన విన్నపం వల్ల పని సానుకూలమైందన్న తృప్తి రామదాసు కన్నా, రామభక్తులు అధికంగా అనుభవించిన ఆనందం కారణం కావచ్చు. ఏదేమైనా తెలుగు భక్తి సాహిత్యాన్ని ఒక కుదుపు కుదిపి రస జగత్తులోనికి నడిపించిన కవి రామదాసు. భక్తి ఉన్నంత కాలం ఈ కీర్తన జీవించే ఉంటుంది. రామదాసు ఇబ్బందికర పరిస్థితుల్లో శ్రీరాముని ఎంతగా స్తుతించినా సీతమ్మకు కూడా హృదయంలో స్థానమిచ్చి, భక్తిలో భాగమిచ్చి కీర్తించాడు.

"అమ్మ నను బ్రోవవే - సమ్మతి తోడ మా
యమ్మ వనుచు నిన్ను - నెమ్మది గొలిచెద॥"

ఏ విన్నపం చేయాలన్నా రామదాసుకు తల్లి సీతమ్మ జ్ఞాపకం వస్తుంది. తల్లి కొంగుచాటున తన కోరిక తండ్రికి విన్నవించుకునే బాలునిగా రామదాసు దర్శనమిస్తాడు.

"కన్న తల్లి నీవు కనుగొని నా పాటు
విన్నప మొనరించి వేగమే విభునితో"

ఆమె తన పక్షం అన్న భరోసా రామదాసుకెపుడూ ఉంది. ఆ ధైర్యంతోనే శ్రీరామునితో - "రామ నీచే నేమీ కాదుగా, సీతాభామకైన చెప్పరాదుగా" అంటాడు.

తన భావాలను దాచుకోవటానికి రామదాసు ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. అందుకే ధైర్యంగా 'నీకు పని సానుకూలం కాకపోతే సీతమ్మకు చెప్పు, ఆమె నెరవేరుస్తుంది' అన్న ధీమాతో రామదాసు చేసిన ప్రస్తుతి వృథా కాలేదు. తల్లివలే, జగజ్జనని వలే ఆమె రామదాసును ఎప్పుడూ కాపాడుతూనే ఉంది. మనసుకి సాంత్వన లేని సందర్భంలో రామదాసు సీతమ్మను ప్రార్థించిన తీరు హృదయాన్ని కరిగిస్తుంది.

రామచంద్రులు నాపై చలము సేసినారు
సీతమ్మ చెప్పవమ్మా!
కటకట! వినదేమి సేతును
కఠిన చిత్తుని మనసు కరగదు
కర్మములు ఎటులుండునో గద
ధర్మమే నీ కుండునమ్మ

'కటకట' అన్నపుడే అతనిలోని ఆవేదన తెలిసినా కరుగని శ్రీరాముని హృదయం రామదాసు గొంతులో దుఃఖాన్ని సుడులు తిప్పింది. తన కర్మేలా ఉన్నా తల్లిగా రక్షించాల్సిన ధర్మం సీతమ్మకుందని పలికిన

ఆవేదనలో రామదాసు వైరాగ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

"జనకతనయ! నాదు మనవి గైకొని
జగజ్జనకునితో తెల్పవే ఓ జననీ"

ఈ కీర్తనలో రామదాసు బందిఖానాలో జీవితమంతా వర్ణితమైంది. అన్ని కష్టాల్లో కూడా 'అదిగో, వచ్చెదరనీ - ఇదిగో వచ్చెదరనీ' ఎదురుచూస్తున్నామన్న రామదాసు భావం తల్లిదండ్రుల గురించి ఎదురుతెన్నులు చూసే పుత్రుని హృదయంలా ఉంది.

పన్నెండేండ్ల నుండి పగలు రేయి
నాపన్నుడనై మిమ్ముల ఓ జననీ
ఎన్నెన్నో విధముల సన్నుతించిన గాని
కన్నుల జూడడాయె ఓ జననీ
కన్నీరు లేకుండ నున్న తీరు నా
కెన్నడు లేదు గదా ఓ జననీ
కన్న తండ్రులంత కరుణ మాలి
భువిని ఉన్న వారలు గలరా ఓ జననీ

పన్నెండేళ్ల కారాగార శిక్ష అతనికి ఎంతటి దుఃఖ భరితమైందో అమ్మకు వివరించిన తీరు భావుకులకే భరింపరానిదైతే కన్నతల్లి హృదయాన్నెంత కరిగించిందో! కారాగార శిక్షల తీవ్రత వర్ణిస్తూ, 'ఎడతెగని ఆపద ఏ పొద్దు కలిగె నేనెవరితో విన్నవింతు' అనటం వల్ల ఎప్పుడైనా మరణ దండన అమలు చేయవచ్చన్న రామదాసు సందేహం కనిపిస్తోంది.

సుదతిరో తెల్లవారిన వెనుక నన్నింక
బ్రతుకనియ్యరు భటులు ఓ జననీ
అతి భీతినొంది నే నార్జించితిని విషము
ఆలస్యమిక చేయకు ఓ జననీ

అనటం వల్ల వాళ్లు మరణదండన అమలు చేసే ముందు ఆ విధమైన చావుకన్నా, విషం తాగి చచ్చిపోవాలన్న కోరికతో అక్కడ తన పట్ల అభిమానమున్న కాపలా సైనికునిచే విషం తెప్పించుకొన్నట్లు తోస్తోంది.

'మరి మరి మిమ్మెపుడు మందలించినా
మనసు నీరై పోయెనుగా' అనటం వల్ల ఇంతకుముందు తను శ్రీరాముని దూషించటం వల్ల తను కూడా చాలా బాధపడుతున్నానన్న పశ్చాత్తాపం కనిపిస్తోంది. 'సరి నా ఇష్టము చెల్లె నేటి వరకు వెఱపులన్నియు తీరెగా' అనటంతో, రామదాసు తనకు తోచిన సేవలు శ్రీరామునికి చేసినట్లు, వేడుకున్నా, దూషించినా, ప్రార్థించినా, అవన్నీ ఉపాయాంతరంగా చెప్పినట్లు చెప్పి 'ఇంక వెఱుపులు లేవు' అనటం తను మృత్యు ఒడిలో ఉన్నట్లు, ఇంక భయాలేవీ బాధించవని నిష్కర్షగా చెప్పాడు.

మండు వేసవి ఎండలో నిలచిన శిక్షలకు, ఉప్పు కలిపిన అన్నం తినటం వల్ల రక్తం నీరై పోయిందని విన్నవిస్తూ శ్రీరాముడు కాలహరణం చేశాడని అన్నాడు. అప్పుడైనా వచ్చి రక్షిస్తారన్న నమ్మకం పూర్తిగా పోయింది. మీరు కఠినాత్ములయ్యారని వేదన చెంది, వివరగా 'సదయాత్ముని పంపి నన్ను సాక మనవే సత్కీర్తి దక్కునే' అంటాడు. దీనివల్ల తన రక్షణ మాటెలా ఉన్నా తనను ఉపేక్ష చేస్తే దైవం అపకీర్తి పాలవుతాడనే భయమే వ్యక్తమౌతోంది. ఈ కీర్తన పైకి చమత్కారంగానో, లౌక్యంగానో కనపడినా తానేమైనా తన దైవానికి అపఖ్యాతి కలుగరాదనే ఆరాటం, శ్రీరామచంద్రుని పట్ల తనకు గల త్రికరణశుద్ధిగా భక్తి, నిజాయితీలను తెలుపుతూ రామదాసు హృదయాన్ని ఆవిష్కరిస్తోంది.

'ఇతర మెరుగక మీరెగతియని నమ్మకం'తో ఉన్నానన్న రామదాసు నమ్మకాన్ని సీతమ్మ వమ్ము చేయలేదు. అన్నదమ్ములను పంపి రామదాసుని ఆదుకుందట. కథైనా, నిజమైనా, పరమ దయాళువు, సీతమ్మ మాతృమూర్తి స్వరూపం ధరించి రామదాసుని కనికరించింది.

రామదాసు సీతమ్మను సంధానకర్తగా చేసికొని రాసిన కీర్తనలన్నీ భక్తిసాహిత్యాన్ని సుసంపన్నం, ఫలవంతం చేశాయి. ప్రజల హృదయాల్లో, నాలుకలపై శాశ్వతత్వం సంపాదించుకున్నాయి.

డా॥ ప్రభల జానకి
హైదరాబాద్. 90004 96959

న్యూటన్ విశ్వభాష

సర్ ఐజాక్ న్యూటన్... ఆధునిక వైజ్ఞానిక శాస్త్ర పితామహుడు. చరిత్ర గతిని మార్చిన అనేక ఆవిష్కరణలకు ఆద్యుడు. అలాంటి శాస్త్రవేత్త గురించి ఇప్పటి వరకూ ఎక్కువ మందికి తెలియని వాస్తవం ఒకటి ఉంది. న్యూటన్ మొదట్లో 'భాష' మీద ప్రయోగాలు చేశారు. అవును... భాష మీదే. లోకం మొత్తానికి ఉపయోగపడే 'విశ్వభాష'ను తయారు చేయడానికి ఆయన ప్రయత్నించారు. న్యూటన్ తన కళాశాల విద్యార్థి జీవితారంభంలో దీనిపై పని చేశారు. తన 'విశ్వభాష'కు ఉండాల్సిన కొన్ని ప్రత్యేక లక్షణాలను నిర్దేశించుకున్నారాయన. ఒకే వర్గానికి చెందిన పదాలన్నీ ఒకే అక్షరంతో ప్రారంభమవడం (ఉదాహరణకు వస్తువుల పేర్లన్నీ 'స'తోనే ఉండటం), ఒకే భావనకు సంబంధించిన వివిధ రూపాలను - ఒకే పద్ధతిలో కొద్దిపాటి అక్షరాల మార్పులతో చెప్పడం (ఉదా: వేడిగా ఉంది, బాగా వేడిగా ఉంది.... ఈ రెండింటికి న్యూటన్ తయారు చేసిన పదాలు utor, owtorz) తదితర లక్షణాల తో కూడిన భాషను రూపొందించడానికి న్యూటన్ చాలా కష్టపడ్డారు. ఈ ప్రత్యేకతల వల్ల ఒక పదాన్ని వినగానే అదే ఏ వర్గానికి చెందిందో సులువుగా తెలిసిపోతుందని - తద్వారా భాషను ఎవరైనా తేలికగా నేర్చుకుని ఉపయోగించుకోవచ్చని భావించారాయన. అయితే, ఆ భాషను పూర్తిస్థాయిలో తయారు చేయడం అసాధ్యమని గుర్తించారో ఏమో కానీ కొన్నేళ్ల తర్వాత ఆ పనిని ఆపేశారు. వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనల వైపు దృష్టి మరల్చారు.

ప్రేమ లేఖల పోటీలో రూ.116 గెలుచుకున్న లేఖ

ప్రేమంటే...



ప్రియమైన శశీ!

శరత్కాలపు చంద్రుడి లాంటి చూపు ఎలా మరువను? 'గులాబీ' సౌకుమార్యం వంటి సుకుమారుడివి నువ్వు. 'మల్లెపూవు' వంటి స్వచ్ఛమైన ప్రేమను నాకందించావు. సుదూర తీరాన ఉన్నా నీ గుండె సవ్వడి నా పేరు కలవరిస్తుందని నాకు తెలుసు. మన మధ్య దూరం ఎంత ఉన్నా మన అంతరంగాలు మాత్రం ఎంతో దగ్గరగా ఉన్నాయి. మూడేళ్ల మన పరిచయంలో ఒక్క ఉత్తరం కూడా నీకు రాయలేదు. కానీ ఇప్పుడు రాస్తున్నాను. ఈ అక్షరాలను 'మది' అనే కాగితంపై రాస్తుంటే చాలా ఆనందం కలుగుతుంది. ఉత్తరాలకున్న మహత్తర శక్తి ఏమని చెప్పనూ... ప్రియా! మనం మొదటిసారిగా కలసి చూసిన చలన చిత్రమేంటో తెల్సా? 'ప్రేమలేఖ'. మనిద్దరికీ ఇష్టమైన నవల 'వెన్నెల్లో ఆడపిల్ల'. అది మనసుకెంతో హత్తుకుంది కదా. నాకు నువ్వు అదే పేరు పెట్టావు. ఎందుకంటే 'వెన్నెల్లో ఆడపిల్ల'లా ఉంటాననీ, కనిపించకుండా నిన్ను కవ్విస్తున్నాననీ చెప్పావు. శశీ! నీ 'సాన్నిహిత్యం' నాకెంతో సంతోషాన్నిస్తుంది. నాకు నచ్చిన పాట ఏంటని అడిగావ్. అప్పుడు నేను 'మానవత్వం పరిమళించే మంచి మనసుకి స్వాగతం' అని చెప్పాను. ఎందుకంటే ఆ పాట నీకు నప్పుతుంది. కారణం నీ ప్రేమను నాకు మాత్రమే కాదు తోటివారికి కూడా పంచావు. వారిని ఆపద్బాంధవుడిలా ఆదుకొని నీ కరుణను, మానవతను చాటుకున్నావు. అది నాకు చాలా నచ్చింది. ఆత్మీయమైన స్నేహితుడిగా నీ ప్రేమను అందించి వారి మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న నీకు నా అక్షరమాలతో అభినందనం చేస్తున్నాను. నిస్వార్థమైన నీ ప్రేమకు నా జోహార్లు. ప్రేమంటే 'ప్రేమించే మనసు' అని అర్థం చెప్పడమే కాకుండా 'ప్రేమించే మానవత్వం' అని మరోసారి నిరూపించావు. ఈ 'ప్రేమ లేఖల పోటీ' పెట్టకపోయి ఉంటే నా లేఖ అందుకొనే వాడివి కాదు. నా అంతరంగం చదివే అవకాశం ఉండేది కాదు. అవునా? శశీ! నువ్వు నా సమక్షంలో ఉంటే ఎంత సంతోషంగా ఉంటుందో? ఆకు కదిలితే అది నీ అడుగుల సవ్వడిగా, పువ్వు పూస్తే అది నీ నవ్వుగా అనిపిస్తుంది. ప్రేమంటే ఇదేనా? ఎడారిలో ఒయాసిస్సులా నీ రాక నా జీవితంలో శాశ్వతం కావాలనుకుంటున్నాను. నా ప్రేమ కోసం నువ్వు ఏన్నేళ్లు నిరీక్షించావో కదా! చివరకు నిజమైన నీ ప్రేమ ఫలించింది. చివరగా ఒక్క మాట - దేవుడు ప్రత్యక్షమైతే ఏం కోరుకుంటావని ఒకసారి అడిగావు గుర్తుందా? ఇప్పుడు చెబుతున్నా విను. "నేను ఈ లోకం విడిచివెళ్లే ముందు నీ చిరునవ్వును తోడుగా తీసుకెళ్లాలని, ప్రశాంతంగా నీ ఒడిలో శాశ్వతంగా నిద్రించాలని" అరె! నీ కంట ఈ కన్నీరెందుకు ప్రియా! ఇది నా కోరిక. ఇంతకంటే ఇంకేమీ కోరను. అందుకే లక్షలు విలువ చేసే లక్షణమైన అక్షరాలను మాలగా చేసి నీకు కానుకగా అందిస్తున్నాను. నీ ప్రేమకు నీరాజనాలు అర్పిస్తూ నీ రాక కోసం సారికలా... అభిసారికలా ఎదురు చూస్తుంటా. చంద్రుని కోసం నిరీక్షించే 'చకోరపక్షిలా' నీకై వేచి ఉంటా ప్రియతమా.. మన ఈ కలయిక కల్ల కాకూడదని కోరుకుంటూ...

నీ
శ్రీ
విజయనగరం

అక్రమాలపై బాణం...

రచనకు ప్రాణం

అక్షరరూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక అన్నాడు కాళోజీ. ఒక్క సిరా చుక్కకు అంత శక్తి ఉంది. ఆ శక్తి నిలువెల్లా నిండిన మనిషే రచయితగా, కవిగా సమాజంలో గుర్తింపు పొందుతుంటాడు. రచయితలు, కవులు వేరే ఎక్కడి నుంచో ఊడిపడరు. సమకాలీన సమాజం నుంచే ఉద్భవించి జాతి జాగృతి కోసం జయగీతికలాలపిస్తూ రచనల కాగడాలతో అందరికీ మార్గదర్శనం చేయిస్తుంటారు. ఇది రచయితలకున్న ప్రధాన లక్షణం. సాహితీపరులు అందరూ ధర్మ పక్షపాతులని చెప్పలేం కానీ అలాంటి వారినే సమాజం గుర్తుంచుకుంటుంది. దీనికి భిన్నమైన రచయితల గ్రంథాలు కేవలం కాలక్షేప సాహిత్యంగా మిగిలిపోతాయి. ధర్మానికి దెబ్బతగిలినప్పుడల్లా దేవుడు అవతరిస్తాడో లేదో కానీ కచ్చితంగా రచయిత మాత్రం పుట్టుకొచ్చి తీరుతాడు. తెలుగు సాహితీ ప్రస్థానాన్ని గమనిస్తే దాదాపు ఈ వెయ్యేళ్ల కాలంలో ఎప్పటికప్పుడు కవులు తమ కలాలను ఝుళిపించి అవినీతిని, అక్రమాలను, అన్యాయాలను ఎదిరించి సమాజ శాంతికి పూలబాటలు వేసిన సందర్భాలు చాలా కనిపిస్తాయి. మహాకవి తిక్కన కలం పట్టింది మతవిద్వేషాలను చల్లార్చటానికే. హరిహరనాథతత్త్వాన్ని ప్రేరేపించి ఆనాడు సామాజికంగా ఉన్న అశాంతిని మహాభారత ఆంధ్రీకరణతో సమసింపచేశాడు.

'నిరంకుశాః కవయః' అనే మాటలు అక్షరసత్యాలే. కవులు, రచయితలు ఎప్పుడూ నిరంకుశులే. ఎందుకంటే వారు చెప్పదలచుకున్నది నిర్మొహమాటంగా, నిస్సందేహంగా చెప్పి తీరుతారు కనుక. ఈ విషయంలో ఎదుటివాడు రాజైనా సరే అంతకుమించిన చక్రవర్తి అయినా సరే వారికేమీ లెక్క ఉండదు. తన కృతిని మనుజేశ్వరాధములకు ఇచ్చి పురంబులు వాహనంబులు... ఇలాంటివన్నీ తీసుకొని నరకంలో బాధలు పడకుండా శ్రీహరికే అంకితమిచ్చి జగత్‌హితానికి తనవంతు కృషి చేస్తానన్నాడు బమ్మెరపోతరాజు. అంతేకాదు చదువులతల్లి కంటినీరు తుడుస్తూ తన స్వార్థం కోసం తన కవిత్వాన్ని అమ్ముకోనని ఆ అమ్మకు మాట ఇచ్చాడు. ఆ మాట ప్రకారమే నడుచుకొంటూ అవకాశం దొరికిన చోటల్లా రాజులు మత్తులని, వారిచ్చే భాగ్యాలలాంటివేవైనా సరే నరకప్రాయాలని నిర్భయంగా చెప్పగలిగాడు. అది కవులు, రచయితల గొప్పతనానికి నిలువెత్తు సాక్ష్యంగా ఈ ధోరణి ఇప్పటికీ కనిపిస్తుంది. ప్రబంధ సాహిత్యంలో ఎంతగా శృంగార, వీరరసాలు ప్రధానంగా కనిపిస్తున్నా ఆ కవుల రచనా ధోరణిలో సామాజిక చైతన్యానికి ఆనాటి పరిస్థితులను అనుసరించి చేసే

ప్రబోధాలూ అంతకుమించే కనిపిస్తాయి. ప్రబంధ కవుల తర్వాత వచ్చిన ప్రతి ప్రక్రియలో ఈ వైనం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. అయితే శతకం కొంత సూటిగా సత్యాలను తెలియచెబుతుంది. పెడసరంగా ప్రవర్తించేవారు, ప్రజల సమస్య లను పట్టించుకోకుండా తిరిగేవారు ఎప్పుడు ఎక్కడ కనిపించినా శతకకారులు వారిని వదిలిపెట్టలేదు. సుమతీ శతకకారుడు "అధికార రోగపూరిత బధిరాంధక శవము జూడ బాపము సుమతీ" అని అనటంలో బాబూ! ఇవి మా సమస్యలు వీటిని కాస్త పట్టించుకొని పరిష్కరించిపెట్టండి అని ఏ పాలకుడి దగ్గరకో వెళ్లినప్పుడు, వచ్చిన వారి వంక కనీసం కన్నెత్తి కూడా చూడని ఆ పాలకుడిని తీవ్రంగా నిరసించిన తీరు ఈ పద్యంలో కనిపిస్తుంది. ఒక్క బద్దెన మాత్రమే కాదు; వేమనలో కూడా సూటిగా ప్రశ్నించే తత్వం కనిపిస్తుంది. వేమన దురా చారాలను దుయ్యబడుతూ చెప్పిన పద్యాలు వేలల్లోనే ఉన్నాయి. అంటరానితనాన్ని పాటించే వారిని, లోభులను వేమన తన పద్యాల బెత్తాలతో చురుక్కుమనేట్టు చరిచాడు. ఈ తరహాలో చాలా శతకాలొ చ్చాయి. అలా అలా తెలుగు సాహిత్యం ముందుకు సాగుతూ భావ, అభ్యుదయ కవి తావనాల్లోకి వేగంగా వచ్చి చేరింది. ఈ తరహా కవిత్వ రచనల్లో కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ లాంటి వారు సామాజిక అంశాలపై బాగా స్పందించిన విషయం తెలిసిందే! చలం తన రచనలో స్త్రీ స్వేచ్ఛకు సంబంధించి ఎంతో ఘాటుగా చెప్పాడు.

తెలుగు సాహిత్యం సంఘసంస్కరణ దిశగా ఎంతో వేగంగా పరుగులెత్తింది. కందుకూరి వీరేశలింగం తన వాడి వేడి రచనా పద్ధతిలో సమాజాన్ని జాగృతం చేశాడు. రాజశేఖర చరిత్రములో అప్పటి సమాజంలో ఉన్న అమాయకత్వం, మోసాలు కనిపిస్తాయి. పానుగంటి వారి సాక్షి వ్యాసాలు సామాజిక దురాగతాలకు పాల్పడేవారిని ఎవరినీ వదలిపెట్టలేదు. మాయలు, మోసాలు చేసే అందరి వేషా లను ఈ వ్యాసాలు ఎండగట్టాయి. సామా జిక రుగ్మతలను అనుసరించే వారి చెంపలు ఈ వ్యాసాల చేతుల్లో ఛెళ్ళున దెబ్బతి న్నాయి. నవ్వుతూనే పెట్టాల్సిన నాలుగూ పెట్టేసి బుద్ధిగా బతకండి అని మందలించి నట్టు పానుగంటి రచనలు కనిపిస్తాయి.

శ్రవ్యకావ్యం కన్నా మేలైనది దృశ్య కావ్యం. సర్వకళాసమాహారంగా సాగిన తెలుగు నాటకం ప్రేక్షకుల హృదయాన్ని సందేశంతో నేరుగా తాకింది. నాటక రచ యితలు ప్రజలకు తాము చేరవేయాల్సిన సందేశాన్ని నాటక పాత్రల సంభాషణల రూపంలో స్పష్టంగా చేరవేశారు. ఇంత నేరుగా సందేశం అందింది కనుకనే స్వాతం త్ర్యోద్యమంలో నాటక రచయితలు ప్రధాన పాత్ర పోషించినట్లు కనిపిస్తుంది.

వాస్తవాన్ని పరిశీలిస్తే కవిత్వం ఉద్య మాలకు ఊతమిస్తుంది. ఉద్యమాలు కవి త్వానికి ఊపిరిలూదుతాయి. స్వాతంత్ర్యోద్య మకాలంలో సాహిత్యంలో ఆనాడున్న అన్ని ప్రక్రియలు ఆ ఉద్యమానికి, దానితోపాటే నడిచిన ఇతర ఉద్యమాలకు ఎంతో ఊతా న్నిచ్చాయి.

సహజంగానే స్వాతంత్ర్యోద్యమం సాహిత్యానికి స్ఫూర్తినిచ్చింది. అయితే తెలుగులో 1920వ సంవత్సరానికి ముందు స్వాతంత్ర్యోద్యమ ప్రచార సాహిత్యం అంతగా కనిపించదు. ఎక్కడన్నా ఒకటి, రెండు కావ్యాల్లో అంతర్గతంగా ఉద్యమ ప్రబోధం, జాతీయస్ఫురణ ఉండేవి. ప్రత్యేకంగా జాతీయ నాయకులను, జాతీ యోద్యమాన్ని గురించి అదే పనిగా కవులు, రచయితలు నేరుగా రాయడం 1920 తర్వాతనే మొదలైంది. దానికి కారణం అప్పటినుంచే గాంధీజీ ఉద్యమ రథసార థ్యాన్ని చేపట్టడం. దాన్ననుసరించే కవులు, రచయితలు స్పందించారు. నాయకుల ఉప న్యాసాలు విని కొందరే ఉద్యమంలోకి రాగ లిగారు. 'దండాలు దండాలు భారతమాత' పాట రాసిన వడ్డాది సీతారామాంజనేయ కవి తన పాటలనే జన సమీకరణకు ఆయుధంగా వాడుకున్నాడు. విశాఖ సముద్రం ఒడ్డున ఒక చిన్న టేబుల్ వేసి దాని మీద గాంధీ బొమ్మ పెట్టి పాటలు పాడితే నెమ్మదిగా జనం పోగయ్యేవారు. అప్పుడు రాజకీయ ఉపన్యాసం ఎత్తుకునేవాడు. ఆ రోజుల్లో నాటకాలు చూసి, ఉద్యమ గీతాలను విని, హరికథలు, బుర్రకథల్లోని విషయాలు గ్రహించి ఉద్యమం వైపు ఉరకలెత్తినవారు ఎందరెం దరో. ఆ రోజుల్లో గాంధీటోపీ పెట్టినా, గాంధీజీపై పద్యం పాడినా దేశద్రోహమే అయ్యేది. అలాంటి పరిస్థితులను ఎదు ర్కొంటూ గాంధీ మీద నాటకం రాసి తొలి విజయబావుటా ఎగరేశారు దామరాజు పుండరీకాక్షుడు. ఆయన రాసిన పాంచాలి పరాభవం (పంజాబ్ దురంతాలు) అనే నాటకంలో ఆనాటి జనరల్ డయ్యర్‌ను దైరాసురా అని సంబోధించటం ఉంది. దానిమూలంగా బ్రిటిష్ పార్లమెంటులో ఆ నాటకం మీద పెద్ద చర్చ జరిగింది. ఆ నాటక ప్రభావాన్ని తట్టుకోలేక అప్పటి పాల కులు దాన్ని నిషేధించారు కూడా. దామ రాజు పుండరీకాక్షుడు రచించిన దాదాపు పదిహేను నాటకాలు ఇలా నిషేధానికి గుర య్యాయంటే ఆ రచయిత రచనాశక్తి ఎంత టిదో ఎవరైనా ఇట్టే తెలుసుకోవచ్చు. ఎలా గైనా ఆయన చేత రచనలు మాన్పించాలని బ్రిటిష్ ప్రభుత్వం ఎంతో ప్రయత్నం చేసింది. రచన చేయటం ఆపితే యాభైవేల రూపాయలు ఇస్తామని రాయబారం కూడా పంపింది. కానీ ఆయన 'గాంధిలేనిది సాగదు నా కలమ్ము' అంటూ తిరుగు సమాధానమిచ్చి ఆ రోజుల్లో అంత డబ్బును వదులుకున్నారంటే రచయితల పట్టుదల ఎలాంటిదో తెలుస్తుంది. గాంధీ విజయం, రణభేరి, సంస్కారిణి, స్వరాజ్య సాధం లాంటి ఎన్నెన్నో రచనలను ఆయన చేశారు. ఆయన రాసిన పద్యాలు, పాటలు ప్రతి ఉద్యమసభలోనూ ప్రార్థనా గీతాల్లా ఉండేవి. ఇంటి ముందుకు భిక్షకోసం వచ్చే వారు కూడా వాటిని పాడేవారంటే ఉద్యమా లకు కవులు, రచయితలు ఎంత ఊతమిచ్చారన్నది స్పష్టమవుతుంది. ఇవన్నీ ఆంధ్రదేశ చరిత్రలో, ఎన్నెన్నో పరిశోధనా గ్రంథాల్లో అక్షరబద్ధమైన విషయాలే.

నాటక రచయితల్లో స్వాతంత్ర్యోద్య మాన్ని కలుపుకొంటూ వరకట్నంలాంటి సామాజిక దురాచారాలను దుయ్యబట్టే తీరులో ఆవిర్భవించిన నాటకం వరవి క్రయం. కాళ్ళకూరి నారాయణరావు దీని రచయిత. ఆనాటి సమాజంలో వ్యాపించి ఉన్న దురాచారాలను నిరసిస్తూ సంస్కరణ ధోరణిలో చింతామణి, మధుసేవ లాంటి నాటకాలను కూడా ఆయన రాశారు. వేశ్యా వృత్తి, వరకట్నం, మద్యపాన దురాచారాలు ప్రబలంగా ఉన్న రోజులవి. వీరేశలింగం పంతులు రచనలతో, కృషితో ఉద్యమరూపం పొందిన సంఘసంస్కరణ వైపు కాళ్ళకూరి అలా ఆకర్షితులయ్యారు. ఆయన మీద బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నంనాయుడు ప్రభావం బాగా ఉంది. గురజాడ అప్పారావు కన్యాశుల్కం రచించిన కొద్దికాలానికే ఆ దురాచారం వరకట్న సమస్యగా సమాజం ఎదుట నిలిచింది. ఆడపిల్లలకు పెళ్లిచేయటం తల్లిదండ్రులకు గడ్డు సమస్యగా మారింది. అప్పట్లోనే రాయప్రోలు సుబ్బారావు వరకట్న దురాచారానికి బలైపోయిన స్నేహలతాదేవి యథార్థకథను 1914లో 'స్నేహలత' అనే కావ్యంగా రాశారు. దాన్ని స్ఫూర్తిగా తీసు కొని కాళ్ళకూరి నారాయణరావు 1923లో వరవిక్రయాన్ని రాశారు. ఆ నాటకంలో కని పించే వరకట్న విశేషాలు చూస్తే ఆ దురా చార విషయంలో అప్పటికీ ఇప్పటికీ ఏమంత తేడా ఉన్నట్లు కనిపించదు. ఆడపి ల్లల తల్లిదండ్రులు పురుషోత్తమరావు, భ్రమ రాంబలతో పెళ్లిళ్ల పేరయ్య "నిన్నగాక మొన్న, నీళ్లకావిళ్ళ నీలకంఠంగాడి కొడుకుకు వెయ్యిన్నూటపదహార్లు రొక్కం, వెండి కంచం, వెండి చెంబులు, బంగారం బటువు, పట్టు తాబితా, రిస్టువాచీ, సిగరెట్లకేసు ఇంకా ఏమిటో వాటిపేర్లు నాకు తిన్నగారావు, బ్యాట్టట, సెల్ఫుషేవింగ్ రేజరట, ప్యాకెట్టు టాయిలెట్టు బాక్సట, వ్యాసలైను సీసా అట, వల్లకాడట, యిన్నిస్తే పుస్తె ముడేశాడు. గొప్పవారి మాట చెప్పవలసిందేముంది?" అన్న ఈ మాటల్లో చమత్కారం మాటున ఆడపిల్లల తల్లిదండ్రులకు ఎదురయ్యే సమస్య ఎలా ఉంటుందో నేరుగా కనిపి స్తుంది.

కవులు, రచయితలు ఇలా ప్రతి సమయం, సందర్భాన్ని దృష్టిలో ఉంచుకుని తమవంతు కృషిని తాము చేస్తూనే ఉంటారు. స్వాతంత్ర్యానంతరం తలెత్తిన సాయుధ పోరాటం లాంటి వాటిని కవులు, నవలాకారులు, నాటక రచయితలు అక్షరబద్ధం చేశారు. ఉద్యమంలో భాగస్వాములైన వారూ కలం పట్టి కవులుగా ఎదిగారు. ఇటీవల కాలంలో వచ్చిన తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కూడా మంచి కవిత్వమే వచ్చింది. కవిత్వం మెల్లమెల్లగా స్త్రీవాదం, దళితవాదం లాంటి ఛాయల్లోకి వెళ్ళింది. ఆ వాదాలను భుజాన వేసుకొని వాటికి సంబంధించిన రచయితలు, రచయిత్రులు జోరుగానే కవిత్వాలను వెలువ రించారు. నవల, కథ, కథానిక వాటిననుస రించి వచ్చిన ప్రక్రియలు అన్నింటా స్ఫూర్తి దాయకమైన రచనలు వచ్చాయి. ఇవన్నీ దాటుకుంటూ కాస్త ముందుకొస్తే ప్రస్తుత సమాజంలో ఎదురౌతున్న అన్ని సమస్యలకు ప్రభుత్వం పక్షాన అప్పుడప్పుడు జరుగుతున్న నష్టాలకు కవులు స్పందిస్తూనే ఉన్నారు. విద్యుత్ ఉద్యమానికి స్పందిస్తూ బషీర్‌బాగ్ కాల్పుల ఘటనను దృష్టిలో ఉంచుకొని కె.శి వారెడ్డి 'ఆగస్టు 28' పేరున రాసిన కవిత పాఠకుల రక్తాన్ని మరిగించి సమస్య తీవ్ర తను బుర్రకెక్కిస్తుంది. విద్యుత్ ఉద్యమంలో కవులూ పాత్రధారులయ్యారు. అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం, సాహితీ స్రవంతి లాంటి సాహిత్య సంస్థలకు చెందిన వారు ఆ ఉద్యమానికి తమ గళాలను జోడించారు. ఆగస్టు 28న కాల్పులు జరగడానికి ఒకరోజు ముందు అప్పటి ప్రతిపక్షానికి చెందిన కాంగ్రెస్ నేతల నిరాహార దీక్ష శిబిరంలో శివారెడ్డి, గద్దర్, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, ఎస్వీ లాంటి వారు కవితాగానం చేశారు. విద్యుత్తు ఉద్యమంపై అ.ర.సం. 'నాలుగు రోడ్ల కూడలిలో నల్లటి రక్తపు మరకలు', సాహితీ

ప్రవంతి 'వికసించిన విద్యుత్తేజం' లాంటి కవితా సంకలనాలను వెలువరించి ప్రజోద్యమానికి బాసటగా నిలిచాయి.

ప్రపంచీకరణ ఇప్పుడు అందరి నోళ్లలో నానుతున్న మాట. ప్రపంచీకరణను శరవేగంతో ముందుకు తీసుకెళ్లాలని పాలక వర్గాలు ప్రయత్నిస్తూ ఉంటే ఆ రథ చక్రాల కింద పడి నలిగిపోతున్న సామాన్యుల వెతలను అక్షరీకరిస్తున్న రచయితలకూ కొదవలేదు. నాళేశ్వరం శంకరం 'దూదిమేడ', జూకంటి జగన్నాథం 'వాస్కోడిగామా డాట్ కాం', నందిని సిధారెడ్డి 'భూమిస్వప్నం', అద్దేపల్లి రామ్మోహనరావు 'పొగచూరిన ఆకాశం', జయధీర్ తిరుమలరావు 'గ్లోబల్ ఖడ్గం' ప్రపంచీకరణ విపరిణామాన్ని ఎలుగెత్తి చూపాయి. విశాలాంధ్ర ప్రచురణాలయం 'ప్రపంచీకరణ ప్రతిధ్వని', 'గ్లోబలైజేషన్ కథలు' ప్రచురించింది.

విచిత్రమేమిటంటే ప్రభుత్వాలు చేస్తున్న తప్పులను, సమాజంలో ప్రబలుతున్న లోపాలను నిరసిస్తూ నాటికలు, నాటకాలు ఎన్నెన్నో వస్తున్నాయి. సమాజంలో జరిగిన ప్రతిమార్పును ఎప్పటికప్పుడు అవి ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. ఆ నాటికలు, నాటకాల పోటీలను నిర్వహించే పరిషత్తుల ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా ప్రభుత్వంలో విధాన నిర్ణయాలు తీసుకొనే స్థాయి ఉన్నవారే హాజరౌతుంటారు. అప్పటికి ఆ ప్రదర్శనను చూసి చప్పట్లు కొట్టి వెళ్లిపోతుంటారు కూడా. ప్రభుత్వమే బంగారు నందులనిచ్చేందుకు నాటిక, నాటకాల పోటీలను పెడుతోంది. ఈ పోటీల్లో కనిపించేవన్నీ సమాజంలో ఎదురయ్యే రుగ్మతలే. ప్రభుత్వపరంగా ప్రజలు ఆశిస్తున్న విషయాలే. అయితే వీటిని చూసిన పాలకవర్గం, అధికార యంత్రాంగం ఆ సమస్యల పరిష్కారానికి ఏం చేస్తోందన్నది ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ఇటువంటి నాటికల్లో వల్లూరి శివప్రసాద్ రచించిన హింసధ్వని నాటిక పిల్లలను చదువు పేరుతో వేధిస్తూ ఒత్తిళ్లకు గురిచేస్తూ తల్లి దండ్రుల ఆప్యాయత, అనురాగాలకు దూరంగా ఉంచే పరిస్థితులను వివరించి చెప్పింది. ఈ నాటిక ఎన్నెన్నో పరిషత్తుల్లో ప్రదర్శితమవ్వటమే గాక, నంది పురస్కారాలను కూడా పొందింది. రైతు ఆత్మహత్యలకు కల్తీ విత్తనాలు, అధిక వడ్డీ రుణాలు కారణమంటూ నాయుడుగోపీ దర్శకత్వంలో చాలా నాటికలు వచ్చాయి. ఇవిగాక ఆడపిల్లల మీద ఆమ్ల దాడులు, ప్రేమ పేరుతో మోసం చేయటం తదితర ఇతివృత్తాలతో నాటికలు, నాటకాలు చాలానే వచ్చాయి. వీటిలో ఎక్కువ బంగారు నంది బహుమతులు పొందినవే. అయినా వాటికి పరిష్కారాలు చెప్పడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లే ఉంది. పాలకులు సాహితీ లోకం చేసే విమర్శలను సాహిత్యాన్ని కేవలం వినోద ప్రక్రియగానే భావించి చేతులు దులుపుకుంటున్నారు.

ప్రస్తుత దశలో పాఠకులను నిద్రబుచ్చే సాహిత్యానికి ఉన్న ఆదరణ ఉత్తేజపరిచే సాహిత్యానికి లేదన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. కాలక్షేప సాహిత్యం వాణిజ్యపరంగా లాభసాటిగా మారింది. అయితే వీటికున్న సాహితీ విలువ పూజ్యం కాబట్టి వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేకపోయినా అలాంటి సాహిత్యం నవతరం మీద చూపే దుష్ప్రభావాన్ని విస్మరించలేం. క్షుద్ర సాహిత్యాన్ని ఎదుర్కోవడానికి ఉత్తమ మార్గం మంచి సాహిత్యాన్ని అపారంగా సృష్టించడమే.

కొన్నేళ్ల క్రితం తెలుగు సాహిత్యంలో స్తబ్ధత నెలకొంది. కానీ దాన్ని పటాపంచలు చేయడంలో దిగంబర కవులు, పైగంబర కవులు తమవంతు పాత్ర నిర్వహించారు. దిగంబర కవుల్లోని లోపాలను ఎత్తి చూపడంలో రా.రా. లాంటి విమర్శకులు దిద్దుబాట చూపారు. ఇప్పుడు మళ్లీ కొన్నేళ్లుగా రాష్ట్రం ఎన్నో తీవ్ర సమస్యలను, చరిత్రలో కనీ వినీ ఎరుగని దురాగతాలనూ ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలోనూ ప్రజలను చైతన్యవంతుల్ని చేసే స్ఫూర్తి దాయకమైన రచనలు తరచుగా రావడం లేదు. కనుక సాహితీ రంగంలో మరోమారు స్తబ్ధత ఆవరించిందన్న అభిప్రాయం ఉంది.

సాహితీకారులు రాజకీయాలకు దూరంగా ఉండాలన్న వాదనను అసలైన రచయితలు ఎన్నడూ ఖాతరు చేయలేదు. అయితే రాజకీయ, సామాజిక ఉద్యమాలే సరైన దిశానిర్దేశం లేకుండా సాగుతున్నప్పుడు రచయితల నుంచి అద్భుతాలు ఆశించలేం. రచయితలకు తాత్విక దిశానిర్దేశం చేసిన అరసం, విరసం లాంటి వాటి కార్యకలాపాలు ఇప్పుడు ఉద్ధృతంగా కనిపించకపోవడానికీ కారణం ఇదే. అయితే వ్యక్తుల స్థాయిలో మాత్రం సామాజిక చైతన్యం ప్రతిఫలిస్తూనే ఉంది. ఇది సమష్టి తత్వాన్ని మరోసారి సంతరించుకుంటే స్తబ్ధత ఆవరించిందన్న విమర్శకు తావుండదు. ప్రజల్లోనూ ఆ చైతన్యాన్ని ప్రజ్వలింపజేయగలిగిన రచయితలూ చరిత్రలో నిలిచిపోతారు.

- తెలుగు వెలుగు బృందం



మాటకట్టు - 7
సమాధానాలు

1 ఏ	2 రు	3 వా	క		4 స్వా	తి		5 కృ	6 తి
7 కా	మ	న		8 త	మి		9 ద్వా	ప	ర
కి		10 ర	11 జ	ని		12 కం	ద		కా
	13 చం		14 ర	వి	15 క		16 శి	17 ర	సు
18 వే	ప	గిం	జ		19 రు	చి		స	
20 దా	క		21 ర	22 మ	ణ		23 ప	న	24 స
25 ద్రి	మా	26 హి		తి		27 వా	వి		ర
	28 ల	లా	29 టం		30 నీ	రు		31 బ	స్సు
32 ఊ		33 రి	క	34 లే	వి		35 గు	రి	
36 హా	రి		37 ము	డి		38 ప	డి	సె	ము

తెలుగులో రాత... శాస్త్రవేత్తల బాధ్యత

శాస్త్రాన్ని అధ్యయనం మాత్రమే చేసేవారు కొందరు. అధ్యయనం చేసి తెలుసుకున్న విషయాలను నలుగురితో పంచుకునే వారు మరికొందరు. శాస్త్రవిజ్ఞానాన్ని రాతలోకి మార్చి వ్యాప్తిలోకి తెచ్చేది ఇంకొందరు. శాస్త్రసారాన్ని, పరిశోధనల ఫలితాలను మాతృభాషలో అక్షరీకరిస్తూ... జాతిని శాస్త్రీయ వెలుగుల్లోకి నడిపించే శాస్త్రవేత్తలు ఒకరో ఇద్దరో! అలాంటి అరుదైన వ్యక్తుల్లో ఒకరు... **ఆచార్య పేరంరెడ్డి పెద్దమద్దులేటిరెడ్డి.**

సముద్ర శాస్త్రవేత్తగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఆయనకు అమ్మభాషంటే అపారమైన అభిమానం. అందుకే, కడలి కడుపులోని రహస్యాలను పిల్లలకు అర్థమయ్యేలా వివరిస్తూ అచ్చ తెలుగులో పుస్తక రచన చేశారు. చేస్తున్నారు. శాస్త్ర విజ్ఞానాన్ని మాతృభాషలోకి తీసుకురావడం, దాని వల్ల జాతికి ఒనగూరే ప్రయోజనాలు తదితర అంశాలపై 'తెలుగు వెలుగు'తో తన అభిప్రాయాలను పంచుకున్నారు మద్దులేటిరెడ్డి. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులను సాధించిన తెలుగు వారెందరో ఉన్నారు. వారందరూ తమ పరిశోధనల ఫలితాలను తెలుగులో రాయాలి. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రంగానికి సంబంధించిన విజ్ఞానాన్ని తెలుగులోకి తేవాలి. దీని వల్ల మన విద్యార్థులకు ఎనలేని మేలు జరుగుతుంది. అంతిమంగా ఈ రచనలు జాతి శాస్త్రీయ పురోగమనానికి తోడ్పడతాయి. ఆంగ్లేతర అగ్రరాజ్యాలు ఈ సంగతిని ఎప్పుడో గుర్తించాయి. స్థానిక భాషలోనే వైజ్ఞానిక శాస్త్రాల్ని అభివృద్ధి చేసుకుంటున్నాయి. చైనా, జపాన్, రష్యా, జర్మనీ తదితర దేశాల్లో పరిశోధన పత్రాలను ముందు స్థానిక భాషలోనే రాయాలి. ప్రపంచ దేశాల గుర్తింపునకు మాత్రమే. తర్వాత వాటిని ఆంగ్లంలోకి అనువదిస్తారు. ఆయా దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో చేరే విదేశీ విద్యార్థులందరూ మొదట చేయాల్సిందేంటో తెలుసా... అక్కడి భాషలను నేర్చుకోవడం. ఎందుకంటే ఆ విద్యాలయాల్లో పరిశోధన చేయాలంటే స్థానిక భాషే ఆధారం.

సముద్రశాస్త్రంలో పరిశోధనల కోసం ప్రపంచ దేశాలన్నీ తిరిగా. శాస్త్ర సాంకేతిక విషయాలను స్థానిక భాషల్లో ప్రచురించడంపై ఆయా దేశాలు చూపిస్తున్న శ్రద్ధ ఆశ్చర్యపరుస్తుంది. చిన్న ఉదాహరణ చెప్పుకోవాలంటే... కెనడాలో క్యూబెక్ అని ఒక రాష్ట్రముంది. అక్కడ ఆంగ్లం మాట్లాడే వారితో పాటు ఫ్రెంచి మాతృభాషీయుల సంఖ్య అధికం. దాంతో శాస్త్రీయ పరిశోధనలను ఆంగ్లంలో, ఫ్రెంచిలో రాస్తారు. ఆంగ్లంలో ఒక పుట ఉంటే దాని పక్కనే ఫ్రెంచి పుట ఉంటుంది. ఖండాంతరాల దాకా ఎందుకు... మన పక్కనే ఉన్న కర్ణాటక ఉంది కదా! శాస్త్రీయ విజ్ఞానాన్ని మాతృభాషలోకి తెచ్చుకోవడంలో అదెంతో ముందు ఉంది. పరిశోధన పత్రాలను కన్నడంలో

రాసే విద్యార్థులకు అక్కడ అదనపు మార్కులను వేస్తున్నారు. మన దగ్గరేమో ఆ పద్ధతే లేదు.

మన రాష్ట్రానికి వరం... అతిపెద్ద తీరప్రాంతం. మత్స్యసంపద అభివృద్ధికి విశేషమైన కృషి చేసే అవకాశం మనకు ఉంది. దీని ద్వారా మత్స్యకారుల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. మన వాళ్లు లాటరీ పద్ధతిలో చేపలను వేటాడతారు. అదే జపాన్, కెనడా లాంటి తదితర దేశాల్లో దీనికి ఆధునిక పద్ధతులను అవలంబిస్తారు. కడలి గర్భంలో ఎక్కడ చేపలు ఎక్కువగా ఉన్నాయో ఉపగ్రహాల ద్వారా తెలుసుకుంటారు. వేటకు వెళ్లడానికి 24 గంటల ముందే మత్స్యకారులకు కచ్చితమైన సమాచారం ఇస్తారు. మన దగ్గర ఈ విధానాలు లేవు. వలలు ఎంత లోతులో వేయాలి... ఏ వాతావరణంలో చేపలు ఉంటున్నాయి అనే విషయాలపై సమగ్ర పరిశోధనలు జరగట్లేదు. జరుగుతున్నా.. పరిజ్ఞానమంతా ఆంగ్లంలోనే ఉంటోంది. దాన్నంతా తెలుగులోకి తేవాలి. దీని వల్ల మన గంగపుత్రులకెంతో ఉపయోగం. వారి ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్రానికి ఆదాయమూ వృద్ధి చెందుతుంది.

పరిశోధనలో భాగంగానే కెనడాలో ఉన్నప్పుడు చాలా అంశాలను గుర్తించా. శాస్త్రీయ పరిశోధనలకు, పరిశోధకులకు అక్కడ ఇస్తున్నంత ప్రోత్సాహం ఇక్కడ లేదు. హార్బర్ నిర్మాణం కోసం క్షేత్రస్థాయిలో అధ్యయనానికి వెళ్లాలని చెబితే హెలికాప్టర్ సమకూర్చారక్కడ. మనం ఏమీ అడక్కుండానే అన్నీ అందుబాటులో ఉంచుతారు. మన దగ్గరైతే తెల్ల కాగితం కావాలన్నా... అర్జీ పెట్టమంటారు. శాస్త్రవేత్తలంటే విదేశీయులకు చాలా గౌరవం. పట్టాలను పట్టించుకోకుండా ప్రతిభ ఆధారంగా గుర్తింపునిస్తారు. అమెరికాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత సముద్ర శాస్త్రవేత్త వర్తింటన్ చదివింది మెట్రిక్యులేషన్ మాత్రమే. విదేశాల్లోని పిల్లలకు విద్యార్థి దశలోనే స్వేచ్ఛనిస్తారు. తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలను చిన్నారులపై రుద్దరు. వారు ఏ రంగంలో స్థిరపడాలనుకున్నారు... అందుకు తగ్గట్టుగా ప్రోత్సహిస్తారు.

ప్రస్తుతం సముద్ర అలలు, ఆటుపోట్లు, సునామీ తదితరాలపై తెలుగులో పుస్తకాలు రాస్తున్నా. మాతృభాషలో రాయడం వల్ల మనవారందరికీ ఈ విషయాలు అర్థమవుతాయన్నది నా తపన. వీటితోపాటు సాగర భౌతిక వనరుల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాలను కూడా తెలుగులో అక్షరీకరిస్తున్నాను. దీనిపై 30 ఏళ్ల కిందటే పరిశోధనా పత్రం ఇచ్చాను. దాన్ని మరింత అభివృద్ధి చేసి 2001లో ఆంగ్లంలో గ్రంథరూపమిచ్చాను. ఇప్పుడు దాన్ని తెలుగులోకి అనువదిస్తున్నాను. వీటితోపాటు సముద్ర శాస్త్రానికి సంబంధించి తెలుగు పదకోశాన్ని తయారు చేయాలనుకుంటున్నాను. అలా నాకు చేతనైన పద్ధతిలో తెలుగు తల్లి రుణం తీర్చుకోవాలనుకుంటున్నా.

నాదెండ్ల తిరుపతయ్య
కర్నూలు. 80087 06404

సాగర మథనం

భూగోళంపై సముద్రాల వాటా... 71 శాతం. మానవ జీవితంపై వీటి ప్రభావం అపారం. దాని గురించి తన 'బాలల సముద్రశాస్త్రం'లో చక్కగా వివరించారు మద్దులేటిరెడ్డి. రెండు భాగాలుగా ప్రచురించిన ఈ పుస్తకంలో సముద్రశాస్త్ర పుటుపూర్వోత్తరాలతో పాటు... సాగరగర్భంలో లభించే ఖనిజ, మత్స్య సంపద గురించి విడమరచి చెప్పారు. కడలిని నమ్ముకుని బతికే జీవరాసులు, వృక్షజాతులను పరిచయం చేశారు. సముద్రాలను శక్తి ఉత్పత్తి స్థావరాలుగా, తాగునీటి అవసరాలను తీర్చే వనరులుగా ఎలా ఉపయోగించుకోవచ్చో విశ్లేషించారు.

విజ్ఞాన సింధువు

కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలం సుద్దమల... ఆచార్య మద్దులేటిరెడ్డి స్వస్థలం. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి సముద్రశాస్త్రంలో స్నాతకోత్తర విద్యను అభ్యసించారు. పీహెచ్‌డీలో భాగంగా సముద్ర అలలు, ఆటుపోట్లపై పరిశోధనలు చేశారు. నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్ ఆఫ్ కెనడాలో ఫెలోషిప్‌కు అర్హత పొందిన తొలి భారతీయుడు ఆయనే. 1964 - 68 మధ్యలో కెనడాలో ఉండి విస్తృతస్థాయిలో సముద్ర పరిశోధనలు చేశారు. గోవాలోని జాతీయ సముద్ర శాస్త్ర అధ్యయన సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ), మంగళూరు (కర్ణాటక) కాలేజి ఆఫ్ ఫిషరీస్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. సముద్రశాస్త్రానికి సంబంధించి అంతర్జాతీయ, జాతీయ వైజ్ఞానిక పత్రికల్లో వందకు పైగా పరిశోధన పత్రాలను రాశారు. ఆయన రాసిన పుస్తకాలు... దేశ విదేశీ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యపుస్తకాలుగా ఉన్నాయి. న్యూయార్క్ అకాడమీ ఆఫ్ సైన్స్, ఏషియన్ ఫిషరీస్ సొసైటీ (మనీలా)ల్లో మద్దులేటిరెడ్డి సభ్యులు. జాతీయ స్థాయిలో కూడా ఎన్నో ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో సేవలు అందించారు.

తెలుగంటే తరగని మమకారం

ఆచార్య మద్దులేటిరెడ్డికి తెలుగన్నా, తెలుగు నేలన్నా ప్రేమ ఎక్కువ. అమెరికా, బ్రిటన్, జపాన్, జర్మనీ, కెనడా, ఇటలీ తదితర దేశాల్లో పని చేసిన ఆయన్ను తమ దగ్గరే ఉండిపోవాలని ఆయా దేశాల వారు కోరారు. కానీ, తెలుగు సంస్కృతి మీద ఉన్న ఇష్టంతో ఇక్కడకు తిరిగి వచ్చారు. మంగళూరులో పని చేసే సమయంలో 'తెలుగు సమితి'కి అధ్యక్షత వహించారు. స్థానికంగా ఉన్న తెలుగు వారందరినీ ఒకే తాటిపైకి తేవడానికి 'తెలుగు వెలుగు' పేరిట ఓ పత్రికనూ నిర్వహించారు. కర్నూలులో స్థిరపడిన తర్వాత 'తెలుగు కళాసమితి'ని ప్రారంభించారు. వర్ధమాన కవులు, రచయితలను ప్రోత్సహిస్తున్నారు. వారి పుస్తకాల ప్రచురణకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. తన పింఛను సొమ్మునే దీనికి వినియోగిస్తున్నారు. విదేశీయులు తనకు రాసిన ఉత్తరాల నేపథ్యంగా 'పడమటి పవనాలు' అనే పుస్తకాన్ని ప్రచురించారు.

మనకూ ఉన్నాయి మందులూ... మాకులూ...

కూరగాయలు తరుగుతున్నప్పుడు అనుకోకుండా వేలు తెగుతుంది. చప్పున ఇంత పసుపును తీసుకుని రక్తం కారే చోట అద్దేస్తాం. దెబ్బకు రక్తం గడ్డకట్టేస్తుంది. ఏ వైద్య కళాశాలలో నేర్చుకున్నాం మనం ఈ కిటుకును? ఇదే కాదు... ఇలాంటి చిట్కాలు కొన్ని వందలు తెలుసు మనకు. వాటినెలా ఔపోసన పట్టాం?

మందులూ - మాకులూ... తెలుగు ప్రజలకు అరచేతిలో ఉసిరికాయల్లా బాగా తెలిసిన అంశాలే! తరతరాలుగా మన ఉత్సవాల్లో, పండుగల్లో, సంబరాల్లో వేప మండలు అంతర్భాగం. అంటు రోగాలు పురుగుల నివారణలో... ఒకటేమిటి... రోజువారీ వ్యవహారాన్నింటిలోనూ వాటినే ఉపయోగిస్తూ వస్తున్నారు. మరి తెలుగువారికి వైద్య రహస్యాలేవీ తెలియవని ఎవరైనా ఎలా అనగలరు?

వైద్యశాస్త్రం అనేదే లేదని మనం అనుకుంటున్న ఆ రోజుల్లో... సమాజం తన బతుకుబాటలో అలవాటుగా అనుసరిస్తూ వచ్చిన పద్ధతులెన్నో. అవే ఆనాటి వారి ఆరోగ్యానికి శ్రీరామరక్షలా నిలిచేవి. నాటి ప్రజల రూపాలూ, అప్పటి గుహల్లో చిత్రించిన మనుషుల బొమ్మలూ చూసినప్పుడు ఇదే అనిపిస్తుంది.

'చచ్చిన వారిని బతికించే సంజీవని మొదలు ప్రాణమున్న వారిని అరనిమిషంలో చంపగల కాలకూటం వంటి మూలికల వరకు'... వాటి పరిజ్ఞానం జ్ఞానపథులైన జానపదులకు ఉండేది. అందుకు సాక్ష్యాలుగా ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి వారు ఎన్నో జానపద గీతాలను సేకరించి అందించారు.

కాళ్లాగజ్జె, కంకాళమ్మా
వేగూచుక్క - వెలగామొగ్గ
మొగ్గా కాదు - మోదుగ నీరు
నీరూ కాదు - నిమ్మలవాయు
వాయూ కాదు - వాయింటకూర
కూరా గాదు - గుమ్మడి పండు
పండూ కాదు - పావడ మీసం
మీసం కాదు - మిరియాల పోతు
పోతూ కాదు - బొమ్మలశెట్టి
శెట్టి కాదు - శామల మన్ను
మన్నూ గాదు - మంచి గంధం చెక్క
లింగూలిటుకూ - పందెమూల పటుకు
కాలు పండినట్లు - కడకుదీసిపెట్టు

ఆడపిల్లలు ఆడుతూ పాడుకునే గేయమిది. ఇందులో చర్మవ్యాధిని నివారించే ఔషధం దాగి ఉంది. తిరుమల రామానుజ స్వామి నుంచి అర్థాన్ని తెలుసుకుని మరీ బిరుదురాజు వారు ఈ విషయాన్ని ప్రకటించారు. పై గేయంలో తెలిపినవన్నీ తెలంగాణాలో స్థానికంగా ఉన్న పేర్లు. కంకాళమ్మ అంటే కచ్చూరాయి. వేగుల చుక్క... బావంచాలు. వెలగమొగ్గ... పాదరసం. ఈ మూడింటితో తయారు చేసిన లేపనం చర్మ వ్యాధిని తగ్గిస్తుందని భావం. పాదరసానికి బదులు మోదుగ చెట్టు నీరు, వాయింట కూర, గుమ్మడిపండు... ఇలా ప్రత్యామ్నాయంగా ఏది దొరికినా వాడుకోవడానికి మరో తొమ్మిది మూలికల్ని ఇదే గేయంలో ప్రస్తావించారు. తరతరాల తెలుగు వైద్యానికి ఈ గేయమే ఒక ప్రతీక. తెలుగు

భాషలోని వైద్య రహస్యాలకు ఇదో ప్రాచీన సాక్ష్యం.

ఒప్పుల కుప్పా - ఒయ్యారి భామా
సన్నబియ్యం - చాయా పప్పు
పాలూ నెయ్యిడి - పాశం వొండూ
నీ మొగుడు దింటే - ఆనందమంటే

- వినే ఉంటారు కదా ఈ గేయాన్ని కూడా. సన్నబియ్యం, చాయ మినపప్పు కలిపి వండిన పాయసంలో నెయ్యి బాగా వేస్తే పుంస్త్వం పెరుగుతుందని అర్థం. 'చెమ్మ చెక్కా - చేరడేసి మొగ్గ' లాంటి ఆట పాటల్లో మన ఊహకందని వైద్యరహస్యాలేవో నిక్షిప్తంగా ఉన్నాయి. 'దయగొని దర్భ సూచి కుటితంబగు మూతికి గారతైలమున్' అనే చాటు పద్యం... గార చెట్టు నుంచి తీసిన తైలాన్ని కుష్ఠు వ్యాధి పీడిత శరీరభాగాలపై రాయాలని సూచిస్తోంది. ఆంధ్ర మహాభారతంలో సత్యభామకి ద్రౌపది చెప్పిన వశీకరణ ప్రస్తావన ఉంది. చెడు ఫలితాలను వివరించి, చివరికి- 'మొగుడి ప్రాణం మీదకు తేవడమే' తప్ప వీటితో ప్రయోజనం ఉండదంటుంది. ప్రేమ అనే ఒకే ఒక వశీకరణ యోగం మాత్రమే ఉపయోగపడుతుందంటూ హితబోధ చేస్తుంది.

మన సామెతల్లో కూడా కొన్ని వైద్యపరమైన చిట్కాలు కనిపిస్తాయి. 'కాళ్లకు రాసుకుంటే కళ్లకు చలువ' అనేది అలాంటి వాటి ఒకటి. వేడి చేసినట్లు కళ్లు మండటం సహజం. అప్పుడు అరికాళ్లకు ఆముదాన్ని మర్దన చేస్తే వేడి తగ్గుతుంది.

కాలప్రవాహంలో పోర్చుగీసు వారు మన గడ్డపై అడుగుపెట్టారు. వారిని ఫిరంగులు, ఫరంగు దేశీయులనీ అన్నారు మనవారు. మిరపకాయలు, పొగాకు, వాటితో పాటు సిఫిలిస్ వ్యాధినీ వెంటబెట్టుకుని ఈ దేశానికొచ్చారు. ఫరంగుల కారణంగా వచ్చిన వ్యాధి కాబట్టి ఫ(ఫి)రంగ అనే పేరు పెట్టింది 'భావప్రకాశ' అనే ఆయుర్వేద గ్రంథం. రసకర్పూరంతో ఆ రోగానికి చేసే చికిత్సను కూడా వివరించింది. ఫిరంగి చెక్క అనే కొత్త వన మూలికను కూడా ఈ చికిత్స కోసమే పోర్చుగీసుల నుంచి పొందారు మనవాళ్లు. అప్పట్లో తెలుగునాట ప్రసిద్ధిపొందిన ఆయుర్వేద వైద్య గ్రంథాలనేకం. యోగ రత్నాకరం, వైద్య చింతామణి, బసవరాజీయం, శరభరాజీయం... వీటిలో ముఖ్యమైనవి.

ఎంత సంస్కృతంలో రాసినా, తెలుగు వాళ్లు తెలుగుదనాన్ని దాచుకోలేరు. ఎక్కడో ఒక చోట అది తప్పకుండా గుబాళిస్తుంది. అలాంటి గుబాళింపే మనకి 'యోగరత్నాకరం'లో కనిపిస్తుంది. ఇందులో రసం/ చారు గురించి చమత్కారముంది. తమిళనాట సాంబారు ఎంత ప్రసిద్ధో, తెలుగిళ్లలో రసం అంత విరివి. సాంబారు వడ్డించినా, పెళ్లి విందుల్లో వెనకే చారు కూడా వస్తుంది - సంప్రదాయం వదులుకోలేక! భోజన పదార్థాల్లో సారభూతం కాబట్టే సారం అన్నారు. అదే తెలుగువారి నోళ్లలో పడి చారు అయింది. కృశర అనే మరో వంటకం గురించి కూడా చెప్పుకోవాలి. ముత్యాల్లా తెల్లగా ఉండి కొనలు విరగని బియ్యాన్ని, దానికి నాలుగో రవంత పొట్టు తీసి ఎండించిన తెల్లని చాయ మినపప్పునీ కలుపు తారు. నీళ్లు పోసి ఉడికించి అదే సమయంలో ఇంగువ, ఉప్పు, అల్లం, నెయ్యి కలిపితే పులగం. తమిళులు పెసర పులగాన్ని 'కట్టుపొంగలి' అంటారు. ఇది మినప పులగం. నాడు తెలుగువారికి ఇష్టమైన పదార్థం.

శ్రీనాథుడు 'కాశీఖండం'లో చెప్పిన ఆహార పదార్థాల్లో అంగార పోలియ ఒకటి. దాని తయారీ విధానమూ 'యోగరత్నాకరం'లో కనిపిస్తుంది. గోధుమ పిండిలో పంచదార, నెయ్యి కలపాలి. బాగా పిసికి నిప్పుల మీద కాల్చిన తర్వాత రొట్టెగా మారింది అంగారిక. తీపి తందూరి రోటీ!

తెలుగుదనాన్ని ప్రతిబింబిస్తూ సాగిన తెలుగు వారి వైద్యం ఆధునిక యుగంలో... స్వాతంత్ర్యోద్యమవేళ కొత్తపుంతలు తొక్కింది. నాడు కొమర్రాజు లక్ష్మణరావు నేతృత్వంలో 'విజ్ఞాన చంద్రికా ప్రచురణ'ల పేరిట వైజ్ఞానిక విషయాలను తెలుగులో అందించే ఉద్యమమూ బయల్దేరింది. ఆంగ్ల దాస్యంలోంచి బైటపడే లక్ష్యంతో ఇది సాగింది. స్వామి జ్ఞానానంద, యల్లాప్రగడ సుబ్బారావు, గొబ్బూరి వెంకటానంద రాఘవ రావు, కోట వెంకటాచలం, వేనరాజు భాను మూర్తి, వసంతరావు వెంకటరావు, డా॥ గాలి బాలసుందరరావు, డా॥ కొమర్రాజు అచ్చ మాంబలను ఈ విషయంలో గుర్తుచేసుకోవాలి. సామాన్యుడికి కూడా అర్థమయ్యేలా తెలుగులో ఆయుర్వేద శాస్త్ర రచనల్ని అందించడానికి డా॥ ఆచంట లక్ష్మీపతి అహరహం కృషిచేశారు. జమ్మి కోనేటిరావు, గోవర్ధన్, సీవీ సర్వేశ్వరశర్మ, కంఠంనేని రాధాకృష్ణమూర్తి, కేవీ కృష్ణకుమారి, సమరం, కొత్త రవీంద్రబాబు, కేఆర్‌కే మోహన్ తదితరులు ఎన్నో వైద్య వైజ్ఞానిక రచనలను తెలుగులోనే అందించారు. ఇంకా కె.నిష్టేశ్వర్, నారాయణరెడ్డి, చదలవాడ రాజరాజేశ్వర శర్మ, టి.భిక్షపతి, చిరుమామిళ్ల మనోహర్... వీరంతా ఆయుర్వేద అంశాలను ప్రజా బాహుళ్యానికి చేర్చిన వారిలో ముఖ్యులు. ప్రకృతి వైద్యశాస్త్రాన్ని మంతెన సత్యనారాయణరాజు ఉద్యమ రూపంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

ఇప్పటికే చరక, సుశ్రుతాది వైద్య గ్రంథాలకు తెలుగు వ్యాఖ్యానాలు బాగానే వచ్చాయి. శాస్త్రజ్ఞులకు ఉపయోగకరంగా త్రిధాతు సిద్ధాంతాన్ని విశ్లేషిస్తూ 1964లో ముక్కామల వెంకటశాస్త్రి రచనలు చేశారు. అవి వైద్య విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండేవి. ఇప్పుడవి అలభ్యం. గిరిజనులతో మమేకమై తిరిగి వనమూలికలను, వాటితో ఒనగూరే వైద్య ప్రయోజనాలను సేకరించిన వారు కొప్పుల హేమాద్రి. మొత్తమ్మీద తెలుగులో వైద్య రచనలకు ప్రాచుర్యం పెరుగుతోంది. ఇంకా పెరగాలి కూడా.

తరతరాల వారసత్వ సంపదగా వస్తున్న 'తెలుగు వైద్యం' ప్రాముఖ్యతను గుర్తించడం, ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని తెలుగులోకి తెచ్చుకోవడం... తెలుగు వారి కర్తవ్యాలు. వాటిని నెరవేర్చడానికి తెలుగు వారందరూ కంకణబద్ధులవ్వాలి. ఇప్పటికే ఆ కర్తవ్యాలను నిర్వర్తిస్తున్న వారికి అండగా నిలబడాలి. అప్పుడే మన ఆరోగ్యానికి 'మనదైన' రక్షణ.

డా॥ జి.వి.పూర్ణచంద్,
విజయవాడ. 94401 72642

కలం చెప్పని కవిత్వం

అంతవరకూ చంచల మేఘాలతో నిండిన నింగి మబ్బుపట్టి లోకం మసక బారితే పల్లె మనసులు తేలిక పడతాయి. ఆశతో ఆకాశానికి మొక్కుతూ నిట్టూర్పు విడుస్తూన్నప్పుడు తూర్పుగాలి వీస్తుంది. తొలకరి చినుకు కురుస్తుంది. విచ్చుకున్న విత్తులవుతారు కర్షకులు. మెత్తని భూమి పచ్చని పావడా పరుచుకుంటుంది. పర్జన్యుడు (వర్షమేఘం) పలకరిస్తాడు. తూనీగలు ఆడతాయి. తూములతో వర్షం కురుస్తుంది. పూలమకరందం నిండుతుంది. తుమ్మెదలకు తీరిక కరువవుతుంది. ఏరులూ, వాగులూ, నదులూ, సాగర సంగమానికి పరుగులు తీస్తాయి. పలుగు, పార, పలుపు, పశువు రైతుకు నేస్తాలై పుడమితల్లి సౌభాగ్యానికి తోడవుతాయి. పల్లె తల్లి ఒంటరవుతుంది. పొలాలే పల్లె ప్రజలకు నివాసాలవుతాయి. ఇది నాట్ల కాలంలో అన్నదాతల జీవితచక్రం.

వ్యవసాయాధార రాష్ట్రం మనది. దేశానికి అన్నపూర్ణగా వాసికెక్కిన నేల మనది. అయితే, రైతులు అనేక వ్యయప్రయాసలకోర్చి భూమిని సాగు చేస్తారు. విత్తులు జల్లి, ఆకును ఉడిచి, కలుపు తీసి, కోతల వరకూ పడే వారు శ్రమను వాళ్ల మరచి పోవడానికి పాట ఊతమైంది. తెలుగు జానపదుల మాండలికాల్లో భేదమున్నా ఈ పాట ప్రతిచోటా, నోటా పూదోట్లై వికసించింది. పదాల మకరందాన్ని పంచింది. ఈ గీతాల బృందావనిలోంచి ఓ 'నాట్ల' పాట...

"గట్టూ మాకులు గట్టి గడలూ బొందిచ్చి
గట్టు రాయని ఇంట్లో పుట్టే గౌరమ్మ
గట్టూ మాకులు గట్టి గడలూ బొందిచ్చి
గట్టు రాయని ఇంట్లో
పుట్టే గౌరమ్మ ॥
పుట్టుటే గౌరమ్మ ఏమేమి
గోరు
కుట్టూ వయ్యారి రవికె,
కుంకుమా కాయ
జాల వయ్యారి రవికె,
జామాల పేరు
వంకా చక్కటి కుడక వజ్రాల
పేరు ॥
నీ చేతి కంకణము ఏదే
శ్రీగౌరు
ఆడబోయిన కాడ ఏడ బోయినదో
నీ చేతి కంకణము ఏదే శ్రీగౌరు
ఆడబోయిన కాడ ఏడ బోయినదో ॥"

పల్లె ప్రజలు శ్రమకు ఎంత విలువనిస్తారో...వేలుపునీ అంతే నమ్ముతారు. ధాన్యాన్ని లక్ష్మీదేవిగా, పంటచేలను గౌరీదేవిగా భావిస్తారు. వివిధ సందర్భాల్లో కానుకలను సమర్పిస్తారు. తమ కుటుంబంలో వ్యక్తిగానూ భావిస్తారు. శ్రామికులు వరినాట్లు వేస్తున్న భూయజమాని ఇంట్లో పుట్టిన గౌరీ దేవతను వర్ణించిన గీతం అబ్బుర పరుస్తోంది.

నాటి రోజుల్లో జానపదగీతాలను ఆకాశవాణి ఆదరించింది. నియమిత సమయంలో ప్రసారాలు చేసింది. పల్లెపాటకు పీట వేసింది. ఆ గీతాల్లో మధురంగా ఆలపించిన గిడుగు లక్ష్మీకాంతమ్మ జానపద గీతం...

"ఊడ్పులూడ్చి యింటికెడదామె
రాయోలే పిల్లా
ఊడ్పులూడ్చి యింటికెడదామె
సీరాలెల్లి ఓసీరా తేవయ్యో
సీరాగట్టితే సిలకాలాగుంటా! ఆ
ఊడ్పులూడ్చి యింటికెడదామె!!
పోలేరమ్మ గుడి పుంతకాడ
ఆజాలారెంకటసామి జట్టేటో
ఆజాలారెంకటసామి జట్టేటో
వాలుగన్నులా సిన్నదానా!!
వల్లమాలినా సిగ్గటే
వచ్చి పోపోమంటారు
యెంటరారో యెంకన్నమావ
యెంటరారో యెంకన్నమావ!"

జానపదం అంటే ఆమెకు ప్రాణప్రదం. అది అంతరించిపోతున్న అపురూప సంపదన్నది ఆవిడ భావన. అందుకే, పల్లె పల్లెకు తిరిగి జానపద గీతాలను సేకరించారు. పదిలపరిచి ప్రపంచానికందించారు. ఆవిడే వింజమూరి సీతాదేవి. ఆమె సేకరించిన వ్యవసాయ గీతాల్లోని ఉడుపుల పాట...

"గట్టు మీదున్నది గానుగ చెట్టూ
గాలీ ధూళీ వచ్చి కొమ్మలల్లాడో
రింగుజాణా యశోదో గౌరీజాణ॥
గాలీ ధూళీ వచ్చి కొమ్మ లల్లాడీ
పూగొమ్మ లల్లాడి పూవు లల్లాడో॥
రింగూ॥
పూగొమ్మ లల్లాడి పూవు
లల్లాడో
కడకమ్మ లల్లాడి కాయ
లల్లాడో॥
కడకమ్మ లల్లాడి కాయ
లల్లాడో
అడవిలో వున్నాయి టేకు
దూలాలో॥ రింగూ॥
అడవిలో వున్నాయి టేకు
దూలాలు



టేకు దూలాలు దెచ్చి కొత్తిల్లు గట్టో॥
రింగూ॥
టేకు దూలాలు దెచ్చి కొత్తిల్లు గట్టో
కొత్తింట్లో నన్ను బెట్టి దండెల్లినారో॥
రింగూ॥
కొత్తింట్లో నన్ను బెట్టి దండెల్లినారో
దండెల్లిన మామయ్యలు నాకేమి దెచ్చో॥
రింగూ॥
దండెల్లిన మామయ్యలు నాకేమి దెచ్చో
కావిడతో చక్కిడాలు కరకంచు చీరో॥
రింగూ॥
కావిడతో చక్కిడాలు కరకంచు చీరో
మూటతో మట్టిడాలు మువ్వంచు చీరో॥
రింగూ॥
మూటతో మట్టిడాలు మువ్వంచు చీరో
ఉగ్గెట్టి పట్టీగిన్నె ఉయ్యాల పంపీ॥ రింగూ॥
ఉగ్గెట్టి పట్టీగిన్నె ఉయ్యాల పంపీ
వేల్లాడే సెంగులకూ వెండుంగ రాలో॥
రింగూ॥
వేల్లాడే సెంగులకూ వెండుంగ రాలో”

జానపదమంటే సాహిత్యం కాదని, సామాన్యుల కాలక్షేపానికే ఉపయోగపడుతుందనే అభిప్రాయం ఉన్న వారికి సమాధానం ఈ గీతం.

కావ్యాలు, స్తోత్రాల్లోనూ చివర ఫలశ్రుతి ఉన్నట్లే జానపదాల్లోనూ ఉంటాయనటానికి ఉదాహరణగా ఉన్న పాట...

“నాదాప నాదులు నంబ వెళ్లారు స్వామి
వేదాంత సారాన వేరు గావించే
పరమాత్మడనువాడు పాదిగావించెర స్వామి
విష్ణూకై మూర్తులు విత్తనము ఏశా
విష్ణూకై మూర్తులు విత్తనము ఏసెర స్వామి
మొదటి మంత్రము చేత మోమేరు పరశా
తిరు మంత్ర మనియేటి తీగె గాయించెర
హరి మంత్ర మనియేటి అల్లు గాయించెర
ఆకింత నలుపేమి అల్లు గాయించెర
ఆకింత నలుపేమి పూలు తెలుపేమి
తిరునాళ్ల పొయ్యేటి నాయన్నలారా స్వామి
తిరునాళ్ల నిధిమీద చెట్టే మొలిసింది స్వామి
చెట్టు మీదవి రెండు పక్షూలున్నాయిర స్వామి
పక్షూల పేరేమీ చెట్టూ పేరేమిర సామి
పరమ యోగులు రెండు పక్షులైనాయిర స్వామి
హరి మంత్రం తిరుమంత్రం ఆ చెట్టు పేరు
హరి మంత్రం అనేటి ఆ చెట్టు పేరు
పాట పాడిన వారికీ ఇన్నవారికిర స్వామి
కలుగును పుణ్యములు తొలగు
దోషములు”

జానపదం ఆది స్వరమై వెలసింది. కర్త ఎవరో, పుట్టుకెప్పుడో తెలియక పోయినా కాలానికి ఎదురీదింది. కలకాలం నిలిచింది. జానపదుల నుంచి జాలువారిన గీతం నిరక్షరాస్యుల్నీ చరిత్రలో నిలిపింది.



జనహృదయమే జానపదం

అమ్మ గొంతెత్తి పాడితే ఉయ్యాల్లో ఉగ్గ పట్టి ఏడ్చే శిశువైనా ఓలలాడుతూ నిద్రపోతుంది. పొద్దుపొడుపు నుంచి పద్దుమణిగే వరకూ శ్రమించే కర్షకునికి కూనిరాగం కుశలమడుగుతూ శ్రమను హరిస్తుంది. పాట పల్లకినీ మోసింది. పడవనూ నడిపింది. పడతుల కాయ కష్టంలోనూ పల్లవించింది. మాటలు మాణిక్యాలై, పదాలు వరదలై, చరణాలు తరంగాలై గీతాల సంద్రమైంది. గేయాల సంబరమయింది. పల్లె ప్రజలు గళం నుంచి పిల్ల తెమ్మెరలా ప్రసరించిన పదాలే సాహిత్యానికి తొలి అడుగులు. వాటినే మనం జానపదాలు అంటున్నాం. ప్రపంచంలో ఏ భాషా సాహిత్యాలకైనా మూలమిదే. ప్రతి భాషకూ, ప్రాంతానికీ ఉనికిని చాటింది. ప్రత్యేకతను నిలిపింది. జానపదాల్లో గీతాలు, కథలు, పొడుపు కథలు, సామెతలూ ఉన్నాయి. వీటిని జానపద మౌఖిక సాహిత్యంగా పరిగణించారు. దీనివల్ల ప్రాచీన ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, సాంఘిక జీవనం వెల్లడవుతాయి. ఈ సాహిత్యంలో జానపదగీతమే ప్రథమ స్థానాన్నాక్రమించుకుంది. మానవ జీవన గమనంలో ప్రతీ వేడుకనూ కన్నుల కట్టింది. భక్తి, యుక్తి, శక్తి, సూక్తి, శృంగారం దేన్నైనా ప్రజల భాషలో పరిమళించిన అక్షర సౌరభం జానపదం. ఇందులో మేలుకొలుపు నుంచి మంగళహారతి వరకూ ఉంటూ... కోడికూత, మేలుకొలుపు, దంపుళ్ళు, నాట్లు, కలుపు, కోతలు, జాలరి మొదలైన వాటితోపాటు వృత్తులకు, బంధుత్వానికి సంబంధించిన పాటలూ ఉన్నాయి. ఈ పాటల్లో ఉన్న పదజాలమంతా తెలుగువారి ఆస్తి. దాన్ని వెలికితీసినప్పుడే భాష పరిపుష్టమవుతుంది. వన్నెలీనుతుంది.

ఎం.రామజోగేశ్వరశర్మ,
హైదరాబాద్. 80085 51846

తల్లీ! వందనం



కామత్ హోటల్...

వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఆ సమయంలో జనం పలచగా ఉంటారు.

"నాకు ఒక సమస్య వచ్చిపడింది" అన్నాడు గోల్డెన్ ఏజ్ వృద్ధాశ్రమం మేనేజర్ హరిశ్చంద్ర స్నేహితుడు రాఘవతో.

"ఏమిటది"

"ఆరునెలల క్రితం కమలనే ఓ పెద్దావిడను తీసుకొచ్చాడు ఆమె కొడుకు ఆశ్రమంలో చేర్చడానికి. ఓ రెండు నెలల వరకు ఖర్చులకు సంబంధించి డబ్బు చెల్లించాడు. ఆ తరువాత కట్టడం మానేశాడు. ఉత్తరం రాశాం. డబ్బు విషయం తెలియజేస్తూ.. జవాబు లేదు. ఆశ్రమం నియమాల ప్రకారం ఆవిడను బయటకు పంపించేయాలి"

"కొడుక్కే పట్టనప్పుడు.. నువ్వు ఏం చేయగలవు"

"కమల గారి మీద ఉన్న జాలి. చాలా మంచావిడ. ఆశ్రమంలో ప్రతి ఒక్కరికీ ఏదో రకంగా సహాయపడుతూ ఉంటుంది అవసరమొచ్చినప్పుడల్లా..."

""విషయం ఆవిడకు తెలుసా"

"చెప్పాను"

"ఏమంటుంది"

"వంట పని అదీ చేయడానికి నేను సిద్ధమే. ఎక్కడైనా పని ఇప్పించండి. పనిజేసి కట్టాల్సిన డబ్బు కట్టేస్తాను అంటుంది"

"బానే ఉందిగా"

"సరే.. కానీ యాజమాన్యం ఊరుకోవట్లేదు. పద్ధతి పద్ధతే. ఒకళ్లకి అలుసిస్తే రేపు వ్యవస్థ దెబ్బతింటుంది అంటోంది. బయటకు పంపించేయమని ఒత్తిడి చేస్తోంది"

"నాకు ఒక ఆలోచన వచ్చింది"

"ఏమిటీ?"

"నాకు ఒక వంటమనిషి అవసరం. మా ఆవిడకు సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. పిల్లలతో ఇబ్బందిగా ఉంది.."

"అయితే ఇంకేం. నీకెటువంటి అభ్యంతరం లేకపోతే ఆవిడకు చెబుతాను చాలా నిజాయితీపరురాలు.. మంచి మనిషి.. నువ్వే చూస్తావుగా నేను చెప్పడం దేనికి"

* * *

రాఘవతో పాటు కమలను చూసిన ఏడేళ్ల ప్రీతి "ఎవరు నాన్న మన చుట్టమా"

"కాదమ్మా కొత్త వంటమనిషి. మన వంటగది, మూలగది చూపించు... మనతోనే ఉంటారు"

"నీ పేరేమిటమ్మా" అనడిగింది కమల.

"ప్రీతి.. మీ పేరు"

"కమల"

"మీ పేరు ఏదైనా, నేను మాత్రం మామ్మా అనే పిలుస్తాను ఇష్టమేనా"

ఆ ముద్దు మాటలకు ముగ్ధురాలైంది కమల.

"ఎందుకు వంట పని చేస్తున్నావు. ఎవరూ లేరా మీకు"

"ఉన్నాడమ్మా మా అబ్బాయి. వాడికి పెళ్లయింది. ఇల్లు చిన్నది.. అందరికీ సరిపోదు. నేను బతకటానికి ఈ ఉద్యోగం



అన్నమాట" బాధతో అంది. గతం గుర్తొచ్చినట్లుంది. కళ్ల వెంట నీటి బిందువులు జారిపడ్డాయి.

* * *

కమల ఓ పల్లెటూళ్లో పుట్టి, పెరిగింది. రైతుకిచ్చి పెళ్లి జరిపించారు పెద్దలు. ఓ కొడుకు పుట్టాడు. భరత్ అని పేరు పెట్టారు. దగ్గర్లో కొంత వరకు చదువు పూర్తి చేసుకుని, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ కాలేజీలో చేరాడు. చదువుకుంటున్న సమయంలోనే తండ్రి గుండెపోటుతో చనిపోయాడు. పల్లెటూరు.. ఒంటరి తల్లి.. ఆర్థిక పరిస్థితులు అన్నీ దృష్టిలో ఉంచుకుని చదువు మానేయడానికి సిద్ధపడ్డాడు భరత్.

ఆ పరిస్థితుల్లో కమల గుండె నిబ్బరం చేసుకుని అంది.. "నువ్వేం బాధపడకు నాన్నా... ఎంత కష్టమైనా సరే.. నేను తట్టుకోగలను. నువ్వు మాత్రం చదువు మధ్యలో ఆపవద్దు.. నేను డబ్బు పంపుతాను"

ఫీజులు, ఇతరత్రా ఖర్చుల కోసం పొలం కొంత తాకట్టు పెట్టాల్సి వచ్చింది. భరత్ చదువు పూర్తయ్యేసరికి కమల రెక్కల కష్టం మీదే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

"అమ్మా, నాకు జూనియర్ ఇంజినీర్‌గా ఉద్యోగం వచ్చింది.. మన కష్టాలు తీరిపోతాయి" అని భరత్ చెప్పగానే కమల కళ్లల్లో ఎంత ఆనందమో.. నెత్తిమీద నుంచి ఓ పెద్ద బరువును తొలగించినట్లుగా సంతోషపడింది.

"నేను ముందు ఉద్యోగంలో చేరి, ఇల్లు తీసుకుని వచ్చి నిన్ను తీసుకెళ్తాను"

"అలాగే"

నెల గడిచిపోయింది. కమల ఎదురుచూస్తూనే ఉంది. 'భరత్‌కు ఏం ఇబ్బంది ఎదురైందో' అని కంగారుపడింది కూడా.

ఆ తరువాత భరత్ రావడం హైదరాబాద్‌లో ఓ ఇంట్లో స్థిరపడటం జరిగిపోయింది.

"దేవుడి దయవల్ల ఉద్యోగం చదువైన వెంటనే వచ్చింది. ఇక పెళ్లి చేసుకుని ఓ ఇంటివాడివైతే బాగుంటుంది" అని తన కోరిక వ్యక్తపరిచింది తల్లి.

భరత్ ఏమీ మాట్లాడలేదు.

"నీ దృష్టిలో ఎవరైనా అమ్మాయి ఉంటే చెప్పు, లేకపోతే మంచి అమ్మాయిని చూడమని మన వాళ్లందరికీ చెబుదాం"

అప్పటికేం మాట్లాడకపోయేసరికి కారణం తెలియలేదు గానీ, ఆ తరువాత విషయం చెప్పాడు.

"అమ్మా నీకు శ్రమ లేకుండా కోడలు రాబోతుంది. మా కంపెనీ డిప్యూటీ డైరెక్టర్ గారమ్మాయి అమృత. ఆయనకు, ఆ అమ్మాయికీ ఇష్టమే. అమ్మాయి అందంగా ఉంటుంది. చదువుకుంది కూడా, నీకేం అభ్యంతరం ఉండదు.."

అమ్మ అభిప్రాయం తనే చెప్పగలిగేంత వాడయ్యాడు కొడుకు.

"భరత్... మనం మధ్యతరగతి వాళ్లం. మనతో సమానమైన వాళ్లయితే బాగుంటుంది. లేకపోతే సర్దుబాట్లలో ఇబ్బందులొస్తాయి. మనతో వాళ్లు కలవడం కష్టమవుతుంది. నేను గొప్ప కుటుంబం నుంచి వచ్చానన్న భావన ఆమెలో ఉంటే కష్టం... ఆలోచించు..."

భరత్ మౌనంగా ఉండిపోయాడు.

"నువ్వెలాగైనా ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటే నీ ఇష్టం.. నాకేం అభ్యంతరముంటుంది"

పెళ్లయింది. అమృత కాపురానికొచ్చింది.

కమల అనుకున్నట్లుగానే జరిగింది. బాగా డబ్బున్న కుటుంబం నుంచి వచ్చింది. ఒక్క కూతురు కావడం, బాగా గారాబంగా పెరగడంతో సమస్యలు మొదలయ్యాయి.

కమల ఎంత ప్రేమగా ఉన్నా, అదేం దురదృష్టమోగానీ అమృతకి అర్థమయ్యేది కాదు. అత్తగారంటే అయిష్టం. ఆమె పద్ధతుల్ని వంకపెట్టేది. ప్రతి చిన్న విషయానికీ పెడార్థాలు తీసి గొడవలు పెట్టుకునేది. అవమానపరిచేది. కొడుకు సుఖంగా ఉండాలనే ఉద్దేశంతో మనసు ఎంత గాయపడినా ఓర్చుకునేది కమల. చాలా విషయాలు చెప్పేది కాదు. మూగవేదన అనుభవించేది ఈ తల్లి. చెప్పుకోవడానికి ఎవరున్నారు కనుక. తన బీరువాలో ఉన్న భర్త ఫొటో తీసి చూసుకుంటూ ఒంటరిగా కుమిలిపోయేది. ప్రాణమున్న ఆమె ప్రాణంలేని ఫొటోతో గోడు చెప్పుకోవడం స్థిమితపడటానికే...

ఒకరోజు అమృత స్నేహితురాళ్లు నలుగురు ఓ కార్లో దిగారు. అంతా హాల్లో కబుర్లు చెప్పుకుంటున్నారు. పళ్లరసం తయారుచేసి వాళ్లకు తీసుకొచ్చింది కమల.

తెలిసో, తెలియకో కమలను 'ఎవరన్నట్లు' చూస్తే, వాళ్లకు తమ పనిమనిషిగా పరిచయం చేయడం తట్టుకోలేకపోయింది.

బాధతో మధ్యాహ్నం భోజనం కూడా చేయలేదు. సాయంకాలం భరత్ ఇంటికి రాగానే కమల జరిగిందంతా చెప్పేసింది. తన గుండె బరువు తట్టుకోలేక... ఓ ఓదార్పు కోసం...

ఓదార్పు మాటలేదు.

'ఏమిటీ ఫిర్యాదులు అసహ్యంగా' అన్నట్లున్నాయి ముఖ కవళికలు.

కొడుకు తీరు తెలియగానే అంది

"ఒరేయ్.. నేను మన ఊరు వెళ్లిపోతాను. మీరు సుఖంగా ఉండొచ్చు"

"ఊరా"

"అవును"

"ఎక్కడుంటావు"

'అదేమిటీ.. మన ఇల్లుందిగా"

"...అది అమ్మేశాను.. శంషాబాద్‌లో కొన్న ఇంటికోసం"

'ఒక్క మాటైనా చెప్పకుండా' అనలేదు.. అనుకుంది...

అమ్మ మౌనం చూసి "అవునమ్మా... ఇంకా అక్కడ ఏముందని వెళ్తాం. అందుకే ఉండేది పట్టణంలోనే కదా అని అమ్మేశాను"

"అంటే మన ఊరితో అనుబంధాన్ని తెంచేశావన్నమాట' అన్నట్లుంది. ఆమె మాట కాదు... భావం.. ఎందుకంటే అది ఒకలాంటి నిరాశ, నిస్పృహల్లోంచి వచ్చింది. కమల ఆలోచనలు నిద్రపోనివ్వలేదు. పొలం, ఇల్లు, భర్త ఉన్నప్పటి రోజులు, జనం రాకపోకలు, ప్రేమాభిమానాలు, ఒక్కొక్కటి గుర్తుకొచ్చి అతలాకుతలం చేశాయి. అర్ధరాత్రి ఎప్పుడో మెలకువ వచ్చి లేచింది కమల నీళ్లు తాగుదామని.

భరత్, అమృతల మాటలు వినబడ్డాయి.

"అమ్మ బాధపడుతోంది. ఆవిడ ఊరెళ్లి పోతానంటోంది"

"పోనీయండి"

"అది కాదు.. అక్కడేముందని, అన్నీ అమ్మేసే కదా ఇక్కడ పెట్టుబడి పెట్టాం.. ఓ పనిచేయి.."

"ఏమిటీ"

"జరిగింది పొరపాటని, క్షమించమని అడుగు"

"ఏమంటున్నారు... నేను ఆమెను క్షమించమని అడగాలా"

"ఏం? పెద్దావిడ.. తప్పేముంది"

"అయినా ఆ రోజు మీ అమ్మ పాత చీరలో ఎలా కనిపించిందో తెలుసా... అసహ్యంగా వాళ్ల ముందు అత్తగారు అని చెప్పడానికి సిగ్గేసింది. అందుకే అలా చెప్పాను"

"పెద్ద... ఎన్ని చీరలున్నాయని ఆవిడకు. నువ్వేమైనా - బాగా లేవని కొన్నావా ఎప్పుడైనా"

"ఏంటీ నన్ను నిలదీస్తున్నారు.."

"నిలదీయడం కాదు.. ఆలోచించు"

"అయినా ఆవిడ అలా నా మీద ఫిర్యాదు చేయడం బాగుందా. అంటే మీకు నా మీద కోపం రావాలనే కదా ఆవిడకు వయసులో అందంగా ఉండి, చదువుకున్న కోడలంటే అసూయేమో..."

"ఎందుకంతంత మాటలు"

"మీరు సమర్థించకండి.. ఇక ఆవిడ, నేను ఒక ఇంట్లో ఉండటం కష్టమే..."

"అంటే నీకు మా అమ్మ ఈ ఇంట్లో ఉండటం ఇష్టం లేదు"

"మళ్లీ నా నోటితో చెప్పిద్దామనా"

"ఎక్కడికెళ్తుంది.. ఊరికెళ్లకుండా చేశాం"

"బోలెడు వృద్ధాశ్రమాలు ఉన్నాయి"

"ఏం మాట్లాడుతున్నావ్"

"అవును"

"వృద్ధాశ్రమమా.. పిచ్చి పట్టలేదు కదా"

"మీరు ఆ పని చేయకపోతే నాకు పిచ్చి పడుతుంది. మీ అమ్మను మీ దగ్గరుంచుకుని నన్ను పిచ్చాసుపత్రిలో చేర్చండి.."

"ఒక్కగానొక్క కొడుకుని... ఈ వయసులో ఆమెను సంతోషంగా ఉంచాల్సింది పోయి..."

"మీరు మీ అమ్మను వదల్లేకపోతే ఓ పనిచేయండి, ఆవిడ, మీరూ ఉండండి. నేను మా పుట్టింటికెళ్తాను"

ఎటూ తేల్చుకోలేపోయాడు. ఇరకాటంలో పడ్డాడు. పెళ్లాం కోరిక తీర్చడానికే మనసు ఓటు వేసింది. కాఠిన్యం గెలిచింది. మర్నాడు ఉదయం...

"నిజమేనమ్మా... అమృత నీ మనసు కష్టపెట్టి ఉండొచ్చు. ఇద్దరికీ పడనప్పుడు ఒకే ఇంట్లో ఉండటం నరకంతో సమానం. నువ్వు మన ఊరికా వెళ్లలేవు... అందుకని..." ఆగిపోయాడు.

ఇబ్బందనిపించిందో, నిబ్బరం సన్నగిల్లిందో... నీళ్లు నిండిన కళ్లతో చూసింది కన్నతల్లి.

"అన్ని వసతులూ ఉండే వృద్ధాశ్రమం ఒకటుంది... ఏమంటావు"

దానికి ఆ తల్లి ఏం సమాధానమిస్తుంది. కన్నకొడుకే అలా అంటే.

కమలకు అర్థమైపోయింది. కోడలు తన కొడుకును ఇరకాటంలో పెట్టిన తీరుకి 'పిచ్చి తండ్రి ఎంత బాధపడ్డాడో' అనుకుంది... తను వారితో లేకపోతేనే వాళ్లు సుఖంగా ఉంటారంటే వెళ్లిపోవడమే మంచిది కదా!

గాయపడిన హృదయానికనిపించింది. వృద్ధాశ్రమానికి వెళ్లడానికే నిర్ణయించుకుంది.

* * *

"మామ్మా ఏమిటి మాట్లాడకుండా ఆలోచిస్తూ ఉండిపోయావు" ప్రీతి మాటలకు ఈ లోకంలోకి వచ్చింది.

కొన్నాళ్లు గడిచాయి. ఓ సెలవు రోజు కమల రాఘవను తన జీతంలో బయానా కింద ఓ మూడొందలు అడిగి తీసుకుంది. ఆ తరువాత బయటకు బయలుదేరుతుండగా ప్రీతి కూడా వస్తానంది. ఎక్కడికి అనడిగినపుడు చెప్పింది.

"ఇంతకు ముందు నేనున్న వృద్ధాశ్రమానికి"

ఇద్దరూ ఆశ్రమానికెళ్లి వెనక్కి వచ్చారు. ప్రీతి వాళ్ల నాన్నతో విషయం చెప్పింది.



"...మీరు డబ్బు అవసరమున్నప్పుడు మీ సొంతం కోసం అనుకున్నాను. మీరు పళ్లుకొని ఆ ఆశ్రమంలో వాళ్లకు పంచడానికి అనుకోలేదు. ఎందుకండీ.. అదంతా"

"నేను అలా అనుకోలేదు బాబూ... నన్ను చూడగానే వాళ్ల ముఖాలు వికసించాయి. ఈ పండు అందుకునేటప్పుడు అక్కడివారి ముఖాల్లో కనిపించిన ఆనందం నాకెంతో తృప్తినిచ్చింది.. నేను ఖర్చుచేసిన దానికంటే ఎక్కువే పొందాను"

రాఘవ వింటున్నాడు.

"...మా కోసం ఆలోచించే వ్యక్తి ఒకరున్నారు అనే ధైర్యం వాళ్లలో కనిపించింది..." అంటూ చెబుతోంది కమల.

రోజులు గడుస్తున్నాయి. రాఘవ భార్య లలితకు జబ్బుచేసింది. తీసుకోవలసిన జాగ్రత్తలు, క్రమం తప్పకుండా వాడాల్సిన మందులు ఇచ్చాడు వైద్యుడు... రెండు మూడు వారాలపాటు మంచం దిగలేదు. కమల ఆ బాధ్యతల్ని స్వీకరించింది. తల్లి ప్రేమలాంటి ఆ ప్రేమకు లలిత కోలుకుంది.

ఆమె సేవలకు రాఘవ కదిలిపోయాడు. ఎంతో కృతజ్ఞతాభావం... కమలమ్మగారనే సంబోధన 'అమ్మ'గా మారింది. దూరం తరిగింది.. బంధం పెరిగింది... "మీరు నాకు కృతజ్ఞతలు చెప్పటమేమిటండీ... ఇన్నాళ్లూ నన్ను వంటమనిషిగా చూశారా. మీ ఇంట్లో మనిషిగానే లెక్కకట్టారు. అలాంటప్పుడు ఇంట్లో మరో మనిషికి బాగుండకపోతే సహాయపడటం గొప్పా"

ఓ రెణ్నెల్ల తరువాత.. ఓ రోజు ఉదయం కాలింగ్ బెల్ మోగింది. రాఘవ తలుపు తెరిచాడు. ఎవరో కొత్త వ్యక్తి.

"నమస్కారమండీ.. మీరు రాఘవ గారు కదా!"

"అవును... మీరు"

"చెబుతా... మీతో మాట్లాడవచ్చా"

"తప్పకుండా... లోపలకు రండి"

కూర్చోగానే

"చెప్పండి... విషయమేంటో"

"నా పేరు భరత్.. నేను కావేరి ఇంజినీరింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నాను. దాదాపు ఓ ఏడాది క్రితం మా అమ్మను 'గోల్డెన్ ఏజ్' వృద్ధాశ్రమంలో చేర్చాను. నేను అక్కడికెళ్లి కనుక్కుంటే వాళ్లు మీ చిరునామా ఇచ్చారు.. ఆమెను తీసుకెళ్దామని..."

"ఓహో! మీరు కమలమ్మ గారి కొడుకా. మీకు సిగ్గనిపించలేదా కన్నతల్లిని అలా వృద్ధాశ్రమంలో విడిచిపెట్టి వెళ్లడానికి"

"నా భార్యకు ఆవిడుండటం ఇష్టం లేదు. నేను ఆమె మాటను కాదనలేని పరిస్థితి"

"అందుకే తల్లి గుండె బద్దలు చేశారన్న మాట"

"........"

"వృద్ధాశ్రమానికి డబ్బులు కట్టకపోవడం... వాళ్ల ఉత్తరాలు, ఫోన్లను పట్టించుకోకపోవడం.. అక్కడా ఆవిడ ప్రశాంతంగా బతక్కూడదనా"

"నేను ఈ విషయంలో అశ్రద్ధ చేయలేదు. జీతం నా భార్యకు ఇచ్చేస్తాను. తనే పంపుతూండేది. కట్టలేదన్నది నాకు తెలియదు"

"అంటే మీ ఆవిడ ఇబ్బంది పెట్టాలనే ఇలా చేసి ఉండాలి"

భరత్ తలదించుకున్నాడు.

"మీ అమ్మగారి మనస్తత్వం, తీరు మమ్మల్ని కట్టిపడేసింది. నా తల్లిలా భావిస్తున్నానావిడను. గొప్ప మనసున్న ఆవిడను పంపడం మాకిష్టం లేదు."

కన్నకొడుకు గొంతువిని లోపల్నుంచి ఆతృతతో వచ్చింది కమల.

"ఎలా ఉన్నావురా భరత్... అమృత ఎలా ఉంది.. ఇలా వచ్చావేంటీ? రాఘవ నీకు తెలుసా" అమాయకంగా అడిగింది.

"కాదమ్మా... నిన్ను ఇంటికి తీసుకెళ్దామని..."

"వద్దులేరా... అక్కడికొచ్చి నిన్ను అమృతలను బాధపెట్టడం, నేను బాధపడటం దేనికి"

"అలా జరగదమ్మా... నేను హామీ ఇస్తున్నాను. ప్రస్తుతం అమృత నీతో గొడవ పెట్టుకోదు"

'ఎలా చెప్పగలవు' అన్నట్లుంది మాతృమూర్తి చూపు.

"అమృతకు కుడివైపు పక్షవాతం వచ్చింది. మంచం దిగడం లేదు"

"అయ్యో... అయ్యో... పక్షవాతమా"

"అదీ కారణం అమ్మను తీసుకెళ్లడానికి! మీ భార్య ఆ తల్లికి కలిగించిన బాధకు పశ్చాత్తాపంతో ప్రవర్తిస్తోందనుకున్నాను... ఈ సమయంలో మీకు ఆమె అవసరం..."

"........"

"అమ్మా... ఇంత జరిగాక కూడా మీరు వెళ్దామనుకుంటున్నారా."

"చూడండీ... ఒకరి అవసరానికి సహాయపడటం, కష్టాలను పంచుకోవడం నా పని... ఎవరి కష్టానికైనా ముందుకొచ్చే నేను నా కొడుకు కష్టంలో ఉంటే వెళ్లకుండా ఎలా ఉండగలను. ఏవో.. తప్పులు చేసి ఉండొచ్చు.. ఈ గుండె గాయపడి ఉండొచ్చు... అన్నీ గుర్తుంచుకుంటామా..! అన్నింటినీ క్షమించే మనసిచ్చాడు ఆ దేవుడు"

తన సంచీ తీసుకుని రాఘవతో, లలితతో 'వస్తానని' చెప్పింది. 'మామ్మా' అంటూ వచ్చిన ప్రీతి బుగ్గలపై ప్రేమగా ముద్దు పెట్టింది. కొడుకుతో ముందుకు నడిచింది ఆ బంగారు తల్లి. గేటుదాటి వెళ్తున్న ఆ అమ్మను చూస్తున్న రాఘవ, లలిత కళ్లల్లో నీళ్లు పొంగి పొర్లాయి. 'మామ్మ' మళ్లీ వస్తుందా నాన్నా' అంటున్న ప్రీతి మాటలకు జవాబివ్వలేదు... ఇవ్వాలని లేదేమో.

మంత్రవాది మహేశ్వర్
హైదరాబాద్. 94414 20962

భాషాశాస్త్రం... విజయాస్త్రం

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆగస్టులో మరోసారి అధ్యాపక యోగానికి అర్హత పరీక్ష ఏపీసెట్ నిర్వహించబోతోంది. ఈ తరుణంలో అభ్యర్థులను విజయపథంలో నడిపించడానికి అందిస్తున్న ప్రణాళిక ఇది. విశ్వవిద్యాలయాల్లో సహాయాచార్యులు కావాలన్నా, డిగ్రీ కళాశాలల్లో, స్నాతకోత్తర కళాశాలల్లో అధ్యాపకులు కావాలన్నా, 'సెట్' అర్హత (రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష) తప్పనిసరి. సుదీర్ఘకాలం తరువాత మన రాష్ట్రం ఈ పరీక్ష నిర్వహిస్తుండటంతో లక్షలాది అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. గత 'సెట్'లో ఎక్కువమంది అర్హత సాధించిన ఘనత 'తెలుగు' అంశాని(సబ్జెక్టు)కే లభించడం విశేషం. ఇటీవల విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ చేయాలన్నా సెట్, నెట్ అర్హత ఉన్నవారికే ప్రాధాన్యతనిస్తుండటంతో సెట్‌కి అత్యంత ప్రాచుర్యం పెరిగింది.

ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యంతో పాటు 'సెట్'లో అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సింది భాషా శాస్త్రానికే. అందులో అధ్యయనం చేయాల్సిన అంశాలివి...

ఏపీసెట్‌కి అర్హత యోగం

"బాష్యతి ఇతి భాష" అంటారు. భాషించేది, మనోగత భావాలను కంఠధ్వనుల ద్వారా వ్యక్తం చేసేది, పరిమితమైన సాధనాలను అపరిమితంగా వాడుకునేలా చేసేది భాష. వాగ్రూప ధ్వనుల సంకేత సముదాయాల్ని భాష అంటారు. దేనిద్వారా మానవులు తమ అభిప్రాయాల్ని నివేదించుకుంటూ ఒకరికొకరు సహకరించుకుంటారో అటువంటి వారి కంఠధ్వనుల వ్యవస్థనే 'భాష' అని నిర్వచిస్తారు. ప్రజలు మాట్లాడే తీరునే భాష అని చెప్పవచ్చు.

భాషా శాస్త్రవేత్తల నిర్వచనాలు

- వ్యక్తి తన ధ్వన్యుత్పత్త్యవయవాల సాయంతో కావించే ధ్వనుల పరంపరే భాష - **సైమన్ పాటర్ (లాంగ్వేజ్ ఇన్ ద మోడర్న్ వరల్డ్)**
- వక్తకు శ్రోతకు మధ్య నాడీ మండలంతో, మేధతో పెక్కు సర్దుబాట్లు గావించుకొంటూ సాగే ఉన్నత సంక్లిష్ట సూత్ర జాలా వలయమే భాష - **సైమన్ పాటర్**
- మాట్లాడే అలవాట్ల సంక్లిష్ట వ్యవస్థే భాష - **హాకెట్ (ఎ కోర్స్ ఇన్ మోడ్రన్ లింగ్విస్టిక్స్)**
- ఒక సమాజంలోని సభ్యులు పరస్పరం సహకరించుకోవడానికి ఉపయోగించే నిర్వ్యాజ వాక్సంకేతాల ప్రక్రియే భాష.

విభిన్న వ్యక్తుల దృష్టిలో భాష నిర్వచనాలు

1. భావ ప్రకటనకు సాధనం భాష - సామాన్య మానవుడు
2. భాషోపయోగంలో ప్రజలకు అవరోధాలు లేకుండా చేసేది భాష - భాషాధ్యాపకుడు
3. కవితా సౌందర్యావగాహనకు ఒక సాధనం భాష, చిత్రకారుడికి రంగుల్లాగా - వాఙ్మయోపాసకుడు
4. మానవ ప్రవర్తనను ఇతర జంతు ప్రవర్తనల నుంచి వేరుపరుచుకోవటానికి ఉపయుక్తమయ్యే శక్తిమంతమైన ఉపకరణం భాష - మనస్తత్వ శాస్త్రజ్ఞుడు
5. 'తాను అధ్యయనం చేసే సంస్కృతిలో' ఒక భాగం భాష - మానవ శాస్త్రజ్ఞుడు (ఆంత్రోపాలజిస్టు)
6. వివిధ దేశోపయోగి భాష - మత ప్రచారకుడు
7. శాసనాలను, రికార్డుల్ని చూసి చరిత్ర నిర్మించటానికి పనికొచ్చేది భాష - చరిత్రకారుడు
8. తర్క విషయ చర్చకు, తార్కిక వాక్య యోజనాన్ని తెలుసుకోవడానికి పనికొస్తుంది భాష. - వేదాంతి
9. వార్తల్ని, లిఖితంగా గానీ వాగ్రూపంలో గానీ అందజేయడానికి ఉపకరిస్తుంది భాష - పాత్రికేయుడు
10. భాష ద్వారానే భాషా విషయ వివేచనం చేయించేది - భాషాశాస్త్రజ్ఞుడు

భాషోత్పత్తి వాదాలు

భాష ఎలా పుట్టిందో అని తెలియజేసే వాదాలను భాషోత్పత్తి వాదాలు అంటారు.

భాషోత్పత్తి వాదం	మరోపేరు	ప్రతిపాదన
బౌవౌ వాదం	ధ్వన్యనుకరణ వాదం	-
పూపూవాదం	ఆశ్చర్యవాదం	-
డింగ్‌డాంగ్ వాదం	ప్రకంపనావాదం	మాక్స్‌ముల్లర్
యోహేవో వాదం	-	నార్వే
ధాతువాదం	-	యాస్కాచార్యుడు
సంపాదనవాదం	అనుభవవాదం	-
స్వతస్సిద్ధవాదం	-	ఛామ్స్కీ

ప్రపంచ భాషా కుటుంబాలు

ప్రపంచంలోని భాషలు ఆరువేలపైనే ఉన్నాయి. భాషా శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం నేడు ప్రపంచమంతటా వ్యాప్తమై ఉన్న భాషల సంఖ్య 2796. భాషా శాస్త్రవేత్తలు వీటిని పది కుటుంబాలుగా విభజించారు.

1. ఇండో యూరోపియన్ 2. సైనోటిబెటన్ 3. యూరల్ ఆల్టాయిక్ 4. సెమిట్‌హెమైట్ 5. ఆస్ట్రిక్ 6. బంటూ 7. ద్రావిడ భాషలు 8. జపానీస్ 9. అమెరికన్ ఇండియన్ 10. బస్క్యూ

భారతదేశంలోని భాషా కుటుంబాలు

భారతదేశ వ్యవహార భాషల్ని గ్రియర్‌సన్ పండితుడు పరిశోధన చేశాడు. 'లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా' పేరుతో పది సంపుటాలుగా ప్రచురించాడు. దీనిలో నాలుగో సంపుటాన్ని స్టెంకెనో ప్రధానంగా సంతరించాడు. ఈ పది సంపుటాల్లో 175 భాషలు 544 మాండలికాలు సర్వే చేశారు. భారతదేశంలో ముఖ్యంగా నాలుగు భాషా కుటుంబాలున్నాయి.

1. హిందూ ఆర్య భాషా కుటుంబం 2. ద్రావిడ భాషా కుటుంబం
3. ఆస్ట్రిక్ భాషా కుటుంబం (మలయో-పోలినీషియన్ కుటుంబం)
4. సైనోటిబెటన్ భాషా కుటుంబం

పై నాలుగు భాషా కుటుంబాల్లో అతిపెద్దది హిందూ ఆర్య భాషా కుటుంబం. తెలుగు భాష భౌగోళికంగా ద్రావిడ శాఖకు చెందింది. వ్యాకరణాంశాల దృష్ట్యా తెలుగు భాష మధ్య ద్రావిడ భాషా ఉపకుటుంబానికి చెందిందిగా ఆచార్య బరో, ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య పి.ఎస్.సుబ్రహ్మణ్యం వంటి వారు నిరూపించారు.

విశ్లేషాత్మక భాషలు	చైనా భాష
సంశ్లేషాత్మక భాషలు	గ్రీకు, లాటిన్
ప్రత్యయాత్మక భాష	ఆంగ్లం
సంయోగాత్మక భాష	తెలుగు
పరానుబంధ సంయోగాత్మక భాష	తెలుగు, యూరల్ ఆల్టాయిక్, జపనీస్, బస్క్యూ
పూర్వానుబంధ సంయోగాత్మక భాష	దక్షిణాఫ్రికాలోని బంటూ కుటుంబానికి చెందిన భాష, సంస్కృతం
అంతరానుబంధ సంయోగాత్మక భాష	సంతాలి, అరబ్బీ
అంతర్విపరిణామ ధాతుభాషలు	అరబ్బీ, హిబ్రూ
బహుధా సంశ్లేషాత్మక భాష	ఎస్కిమో
ధాతు విశ్లేషాత్మక భాష	చైనా
ప్రాతిపదిక విశ్లేషాత్మక భాష	సయోన్
ధాతు సంశ్లేషాత్మక భాష	అరబిక్
ప్రాతిపదిక సంశ్లేషాత్మక భాష	గ్రీకు
సమూహ సంశ్లేషాత్మక భాష	జార్జియన్
పార్శ్వవర్తి సంయోగాత్మక భాష	సుబియా

భాషాశాస్త్రంలో గుర్తులు చాలా ప్రధానమైనవి

*	:	కొన్ని సూత్రాలు ఆధారంగా నిరూపించిన పునర్నిర్మిత రూపానికి గుర్తు.
అ>ఆ	:	చారిత్రకంగా 'అ', 'ఆ'గా మారింది.
అ -> ఆ	:	వర్ణనాత్మకంగా 'అ' 'ఆ'గా మారింది. (సంధివశంగా)
//	:	వర్ణ విధేయ లిపిని ఈ గుర్తుల మధ్య రాస్తారు.
[ ]	:	ధ్వని విధేయ లిపిని ఈ గుర్తుల మధ్య రాస్తారు.
/	:	ఈ గుర్తుకి ఇరువైపులా ఉన్న రూపాలు రెండూ సాధ్యం.
~	:	ఈ గుర్తుకు ఇరువైపులా ఉన్న రూపాలు సపదాంశాలు. వాటి భేదం పూర్వాపర వర్ణాలను ఆశ్రయించి ఉంటుంది.
∞	:	ఇరువైపులా ఉన్న రూపాలు సపదాంశాలు.
Ø	:	అభావం; ఒక రూపం ఉండాల్సిన చోట దాని లోపాన్ని సూచించే గుర్తు.

భాషాశాస్త్రంలో ప్రధానంగా దృష్టిసారించాల్సిన అంశాలు

ధ్వన్యుత్పత్తి స్థానాలు, శాసన భాషా పరిణామం, కావ్య భాషా పరిణామం, ద్రావిడ భాషలు, ఆంధ్రము, తెనుగు, తెలుగు పదాల పుట్టు పూర్వోత్తరాలు, గ్రాంధిక, వ్యావహారిక భాషోద్యమాలు, మాండలిక భాష, ప్రమాణ భాష, ధ్వని విపరిణామం, అర్థ విపరిణామం, అన్యదేశ్యాలు, లిపి పరిణామ విశేషాలు, అంతర్జాతీయ ధ్వనిమాల, ధ్వని - వర్ణం - సవర్ణం, పదం - పదాంశం - సపదాంశం, వాక్య విజ్ఞానం.

జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి కూడా 'సెట్' అర్హత ఉండాలనే వార్తలు వస్తున్న నేపథ్యంలో నిర్దిష్టమైన అధ్యయనాన్ని ప్రణాళికాబద్ధంగా చేస్తేనే విజయం వరిస్తుంది.

– హేమ

వ్యాకరణం గెలుపు సాధనం

ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన ప్రకటన వెలువడనుంది. ఈ తరుణంలో తెలుగు పండితులను దృష్టిలో ఉంచుకోవాల్సిన, సాధన చేయాల్సిన అంశాలివే.

పాఠశాల సహాయకులు(తెలుగు), దిగువ శ్రేణి తెలుగు పండిత (గ్రేడ్-2) ఉద్యోగానికి అభ్యర్థులు పోటీ పడతారు. వీరు రెండింటికీ ప్రాధాన్యత ఇస్తారు. పాఠశాల సహాయకుల ఉద్యోగాలకు పోటీ ఎక్కువ. ఎందుకంటే తెలుగు పండిత ఉద్యోగాలు చాలా తక్కువ సంఖ్యలో భర్తీ కావడమే ప్రధాన కారణం. ఈ పోటీ ప్రపంచంలో అభ్యర్థులు వ్యాకరణాన్ని ప్రత్యేక దృష్టితో అధ్యయనం చేయాలి. వ్యాకరణమంటే కేవలం ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠ్యాంశాల్లో ఉన్న వ్యాకరణాంశాలు మాత్రమే కాదు. బాలవ్యాకరణాన్ని లోతుగా అధ్యయనం చేయాలి. వ్యాకరణ పరిభాషపై పట్టు సాధించాలి. గత 2012 డీఎస్సీ ప్రశ్నపత్రంలో బాలవ్యాకరణం నుంచి ప్రశ్నలు రావడమే దీనికి నిదర్శనం.

వ్యాకరణం

వి+ఆకరణం = వ్యాకరణం. "వ్యాక్రియంతే వ్యుత్పాద్యన్తే శబ్దాః అనేనేతి వ్యాకరణం" అని వ్యాకరణ శబ్దానికి వ్యుత్పత్తి. విశిష్టమైన ఆకృతి కల్గింది, శబ్దాలను శాసించేది వ్యాకరణం. భాష ప్రయోగాత్మక విశ్లేషణ, భాష శరీర ధర్మశాస్త్ర వివరణమే వ్యాకరణం. ప్రయోగ శరణం వ్యాకరణమంటారు. భాష స్వరూప స్వభావాలను వివరించే శాస్త్రం, భాషలోని సాధు, అసాధు ప్రయోగాలను వివరించే శాస్త్రం వ్యాకరణం. ఇందులో పారిభాషిక పదాలు తెలుసుకోవడం తప్పనిసరి. ఏ శాస్త్రానికైనా సాంకేతిక నామాలుంటాయి. అయితే వ్యాకరణంలో పారిభాషిక పదాలుంటాయి. "పరితః భాష్యన్తే ఇతి పరిభాషాః" పరిభాషలనగా లోకంలో తరచుగా వ్యవహరించేవి.

- తెలుగు భాషకు రాసిన తొలి వ్యాకరణం - ఆంధ్రశబ్దచింతామణి- కర్త నన్నయ్య. దీన్ని సంస్కృతంలో రాశారు.
- తెలుగు భాషకి తెలుగులో రాసిన తొలి వ్యాకరణం 'ఆంధ్రభాషా భూషణం' - కర్త: మూలఘటిక కేతన
- తెలుగు భాషకి ప్రామాణిక వ్యాకరణం - బాలవ్యాకరణం - కర్త: పరవస్తు చిన్నయసూరి
- వ్యాకరణంలోని విభాగాలను పరిచ్ఛేదాలు అంటారు.

బాలవ్యాకరణంలో మొదటి పరిచ్ఛేదం సంజ్ఞా పరిచ్ఛేదం. ఇందులో ఎక్కువ సంజ్ఞలు కన్పిస్తాయి. మిగతా పరిచ్ఛేదాల్లో కూడా పారిభాషిక పదాలు కన్పిస్తాయి. జూనియర్ లెక్చరర్స్ (దిగువ శ్రేణి అధ్యాపకులు) తెలుగు ఉద్యోగానికి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు నిర్వహించిన పరీక్షలో ఒకసారి 'సంజ్ఞా పరిచ్ఛేదంలోని సూత్రాల సంఖ్య' అని ప్రశ్నించారు. ఇలాంటి ప్రశ్న వస్తుందని ఏ అభ్యర్థీ ఊహించడు. కాబట్టి 'కాదేదీ ప్రశ్నకు అనర్హం' అని గమనించి నిర్దిష్టమైన ప్రణాళికతో అధ్యయనం కొనసాగించాలి.

లఘువు, అలఘు భేదం కలిగిన అక్షరాలు య, ర, ల, వ

- **లఘుయకారం:** సంధివశాన ఆగమంగా వచ్చే యకారం. ఉదా: హరియతడు
- **అలఘుయకారం:** సహజంగా ఉండే యకారం. ఉదా: కాయ
- **లఘురేఫ:** పెరుగు, కరుగు
- **అలఘురేఫ:** విఱుగు, మెఱుగు
- **లఘులకారం:** తల, నెల
- **అలఘులకారం:** ఏళులు, పాళులు, త్రాళులు
- **లఘువకారం:** ఆదేశ వకారం. ఉదా: అతడు వలికె
- **అలఘువకారం:** సహజమైన వకారం. ఉదా: నావ, చేవ
- **దంత్యచజలు:** అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓలతో కూడిన చజలు. ఉదా: చలి, చాప, చుక్క (దంత్యాన్ని '‿' సూచిస్తారు)
- **తాలవ్యచజలు:** ఇ, ఈ, ఎ, ఏ లతో కూడిన చజలు. ఉదా: చిలుక, చీమ, చెట్టు, జిల, జీడి
- **లుప్తశేషం:** లోపించగా మిగిలింది అర్థం. ప్రాతాది సంధిలో లుప్తశేషం కనిపిస్తుంది. ఉదా: లేత+దూడ = లేదూడ. లేత పూర్వపదంలో 'త'లోపించి లే మిగులుతుంది. 'లే' లుప్త శేషమవుతుంది.
- **భృశార్థం:** మిక్కిలి అని చెప్పటానికి సూరి భృశార్థం ప్రయోగించాడు. కట్టకడ - కడ+కడ 'కడ' అనేది బాగా మిక్కిలి అనే అర్థంలో వాడారు.
- **ఆద్యక్షర శేషం:** ఆది అక్షరంగా మిగిలిందని అర్థం. ఉదా: క్రొత్త+పసిడి = క్రొంబసిడి. క్రొత్తలో క్రొ మాత్రమే మిగిలింది. కావున క్రొ అన్నది ఆద్యక్షర శేషం.
- **ఆమంత్రణం:** మంత్రణం అనగా సంబోధన లేదా పిలుపు
- **యుష్మదర్థకం:** నీవు, మీరు అనే అర్థాలిచ్చే పదాలు
- **అస్మదర్థకం:** నేను, మేము, మనం అనే అర్థాలనిచ్చే పదాలు
- **ఉపధ:** తుది వర్ణానికి ముందున్న వర్ణం ఉపధ. ఉదా: అర్చి: ర్+చ్+ఇ చివరి వర్ణం 'ఇ' దానికి ముందున్న వర్ణం 'చ్' అన్నది ఉపధ.
- ఉపధ ఎప్పుడు 'హల్' వర్ణం

అయి ఉంటుంది.

● ఉత్తమం మూడచ్చులకు తక్కువగాకుండా ఉండే పదంలో చివరి అచ్చు ఉత్తమం.

ఉదా: కలికి= క్+అ, ల్+ఇ,క్+ఇ చివర 'కి'లోని 'ఇ' ఉత్తమం అవుతుంది.

● **ఉపోత్తమం:** మూడచ్చులకు తక్కువ గాకుండా ఉండే పదంలో చివరి అచ్చుకు ముందుండేది ఉపోత్తమం.

ఉదా: చిలుక: చ్+ఇ+ల్+ఉ+క+అ

చివరి అచ్చు 'అ' దానికి ముందుండే 'ఉ' అనేది ఉపోత్తమం.

ఉత్తమం- 'అ', ఉపోత్తమం 'ఉ' అవుతుంది.

● **తదభావ ద్యోతకం:** అది లేదు అనే అర్థాన్ని తెలియజేయడాన్ని తదభావ ద్యోతకం అంటారు.

ఉదా: ముక్కిడి: ముక్కులేని వాడని అర్థం.

● **క్త్వార్థకం:** భూతకాలిక అసమాపక క్రియ క్త్వార్థకం. ఇందులో 'ఇ' అనే ప్రత్యయం చేరుతుంది. ఉదా: వచ్చి, కొట్టి

● **శబ్దపల్లవం:** ధాత్వాదులకు ధాతువులు చేరినప్పుడు విలక్షణార్థం ఇచ్చే వాటిని శబ్దపల్లవాలంటారు.

ఉదా: మేలుకొను

మేలు - నామవాచకం

కొను - ధాతువు = మేలుకొను అన్నప్పుడు నిద్రలేవడం అనే విలక్షణార్థం వస్తుంది కావున దీనిని శబ్దపల్లవం అంటారు.

● **ఆమ్రేడితం:** 'ద్విరుక్తస్య పరరూపం ఆమ్రేడితం' అంటారు. ఒక పదం రెండుసార్లు ఉచ్చరించినప్పుడు అందులో రెండో పదాన్ని ఆమ్రేడితం అంటారు.

ఉదా: ఆహాహా = ఆహా+ఆహా

ఓహోహో= ఓహో+ఓహో

● తెలుగులో మొదట లేని అక్షరాలు: యకారం, వువూవొవోలు

● **అధికరణం:** అధికరణం అంటే ఆధారం. అది మూడు రకాలు.

1. **ఔపశ్లేషికం:** సమీప సంబంధం కలది. ఉదా: ఘటమందు జలమున్నది.
2. **వైషయికం:** విషయ సంబంధమైనవి. ఉదా: మోక్షమునందిచ్ఛ కలదు.
3. **అభివ్యాపకం:** సర్వత్రా వ్యాపించింది. ఉదా: అన్నింటియందు ఈశ్వరుడు కలడు.

● **కర్త:** ధాత్వర్థ వ్యాపారాశ్రయం కర్త. ఉదా: రాముడు రావణుని చంపెను. చంపటం అనే వ్యాపారానికి ఆశ్రయమైన రాముడు కర్త.

● **కర్మ:** ధాత్వర్థ ఫలాశ్రయం కర్మ. చంపబడినవాడు రావణుడు కాబట్టి రావణుడు కర్మ అవుతాడు.

● **కరణం:** క్రియాసిద్ధిం ప్రకృష్టోపకారకంబు కరణం. ఉదా: ఖడ్గంబు చేత ఖండించె ఇక్కడ 'ఖడ్గం' కరణం అవుతుంది.



● **పర్యుదాసం:** ఉత్తర పదంతో చేరునప్పుడు నిషేధార్థం వస్తే దాన్ని పర్యుదాసం అంటారు. ఉదా: అనుదంతం అంటే ఉదంతం కానిది. అనుదంతం అనే పదం పర్యుదాసానికి ఉదాహరణగా భావించవచ్చు.

● **ఉపయోగం:** నియమపూర్వక విద్యాస్వీకారాన్ని ఉపయోగం అంటారు. ఉదా: రామకృష్ణులు సాందీపుని తోడ వేదంబులం జదివిరి.

కారకం: క్రియతో అన్వయం కల్గించేది కారకం. కారకం అనగా విభక్తి.

కారక భేదాలు ఆరు.

1. కర్తృకారకం - ప్రథమా విభక్తి
2. కర్మకారకం - ద్వితీయా విభక్తి
3. కరణ కారకం - తృతీయా విభక్తి
4. సంప్రదాన కారకం - చతుర్థీ విభక్తి
5. అపాదాన కారకం - పంచమీ విభక్తి
6. అధికరణ కారకం - సప్తమీ విభక్తి

● షష్ఠీ విభక్తికి కారకం లేదు.

ఈ విభాగంలో అడుగుతున్న ప్రశ్నలు పరిశీలిద్దాం.

అసమాపక క్రియలు	చేరే ప్రత్యయం	రూపం
1. **క్త్వార్థకం:** భూతకాలిక అసమాపక క్రియ	ఇ కొట్టి	కొట్టి
2. **వ్యతిరేక క్త్వార్థకం:** క్త్వార్థకానికి వ్యతిరేక రూపం	అక	కొట్టక
3. **శత్రర్థకం:** వర్తమాన కాలిక అసమాపక క్రియ	తూ/టూ/చున్ వచ్చుచున్	వస్తూ, కొడ్తూ,
4. **చేదర్థకం:** భవిష్యత్ కాల అసమాపక క్రియ	తే/ఇతే/టే/ఇనన్	వస్తే, కురిస్తే, అంటే,వచ్చినన్
5. **అప్యర్థం:** అపి అంటే కూడా అని అర్థం. జరిగినప్పటికీ అనే అర్థం ఇచ్చేది	ఇనా	వచ్చినా
6. **తుమున్నర్థకం:-**	అన్	కొట్టన్
7. **ఆనంతర్యార్థకం:-**	డున్	కొట్టుడున్

● **ఈ కింది వానిలో భూతకాలిక అసమాపక క్రియ (ఇ)**

అ. చేదర్థకం ఆ. అప్యర్థకం ఇ. క్త్వార్థకం ఈ. శత్రర్థకం

● **'జరిగినప్పుడు' అని అర్థాన్నిచ్చే అసమాపక క్రియ (అ)**

అ. చేదర్థకం ఆ. ఆనంతర్యార్థకం

ఇ. వ్యతిరేక క్త్వార్థకం ఈ. తుమున్నర్థకం

● **ఆనంతర్యార్థకంలో చేరే ప్రత్యయం? (ఆ)**

అ. తూ ఆ. డున్ ఇ. తే ఈ. ఇ

పై విధంగా వ్యాకరణ పరిభాషపై పట్టు లభిస్తే వాక్యకరణంపై చక్కని అవగాహన ఏర్పడుతుంది. ప్రశ్నల కాఠిన్యత వ్యాకరణంలోనే ఎక్కువగా ఉంటుంది కాబట్టి జాగ్రత్త సుమా!

- శివలీల

అప్పుడు కళకళ ఇప్పుడు వెలవెల

పచ్చటి మన్యసీమలపై ప్రపంచీకరణ పడగనీడ పరుచుకుంటోంది. గిరిజన జాతుల మూలాలపై గరళం విరజిమ్ముతోంది. తెలుగు సమాజంలో అంతర్భాగమైన ఆదివాసీల అస్తిత్వాన్ని ప్రమాదపుటంచులకు నెట్టేస్తోంది. స్పందించి చేయందించకపోతే... ప్రకృతి పూజారుల సాంస్కృతిక చిహ్నాలు, విశిష్ట, విభిన్న సంప్రదాయాలన్నీ కాలగర్భంలో కలిసిపోతాయి.

నృత్యం ఆరోప్రాణమైన వారికి చిత్రలేఖనం దేవుడి ప్రతిరూపం. కొయ్య శిల్పాలకు ప్రాణం పోసే వారి అమృత హస్తాలు అందమైన అల్లికలనూ ఆవిష్కరించగలవు. గోండులు, కోయలు, కొండదొరలు, యానాదులు, చెంచులు... ఎవరైనా సరే, అందరిదీ ప్రకృతితో ముడిపడ్డ జీవన విధానమే. తెలుగు గడ్డపై శతాబ్దాలుగా విరాజిల్లుతున్న గిరిజన సంస్కృతికి వారసులు వారు. తెలుగు సమాజంలో భాగంగా ఉంటూనే తమవైన ఆచార వ్యవహారాలను, భాషలను తరతరాలుగా కాపాడుకుంటున్నారు. మన సామాజిక చరిత్రకు వైవిధ్యమైన సొబగులద్దుతున్నారు.

కాలం మారుతోంది. ప్రపంచీకరణతో లోకమంతా కుగ్రామమైన వేళ ప్రాచీన కళలు కనుమరుగవుతున్నాయి. 'అభివృద్ధి' మాటున జరుగుతున్న సాంస్కృతిక దాడిలో గిరిజన జాతి గుర్తులు చెరిగిపోతున్నాయి. లక్షల మంది గిరిజనులు తమదైన సొంత గుర్తింపునకు దూరమై సమూహంలో కలిసిపోయే కన్నీటి చిత్రం ఇప్పుడు ఆవిష్కృతమవుతోంది.

గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా నదీ తీర కొండ కోనలు, తెలంగాణ ప్రాంతాల్లో 35 తెగల గిరిజనులు నివసిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వీరి సంఖ్య 60 లక్షలు..

గోదావరి తీర ప్రాంత ఆదిలాబాద్ అడవులు, నిర్మల్-సత్మల్ కొండల్లో గోండులు, నాయకపు వాళ్లు... వారిని ఆశ్రయించి తోటి, ప్రధాన్, కోలమ్ తెగలవారు నివసిస్తున్నారు. ఆంధ్రులకు మూలపురుషులైన అంధ్‌లు ఈ జిల్లాలోనే ఉన్నారు. కరీంనగర్ జిల్లాలోని మహదేవ్‌పూర్ అటవీ ప్రాంతం నుంచి గోదావరి ప్రవాహం వెంటనున్న అడవుల్లో (ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాల్లో) కోయలు జీవిస్తున్నారు. వారికి ఉత్తరపు ఎగువనున్న కొండకోనల్లో (ఉత్తరాంధ్ర మన్య ప్రాంతాల్లో) కొండరెడ్లు, కొండ దొరలు, కోంద్‌లు, పర్జలు, గదబలు, సవరలు ఉన్నారు. కృష్ణా నదిని ఆనుకుని ఉన్న నల్లమల అడవులు చెంచులు, యానాదులకు నెలవులు. నెల్లూరు ప్రాంతంలో ఎరుకల, యానాదులు కనిపిస్తారు. రాయలసీమలో సుగాలీలు, ఆంధ్రా లంబాడీలుగా పిలిచే బంజారాలు ఎక్కువగా తెలంగాణలోనే ఉంటారు. గిరిజనులందరిలో వీరిపైనే ప్రపంచీకరణ ప్రభావం ఎక్కువగా పడింది. సాంప్రదాయికంగా చెప్పుకునే చతుష్షష్టి కళల్లో లలిత కళలు అయిదు. మిగతావన్నీ ఔపయోగిక కళలు. మత, ఆధ్యాత్మిక సంబంధ కళలను తప్ప నాగరికులు ప్రస్తావించరు. కానీ, గిరిజనులకు పైన తెలిపినవన్నీ ఔపయోగిక కళలే. ప్రదర్శన కోసం కాకుండా సందర్భానుసారం అవసరాలకు ఉపయోగపడేదాన్ని ఔపయోగిక కళ అంటారు. మన గిరిజనులు వాటిలో నిష్ణాతులు.

ఆటైనా... పాటైనా...

రాష్ట్రంలోని అన్ని గిరిజన తెగల వారూ నృత్యం చేస్తారు. ఒక్కొక్క తెగకు ఒక్కో ప్రత్యేక నృత్య రీతి. వీటిలో కొన్ని నృత్యాలు వేల సంవత్సరాల నుంచి మనుగడలో ఉన్నాయి. కోయల కొమ్ము నృత్యం ఆహార్యంలో, పాటల్లో సింధూ నాగరికత కాలం నాటి (పశుపతి పూజ) ఛాయలు కన్పిస్తాయి. విశాఖపట్నం జిల్లా అరకు లోయలో చేసే 'థింసా' నృత్యం లోక ప్రసిద్ధం. అలాగే, గోండులు 'దెంసా' ఆడతారు. లంబాడీ స్త్రీలు చేసే నృత్యాలు నాగరిక సమాజంలోకి చాలా చొచ్చుకుపోయాయి. తోటి తెగలోని కొర్రాజులు నాయకపోడ్ తెగను ఆశ్రయించి పద్మనాయక్ వృత్తాంతాన్ని నృత్య గానాలతో ప్రదర్శిస్తారు. చెంచు నృత్య నాటకం, సవర నృత్యం కూడా ప్రత్యేకంగా చెప్పుకోదగినవే.

రాతలోనూ మేటి

ఏ ప్రసిద్ధ సాహిత్యాన్నికైనా మాతృక మౌఖిక

ఆంధ్రఫోక్‌ఆర్ట్స్.ఆర్గ్

సాహిత్యమే. అది మన గిరిజనులందరి లోనూ ఉంది. అయితే, వారి భాషలకు లిపి లేకపోవడంతో ప్రచురణకు నోచుకోలేదు. కొన్ని దశాబ్దాలుగా కొందరు ఔత్సాహికులు గిరిజన సాహిత్యాన్ని ప్రచురించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా కొంత బంజారా, ఆదిలాబాద్ జిల్లా తెగల సాహిత్యం బయటపడింది. మూడు శతాబ్దాల నాటివైన గోండి భారతం, అంకంరాజు కథ, బోయ ధర్మయ్య ఆధ్యాత్మిక, నాటక సాహిత్యాలు వెలుగులోకి వచ్చాయి.

బొమ్మను గీస్తే...

సవరల ఇంటి లోపలి/ ముందు గోడలపై బొమ్మలు కనిపిస్తాయి. వాటిని వారు ఎంతో పవిత్రంగా చూసుకుంటారు. దేవుడికి మొక్కుకున్న ప్రకారం కోరికలునెరవేరాక పూజారి (వెజ్జు/శమక/ఇత్తల్) చేత బొమ్మ వేయిస్తారు. దాన్ని 'ఇదిసింగ్' అంటారు. దీనికి 'ఇంట్లో రాయబడింది' అని అర్థం. అదే సవరలకు దేవుడు. తాము చేసే అన్ని పనులనూ అందులో చిత్రించి... తమకు రక్షణగా నిలవాలని దేవుణ్ని వేడుకుంటారు. కోయ తెగ ప్రజలు కూడా తమ ఇంటి గోడలను పుట్ట మన్నుతో అలికి వాటికి రకరకాల ముగ్గులు, చిత్రాలు వేస్తారు.

చెక్కను చెక్కి...

మానవులు మొదట్లో కొయ్య శిల్పాలనే పూజించేవారు. తదనంతర కాలంలో నాగరికులు రాతిశిల్పాల వైపు మళ్లారు. గిరిజనులు మాత్రం ఇంకా కొయ్య శిల్పాలనే చెక్కుకుంటారు. వాటిని ప్రత్యేక రంగులతో అలంకరిస్తారు. ఇలాంటి దారు శిల్పాలను చేసేవారిలో అగ్రాసనం నాయకపు వాళ్లదే. పాండవుల ముఖాలను, కృష్ణుడు, గొర్రెపోతు, గుర్రం (లక్ష్మీదేవర), పోతురాజు, ఎర్రగొండ-నల్లగొండ రాక్షసుల ముఖాలను వారి శిరోభూషణాలతో సహా అందంగా చెక్కుతారు వారు. వాటిని సహజ రంగులతో తీర్చిదిద్ది తమ దేవాలయం 'ఇల్లారి'లో భద్రపరుస్తారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వాటిని ముఖాలకు ధరించి నృత్యం చేస్తారు. గోండులు 'కోడెల్' అనే పులి విగ్రహాన్ని, 'తపల్' అనే మనిషి తలను కర్రతో తయారు చేస్తారు.. ఆదిలాబాద్‌లోని ఆకిపెన్, పెర్సిపెన్ తదితర గిరిజన ఆలయాల్లో వారి కొయ్య శిల్పాలను చూడవచ్చు. మరణించిన వారి జ్ఞాపకంగా కూడా అక్కడి వారు కొయ్య శిల్పాలను చెక్కుతారు. వీరిలాగే సవరలు కూడా ఆయా గ్రామదేవతల ముఖాలను... ప్రత్యేకించి గుస్సాడి దేవత విగ్రహాన్ని రూపొందిస్తారు. తమ పూర్వీకుల సమాధుల వద్ద కొన్ని దారు శిల్పాలను నిలుపుతారు.

అల్లికలు... అందాలు

ఈత, తాడి చెట్ల ఆకులు, ఈనెలతో చాపలు, తట్టలు, బుట్టలను రూపొందించడంలో నిష్ణాతులు ఎరుకలు, యానాదులు. వెదురు (కంక) ఈనెలతో రకరకాల కళాత్మక ఔపయోగిక వస్తువులను తయారు చేయడంలో ఆరితేరినవారు కోలములు, కోయలు, కొండరెడ్లు. కోలముల పేరే 'కోల' అనే పదం నుంచి పుట్టింది. కోల అంటే వెదురు బొంగు. గదబలు, బంజారాల స్త్రీలు బట్టలను నేయడం, ఎంబ్రాయిడరీ

చేయడంలో నిపుణులు. గదబ అమ్మాయి తన బట్టలను తనే నేసుకోవాలి. లేకపోతే పెళ్లి అర్హత రాదు. బంజారా స్త్రీ తన కూతురు పెళ్లిలో రెండు జతల బట్టలను కానుకగా ఇవ్వాలి. వాటిని ఆమె నెలల తరబడి చేతితో కుట్టి, అద్దాలను పొదిగించి తయారు చేస్తుంది. అలాగే సోది చెప్పడం (ఎరుకల), పచ్చబొట్లు పొడవటం (తోటి), వీణను కొనగోళ్లతో మీటుతూ, రేలా రేలా అంటూ పాటలు పాడుతూ భవిష్యత్తును ఊహించడం (కోయ) వంటివి గిరిజనుల వారసత్వ సంపదలే. అలాగే, బంజారా స్త్రీలు ధరించే 27 రకాల వెండి నగలను కళాత్మకంగా రూపొందించడంలో దిట్టలు వారిలోనే ఒక తెగవారైన సోనార్ బంజారాలు.

గత కొన్ని దశాబ్దాల్లో సాంకేతిక పరిజ్ఞానం, రవాణా, సమాచార, అంతర్జాల రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులు గిరిజనుల జీవితాలను ప్రభావితం చేశాయి. తక్కువ ధరకు అందుబాటులో ఉన్న వస్తువుల వినియోగానికి వారు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా హస్తకళలు తెరమరుగవుతున్నాయి. నాగరిక సమాజంతో పెరిగిన సాన్నిహిత్యం, గూడేల్లోని పరిస్థితుల కారణంగా కొన్ని గిరిజన సంప్రదాయాలు అదృశ్యం అవుతున్నాయి.

తోటి తెగ వారు సాధారణంగా నాయకపు గిరిజనులకు గోండి భాషలో కథలు చెప్తారు. అలాంటి వారు ఇప్పుడు ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వలస పోయి గ్రామాల్లో కూడా కథలు చెబుతున్నారు. పైగా తెలుగులో వివరిస్తున్నారు. కథకుల్లో కొందరు ప్యాంట్, అంగీ, టీ-షర్టులు వేసుకుంటున్నారు. కథకు సినిమా సన్నివేశాలను కూడా జోడిస్తున్నారు. సాంప్రదాయికంగా వాయించే కింకిరి, పేపెరె మొదలైన వాయిద్యాల స్థానంలో అదనంగా ప్లాస్టిక్ డప్పులు వచ్చాయి. ప్రఖ్యాత సమ్మక్క- సారక్క జాతరలో కొమ్ము నృత్యం చేసే కోయలకు బదులు శివసత్తులు కనిపిస్తున్నారు.

అత్యంత పవిత్రంగా భావించే సవరల 'ఇదిసింగ్' అంగళ్లలోకి వచ్చింది. ఇళ్ల గోడలకు వేసుకునే చిత్రలేఖనాన్నే బట్టలు, కాగితాల పైన వేసి అమ్ముతున్నారు. కాపు సవరలు ఇటీవలి కాలంలో బుట్ట బొమ్మలను ధరించి నృత్యం చేస్తున్నారు. నిజానికి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అటవీ ప్రాంతాల్లో సాంప్రదాయికంగా 'ప్రభల'నే రంగు బొమ్మ ఉన్న పతాకాలను ఊరేగిస్తూ నృత్యం చేస్తారు. వెదురు ఈనెలతో చేసిన పొడవాటి తడకపైన వివిధ రంగుల బొమ్మలతో రూపొందించిన బట్టను అతికించి ప్రభలను తయారు చేసేవారు. ఈ మధ్య కాగితపు గుజ్జుతో ముఖ తొడుగులను తయారు చేస్తున్నారు. ప్రపంచీకరణకు ముందు కాగితపు గుజ్జు గిరిజనులకు తెలియదు. పైగా ఈ ముఖ తొడుగులకు సహజ రంగులు కాకుండా రసాయనిక రంగులు వాడుతున్నారు. ఆ రంగులతో పౌరాణిక విష్ణుమూర్తి దశావతారాలను వేస్తున్నారు. సంస్కృతీకరణకు ఇదొక ఉదాహరణ.

నాయకపు తెగ పద్మనాయకులకు వర్షాకాలంలో కింకిరి కథలు చెప్పే తోటి తెగ ప్రజలు చాలా వరకు తమ వృత్తిని మానేశారు. వరంగల్ జిల్లాలో తోటిల సంఖ్య వేలల్లో ఉన్నా కింకిరి కథకుల బృందాలు మాత్రం రెండే ఉన్నాయి. ఈ కథకుల్లో కూడా ఒకప్పుడు 40 రకాల కథలు చెప్పేవారు ఉండేవారు. ఇప్పుడు మాత్రం శశిరేఖా పరిణయం, కీచకవధ, పాండవ వనవాసం వంటి రెండు మూడు రకాల కథలనే చెబుతున్నారు. సింగి, సింగడు తదితర సహజ పాత్రలతో చెంచులక్ష్మి కథను చెప్పే చెంచులు ఇప్పుడు ఆ సంప్రదాయాన్ని మర్చిపోయారు. వారిలో కొద్దిమంది మాత్రం అదే కథను నాగరిక కళాకారుల్లాగా యక్షగాన ప్రదర్శన ఇస్తున్నారు. ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలతో పాటు ఖమ్మం, తూర్పుగోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో నివసిస్తున్న కోయ తెగ ప్రజలైతే తమ కొమ్ము నృత్యాన్ని పూర్తిగా మర్చిపోయారు.

గదబ అమ్మాయిలు చేనేత కళకు దూరమైపోయారు. విద్యావంతులైన బంజారాల్లో ఎవరికీ బట్టలు కుట్టడం, ఎంబ్రాయిడరీ రాదు. బుట్టలు, చేటలు, చాపలు, గొడుగులు, కుండలు, కొలత పాత్రలు... మొదలైన గిరిజనుల సృజనలు ప్లాస్టిక్ ధాటికి నిలువలేకపోతున్నాయి. ఫలితంగా ఆదివాసీలు వడ్రంగి, కమ్మర వంటి వృత్తుల్లోకి మారిపోతున్నారు.

మరోవైపు... కొన్ని గిరిజన సంప్రదా యాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో

గ్రంథచౌర్యం!

సరస్వతీ పుత్రులు పుట్టపర్తి నారాయణాచార్యులకు అప్పట్లో పెద్ద చిక్కు వచ్చిపడింది. ఆయన రచనలను ఆయన శిష్యులే దొంగిలించేవారట! వాటిని తమ పేరు మీద అచ్చొత్తించేసుకునేవారట! పుట్టపర్తి వారే ఈ విషయాన్ని పత్రికాభిముఖంగా ('తెలుగు సంక్రాంతి'... 1960 జనవరి సంచిక) చెప్పారు. 'ఈ నడుమ కొందరు శిష్యబ్రువులు నా చుట్టూ చేరి నా రచనలను దొంగలించి, తమ పేరిట ప్రకటిస్తూ ప్రచారం చేసుకుంటూవున్నారు' అని వాపోయారాయన. 'ఇట్టివారినే జగన్నాథుడు "జారజన్మానః" అన్నాడు' అని దొంగ శిష్యులకు చురకలేశారు.

వాటికి విశేష ప్రచారం లభిస్తోంది. సవర నృత్యాన్ని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి ఉపయోగిస్తున్నారు. కోయల కొమ్ము నృత్యాన్ని కూడా వాడుకుంటున్నారు. విశాఖపట్నం జిల్లా పాడేరులోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆ ప్రాంతంలోని కోలారి థింసా, దండారి నృత్యాల అభివృద్ధికి కృషి చేస్తోంది.

క్రీ.శ.1742లో ముని పంతులు అనే కవి రాసిన గోండీ భారతాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత భాండాగారం ప్రచురించింది. ఆ సంస్థ పూర్వ సంచాలకులు ఆచార్య జయధీర్ తిరుమలరావు ఆధ్వర్యంలో ఇటీవల 150 ఏళ్ల కిందటి గోండు రాత ప్రతులను సేకరించారు. వాటి ఆధారంగా గోండీ భాష వర్ణమాల, గుణింతాలు, బాలశిక్షలను రూపొందిస్తున్నారు. చిలుకూరి నారాయణ అనే పరిశోధకుడు బంజారా భాషకు లిపిని రూపొందించినట్లు ప్రకటించారు.

ప్రభుత్వపరంగా గిరిజన సంస్కృతిని రక్షించేందుకు సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల గిరిజనుల వస్తువులు, కళాఖండాలను సేకరించి భద్రపరిచి ప్రదర్శిస్తున్నారు. ఇలాంటివే మరో మూడు సంగ్రహాలయాలు అరకు, శ్రీశైలం, మన్ననూరు (మహబూబ్‌నగర్ జిల్లా)లలో ఉన్నాయి. ప్రభుత్వేతర సంగ్రహాలయాలు కూడా కొన్ని గిరిజన కళలకు అండగా నిలబడుతున్నాయి. వాటిలో ముఖ్యమైంది... ఆదిలాబాద్‌లో రవీంద్ర కళాశ్రమం.

గిరిజన తెగలను, వాటి వారసత్వ సంపదలనూ పరిరక్షించడానికి ప్రభుత్వం తరపున చేయాల్సింది ఎంతో ఉంది.

- గిరిజన ప్రాబల్యమున్న ప్రతి జిల్లాలో ఆదివాసీల సాంస్కృతిక విశేషాలను తెలిపే సంగ్రహాలయాల ఏర్పాటు.
- ఒక్కో గిరిజన తెగకు సంబంధించి ఒక్కొక్క గూడేన్ని (టిపికల్ ట్రైబల్ సెటిల్‌మెంట్) ఎంపిక చేసి పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయాలి. దీనివల్ల గూడేల్లో పరిస్థితులు మెరుగుపడతాయి. గిరిజన సంస్కృతిని ప్రత్యక్షంగా చూసేందుకు, అవగాహన చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- సంగీత, సాహిత్య, లలిత కళా అకాడమీలతో పాటు గిరిజన అకాడమీని కూడా ఏర్పాటు చేయాలి. (లేదా) ఆ అకాడమీల్లోనైనా గిరిజన సంగీతం, సాహిత్యం, కళల విభాగాలను ఏర్పాటు చేయాలి. వాటికి ప్రత్యేక నిధులను కేటాయించాలి. ఈ విభాగాలకు గిరిజన ఉపప్రణాళిక నిధులు తప్పనిసరిగా అందేలా చూడాలి.
- వనవాసీల వారసత్వ కళల్లో నిపుణులైన వారిని గుర్తించి... వారి జాబితాను, గిరిజన కళల ఇన్వెంటరీని రూపొందించాలి. సంవత్సరపు క్యాలెండర్ ప్రకారం ప్రదర్శనలు ఇప్పించాలి. కళాకారులకు పించన్లు ఇవ్వాలి.
- గిరిపుత్రుల కోసం ప్రత్యేకంగా హస్తకళల శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వాణిజ్య సౌకర్యం కల్పించాలి.
- గిరిజనులు ప్రకృతి, మూలికా వైద్యాల్లో నిష్ణాతులు. కాబట్టి వైద్య శాస్త్రవేత్తలతో సమన్వయం చేసి, ఆదివాసీల నైపుణ్యం ప్రజలందరికీ ఉపయోగపడేలా చూడాలి.
- ఒక్కో తెగకు సంబంధించిన ఒక్కో పండుగ/జాతరను ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలి. గిరిజనుల ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను కాపాడుకోవడానికే కాకుండా ఇతర వర్గాల వారికీ వనవాసీ సాంస్కృతిక ఔన్నత్యాన్ని తెలియజేయడానికి ఈ నిర్వహణ ఉపయోగపడుతుంది.
- గిరిజన సంస్కృతీ పరిరక్షణ, ప్రచారం, అభివృద్ధి తదితర కార్యకలాపాలన్నింటి కోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించాలి.

ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కూడా గిరిజన కళలపై పరిశోధనలు చేయాలి. లిపి లేని భాషలకు.. ఆ కొరతను తీర్చడానికి భాషా పరిశోధకులు ముందుకు రావాలి. మాతృభాషలో విద్యాభ్యాసం చేసే అవకాశం గిరిజన చిన్నారులకు రావాలి. అప్పుడే వారి అస్తిత్వం అజరామరమవుతుంది.

గిరిజన కళలను కాపాడుకునే బాధ్యత తెలుగు సమాజంపై ఉంది. ఎందుకంటే, అవి కనుమరుగైతే గిరిజన సంస్కృతిలో, మానవ జాతిలో వైవిధ్యం నశిస్తుంది.

డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ
ఎ.పి. గిరిజన సంగ్రహాలయ అధికారి,
హైదరాబాద్. 94909 57078

పద్యం పాడేటప్పుడు...

వచనం వివరించేటప్పుడు...

సంధులతో బంధం వేసేటప్పుడు...

ఎప్పుడైనా సరే, తెలుగు ఉపాధ్యాయుడు జ్ఞానస్వరూపుడిలా కనిపించాలి. విద్యార్థులపై మమకారం, బోధనలో భావావేశాలకు అధ్యయనంతో వచ్చే ఆత్మస్థైర్యం తోడైనప్పుడే తరగతి గదిలో గురువులు రాణించగలరు.

నవతరం తెలుగు నేర్చుకోవట్లేదని గుబులు పడుతున్నాం. నేర్చుకుంటున్న వారు కూడా అక్షరదోషాలు లేకుండా ఒక్క వాక్యమూ రాయలేకపోతున్నారని కలత చెందుతున్నాం. నేర్చుకున్నారని అనుకున్న వారు సైతం పద ఉచ్చారణలో ఆపసోపాలు పడుతున్నారని బాధగా చెప్పుకుంటున్నాం. ఇవన్నీ నిజమే. అయితే, ఈ పరిస్థితికి కారణమెవరు? ఆంగ్లంపై పెరుగుతున్న మోజు, అమ్మభాషపై అమ్మానాన్నల అయిష్టత, తెలుగును వెలిగించుకోవడంపై ప్రభుత్వ నిర్లక్ష్యం... ఇవే సమాధానాలైతే సమస్య ఎప్పటికీ పూర్తిగా పరిష్కారం కాదు. పిల్లలకు తెలుగు నేర్పే ఉపాధ్యాయుల నైపుణ్యం కూడా ఈ విషయంలో కీలకపాత్ర పోషిస్తుందన్న సంగతిని గుర్తించాలి. 'నా విద్యార్థులకెప్పుడూ నేను పాఠాలు చెప్పలేదు. విషయాలను వారు నేర్చుకునే వాతావరణాన్ని సృష్టించే వాణ్ని' అని చెబుతారు అల్బర్ట్ ఐన్‌స్టీన్. అతి సాధారణ బోధనతో ప్రయోజనముండదనీ, పాఠ్యాంశాలపై పిల్లల్లో ఆసక్తి కలిగించి - నేర్చుకోవాలన్న తపనను వారిలో పెంచినప్పుడే ఫలితం ఉంటుందన్నది ఆయన మాటల్లోని భావం. తెలుగు ఉపాధ్యాయులందరూ ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

తెలుగు బోధన ఒక విశిష్టమైన వృత్తి. కేవలం కఠిన పదాలకు అర్థతాత్పర్యాలు చెబుతూ తెలుగు ఉపాధ్యాయుడు నెగ్గుకురాలేడు. వినదగినవి, ఆచరించదగినవి, ఆనందించదగినవి, జీవితానికి అన్వయించుకో దగినవి అతనిలో ఉన్నప్పుడు మాత్రమే మనగలుగుతాడు. అందుకు ఉపాధ్యాయుడికి విశేష వ్యక్తిత్వం, ప్రత్యేక ప్రజ్ఞ ఉండి తీరాలి. అంతేకాదు అతనికొక సాహిత్య వ్యక్తిత్వముండాలి. దాని కోసం నిరంతర సాహిత్య కృషి చేయాలి. యావజ్జీవ విద్యార్థి కావాలి. అధ్యయనం చేసిన అంశాలను ఎప్పటికప్పుడు నెమరువేస్తూ తనలో శాశ్వతంగా నిక్షిప్తం చేసుకోగలగాలి.

తెలుగు ఉపాధ్యాయుడు విద్యార్థుల హృదయాలను తీర్చిదిద్దే మహాశిల్పి. సాహిత్యం మనిషిని సంస్కరిస్తుంది కాబట్టి విద్యార్థులను విశిష్ట వ్యక్తులుగా తీర్చిదిద్దే బాధ్యతను మోయాల్సింది తెలుగు బోధకులే. తెలుగు మాతృభాష కావడంతో దాన్ని నేర్చుకోవడంలో విద్యార్థుల్లో కొంత అలసత్వం సహజం. అలాంటి వారిని కూడా తన మృదు మధుర పాఠ ప్రవచనాలతో ఆకర్షించే సత్తా తెలుగు ఉపాధ్యాయుడికి ఉండాలి. తాను నేర్చుకొన్న విజ్ఞానానికి, అనుభవాన్ని జోడించి శిష్యులకు బోధించాలి. వాళ్లు తనకంటే జ్ఞాన సంపన్నులు కావాలని మనస్ఫూర్తిగా కోరుకోవాలి. 'శిష్యాదిచ్ఛేత్ పరాజయమ్' అన్నదానికి ఉదాహరణ కావాలి.

అజంత భాషను బోధించే గురువుకు సమయస్ఫూర్తి ఎంతో అవసరం. తరగతి గదిలో కొందరు కొంటె విద్యార్థులుంటారు. అలాంటి వారు ఎక్కుపెట్టే ప్రశ్నల బాణాలను లాఘవంగా ఎదుర్కోవాలి. సమయస్ఫూర్తితో సమాధానమివ్వాలి. ఉపాధ్యాయుడు ద్రష్టగా - స్రష్టగా ఉన్నప్పుడే ఇది సాధ్యపడుతుంది.

అంతేకాదు, ఉచ్చారణ దక్షత, సంస్కారవంతమైన వాక్కు ఉండాలి. మాటలో సహజత, సరళత, స్పష్టత, స్వచ్ఛత, సరసత గోచరించాలి. కావ్య పఠనానికి కావాల్సిన హావభావ ప్రదర్శన, శ్రావ్యమైన కంఠస్వరం తప్పనిసరి. పద్యాన్ని అందంగా, అర్థవంతంగా చదవగలిగినప్పుడు విద్యార్థులను ఆకట్టుకోవడం కష్టం కాదు. వినడానికి పద్యం ఎలా ఉండాలో చెప్పే కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి పద్యమిది!

పద్యమ్ము వినినంత పారవశ్యమ్మున
మోరెత్తి పశువైన మురియ వలయు
పద్యమ్ము వినినంత పరుగెత్తు సెలయేరు
క్షణమాగి చెవియొగ్గి చనవలయు
పద్యమ్ము వినినంత పసికందు ఏడ్పాపి
పాలుత్రావిన దృప్తి బడయవలయు
ఎండుమ్రోడులు చివురించి ఎదగవలయు
మండువేసవి చల్లగా మారవలయు

ప్రతీకాత్మక చిత్రం: రాజు

కోయిలట్టుగ కాకియు కూయవలయు
దారు శిల్పము చెలగి చిందాడ వలయు

అంత గొప్పగా కాకపోయినా కనీసం అర్థవంతంగానైనా పద్యాన్ని పఠించగలగాలి.

పాఠం చెప్పేటప్పుడు మోటుతనాన్ని, అశ్లీలతను తొలగించాలి. ఛలోక్తి ముసుగులో ఔచిత్యాన్ని విస్మరించకూడదు, వస్త్రధారణలో హుందాతనం ఉట్టిపడాలి. విద్యార్థులకు కొన్నిసార్లు స్వేచ్ఛనిస్తూనే నియంత్రించ గలగాలి. సందర్భానుసారంగా వారిని ఉత్తేజపరచటం, అదుపులో ఉంచటం తెలియాలి. సత్ప్రవర్తన, సహనం, స్నేహశీలత, నిరాడంబరత, విద్యార్థులందరినీ సమదృష్టితో చూడగల నిష్పక్షపాతవైఖరి ఎంతో అవసరం.

సాహిత్యం ఒక అనంత సాగరం. ఎన్నో పురాణేతిహాసాలు, కావ్యశాస్త్రాలు ప్రవాహాల్లా వచ్చి ఇందులో చేరతాయి. కనీసం కొన్ని ప్రసిద్ధమైన పురాణేతిహాసాలు, అందులోని పాత్రల పరిజ్ఞానం తెలుగు బోధకుడికి తప్పనిసరిగా ఉండాలి. భాషలోని తప్పొప్పుల గురించి తెలియాలి. వివిధ గ్రంథాలు - వాటి రచయితల వివరాలు గమనంలో ఉంచుకోవాలి. వీటితో పాటు ఇతర భాషా సాహిత్యాలతో పరిచయం పెంచుకోవాలి. ముఖ్యంగా సంస్కృతాంగ్ల భాషా పరిజ్ఞానం కొంతమేర్కైనా ఉండాలి. ఇతర సామాజిక శాస్త్రాల అధ్యయనం - ముఖ్యంగా చరిత్రాధ్యయనం అనివార్యం.

పాఠ్యబోధన చేసేటప్పుడు తన భావాలను, ఇష్టాయిష్టాలను విద్యార్థులపై రుద్దకూడదు. ప్రాచీన - ఆధునిక సాహిత్యాలను సమదృష్టితో చూడాలి. పద్య కవిత్వాన్నీ, వచన కవిత్వాన్నీ ఒకేలా స్వీకరించాలి. విద్యార్థులతో స్వీకరింపజేయాలి. సాహిత్యంలోని అంశాలను బోధించేటప్పుడు సంకుచిత కుల, మత, ప్రాంతీయ దృష్టిని, పక్షపాత వైఖరిని ప్రదర్శించకూడదు.

త్రిమూర్తి స్వరూపుడు

సృష్టి, స్థితి, లయ కర్తలైన త్రిమూర్తులకు ప్రతిరూపం గురువు. శిష్యుల్లో జ్ఞానసృష్టి చేసేది ఉపాధ్యాయుడే. వారి ప్రతిభా పాటవాలను సుస్థిరం (స్థితి) చేసి, అజ్ఞానాన్ని నాశనం (లయం) చేసే పరబ్రహ్మస్వరూపుడు అతడే. ఆత్మవిశ్వాసం. ఆత్మ సంయమనం, ఆత్మాభిమానమున్నప్పుడే త్రిమూర్తితత్వాన్ని అందుకుంటాడు గురువు. విధి నిర్వహణలో ఆత్మసంతృప్తే పనికి గీటురాయి. తెలుగు ఉపాధ్యాయులందరూ ఈ విషయాన్ని స్మరణలో ఉంచుకుని, కర్తవ్యాన్ని నిర్వర్తించినప్పుడు... తెలుగు భవిత శోభాయమానమవుతుంది. తెలుగు జాతి ఘనత విశ్వవ్యాప్తమవుతుంది.

డా॥ జోస్యుల కృష్ణబాబు,
తెలుగు రీడర్, పెద్దాపురం,
తూర్పుగోదావరి జిల్లా
98664 54340



భాషతో కళాపోషణ

అ.ఆ. స్పందన

'శ్రీరామరాజ్యం' చిత్రంలో చెంగు చెంగున దూకే బాల హనుమంతుణ్ని చూశారా! తనే మా అబ్బాయి.. పవన్ శ్రీరామ్! బాలనటుడిగా ఇప్పటి వరకూ 35 చిత్రాల్లో నటించాడు. వాణిజ్య ప్రకటనల్లోనూ చేశాడు. 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే'తో మొదలైన వాడి నట జీవితం నిరంతరంగా, విజయవంతంగా కొనసాగుతోంది. అయితే, కొంతమంది ఇరుగు పొరుగువారు ఎప్పుడూ సినిమాలు చేస్తే పిల్లాడు ఎందుకూ పనికిరాకుండా పోతాడని భయపెట్టారు. నేను ఉపాధ్యాయురాల్ని కావడంతో పుస్తకాలు పట్టుకెళ్లి, చిత్రీకరణ విరామ సమయంలో చదివించే దాన్ని. 'శ్రీరామరాజ్యం'లో చేసేటప్పుడు 40 రోజులపాటు ఏకధాటిగా చిత్రీకరణ జరిగింది. పౌరాణిక సంభాషణలు పలికేటప్పుడు బాబుకి.. పదాల అర్థాలు వివరించి చెప్పేదాన్ని. క్లిష్టమైన పదాలను ఎలా ఉచ్చరించాలో చెప్పేదాన్ని. దాంతో తను చిత్రీకరణలో ఎక్కడా ఇబ్బంది పడలేదు. ఇంట్లో కూడా అచ్చతెలుగులో మాట్లాడిస్తూ, సంభాషణలు చెప్పిస్తూ.. వాడి ఉచ్చారణను ఇంకా మెరుగుపరచడానికి సదా ప్రయత్నిస్తూనే ఉంటాను. చలనచిత్రాల్లో చేస్తున్నా... తరగతి గదిలో తనెప్పుడూ ప్రథమ శ్రేణిలోనే ఉంటాడు. తల్లిగా నాకు అంతకు మించి కావాల్సింది ఏముంది!

పి.ఛాయాకుమారి,
హైదరాబాద్

కథ

వాగు

యాల్ల పొద్దుగాల్నే లేసి మంచం కింద వెట్టుకున్న చెంబుల నీళ్లు తాగిన రాజయ్య కిందికి దిగి యాపపుల్ల నోట్ల వెట్టుకోని వాగువైపు నడవ వట్టిండు. వాక్కు వొయ్యి దాంట్ల తానం జేస్తే ఎంత హాయి ఎంత గమ్మతిగ ఉంటదో.

వాగు సల్లని తల్లి. పొలాలకు నీళ్లిచ్చి పంటలకు సాయపడ్తది. పోరగాండ్లు తానమాడి ఎగిరి గంతులేస్తే ఆనందపడుతూ సంబరాన్ని పంచిస్తది. సాప పిల్లలకు సముద్రమైతది. ఊరి మైలంతా బట్టలల్లకెల్లి తీసే సాకలికి తెల్లదనమయితది. జాలర్లు కుస్తీ పడితే సంపాదన ఇచ్చే సాపలనిస్తది. మేసి మేసి సాయంత్రానికి ఇంటికొయ్యే ఆలమందలకు అమృతమయితది. సక్కని తల్లి నా ఊరి వాగు.

రాజయ్య మెల్లగా వాగులకు దిగి దోసిట్ల నీళ్లు పట్టుకుని నా గంగమ్మ తల్లి అని మురిసిపోయిండు. తానమాడుతూ తనివితీరా అటూ ఇటూ బొర్లుతూ మునకల మీద మునకలు వేయవట్టిండు. మధ్య మధ్యల కమ్మని పాటలు పాడుతూ ఉంటే ప్రకృతి పరవశించింది. సాపలు సావధానంగా వినసాగాయి. చెలిమల అలలు శృతి కలిపాయి. కోయిలల చెవులు నిక్కబొడుచుకున్నాయి. అంత కమ్మటి కంఠం రాజయ్యది. జానపదాలు అలవోకగా పాడే వరం ఇచ్చాడు దేవుడు.

గంత దూరం నుంచే వస్తున్న బెస్తోల్ల రాజమల్లు "ఓ రాజన్నా అచ్చినావే తానమాడే యాళ్లయిందా..." అనుకుంట రావట్టిండు. "ఆc సెనార్తి రాజమల్లు రావోయ్ రా అచ్చినావా ఇయ్యాల్ల పొద్దుగాల్నె అచ్చినవ్ ఏందోయ్ కత" అన్నాడు. రోజూ పొద్దాకంగా సాపలు కోసం తోపెల పట్టుకొనత్తడు రాజమల్లు.

సాయంత్రం సాకలివాళ్లు ఇండ్లకెళ్లిపోతరు. యవుసుదార్లు నాగండ్లు కడిగి ఎడ్లకు తానంజేపిచ్చి ఊరిల వడుతరు. ఇగ గప్పుడయితె రాజమల్లుకు సాపలు వట్టుడు జెరంత సులువయితది. అయిసు మీదున్నపుడు కైకిలి గంబడి సేసుకున్నడు గానీ ఇగ ముసలితనం మీద వడ్డంక పాణంల హుషారుగుంటలేదు. ఏదో కాలం ఎల్లబుచ్చుతాండు పెండ్లాంతోని. ఓ పొల్లకు లగ్గం జేసిండు. పొలగాడు మంచోడు దొరికిండు.

రోజూ సాయంత్రం వచ్చెటోడు ఇయ్యాల్ల పొద్దుగాల్నె వచ్చిండు. తానం జేస్తున్న రాజయ్యను జూసి "ఏమనుకోకోయ్ బావా తిట్టేవు నన్ను నీళ్లు ఏం మురుకులు గాకుంటనే పట్టుకుంట గిన్నన్ని సాపలు" అన్నాడు.

"ఏ ఎందుకోయ్ పట్టుకో నా తానం గూడ అయిపోయింది" అనుకుంట ఒడ్డుకెక్కిండు రాజయ్య. "అవుగనీ ఇయ్యాల్ల పొద్దుగాల్నె వచ్చినవేందోయ్".

"ఆ గీ కన్నారం (కరీంనగర్) దాకా వొయి రావాల్నోయ్ మా పొల్ల నీళ్లాడింది. పొలగాడు పుట్టిండు. సూసి రావాలె" - సంబరపడ్డడు రాజమల్లు.

రాజమల్లు నేర్పుతోని సాపలు పడుతా ఉంటే కన్నార్పకుండా సూడవట్టిండు రాజయ్య. ఒక పావుగంటల్నే మంచిగనే పడ్డయి సాపలు రెండు కిలోలన్ని. సాపలు బుట్టనిండా నింపుకుని తానం జేసి ఒడ్డుకెక్కినంక ఇంటిదారి పడతన్న రాజయ్యను కేకవేసి పిలిసిండు. ఓ సవుసేరన్ని సాపలు వెట్టిండు.

"ఏ ఎందుకోయ్ నీకు బ్యారం తలుగుతది పో అమ్ముకపో" అన్నడు రాజయ్య.

"ఏం గాదులేవోయ్ నీ మొకం జూసిన యాళ్ల నిన్ను మందలిచ్చిన ఘడియ ఏందోగని ఇరుగవడ్డయి గింతంత సేపట్లనె" అని మురువ వట్టిండు.

రాజయ్యకు కూడ సాపలంటే మా ఇష్టం. పులుసు వెట్టి అండుతె వాడంత కమ్మటి వాసన గొడుతది. కాదనలేక తీసుకున్న రాజయ్య మంచి సలహా ఇచ్చిండు. ఎట్లాగు కన్నారం వోతన్నవుగదా గాడ మంచి ధర పలుకతది తీసుకుపోవోయ్ అన్నడు రాజమల్లుతోని.

జూలపల్లి బస్టాండుకొచ్చిన రాజమల్లు బస్సుకోసం చూసి చూసి ఆఖరికి

చొప్పదండికి వొయ్యే ఆటో ఎక్కిండు. ఆటో పొలగాడు ఆ సాపలు జూసి "ఎహె నీ యవ్వ గీ కంపు వాసన నా ఆటోల వెడతవ తియ్ తియ్" అని లొల్లి వెట్టిండు. "అరె బిడ్డ నువు గట్లంటె ఎట్లరా అయ్యా నాటి దినం గాదు, వయసు గాదు నాది. నడిసిపోదామంటే. నాడు పోలేదా



సెయ్యలేదాగనీ ఇప్పుడు కాల్లల్ల బలం లేకపాయె. మా అయ్య జెర దండం బెడుతరా బిడ్డ. నాలుగు పైసలస్తయిరా. ఎనుక దిక్కు గీ గంప వట్టుకోని కూసుంట" అని కాళ్లా వేళ్లా పడితే సరే అన్నట్టే అన్నడు గానీ కొన్నన్ని సాపలు పెట్టుమని మెలికవెట్టిండు. చేసేది లేక సరేనని ఎక్కి కూసున్నడు.

ఆటో సబ్‌స్టేషన్ మీంచి దొరగారి మామిండ్ల దాటినంక ఓ సూటు బూటు అయ్య "ఎందుకత్తరయా గీ కంపు వట్టుకోని అరె కొద్దిగన్న ఇంగితజ్ఞానం లేదు. పురాగ చెడిపోయింది దునియా" అనుకుంట ఏదేదో ఉపన్యాసం దంచవట్టిండు. పక్కపొంటె ఉన్న ఇంకోగాయిన నాలుగచ్చురాలు నేర్సిన మనిషి నాలుగు మాటలన్నడు.

ఇగ గవన్నీ ఇన్నా ఇననట్టె ఊకున్నడు రాజమల్లు.

అనుకోనీ అనుకుంటె పడుతమాయె పడితె సెడిపోయేది ఏందట అనుకుని చెవుల ఉన్న సుట్ట దీసి నోట్ల వెట్టిండు.

"ఓయ్ తాతా పోనీలే అని ఊకుంటే నీకు ఈ సుట్ట ఓటా? గుప్పు గుప్పుమని పొగ... దిగుతవ సుట్ట ఆపుతవా?" ఓ కాలేజీ పోల్ల గయ్యిమని లేచింది. ముసలోనికి మొదటికే మోసం రాజిక్కనని నచ్చుకున్నా పారేసిండు గానీ మనసంతా పీకుతా ఉంది.

ఇంతల్నే పెద్దాపూర్ వచ్చింది. ఆటో ఆగింది. దిగేవాళ్లు దిగినంక ఓ పెద్ద మీసాలాయన మాంచి ఎత్తు, మందం పెయ్యి ఉన్నోడు సూత్తనే జల్లుమంటది పాణం "చొప్పదండి దాకా" అనుకుంట ఎక్కిండు. నోరు తెరిసి మాట్లాడితే పండ్లన్నీ సిలుము పట్టినయా అనిపిస్తాంది. సిన్నపాటి గుట్కాల ఫాక్టరే నోట్లున్నట్టున్నది.

ఆ వాలకం జూస్తే ఒక్కసారె నలుగుర్ని ఎత్తి ఆమాంతం అవతల పారేసేటట్టున్నడు. "అరె కొద్దిగ జరుగరాదయా - అటు జరుగు" అనుకుంట మనుషుల్ని తోసిండు. మధ్యలున్న బక్కపలుచటోడు ఓ సావు సచ్చిండు. కాలేజీ పోల్లయితె మింగలేక కక్కలేక ఇరికిరికి కూసున్నది. ఆ మనిషిని జూత్తే అందరికి ఓ తీరుగనే భయంగా ఉంది. ఆ మనిషి ఇద్దరి పెట్టున్నడు. జాగంత ఆపుకున్నడు.

భూపాలపట్నంల డ్రైవర్ ఆటో ఆపి ఇంకొకలను ఎక్కించుకోబోతే "అరె ఏడెక్కిత్తవుర భయ్ - పోనీ పోనీ ఈడికె ఇరుకుటం అయితందిరా అంటే గీడొకడా మల్ల..." ఓ పాసింజర్ ఈసడించుకుంటే. "ఏయ్ మాటలు మంచిగ రానీ గీడు గాడు అంటే ఈపు సాపయిద్ది" కొత్త పాసింజర్ అందుకున్నడు.

"అరె ఎందుకే అన్న లొల్లి నాకో నాలుగు రూపాయలత్తయి. జర సదురుకొని కూసొండ్రన్నా" బతిమాలాడు డ్రైవర్.

"అరె ఓ పిలగ ఏందిర నీ నస. నాకు టెండరు ఉంది కన్నారంల టైం అయితంది పోనీయ్ గా పైసలు గూడ నేనే ఇస్తపా - పోనీయ్" గరంగా అన్నాడు మొద్దు పాసింజర్. ఆటో కదిలింది.

దొడ్డుగా ఉన్న పాసింజర్ నజరు ఎనుక కూసున్న సాపల ముసలాయన మీన పడ్డది. "ఏయ్ ముసలాడా ఎక్కడ పట్టినవ్ గీ సాపలు? పెద్దపురం సెరువులయా. గది నాదే కాంట్రాక్ట్ ఎవన్నడిగి పట్టినవ్".

ముసలోని పాణం జల్లుమన్నది "గీ సాపలు మా జూలపల్లి ఆగుల వట్టినసారూ. పెద్దపురం నేనేడ నడుత్త దొరా గివ్వి గాడియి కాదు".

ఛస్ నీ కిరి కిరి ఏందిరా రాణాకు పట్టిత్త తియ్యి ఏదీ సూపియ్యి. గా బుట్ట దీసి సూపియ్యి అని ఆటో రాడ్ మీద ఒక్క గుద్దు గుద్దిండు. అదిగిన మనిషికి దాకెనా దెబ్బకు పిట్టగట్టుడే.

గీ లొల్లికి ఆటో ఆగింది. ముసలోడి బుట్ట గుంజి సాపలు కింద వడేసిండు. అన్ని జెల్లలు, గురిజెలు, ఉలిసెలు ఉన్నాయి. ఎగాదిగా జూసి గియ్యి నాయి కాదులే. నా సెరువుల గీ రకం సాపలేదు గానీ నాకు గీ గురిజలంటే సానా ఇది. అనుకుంట రెండు పెద్దవి తీసి సంచిల పారేసుకున్నడు.

ముసలోని పాణం కలి కలి అయింది. ఆటోనికి పాయె కాంట్రాక్టర్‌కు పాయె. ఇగ సగం మిగిలినయ్. మనసంతా తండ్లాడ వట్టింది. ఏమన్నా ఇది అన్నాలమందామంటే కాంట్రాక్టర్ ఒక్క గుద్దుకే తను సత్తడు.

ముసలి పాణం బిక్కు బిక్కుమన్నది.

నానా తంటాలు పడి ఎట్లనో ఒక తీరుగ చౌప్పదండిల దిగిండు ఇగ ఆటోల పోవద్దు అని నికరం జేసుకున్నడు బస్సు ఎంతసేపటికన్న రానీ దాంట్లో పోవాలె గానీ ఇగ ఆటో ఎక్కేదే లేదు. నిమ్మలంగ గూసున్నడు బస్టాండుల. సూడంగ సూడంగ మంచిరాల నుండి కరీంనగర్ వొయ్యే పల్లెవెలుగు బస్సు మెల్లగ ఆగింది.

అబ్బ అనుకున్నడు పాణం లేసొచ్చింది రాజమల్లుకు. ఉరికి వస్తున్నయినను ఆపి ఏయ్ ఎనుక నుంచి ఎక్కుపో అన్నడు కండక్టర్. దవ దవ ఉరికి ఎనుక డోరు నుంచి ఎక్కిండు. ఏయ్ పెద్ద మనిషి సెడ్డ వాసన అటు జరుగు ముందుకు వో అని ముక్కున వేలేసుకున్నడు ఓ బాపనాయన. అవస్థలు పడుకుంట మెల్ల మెల్లగ డ్రైవర్ పక్కకచ్చి నిలుచున్నడు.

బస్సు నడుపుతున్న డ్రైవర్ సాబ్ రోడ్డు మీదనే భేషుగ్గా మనసు వెట్టిండు కానీ ముక్కేమో ముసలోని దిక్కు పడ్డది. ఇగ మెదడు ఆలోచనల వడ్డది. పెదవుల మీద ఎన్నిల కురుత్తాంది. ఇయ్యాల సాపలు దినే ఛాన్స్ దొరికిందిర భయ్ అనుకున్నడు.

ఏం తాతా ఏడి దాకా పోవాలె దా నా పక్కకు గీడ కూసో అని ఇంజను మీద కూసోవెట్టిండు.

"ఏం తాతా"

"ఆ గీ కన్నారం దాకనే సారు"

"ఏం సాపలున్నయేంది?" డ్రైవరులో ఆత్రుత.

"ఆ ఏముంది సారు గురిజెలు, జెల్లలు..." రాజమల్లు అమాయకంగా.

"అరె జెల్లలు కల్లు దాక్కుంట కాల్చుకోని తింటే నా సామిరంగా వైభోగమే" లొట్టలేస్తున్నడు. డ్రైవర్‌ను జూసి ముసలోడు గతుక్కుమన్నడు. నగునూర్‌ల బస్సాగింది. దిగెటోల్లు దిగినా, ఎక్కెటోల్లు ఎక్కినా బస్సు కదల్లేదు. డ్రైవర్ బుట్టల నుంచి నాలుగు సాపలు వట్టిండు.

సారు పైసలయితయి సారూ ముసలోడు బాధగ మూలిగిండు.

ఏయ్ బస్సుల ఎవడయ్యా నిన్ను సాపలు పట్టుకోని ఎక్కుమన్నడు దిగు దిగు అనుకుంటనే బస్సు ముందుకు కదిపిండు. దిగు దిగు మంటనే ఉన్నడు. బస్సు ఆగుతలేదు. నగునూరు బ్రిడ్జి దాటినంక బస్సు స్లో చేస్తూ తోసినంత పనిజేసిండు.

పాపం ముసలి పానం మూలిగింది. ఇగ కన్నారం దాకా నడుసుడే మంచిదను కున్నడు. అడుగుల అడుగేసుకుంట ఎట్లనో మెల్లమెల్లగా కన్నారంల వడ్డడు. ఇగ సీద దావకాండ్లకు వొయ్యి గాడ బిడ్డను జూస్కోని జరంత అలసట దీరినంక బయటకు పొయ్యి మిగిలిన ఆ నాలుగు సాపలు అమ్ముదామని సక్కగ హాస్పిటల్‌కే పోయిండు.

సర్ర సర్ర దావకాండ్లకు పోయి బిడ్డను జూసి ముచ్చటపడి పొలగాన్ని తీసుకుని ముద్దాడ వట్టిండు. ఎంత ముద్దుగున్నడు బిడ్డా! అచ్చం నీ లెక్కనే... రామ సక్కని పొలగాన్ని ఇచ్చిండు దేవుడు అని సకల సంతోసపడ్డడు.

జబ్బు జబ్బున ఈగలు, దోమలు. శుచి లేదు, పాడు లేదు. పట్టించుకునే నాథుడే లేడు. పేషెంట్లు ఎల్లిపోయేటప్పుడు మాత్రం దిగుతరు వాచ్‌మెన్, స్వీపర్‌లు సంభావన అడుగటానికి. సంభావన తీసుకున్నంత సంబురం సంరక్షణలో లేదు.

ఏయ్ జరుగుర్రి వయా జరుగుర్రి పెద్ద సారత్తుండు. ఏయ్ ముసలోడా ముద్దాడింది సాలుగానీ నడు నడు బయటికి నడు. సైరన్ మోత వెట్టినట్టే ఉరుకులాడ వట్టిండు అటెండరు.

ఆగు సారు ఆగు జెరంత మా పొల్లను ఎప్పుడు తీసుకపోవాల్నో గా పెద్దయ్యగార్ని ఆడుగుతాన్నాడు రాజమల్లు.

డాక్టరు వచ్చి పేషెంట్లను జూసుకుంట పోతా ఉన్నడు. రాజమల్లు బిడ్డ సంగతి అడిగిండు. అన్ని విషయాలు జెప్తూ డాక్టరు మంచి బలమైన ఆహారం పెట్టమన్నడు. గంతల్నే రాజమల్లు దగ్గరున్న సాపల మీద పడింది డాక్టర్ కన్ను.

"అరె గీ సాపలు ఆరోగ్యానికి చాలా మంచిది. ఏయ్ పెద్ద మనిషి ఏం సాపలున్నాయి నీ దగ్గర".

"గురిజెలు, జెల్లలు ఉన్నయ్ సారూ".

డాక్టర్ అటెండర్‌ను పిలిచి గీ ముసలాయన దగ్గరున్న సాపలు అన్నీ పట్టుకుపోయి అమ్మగారికిచ్చిరా అంటూ ఆర్డర్ వేసాడు. ఉన్న సాపలన్నీ డాక్టరుకిచ్చి రాజమల్లు సేతులు దులుపుకున్నడు. అటెండర్ కోసం గంట సేపట్నుంచీ చూస్తాండు. మెల్లగా వస్తున్న అటెండర్‌ను చూసి "అయ్యా గా పైసలిప్పియ్య పోతిరి" చేతులు గట్టుకుని అడిగిండు రాజమల్లు. "పైసలా ఎక్కడియి" అటెండర్ జవాబు.

"డాక్టరు సారుకు సాపలిస్తిరి గదా సారు గా పైసలే".

"ఓయ్ ముసలోడా! గవ్వటికా పైసలడుగుతున్నవ్. గీ బిల్లంతా ఎవడు గడుతడు అనుకుంటున్నవ్ మల్లా పోపో పైసలు గావాల్నట పైసలు" వెటకారంగా

నోరూరిపోదా!



శతాబ్దాల కిందట తెలుగు నేలపై భోజన హోటళ్లు ఉండేవా? ఉంటే... వాటిలో ఎలాంటి భోజనం లభ్యమయ్యేది? శ్రీనాథుడి 'క్రీడాభిరామం' ఈ ప్రశ్నలకు జవాబిస్తుంది. కాకతీయుల రాజధాని ఓరుగల్లులో ఓ పూటకూళ్ల ఇల్లు ఉండేది. అక్కడ ఎలాంటి ఆహార పదార్థాలు ఉండేవంటే...

కప్పుర భోగివంటకము కమ్మని గోధుమ
పిండి వంటయున్
గుప్పెడు పంచదారయును క్రొత్తగకాచిన
యాలనే, పెస
ర్పప్పును గొమ్మనల్లనటి పండ్లును నాలుగు
నైదు నంజులున్
లప్పలతోడ క్రొంబెరుగు లక్షణ వడ్డల
యింట రూకకున్

సన్నబియ్యం అన్నం, గోధుమలతో చేసిన పిండివంటలు, మిఠాయిలు, పచ్చళ్లు, ఆవు నెయ్యి, పెసర పప్పు, పళ్లరసాలు... ఇవన్నీ కూడా ఒక్క రూకకే లభించేవట!

సమాధానమిచ్చాడు అటెండర్.

సేతులు పిసుక్కున్నడు రాజమల్లు. ఛత్ నీ యవ్వ లోకం ఎంత బద్మాష్‌దిరా. జూలపల్లిల మొదలువెడితె కన్నారం దాకా నంజుకతిన్నరు. అట్టిగత్తె బర్రె పెండ తింటరు నా బాంచెన కొడుకులు. పొల్లకు ఏమన్నా కొందామంటె సేతుల నయాపైసా లేదు. గా సేపలు అండుకొని వచ్చినా బిడ్డ తుర్తిగ తినేది. ఈళ్ల నోళ్లల్ల మన్నువడ ఒక్కడు ఒక్కడంటె నిజాయితీదారు లేడు ఈ లోకంల. రాజమల్లు మనసంతా కుత కుత ఉడుకుతంది. సలివెట్టంగ పొద్దుగాల వొయ్యి సాపలు పట్టుకొని ఆరాటంతోని వచ్చిండు. ఏం ఫాయిదా లేకుంటయింది.

ఇంతల్నే "ఓయ్ రాజమల్లు ఏం ఆలోసిత్తన్నవోయ్" భుజం మీద సెయ్యేసి అడిగిండు రాజయ్య. ఎంతసేపాయే పిలువవట్టి ఎటో సూత్తన్నవ్.

"అగో నేను జూడనే లేదు. నువ్వు గీడికి ఎప్పుడు అత్తివోయ్ రాజం బావా".

"ఇగో గిప్పుడే..." అనుకుంట సెయి సంచిలకెళ్లి పెద్ద గిన్నె చేతుల వెట్టిండు.

"గిదేంది".

"ఇప్పి సూడు తెలుత్తది".

తువ్వాల ఇప్పి గిన్నె తీసి తెరచి చూసిన రాజమల్లు కండ్లల్ల ఆనందం. ఎంత కమ్మగ ఉంది వాసన. పులుసువెట్టి సాపలు వండుకచ్చిండు. పొద్దుగాల రాజయ్యకు తను సాపలు ఇచ్చిన సంగతె యాది మరిసిండు. గాయినెకు కుషితోని ఇచ్చిండు తినుమని. కాని మొత్తం మల్ల రాజమల్లుకే వండుకొని తెచ్చిండు. గీల్లంతా పీక్కొని పీక్కొని తిన్నరు. మరి రాజయ్య... తను తన బిడ్డ దావకాండ్ల ఉన్న సంగతి మాట వరుసకు అంటే ఎంత కట్టపడి సైకిలు తొక్కుకుంట జూలపల్లి నుంచి గీడి దాంకా అచ్చిండు.

ఉన్నరు - లోకంలో ఒకరో ఇద్దరో అక్కడో ఇక్కడో... గీ లోకం బద్మాష్ ఏం గాలేదు. దునియల గిసంటి ధర్మాత్ములు ఉంటరు. అందుకే పురాగ పాడుగాకుంట వానలు వడుతున్నయ్. పంటలు పండుతున్నయ్.

పొద్దుందాకా పడ్డ బాధంతా మరిసి పోయిండు. రాజమల్లు కళ్లు చెలిమల యినాయి. ఆనందం జూలపల్లి వాగై పొంగింది. వాగు తన కోసం కాదు మంది కోసమే... రాజయ్య బావా వాగసొంటోడే.

ఊరు కండ్లల్ల మెదిలింది. సాపలు కంటి పాపలై తిరిగినయి. పోవాలె - పొద్దుగాల్నె మల్ల తొవెల పట్టుకుని. నా జీవనధార పిలుస్తంది అనుకున్నడు గుండెల నిండా గాలి పీల్చుకుంటూ...

కోడూరి రవి
జూలపల్లి, కరీంనగర్
9491470260

మాయమైపోతున్నవమ్మా...

"అలా తిన్నగా వెళ్లి ఎడమ పక్కకి తిరుగు. అట్నుంచి నేరుగా పదడుగులు వేశావంటే వేప చెట్టు పక్కన రెండు వేపులా వసారా ఉన్న డాబా ఇల్లే నాగిరెడ్డి గారిల్లు"

ఓ ఇంటి చిరునామా!

ముసలమ్మ మరచెంబు...
చిలకల పట్టె మంచం...
కాడగిన్నె, వంకీల చెప్పులు...
కొక్కేల తూగుటుయ్యాల...
'మనవైన' వస్తువుల గుర్తులు!
బట్టతల, బుంగమీసాలు...
జడకుచ్చులు, గాంధీ కళ్లద్దాలు...

ఆత్మీయుల రూపురేఖలు!

"అదే... ఆత్మకూరుకు ఇచ్చామే భాష్యం లక్ష్మీదేవి పెద్దకూతురు పద్మావతమ్మ కొడుకు"...

బంధుత్వాల లోతులు!

కొన్నేళ్ల కిందటి వరకూ ఏ తెలుగింటి తలుపు తట్టినా వినబడే మాటలివి. ఇప్పుడేమో 'రైటుకెళ్లి లెఫ్టుకు తిరగడం'తో పనైపోతోంది. ఆంటీ, అంకుల్ అంటూ వరసలు కలుపుతున్నారు. 'ఆ హైహీల్స్ శాండిల్స్ లుకింగ్ గుడ్ కదా' అంటూ మురిసిపోయే వారు ఎందరో!

మనం పోయినా, మన ఆనవాళ్లు మిగిలి ఉండాలంటారు పెద్దలు. భాషాపరంగా మాత్రం తెలుగు వారి ఆనవాళ్లన్నీ మట్టిగొట్టుకుపోతున్నాయి.

మరోవైపు... ఆకాశహర్మ్యాలపై చూపే ప్రేమలో వందో వంతు కూడా తెలుగు వారి చారిత్రక ఆనవాళ్లను కాపాడుకోవడంపై చూపించట్లేదు. దాంతో ఎన్నో అద్భుత నిర్మాణాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మా ఊళ్లోనూ అలాంటివి ఎన్నో అంతరించిపోయాయి. అయినా ఒక్క ఆనవాలు ఇంకా మిగిలి ఉంది.

అదే కొండారెడ్డి బురుజు. మన దేశంలోని అతి ఎత్తైన జాతీయ పతాక స్థూపాల్లో అయిదవది.

ఇప్పటికే మా ఊరేదో అర్థమై ఉంటుంది కదా! కర్నూలు.

సరే, మీ ఊరి ఆనవాళ్లు ఏమైనా మిగిలున్నాయా...?

- బాలగౌని వెంకటేశ్వర్ గౌడ్
కర్నూలు.



అసలు సిసలు తెలుగు నిఘంటువు అంటే ఏది? కావ్యభాషగా కనిపించే సంస్కృతాంధ్ర పదాలకు అర్థాలు వివరించేదా? ప్రామాణిక భాష అని పిలిపించుకునే పలుకుబడులకు మాత్రమే పట్టంకట్టేదా? కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వినబడే మాటలను గుదిగుచ్చేదా? కాదు. తెలుగు వాళ్ల వ్యవహారంలో ఉన్న ప్రతి తెలుగు పదాన్ని తనలో ఇముడ్చుకునేది. పల్లెయుల నుంచి కావ్యకర్తల వరకూ అందరి నోళ్లలో నానే అన్ని అచ్చతెలుగు మాటలకూ సమస్థాయి కల్పించేది.

మాటలను మూటగడదాం

గతించిన కాలానికి, వర్తమానానికి చెందిన 'పలుకుబడి'ని నిక్షిప్తం చేసుకుని భాష భవిష్యత్తుకు భరోసా కల్పించేవే నిఘంటువులు. భాషను భద్రపరుస్తాయి కాబట్టే వాటిని పదకోశాలు అని అంటారు. ప్రాచీన నిరుక్తం వైదిక నిఘంటువు. యాస్కుడి నిరుక్తం తొలి పదకోశమన్నది భాషా పరిశోధకుల భావన. తొలినాళ్లలో తెలుగు నిఘంటువులు పద్యాల్లో ఉండేవి. 1684లో గణపవరం వేంకటకవి 'వేంకటేశాంధ్రము' అనే తొలి నిఘంటువు రూపొందించారు. ఈ పద్ధతి చాలాకాలం వరకు సాగింది. తరువాత క్రమంగా అకారాది నిఘంటువులు ప్రారంభమయ్యాయి. 1816లో మామిడి వేంకటార్యుడు తొలి అకారాది నిఘంటువు 'ఆంధ్రదీపిక'ను తయారు చేశారు. తర్వాతి కాలంలో బహుజనపల్లి సీతారామాచార్యులు, నిడదవోలు వేంకటరావు, గురజాడ శ్రీరామమూర్తి వంటి వారు వరసగా తెలుగుభాషా నిఘంటువులు రూపొందించారు. అయితే, వీటిలో తెలుగు పదాలన్నీ ఉన్నాయా అంటే సమాధానం కష్టం. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో వాడుకలో ఉన్న పదాలకు మన పదకోశాల్లో స్థానం దక్కిందా?

వరంగల్‌కు చెందిన అయిదరాజు కొండలరావు 1954లో 'తెలుగు హిందూస్తానీ' నిఘంటువును రూపొందించారు. అప్పటి వరకు తెలుగు పదకోశాల్లో ఒకటి రెండు తెలంగాణ పదాలు మాత్రమే ఉండేవి. కానీ అయిదరాజు నిఘంటువులో తెలంగాణ పదాలను చాలా వరకు సేకరించారు. డా॥ కె.గోపాలకృష్ణారావు తెలుగు - ఉర్దూ నిఘంటువు తెలంగాణ నుడికారపు సొగసును మరింత వెలుగులోకి తెచ్చింది.

ఒక మాండలిక భాష నిఘంటువుల్లోకి ఎక్కాలంటే, ఆయా కోశకర్తలకు, ఆ మాండలిక భాషతో, ప్రాంతంతో కూడా సాన్నిహిత్యం ఉండాలనీ ఈ నిఘంటువులు ఉదహరిస్తాయి. ఓరుగల్లు పదజాలంపై మామిడి వేంకటార్యుడు ఓ పదకోశాన్ని రూపొందించారు. ఇది అముద్రితం. తెలుగు అకాడమీ ప్రచురించిన మాండలిక వృత్తి పదకోశాల వల్ల అప్పటికే అంతరించిపోతున్న తెలుగు పల్లె పదాలు కొన్నైనా వెలుగులోకి వచ్చాయి. అయితే, తెలుగు భాష ఔన్నత్యాన్ని సమున్నతంగా ప్రదర్శించాలంటే సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు, జానపద సాహిత్యంలోని పదాలతో కలిపి జానపద నిఘంటువునూ రూపొందించుకోవాలి. మాతృభాషపై ఉన్న ప్రేమతో మారుమూల పల్లె పదాలను, సామెతలు, జాతీయాలను సేకరించి ప్రచురించిన నేదునూరి గంగాధరం, నాళం కృష్ణారావు వంటి వారి కృషి దీనికి అక్కరకు వస్తుంది.

తెలుగు వారు ఉపయోగించే ప్రతి తెలుగు పదమూ నిఘంటువుల్లోకి రావాలి. అప్పుడే మన పదసంపద ఎంతో తేలుతుంది. 'వ్యావహారిక, కావ్య పదాలతో పాటు ప్రాంతీయ వాడుకలో ఉన్న పదాలన్నింటితో సమగ్ర శబ్దకోశాన్ని తయారు చేసుకోవాల'ని తిరుమల రామచంద్ర ఎప్పుడో సూచించారు. నిఘంటుకర్తలు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుంటే తెలుగు జాతికి అద్భుతమైన పద భాండాగారం సిద్ధమవుతుంది.

మాండలికమంటే కేవలం ఒక ప్రాంతానికో, పల్లీయులకో పరిమితం కాదు. ప్రాచీన కవుల రచనల్లో కూడా మాండలిక పదాలు కనిపిస్తాయి. జడుపు, పిట్ల, జంకు వంటి తెలంగాణ పదాలు తిక్కన భారతంలో ఉన్నాయి. నన్నెచోడుని రచనల్లో బైట, మానిన, బొంది వంటి పదాలు కనిపిస్తాయి. పోతన కవిత్వంలో తెలంగాణ మాండలిక పదాలు కోకొల్లలు. వీటిలో చాలా వరకు వాటిని పూర్వనిఘంటువులు ప్రస్తావించాయి. అయితే, కావ్యగౌరవం దక్కించుకున్న పదాలతో పాటు సామాన్యుల వాడుకలో ఉన్న మాండలిక మాటలకూ నిఘంటువుల్లో స్థానం కల్పించాలి.

1985లో తెలుగు అకాడమీ ప్రచురించిన మాండలిక పదకోశాల్లో ఆయా ప్రాంతాల మాండలిక పదాలు వాటి అర్థ వివరణ, ప్రాంతీయ రూపం వివరంగా ఉన్నాయి. ఉదాహరణకు కరీంనగర్ మాండలిక పదాలు చూడండి...

అగడు, అగ్గో, అంగి, అటెంక, అడ్డంగ, అడ్డగోలు, అపురు (అధికారులు), అంబటాల, అనంకాయ (సొరకాయ), ఈడ, ఈపు, ఉద్దెర, ఉస్కె, ఎగుసం (వ్యవసాయం), ఎరుక (తెలుసు), ఏగిరం (తొందర), ఏసంగి (వేసవి), డిర్లటం (అరవటం), కంకగుల్ల (వెదురుగంప), కంచుడు, కందిలి, కబ్బెం, కడుముంత, కనరు, కనుజు, కైకిలి, కరారు, కల్లం, కీసా (జేబు), కుంచం, కుంట, కుందెన, కూసంత, కూరాడు, గత్తర (కలరా), గరివి (తాకట్టు), చిత్పలపండు (సీతాఫలం), చేపొయ్యి (చేబదులు), చత్రి (గొడుగు), జర్ర (కొంచెం), తలువాలు, తాంబాళం, తిప్పలు (కష్టాలు), తొక్కు (పచ్చడి), తొవ్వ (దారి), నూకడం (నెట్టడం), పతంగి (గాలిపటం), పాశం (పాయసం), పిస్సోడు (పిచ్చోడు), పుస్తె (తాళి), పెయ్యి (శరీరం), పెండ (పేడ), బరిబాతల (నగ్నంగా), మెత్త (దిండు), లొల్లి (అల్లరి)

ఇలా తెలంగాణ పలుకుబడికి పూర్తిగా కాకపోయినా, కొంత వరకైనా రక్షణ లభించింది. దీనివల్ల ఇతర ప్రాంతాల్లోని తెలుగు ప్రజలకు ఇక్కడి మాటల్లోని మాధుర్యం తెలిసింది. అదే, సమగ్ర శబ్దకోశం తయారైతే అన్ని ప్రాంతాల పలుకుబళ్లూ ఒకే చోట కొలువవుతాయి. భాషావినియోగంలో ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి వస్తాయి. కొన్ని భావనలను వ్యక్తం చేయడానికి తెలుగులో సరైన పదాలు లేకే అన్యభాషను వాడుతున్నామనే వారికి 'మనదైన' సమాధానం చెప్పడానికీ ఇది ఉపయోగపడుతుంది. ఈ నిఘంటువు రూపకల్పనకు విశ్వవిద్యాలయాల తెలుగు శాఖలూ, తెలుగు అకాడమీ, ప్రభుత్వం వెంటనే నడుంబిగించాలి.

పాపం... టకీ టకీ!

ప్రపంచంలోకెల్లా అతి బీద భాష ఏంటో తెలుసా? 'టకీ టకీ' (స్రనాన్ అని కూడా అంటారు). దక్షిణ అమెరికా లోని సురినామ్ దేశ భాష ఇది. పాపం... ఇందులో 340 పదాలు మాత్రమే ఉంటాయి. ఈ ప్రాథమిక పదాలను ఉపయోగించుకుంటూ అనేక పదబంధాలను రూపొందించుకుని మాట్లాడుకుంటూ ఉంటారు ఆ భాషీయులు. ఈ టకీ టకీని మాట్లాడే వారి సంఖ్య లక్షకు పైగానే ఉంటుంది. ఇంకోమాట... ఈ సురినామ్‌తో మనదేశానికీ అనుబంధం ఉంది. అక్కడ భారతీయుల సంఖ్య ఎక్కువే. వారందరూ ఆంగ్లేయుల పాలన కాలంలో వలస కూలీలుగా అక్కడకు వెళ్లారు.

డా॥ బి.దామోదరరావు
జానపద విజ్ఞాన పరిశోధకులు,
విశ్రాంతోపన్యాసకులు, కరీంనగర్
94409 86279

[illegible]
పంపవచ్చు.

[illegible]
మంచి ప్రయత్నమే అవుతుంది. మీ పదాలను teluguvelugu@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

పద పంచాయతీ

- **activate:** v. [with object] make (something) active or operative:.., convert (a substance, molecule, etc.) into a reactive form: క్రియాత్మకం చేయు, చైతన్యవంతం చేయు
- **Accredit:** verb. give credit to (someone) for something:...., (of an official body) give authority or sanction to (someone or something) when recognized standards have been met:.., give official authorization for (someone, typically a diplomat or journalist) to be in a particular place or to hold a particular post: ఒక వ్యక్తికి ప్రత్యేక లక్షణాన్ని ఆపాదించు, గుర్తించు.
- **allowance:** (n) the amount of something that is permitted, especially within a set of regulations or for a specified purpose:.., an amount of money that can be earned or received free of tax:.., a sum of money paid regularly to a person to meet needs or expenses: బత్తెము, అనుమతించిన మొత్తం, అంగీకారం
- **Betting:** (n) the action of gambling money on the outcome of a race, game, or other unpredictable event:.., the odds offered by bookmakers on the outcome of races, games, etc.:.., పందెం కాయడం
- **basin:** (n) chiefly British a bowl for washing, typically attached to a wall and having taps connected to a water supply; a washbasin...,, a wide open container used for preparing food or for holding liquid:.., a circular or oval valley or natural depression on the earth's surface, especially one containing water: హరివాణం, నదీపరీవాహక ప్రాంతం, భూక్షయం వల్ల ఏర్పడిన పల్లపు ప్రాంతం, పళ్ళెం, లోతు లేని వెడల్పు పాత్ర
- **block:** (n) a large solid piece of hard material, especially rock, stone, or wood, typically with flat surfaces on each side:.., a large single building subdivided into separate rooms, flats, or offices:..., a large quantity or allocation of things regarded as a unit దిమ్మ, మొద్దు, దుక్క
- **boxing:** (n) the sport or practice of fighting with the fists, especially with padded gloves in a roped square ring according to prescribed rules. మల్లయుద్ధం, ముష్టియుద్ధం
- **cartoon:** (n) a simple drawing showing the features of its subjects in a humorously exaggerated way, especially a satirical one in a newspaper or magazine: పత్రికల్లో ప్రచురితమయ్యే వ్యంగ్య చిత్రాలు.
- **covert:** (adj) not openly acknowledged or displayed:..., (n) a thicket in which game can hide. రహస్యమైన, పైకి వ్యక్తపరచని
- **custody:** (n) the protective care or guardianship of someone or something:.., imprisonment:.., అదుపు, వశం, నిర్బంధం
- **discharge:** verb tell (someone) officially that they can or must leave, in particular: .., allow (a liquid, gas, or other substance) to flow out from where it has been confined:.., do all that is required to perform (a duty) or fulfil (a responsibility):.., Law (of a judge or court) cancel (an order of a court): విడుదల చేయు, నెరవేర్చు, ఉద్యోగం నుంచి తొలగించు, కర్తవ్యనిర్వహణ చేయు, విసర్జనం, స్రావం, ఉత్సర్గం, విడుదల
- **fascinate:** (v) [with object]: attract the strong attention and interest of (someone):.., archaic (especially of a snake) deprive (prey) of the ability to resist or escape by the power of a gaze: భ్రమపుట్టించు, మోహింపజేయు, మరులుకొలుపు
- **field:** (n) an area of open land, especially one planted

with crops or pasture, typically bounded by hedges or fences:.., a particular branch of study or sphere of activity or interest:.., a space or range within which objects are visible from a particular viewpoint or through a piece of apparatus. పొలము, మడి, చేను

○ **fertility:** (n) the quality of being fertile; productiveness:, the ability to conceive children or young: ఫలవంతం, సారం, సత్తువ

○ **fence:** (n) a barrier, railing, or other upright structure, typically of wood or wire, enclosing an area of ground to prevent or control access or escape..., a large upright obstacle in steeplechasing, showjumping, or cross-country..., a guard or guide on a plane, saw, or other tool... కంచె

○ **flat:** adjective (flatter, flattest) having a level surface; without raised areas or indentations:.., lacking emotion; dull and lifeless:..., సమతలం, నివాస గృహ భవనం, బయలు,

○ **franchise:** (n) an authorization granted by a government or company to an individual or group enabling them to carry out specified commercial activities, for example acting as an agent for a company's products:.., a business or service given a franchise to operate:.., a general title or concept used for creating or marketing a series of products, typically films or television shows:.., (usually the franchise) the right to vote in public elections: వాణిజ్య అనుమతి/ఓటు హక్కు

○ **Label:** (n) a small piece of paper, fabric, plastic, or similar material attached to an object and giving information about it:.., a classifying phrase or name applied to a person or thing, especially one that is inaccurate or restrictive:..., చిన్న చీటీ, అట్టముక్క/ లోహం ముక్క, (ఒక వస్తువుకు దాని పేరు, సమాచారం తెలియజేస్తూ అంటించేది)

○ **mascot:** (n) a person or thing that is supposed to bring good luck, especially one linked to a particular organization or event:.., మంచి అదృష్టాన్ని తెచ్చేదిగా భావించే వ్యక్తి, జంతువు, వస్తువు, చిహ్నం, రక్షరేకు, తాయెత్తు, గుర్తు

○ **Nominate:** (v) propose or formally enter as a candidate for election or for an honour or award:.., appoint to a job or position:..., specify (something) formally, typically the date or place for an event: ఎంపిక చేయు, నియమించు, నియోగించు

○ **online:** (adj) controlled by or connected to a computer. .., (of an activity or service) available on or performed using the Internet or other computer network: కంప్యూటర్‌తో అనుసంధానమై, దానితో నియంత్రించగలది

○ **park:** (n) a large public garden or area of land used for recreation: .., an area devoted to a specified purpose:.., (in a car with automatic transmission) the position of the gear selector in which the gears are locked, preventing the vehicles movement. తోట, ఉద్యానం, పచ్చిక వనం

○ **passport:** (n) an official document issued by a government, certifying the holder's identity and citizenship and entitling them to travel under its protection to and from foreign countries:.., [in singular] a thing that ensures admission to or the achievement of something: విదేశాలు సందర్శించడానికి ప్రభుత్వమిచ్చే అనుమతి పత్రం

○ **parcel :** (n) an object or collection of objects wrapped in paper in order to be carried or sent by post:.., a quantity or amount of something, especially as dealt with in one commercial transaction: కట్ట, మూట, సముదాయం, బంగీ.

○ **percentage :** (n) a rate, number, or amount in each hundred:.., any proportion or share in relation to a whole:.., an amount, such as an allowance or commission, that is a proportion of a larger sum of money: శాతం, నూటికింత అని నిర్ణయించే సంఖ్య

○ **Project :** (n) an individual or collaborative enterprise that is carefully planned to achieve a particular aim:.., a piece of research work undertaken by a school or college student:.., a proposed or planned undertaking: ప్రణాళిక, యుక్తి (పరి) యోజన, ముందుకు పొడుచుకొని వచ్చు, విసరివేయు, యుక్తి పన్ను, ఎత్తి చూపు, ప్రదర్శించు

○ **Punch:** (v) strike with the fist:.., press (a button or key on a machine): పిడిగుద్దు, హాస్యగాడు, ముష్టిఘాతం, బెజ్జాలు పొడిచే సాధనం, బాగా మత్తెక్కించే సారాయి, పెద్ద పొట్ట

○ **roam:** (v) move about or travel aimlessly or unsystematically, especially over a wide area: ఊరకతిరుగు, సంచరించే

○ **Return:** (v) come or go back to a place or person:.., give, put, or send (something) back to a place or person:.., yield or make (a profit):.., (of an electorate) elect (a person or party) to office: తిరిగివచ్చు, పునరాగమనం

○ **sector:**(n) an area or portion that is distinct from others:..., the plane figure enclosed by two radii of a circle or ellipse and the arc between them..., a mathematical instrument consisting of two arms hinged at one end and marked with sines, tangents, etc. for making diagrams. వృత్తంలో కేంద్రం నుంచి పరిధికి గీసిన రెండు వ్యాసార్ధాల మధ్య ఉండే ప్రదేశం

○ **semester:** (n) a half-year term in a school or university, especially in North America, typically lasting for fifteen to eighteen weeks:.., విద్యాసంలో సగభాగం

○ **spot :** (n) a small round or roundish mark, differing in colour or texture from the surface around it:..., a particular place or point:.., a pimple...,, [as modifier] denoting a system of trading in which commodities or currencies are delivered and paid for immediately after a sale: గుండ్రని మచ్చ, మరక, చుక్క

○ **taskforce:** (n) an armed force organized for a special operation:.., a unit specially organized for a task: యుద్ధంలో ప్రత్యేక ప్రయోజనాల కోసం నియమితమైన, ఉపయోగించు భద్రతాదళం.

తులాభారం



ఆంధ్రనగరి... చారిత్రక నగారా!

గతాన్ని, జ్ఞాపకాలను, స్ఫూర్తి గాథలను భావితరాలకు అందించడంలో మనమెందుకు తరచూ విఫలమవుతున్నాం; ఎందుకు అభావంగా మిగిలిపోతున్నాం అన్న ప్రశ్నలకు ఏవేవో జవాబులు కొంతకాలంగా వినిపిస్తూనే ఉన్నాయి. అలాంటి ప్రశ్నలకు గట్టి సమాధానమే సాయి పాపినేని రచించిన 'ఆంధ్రనగరి' పుస్తకం. శ్రీముఖ శాతవాహనుడు మొదలు పల్లవ రాజుల దాకా వివిధ చారిత్రక ఘటనలకు నవలారూపమిస్తూ రచయిత చేసిన ప్రయత్నం ఆద్యంతం విలక్షణమూ, విభిన్నమూ. జాతి పూర్వానుభవాలే భావితరాలకు పాఠాలు. పెద్దలు- పిల్లలకు ఆస్తులతోపాటు ఇలాంటి విలువైన అనుభవాలనూ అందించాలి. ఇంతకు ముందెవ్వరూ చెప్పలేదనిపించేంత ఆసక్తిగా రాయడమే మంచి రచయిత లక్షణం. ఆ ప్రాతిపదికన చూసినప్పుడు ఆంధ్రనగరి ఉత్తమ పుస్తకాల కోవలోకి వస్తుంది. ఈ పుస్తకం కృష్ణానదీ తీరాన వెలసిన తెలుగువారి వైభవోపేత చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ సంపదకు దర్పణం పట్టింది. గతానికి సంబంధించిన విలువైన జ్ఞాపకాలను పరిరక్షించుకోవడమే చారిత్రక స్పృహకు గీటురాయి. ఆ మేరకు స్ఫూర్తిని రగిలించడంతోపాటు- మనగురించి మనం తెలుసుకుని, మనవారి నొకపరి తలచుకునే మంచి అవకాశం ఈ పుస్తక పఠనం. నేపథ్యానికి తగినట్లు ప్రాచీన తెలుగును పరిణతంగా ప్రయోగించడంతో- రచనాశైలిపరంగానూ ఎక్కువ మంది ఎక్కువకాలం గుర్తుపెట్టుకునే పుస్తకంగా ఇది నిలిచిపోతుంది. కృష్ణానదీ తీరాన వివిధ దశల్లో వెల్లివిరిసిన అపూర్వ నాగరికతను రసగుళికల్లాంటి వాస్తవిక కథారూపాలుగా ఆవిష్కరించిన పద్ధతి తెలుగు చరిత్ర రచనల్లో కొత్త ప్రయోగం. అక్కడక్కడా 'బాక్సు'ల్లో అందించిన విశేషాలు ఆసక్తికరంగా, పాఠకుల్లో జిజ్ఞాస పెంపొందించేలా ఉన్నాయి. సామ్రాజ్యాలు, చక్రవర్తులు, యుద్ధాలు, గెలుపు ఓటములతోనే చరిత్రను నింపివేసే పాక్షిక పంథాను విడనాడి- సామాన్యుల ఆర్థిక స్థితి, బౌద్ధమత విలక్షణత, సాంస్కృతిక వైవిధ్య ప్రస్తావనలూ ఉండటంతో పుస్తకం పరిణతంగా రూపుదిద్దుకొంది. సమాజం ఒక వ్యవస్థనుంచి మరొక వ్యవస్థలోకి ఎలా మార్పు చెందిందో అవగతమైతే వర్తమానంపై సహేతుక అవగాహన ఏర్పడుతుంది. నడుస్తున్న చరిత్రను చూసే కోణమూ మారుతుంది. కొందరు తమ దృక్పథాలకు సరిపోయినవే వాస్తవాలను భావించి భద్రపరచడంవల్ల యుగ చరిత్రల గురించి మన పాఠ్యపుస్తకాల్లో మనస్సుల్లో పాక్షిక చిత్రాలే నిక్షిప్తమై ఉన్నాయి. చరిత్ర వ్యాఖ్యానం, విలువలు, విషయగతత్వానికి సంబంధించి ఆంధ్రనగరి పుస్తకంలో వ్యక్తమైన దృక్పథం పరిశోధకులకూ ఎన్నో నూతన కోణాల్ని అందిస్తుందనడంలో సందేహం లేదు. మన చరిత్రను అందమైన కథలుగా మలచి పాఠక దేవుళ్లకు అందించిన నైవేద్యం ఈ పుస్తకం.

రచయిత: సాయి పాపినేని; పుటలు: 231;
వెల: రూ.290; ప్రతులకు: విశాలాంధ్ర పుస్తకకేంద్రాల్లో

- ఉల్చాల హరిప్రసాదరెడ్డి

విలక్షణ అక్షరాలు

ఇరవై మూడు సంవత్సరాలుగా ప్రవాహంగా సాగిపోతోన్న కథాఝరిలోని సరికొత్త కెరటమే ఈ 'కథ-2012'. ఇందులో మొత్తం 13 కథలున్నాయి. వీటిలో కొన్ని కథల మధ్య వస్తుపరంగా చిన్న చిన్న సామ్యాలు గోచరించినా పాత్రల ద్వారా ఆయా కథల్లోని విభిన్న కోణాలు ఆవిష్కృతమవుతాయి.

'హెు స్సేన్ మై ఫాదర్' కథలో డేవిడ్ ఎంత ఎదిగినా తన మూలాల్ని, తన తోడును వెదుక్కుంటూ ఎంత తపన పడతాడో, చిన్ననాటి నేస్తం ఎదురైనప్పుడు తన గతం గురించి ఎంత నిజాయితీగా ఆమెకి వివరిస్తాడో, అలివేలు- నర్తకి స్థాయికి ఎలా చేరుకుంది అన్న దానికి అంత తక్కువ ప్రాధాన్యతనిస్తాడు. అలసిన మనసుకి కావలసింది సంజాయిషీలు కాదు, ఆమె సాహచర్యం అని తెలిపిన ఆ కథ చాలా సరళమైన భాషలో సాగిపోతుంది.

సంపాదకులు: వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్; పుటలు: 197;
వెల: రూ.50; ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకకేంద్రాల్లో

అభం శుభం ఎరుగని వయసులో పెళ్లి చేసుకొని భర్త చేతిలో అర్థంతరంగా తనువు చాలించిన 'సామాన్య' కథ 'మహిత' మనతో కంటతడి పెట్టిస్తుంది. ఒక తల్లి తన దారి తను చూసుకుని వెళ్లిపోతే ఆమె పిల్లలు పడే క్షోభని 'దమయంతి కూతురు' ద్వారా కవయిత్రి పి.సత్యవతి చెప్పిన తీరు కదిలిస్తుంది.

ఇవేకాదు తన చెల్లి జీవితాన్ని నాశనం చేసి ఆమె చావుకి కారణమైన శంకర్‌కి ప్రాణం విలువెంతో తెలిసేలా చేసిన సలీం, (జుమ్మేకి రాత్ మే- పెద్దింటి అశోక్‌కుమార్) క్షమ అంటే ఏంటో చెప్తే, కన్నెమ్మ కష్టాలకి కదిలిపోయి, పగిలిపోయిన పొంతకుండ (రయిక ముడి ఎరగని బతుకు - స.వెం.రమేష్) ఎదుటివాడి బాధల్ని నీ బాధగా చూడమని చెప్తుంది. విభిన్న పాత్రలు, వేరు వేరు మాండలికాలు, రకరకాల నేపథ్యాలతో కూడిన కథలున్న ఈ పుస్తకం, రాశి కంటే వాసి గొప్పదని మరోసారి నిరూపిస్తుంది. ప్రతియేడూ ఆ సంవత్సరంలో వెలువడిన మేటి కథల్ని ఎన్నుకొని సంపుటాలుగా అందిస్తున్న 'కథాసాహితి' వారికి అభినందనలు.

- వరుణ్ పారుపల్లి

వెలుగు చూసిన సీమరత్నాలు

ఆంగ్లేయులు దత్త మండలంగా పిలిచే ప్రాంతాన్ని కవులే రాయలసీమ అని మార్చారు. దాన్ని తెలుగు ప్రజలు ఆదరించారు. 1928 నవంబరులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభల్లో చిలుకూరి నారాయణరావు 'దత్త' అనే పేరుతో ఓ గేయాన్ని చదివి అందులో 'రాయలసీమ' అనే పదాన్ని ప్రస్తావించారు. దీనికి ఆ సమావేశంలో ఆమోదం లభించింది. ఈ మాటకు బహుళ ప్రాచుర్యం తెచ్చిపెట్టిన వారు ప్రముఖ సంపాదకుడు పప్పూరు రామాచార్యులు. ఇంత చారిత్రక నేపథ్యం ఉన్న ఆ గేయం చదవాలని ఎవరికి అనిపించదు? ఆ లోటు తీర్చారు డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి. పప్పూరు రామాచార్యుల సంపాదకత్వంలో వెలువడిన 'శ్రీసాధన' వార పత్రికలో 1926-47 మధ్య ప్రచురించిన సాహిత్యాన్ని పుస్తక రూపంలో వెలువరించడం ద్వారా ఈ గేయం నేటి తరం పాఠకుల దృష్టికి వచ్చింది. రాయలసీమ ప్రాంతంలో పత్రిక లేని లోటును గమనించిన రామాచార్యులు 1926 ఆగస్టు 14న ఈ పత్రికను అనంతపురంలో ప్రారంభించారు. నాటి పాఠకులు సామాజిక సమస్యలపై కేవలం లేఖలతో సరిపెట్టకుండా పద్యాలు, గేయాల రూపంలో తమ భావాలను వెల్లడించారు. వాటన్నింటిని సేకరించి 'శ్రీసాధన కవిత్వం' పేరుతో సంకలనం చేసి హరినాథరెడ్డి పుస్తక రూపంలో తెచ్చారు.

సంకలన కర్త: డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి; వెల: రూ. 40; పుటలు: 100; ప్రతులకు: ప్రధాన పుస్తకకేంద్రాల్లో

పత్రిక వెలువరించడానికి రామాచార్యులు పడిన పాట్లన్నింటినీ సంకలనకర్త కళ్లకు కట్టినట్టు వివరించారు. ఆంధ్రపత్రిక, కృష్ణా పత్రిక, గోల్కొండ పత్రికల్లాగా శ్రీసాధన కూడా ఒక తరానికి ప్రతినిధి. ప్రథమ సంచికలోనే 'ఓటరు నిర్వేదం' గేయంలో ఓ పాఠకుడు ఎన్నికల్లోని లొసుగులను ఎత్తి చూపారు. అస్పృశ్యతపై నంద్యాల అరుంధీయ సమాజం వారు రాసిన రెండు సీస పద్యాలు చదివి తీరాల్సిందే. అన్ని సామాజిక సమస్యలకూ శ్రీసాధన వేదికయింది. 'నంద్యాల... నంద్యాల - నందీశ్వరునికి ఉయ్యాల...' వంటి పాటలతో పాటు బాలగేయాలూ ఉన్నాయి. 'రోగంబు లేకనే రోగి జేతువు - నిరుద్యోగమా నా నుంచి తొలగిపొమ్ము...' అంటూ నిరుద్యోగంపై రాసిన పద్యాలు నేటికీ ప్రాధాన్యమున్నవే. స్థానిక రచయితలను, చరిత్రను వెలుగులోకి తీసుకొని రావడానికి చేసిన ఈ ప్రయత్నం మిగిలిన వారికి మార్గదర్శకం.

- పి.శంకరరావు

అక్షర నైవేద్యం

కలౌ వేంకటనాయకః అన్నట్లు తిరుమల శ్రీవేంకటేశ్వరుడిపై విశేష అధ్యయన మిది. ఎస్.కె. రామచంద్రరావు కన్నడ మూలానికి గుత్తి చంద్రశేఖరరెడ్డి తెలుగు అనువాదమిది. అయినా.. పదహారణాల తెలుగుదనంతో సరళ సుందరంగా శోభిస్తోంది.

శాసనాలు, ఆళ్వారుల పాశురాల్లో ఉన్న వేంగడ పదం.. దాని అర్థాలు.. కాలక్రమంలో 'వేంకటం'గా మార్పు చెందడాన్ని సమగ్రంగా వివరించారు. కొండ మీద గుడి ఏర్పడటానికి ముందు ఎలాంటి పరిస్థితులు ఉండేవీ... శాసన, చారిత్రక ఆధారాలతో పేర్కొన్నారు. తర్వాత రామానుజుల ప్రవేశం, ఆ కొండ మీది దైవం శైవమా? వైష్ణవమా? వివాదానికి రామానుజులు తెరదించిన విధం, అర్చనా విధానాల రూపకల్పన, తిరుచానూరును వైష్ణవగ్రామంగా అభివృద్ధి చేయడం.. ఇలా అన్ని విషయాలు క్రమంగా వస్తాయి. ఈ సంఘటనల నేపథ్యంలో వ్యాప్తిలో ఉన్న ఐతిహ్యాల ప్రస్తావన కూడా ఉంది. 108 దివ్యతిరుపతుల వివరణ సందర్భవశంగా సాగుతుంది.

సాళువ నరసింహుని కాలంలోనే తిరుమలలో వివిధ రకాల ప్రసాదాలు ఏర్పాటయ్యాయి. అప్పుడే వితరణతో పాటు విక్రయాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంలోనే కొండకు వృషాద్రి, శేషాద్రి అనే పేర్లు, వాటి వెనుక ఐతిహ్యాలు వెలుగులోకి వచ్చాయి. తర్వాత తాళ్లపాక కవులు నాలుగు తరాల వరకూ

అనువాదం : గుత్తి చంద్రశేఖరరెడ్డి, పుటలు: 279; వెల: రూ. 250/- ప్రతులకు : ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

స్వామి కైంకర్యంలో తరించారు. వీరిలో అన్నమయ్య అగ్రగణ్యులు. ఈ కవులు సృజించిన సాహిత్యంతో ఆ కొండలరాయుడి ప్రభ దశదిశలా ప్రసరించింది.

తుళువ వంశ రాజుల్లో శ్రీకృష్ణదేవరాయలు, ఆయన దేవేరుల కైంకర్యం ప్రత్యేకం. రాయలు కొండకు వచ్చినప్పుడల్లా స్వామికి ఏయే ఆభరణాలు, ఇతర పూజాసామగ్రి సమర్పించారో చాలా వివరంగా పొందుపరిచారు. విజయనగర రాజుల కాలంలో వారం రోజుల చొప్పున నెలనెలా బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఇంతటి వైభవానికి, సంపదలకు కేంద్రమైన దేవుడు వడ్డీకాసులవాడు ఎందుకయ్యాడన్నది ఆసక్తికరం. తరువాత ముస్లింలు, విదేశీయుల రాకతో గుడి పరిస్థితి తదితర వివరాలను చక్కగా చెప్పారు. గుడిలో పూజావిధానాలు, ఉత్సవాలు, వైఖానసులకు, పాంచరాత్రులకు విభేదాలు, అందుకు కారణాలను విశదీకరించారు. చివరలో ఆళ్వారుల దివ్యసూక్తులను సంక్షిప్తంగానైనా చేర్చడం ముదావహం. ఆధ్యాత్మిక పాఠకులు మెచ్చే గ్రంథమిది.

- చారి

కొండ అద్దమందు...

అమెరికా చుట్టొద్దాం..!

అమెరికాలోని తెలుగు వారు ఎలా ఉన్నారు, ఎలా అభివృద్ధి చెందారు, మన సంస్కృతి, సంప్రదాయాల్ని ఎలా కాపాడుకుంటున్నారు... తదితరాలను విడమరిచి అక్షరబద్ధం చేసిన పుస్తకమిది. సులభంగా, సరళంగా, అందరికీ అర్థమయ్యేలా అన్ని కోణాల్ని దర్శింపజేశారు రచయిత. 18 ప్రధానాంశాలను ఎన్నుకుని అక్కడి తెలుగు వారి జీవనశైలిని విశదీకరించారు.

అనేక కార్యక్రమాల్లో అనుసంధాన, నిర్వాహకకర్తగా పనిచేసిన అనుభవాలు, స్వయంగా పాత్రికేయుడు కావడంతో తన అనుభవాలని పాఠకుడికి విశ్లేషణాత్మకంగా అందించారు. అమెరికా సందర్శనార్థులకు మార్గదీపికలా ఉపయోగపడుతుందీ సృజన.

- జి.శ్రీనివాసరావు

రచయిత: చెన్నూరి సుదర్శన్; పుటలు: 160, వెల: రూ.100, ప్రతులకు: ఫ్లాట్ నం.8, జనోదయం, మోతీనగర్, హైదరాబాద్

కథా కదంబం

తలపుల్లో భావాలకి ఆకృతినిచ్చి పదిమందినీ ఆకర్షించడం ఓ తపస్సు. దాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు అయ్యగారి శ్రీనివాసరావు. పత్రికల్లో ప్రచురితమైన ఆయన కథల్లో పాఠకాదరణ పొందిన ఇరవై ఎనిమిదింటిని కిత'కతలు'గా ప్రచురించారు. 'కాయ-పండు', 'ఎంతహాయి' 'స్థలాభోగం- శిలాభోగం' వంటి కథల్లో వ్యక్తిత్వాన్ని, సంప్రదాయాన్ని రక్షించుకునేలా అంశాలున్నాయి. ప్రతి కథలోనూ హాస్యాన్ని పంచుతూ, వ్యంగ్యాన్ని ఒలికిస్తూ, ఆధ్యాత్మికాన్ని ప్రబోధించారు. సరళమైన భాష, చతుర సంభాషణలు ఈ కథలకు ఆభరణాలు. హృదయాహ్లాదాన్ని కలిగించే కథా కదంబమిది.

- అక్షరదీక్షిత

రచయిత: అయ్యగారి శ్రీనివాసరావు, పుటలు: 112; వెల: రూ.60
ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాలు



ఏం తినాలి?

అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఆహారం అంటే మనిషి తినే భోజనం మాత్రమే కాదు. ఈ సకలచరాచర విశ్వం నుంచి స్వీకరించే గాలి, నీరు, శబ్దం, కాంతి (చూపు), ఔషధం, విజ్ఞానం.. ఇలా ఎన్నో అంశాలు ఆహారం అని ప్రాచీన వాఙ్మయం చెబుతోంది. వాటన్నింటిపై చేసిన సమగ్ర, శాస్త్రీయ పరిశోధనే... 'అన్న విజ్ఞానం'.

వేదాలు, ఉపనిషత్తులతో పాటు మన ప్రాచీన సాహిత్యంలోని ఎన్నో అంశాలను ఉదహరించారు. శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యాన్ని ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలో ఈ పుస్తకం ద్వారా తెలుస్తుంది.

- శ్రీ గార్గేయ

రచయిత: రాజగోపాలాచార్యులు; పుటలు: 120; వెల: రూ.60; ప్రతులకు: 27-17-45, ఎ.ఎస్.ఆర్.నగర్, భీమవరం, ప.గో. జిల్లా

భవితకు దిశానిర్దేశం

రచయిత్రి: మేడిగ దుర్గారాజేంద్రన్, పుటలు: 336; వెల: రూ.200; ప్రతులకు: విశాలాంధ్ర పుస్తకకేంద్రాలు

యువతకు ఎదురయ్యే మానసిక సమస్యలను, కుటుంబ సమస్యలను ఎదుర్కోవడానికీ ఈ గ్రంథం బహుళార్థ సాధకం. అంతే కాదు వివాహ అంశాల్లో అనురాగానుబంధాల్లో పొరపొచ్చాలు లేకుండా, ఇచ్ఛాప్రకటనలు ఎలా వెలువరించాలో సైతం ఈ గ్రంథం వల్ల తెలుస్తాయి. తప్పనిసరై విడాకుల ప్రశ్న తలెత్తితే, ఎలా ఉండాలో సైతం తెలుపుతుంది. కోర్టు తీర్పులనూ పరిచయం చేస్తుంది. చట్టాల గురించి, చుట్టాల ఆతిథ్యాల ఆత్మీయతల గురించి అంశాలున్నాయి. పెద్దల చిన్నల అవసరాల గురించి మెలకువలు తెలుపుతుంది. విశ్రాంతి కాలానికి సూచనలిస్తుంది. చిన్నలకూ పెద్దలకూ పెద్దగా ఉపయోగపడే సామాజిక మానసిక భావాల సమన్వయ గ్రంథం.

'లేలేత హృదయమా ఇది నీకు', 'యువత ప్రేమోన్మాదాలు', 'రాగాలాపరాగాలా సాగే సంసారం నవజీవనసారం', 'మనసులు కలిసిన శుభవేళ' వంటి శీర్షికలు రచయిత్రి ఆధునిక రచనా పద్ధతిని తెలుపుతుంది.

- వెన్నెల



సందేశాత్మకం

ఈ సంపుటిలోని రెండు నాటికల్లోని సన్నివేశాలు పాఠకుల కళ్లకు కట్టినట్లు కన్పిస్తాయి. ముఖ్యంగా 'జనారణ్యంలో జానకి' ఏడు పాత్రలతో ఉత్కంఠగా సాగుతుంది. నేటి సమాజంలో ఉద్యోగినులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, వాటిని ఎదుర్కోవాల్సిన తీరును చెబుతుంది ఈ నాటిక. పాత్రల చిత్రణ ఆకట్టుకునేలా ఉంటుంది. ప్రధాన పాత్ర జానకిని ఆత్మవిశ్వాసానికి, ధైర్యానికి, తెలివికి ప్రతిరూపంగా తీర్చిదిద్దారు.

మరో నాటిక 'అభ్యుదయానికి సంకెళ్లా...?' సందేశాత్మకం. కుల, మత, ఆర్థిక కారణాలతో ప్రేమికుల ఆశలను చిదిమివేసే పెద్దలకు కనువిప్పు కలిగించే రచన ఇది. సన్నివేశాల్లో ఆర్ద్రత... సంభాషణల్లో బిగి... ఆలోచన రేకెత్తించే ముగింపు... వీటన్నింటి సమాహారం ఈ నాటికలు.

- శ్రీవ్యాస్

రచయిత: విడదల సాంబశివరావు; పుటలు: 53; వెల: రూ. 80, ప్రతులకు: 3-173/1, 7వ లైన్, పండరీపురం, చిలకలూరిపేట, గుంటూరు



'శబ్దసాగరాన్ని దాటించే నావ'

ఆంధ్ర శబ్ద చింతామణి తెలుగు వ్యాకరణాలకు మూలం. ఆ గ్రంథాన్ని అనుసరించి తరువాత చాలా వ్యాకరణ గ్రంథాలు వచ్చాయి. అందులో 'ఆంధ్రకావ్యార్ణ వోడుపము' ఒకటి. దీన్ని భార్గవుని కుమారుడైన 'పున్నన' పండితులు రచించినట్లు ప్రతీతి.

దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం, పరిశోధనాలయం వారు తాటాకు ప్రతుల నుంచి శోధించి ముద్రించింది. దీనిలో ఛందస్సు, అలంకారాలు మొదలైన వాటిని గురించి చర్చ జరిగింది. ఇందులో ముఖ్యంగా ఇప్పటికి నాలుగు వందల సంవత్సరాల నాటి తెలుగు భాష స్వరూపం తెలుసుకోవచ్చు. ఇది భాషా చరిత్ర పాఠకులకు బహుళ ప్రయోజకరం.

- చింతలపూడి

సంపాదకులు: డా॥చిల్లావూరి శివరామకృష్ణశర్మ; పుటలు: 62; వెల: రూ.55; ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం, హైదరాబాద్

కొత్త పొత్తాలు

శ్రీవినాయక శతకం
ర: మంకు శ్రీను; **పు:** 55; రూ. 50; **ప్ర:** రచయిత, కొప్పర్రు, నర్సాపురం, ప.గో. జిల్లా

మినీ ఆంధ్రప్రదేశ్ దర్శిని
ర: ఆకెళ్ల రాఘవేంద్ర, పి.రాజేశ్వరరావు; **పు:** 100; రూ. 40; **ప్ర:** అన్నీ ప్రముఖ పుస్తకకేంద్రాల్లో

శుక త్రిశతి; ర: టి.హెచ్. నటరాజారావు; **పు:** 80; రూ. 100; **ప్ర:** నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ క్రాస్‌రోడ్, హైదరాబాద్

వీక్షణ
ర: దాస్యం సేనాధిపతి; **పు:** 89; రూ. 80; **ప్ర:** విశాలాంధ్ర పుస్తకకేంద్రాలు

శేషగిరి వాణి
ర: మరింగంటి శేషగిరాచార్య; **పు:** 44, **ప్ర:** రచయిత, ప్లాట్. 14, బాలాజీనగర్, నాదర్‌గుల్, హైదరాబాద్

పవిత్ర
ర: బి.సులోచన; **పు:** 111; రూ. 60; **ప్ర:** అన్ని పుస్తక కేంద్రాల్లో

గేయగుచ్ఛము; కర్త: ఎం.డి. జహంగీరు; **పు:** 50; రూ. 50; **ప్ర:** రచయిత, రాం నగర్‌కాలనీ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్

నా సాహితీయాత్ర
ర: కొల్లా శ్రీకృష్ణారావు; **పు:** 80; రూ. 50; **ప్ర:** రచయిత, 2/11, రోహిణీ టవర్స్, బ్రాడీపేట, గుంటూరు

శ్రీ పెంచలకోన నృసింహ శతకం; ర: డా॥ రామడుగు వేంకటేశ్వరశర్మ; **పు:** 72; రూ. 30; **ప్ర:** రచయిత, 5-19-9(ఎ), శ్రీకవితాసదనం, 2/17, బ్రాడీపేట, గుంటూరు

వజ్ర సంకల్పం
ర: చీపెల్లి బాపు; **పు:** 63; రూ. 50; **ప్ర:** ప్రముఖ పుస్తక కేంద్రాల్లో

ర: రచయిత, పు: పుటలు, ప్ర: ప్రతులకు

పద్యం భళారే... విచిత్రం

వాహ్... అద్భుతం! ఏం రాశారండీ!

ఆ పద్యాలను చూడగానే నోటివెంట అప్రయత్నంగా వచ్చేసే మాటలివి. ఆ అక్షరాల కూర్పుల్లో అందం ఉంటుంది. చమత్కారం కనిపిస్తుంది. ఆశ్చర్యపరిచే కవనం ద్యోతకమవుతుంది. మొత్తంగా తెలుగు గొప్పతనం దర్శనమిస్తుంది. అనులోమ విలోమ విధానంలో రాసిన ఆ పద్యాలు మన కావ్యకర్తల అరుదైన ప్రతిభకు నిదర్శనాలు.

ఎటు నుంచి చదివినా ఒకేలా ఉండటమే ఈ ప్రక్రియ ప్రత్యేకత. నందనందనం తదితర మాటలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఆంగ్లంలో 'పాలిండ్రోమ్' అనే ఈ పద్ధతిలో పద్య రచన చేయడం కొంచెం కష్టం. కానీ, మన కవులు మాత్రం చాలా సులువుగా ఆ పని చేశారు. కావాలంటే...

'పారిజాతాపహరణం'లో నంది తిమ్మన చెప్పిన ఈ పద్యాన్ని చూడండి. దీన్లో మొదటి రెండు పాదాలు పూర్తయ్యాక 'అనులోమ' విధానంలో ఉంటుంది.

నాయశరగ సారవిరయ
తాయన జయ సారసుభగధర
దీనియమా
మాయని ధీరధగభసుర
సాయజ నయతాయరవిర
సాగరశయనా

న్యాయం అనే బాణాలతో గరుత్మంతుడి గమనానికి మించిన వేగంతో విజయాన్ని సాధించగల నైపుణ్యం నీది. ముల్లోకాలకు నువ్వే ఆదర్శం. దుర్మార్గుల్ని శిక్షించి ధర్మాన్ని నెలకొల్పిన వ్యక్తివి నువ్వు. ప్రజల మన్ననలను అందుకున్నావు... ఇలా నారదుడు శ్రీకృష్ణుణ్ని కీర్తించే సందర్భమిది.

విన్నకోట పెద్దన 'లక్షణసార సంగ్రహం'లోనూ ఇలాంటి పద్యం ఉంది. దీనిలో మొదటి రెండు పాదాలను తిప్పి చదివితే తర్వాత పాదాలు వచ్చేస్తాయి. అలాగే, పద్యం మొత్తం మొదటి నుంచి చివరికి, చివరి నుంచి మొదటికి ఒకేలా ఉంటుంది.

మానవ భటనయ జయదయ
యానకతనయా పదదమ హారవ
వనదా
దానవ వరహా మదదమ
యానత కనయా యదయజయనట
భవనమా

శ్రీరాముడి భటుల్లో నీతి, దయగల వాడా... నడకలో నారదుడివి. గర్వాన్ని ఖండించిన వాడివి. జితేంద్రియుడా... శరణాగతులకు అధికంగా భాగ్యాలిచ్చే వాడా... అని దీని అర్థం.

దామోదర రద మోదా
రామాతతరా జయ యజరా
తతమారా
రామా జని నిజ మారా
భూమా తతభూమతతమ భూతత
మాభూ!

విక్రాల వారి 'శ్రీవేంకటేశ్వర చిత్రరత్నాకరం' ఉత్తర భాగంలో కనిపించే పద్యమిది. ఏ పాదానికి ఆ పాదమే ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు చదివితే ఒకేరీతిలో ఉంటుంది. దీన్ని 'పాదభ్రమకం' అంటారు. మన తెలుగులో ఏకాక్షరాలకు కూడా ప్రత్యేకమైన అర్థాలున్నాయి. వాటిని లాఘవంగా ఉపయోగించుకుంటూ కవి ఈ పద్యాన్ని చెప్పారు. ఇంతకూ దీన్లోని అక్షరాలకు అర్థాలేంటంటే...

ర - భయాన్ని; ద - ఖండించే వాడా; మోదా - ఆనంద స్వరూపుడా; తత - అధికమైన; రా - బంగారం కలవాడా; మా - బుద్ధికి; రా - శాలయైనవాడా, రామా - లక్ష్మీ వల్ల; జని - జన్మించిన; నిజ - నిత్యుడైన; మారా - మన్మథున్ని



పొందినవాడా; భూమా - విరాట్స్వరూపుడా; భూ - భూదేవికి; మతతమ - మిక్కిలి ప్రియుడా!; భూ - భూమిలానే; తత - గొప్పదైన; మా - లక్ష్మికి; భూ - స్థానమైన వాడా, దామోదర; జయ - జయించుము.

ఈ అనులోమ విలోమ పద్య విన్యాసాలు మనుచరిత్ర, వసుపురాణం, గోపీనాథ రామాయణం వంటి కావ్యాల్లోనూ కనిపిస్తాయి. తెలుగు వారికే సొంతమైన ఇలాంటి విలక్షణ రచనా ప్రక్రియలెన్నో... ఎన్నెన్నో! అవన్నీ తెలుగు ప్రభను దిగంతాలకు ప్రసరింపజేసేవే.

– గరిమెళ్ల కృష్ణమూర్తి,
విశాఖపట్నం. 85006 35926

Visit us at www.reliancedigital.in | Email: reliancedigital@ril.com

Hyderabad: • **A S Rao Nagar:** Near Radhika Theatre ✆4260 6767 • **Attapur:** Near Pillar No. 154 ✆30274457 / 30274458 • **Banjara Hills:** Road No. 12 ✆4472 2200 • **Begumpet:** Airport Road, Above Reliance Trends ✆4002 0022/55 • **Himayatnagar:** Opposite Minerva Coffee Shop ✆4020 7777 / 1111 • **Inorbit Mall:** Hitech City ✆4012 2233 • **Jubilee Hills:** Road No. 36, Adjacent to Police Station ✆30461786/87 • **Kothapet:** Adj. Omini Hospital, Opposite PVT Market ✆42024499 • **Kachiguda:** Station Road, Opp. Venkatramana Theatre ✆4014 0500 / 0666 • **Kukatpally:** Opposite BJP office ✆4262 7777 • **Madinaguda:** Adjacent to Hyundai Show Room ✆4017 2299 / 2288 • **Malakpet:** Main Road ✆6602 5000 / 3000 • **NSL Centrum Mall:** KPHB Near Malaysian Township ✆4019 2000/1 • **Secunderabad:** SD Road, Near Basera Hotel ✆4203 3333 / 44 • **Shivam Road:** Opposite. University Gate ✆27656868/ 6668 | **Bhimavaram:** Coastal City Center Mall: 1st Floor, Undi Road, Bhimavaram Town ✆2299 22/ 33 | **Vijayawada:** • MG Road, Opposite to Durga Mahal Theatre, Patamata ✆246 6000 / 6600 • LEPL Centro Mall, M. G. Road ✆2466603 | **Vizag:** CMR Central, Maddilapalem ✆646 0002 / 0440

www.facebook.com/reliancedigital www.twitter.com/reliancedigital www.plus.google.com/reliancedigital www.youtube.com/reliancedigitaltimes

• Ahmedabad • Allahabad • Alwar • Asansol • Bareilly • Bangalore • Bhimavaram • Bhiwadi • Bhubaneshwar • Bilaspur • Bhopal • Chandigarh • Chennai • Coimbatore • Delhi NCR • Dhanbad • Durgapur • Gulbarga • Hubli • Hyderabad • Indore • Jaipur • Kanpur • Kannur • Kochi • Kolhapur • Kolkata • Kota • Kozhikode • Lucknow • Madurai • Mangalore • Mumbai • Mysore • Nagpur • Nashik • Navi Mumbai • Pune • Sangli • Thane • Thrissur • Ujjain • Vadodara • Vijayawada • Vizag

FIND NEW ROADS™

CHEVROLET

PRESENTING THE CHEVROLET ENJOY

Available in Petrol and Diesel

- LUXURIOUS CAPTAIN SEATS
- SPACIOUS THIRD ROW
- FLEXIBLE LUGGAGE SPACE
- SAFE CAGE STRUCTURE
- DUAL FRONT AIRBAGS
- ABS WITH EBD
- DUAL AC

CARRY YOUR WORLD WITH YOU

With dual AC, spacious third row legroom, captain seats and a foldable third row, the Chevrolet Enjoy is ingeniously designed for space and comfort. It also has rear wheel drive to ensure better handling. It's a great way to explore together.

Download PointART Visit: pointart.mobi or SMS AR to 56767 | Capture the print ad | Experience the spacious Enjoy**

FOR TEST DRIVE: 1800 3000 8080 | SMS <ENJOY> TO 5424280 | WWW.CHEVROLET.CO.IN | ALSO VISIT : WWW.FACEBOOK.COM/CHEVROLETINDIA

CHEVROLET 3 YEARS PROMISE 3 YEARS/45,000KM#
WARRANTY: 3 years/100,000 km (whichever is earlier)

Terms and Conditions Apply. #Chevrolet Promise-Assured low cost of maintenance and repairs carried out at Chevrolet authorized service stations for a period of 3 years/45,000 km (whichever is earlier). Accessories shown are not part of standard equipment. Features shown may vary from model to model. Colors shown may not match the actual because of printing limitations. **Compatibility dependent on mobile phone. Chevrolet is a registered trademark of General Motors Company. For full terms and conditions, please contact your nearest dealership or visit our company website: www.chevrolet.co.in

McCann/GM/06/13